

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

పేజీలు: 14 + 20 వెల: రూ. 6.50



సోమవారం | 28-1-2019

శ్రీవిళంబినామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంతరుతువు, పుష్యమాసం, బహుళపక్షం; తిథి: అష్టమి మ. 2.30 తదుపరి నవమి; నక్షత్రం: స్వాతి మ. 2.29 తదుపరి విశాఖ; వర్జ్యం: రా. 8.15-9.54; దుర్ముహూర్తం: మ. 12.51-1.36, మ. 3.05-3.50; అమృతఘడియలు: శే. ఉ. 7.15, తె. 6.10 మొదలు; రాహుకాలం: ఉ. 7.30-9.00; సూర్యోదయం: 6.54; సూర్యాస్తమయం: 6.03

సంపుటి: 59
సంచిక: 283

విజయవాడ సిటీ*

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Kakinada | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad | Bangalore and Chennai

● ఉచిత విద్యుత్తు



నేతన్నల ఉచిత విద్యుత్తు 100 యూనిట్ల నుంచి 150 యూనిట్లకు పెంపు!
స్వర్ణకారుల దుకాణాలకు వంద యూనిట్ల వరకూ కరెంటు ఉచితం.
నాయీ బ్రాహ్మణులు నిర్వహించే క్షురశాలలకు, రజకులకు 150 యూనిట్ల ఉచిత విద్యుత్తు.
అత్యంత వెనుకబడిన బీసీల నివాసాలకు వంద యూనిట్ల కరెంటు ఉచితం!

● కార్పొరేషన్లుగా 8 ఫెడరేషన్లు



రజక, నాయీ బ్రాహ్మణ, సగర, వడ్డెర, కృష్ణ బలిజ, వాల్మీకి, కుమ్మరి, భట్రాజ కులాల ఫెడరేషన్లన్నీ కార్పొరేషన్లుగా మార్పు.

● కొత్త కార్పొరేషన్లు

శెట్టి బలిజ, గౌడ, శ్రీశయన, విశ్వబ్రాహ్మణ, మేదర, వడ్డెర, యాదవ, కురబ, మత్స్యకారులు, తూర్పు కాపులు, కొప్పుల వెలమ, చేనేత, కళింగ, గవర, గాండ్ల కులాలకు కార్పొరేషన్లు.





రాజమహేంద్రిలో జయహో బీసీ సభకు హాజరైన జనం.. సభలో మోకు, కల్లు కుండతో సీఎం చంద్రబాబు

జయహో బీసీ

సీఎం వరాల జల్లు

- టీడీపీ అంటేనే వెనుకబడిన వర్గాలు
- నా శక్తి మొత్తం వారి మేలుకోసమే!
- ఏ పథకమైనా వారికే తొలి ప్రాధాన్యం
- వైఎస్ హయాంలో అంతా అన్యాయం
- 32 కులాలను బీసీ జాబితా నుంచి తొలగించిన కేసీఆర్‌తో జగన్ దోస్తీ
- బీసీల ఐకమత్యాన్ని దెబ్బతీసే కుట్ర
- ప్రతి బీసీ ఇంటిపై 'దేశం' జెండా
- అండగా ఉండి ఆశీర్వదించండి
- బీసీలకు చంద్రబాబు వినతి
- రాజమహేంద్రిలో 'జయహో బీసీ' సభ
- పెద్దసంఖ్యలో తరలి వచ్చిన బీసీలు

బీసీలకూ సబ్ ప్లాన్... చట్టబద్ధత
లాండ్రీలు, క్షురశాలలకు ఉచిత కరెంటు
చేనేత కార్మికులకూ ఉచిత విద్యుత్తు పెంపు
నూలు కోసం నెలకు రూ. 2 వేలు చెల్లింపు
గొర్రెలన్నింటికీ ప్రభుత్వ వ్యయంతో బీమా
కార్పొరేషన్లుగా 8 ఫెడరేషన్లు
మరిన్ని కులాలకు కొత్తగా కార్పొరేషన్లు
వంద కోట్లతో జ్యోతిబా పూలే పార్కు, స్మారకం
పారిశ్రామిక పార్కుల్లో 25 శాతం బీసీలకు
బీసీలకు భవన్‌లు



రాజమహేంద్రవరం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): 'తెలుగుదేశం అంటేనే బీసీలు. బీసీలంటేనే తెలుగుదేశం పార్టీ! వెనుకబడిన వర్గాలను ఆదరించింది, వారికి అండగా నిలిచింది తెలుగుదేశం పార్టీయే. బీసీల్లో ఐక్యత తీసుకువస్తాం. 50 శాతం జనాభా బీసీలే. వాళ్లకు న్యాయం చేసిన పార్టీ టీడీపీ. జయహో బీసీ సభతో చరిత్రను తిరగ రాస్తాం" అని తెలుగుదేశం అధ్యక్షుడు, ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. "మీ కోసం నేను పని చేస్తున్నా. మా ప్రభుత్వం

మిగతా 11వ పేజీలో...

"మీ కోసం నేను పని చేస్తున్నా. మా ప్రభుత్వం పని చేస్తోంది. 75 రోజుల్లో ఎన్నికలు ఉన్నాయి. టీడీపీ జెండా ప్రతి బీసీ ఇంటిపైనా రెపరెపలాడాలి. వచ్చే ఎన్నికలలో 175 సీట్లకు 150 సీట్లు మనమే గెలవాలి. పాతిక ఎంపీ స్థానాలూ టీడీపీకి సొంతం కావాలి. రాష్ట్రానికి న్యాయం జరగాలి. అందుకు... బీసీలంతా టీడీపీకి అండగా నిలవాలి

-సీఎం చంద్రబాబు



● ఇతర వరాలు

బీసీ విద్యార్థుల విదేశీ విద్యకు సహాయం 10 లక్షల నుంచి 15 లక్షలకు పెంపు!



చేనేత కార్మికులకు ప్రతినెలా నూలు కోసం ఇచ్చే రూ.వెయ్యిని రెండు వేల రూపాయలకు పెంపు.
గొర్రెలన్నింటికీ బీమా...
ప్రీమియం భారం సర్కారుదే.
ఎంబీసీలకు ఇచ్చే సబ్సిడీ 90 శాతానికి పెంపు. యూనిట్ విలువ రూ.30 వేల నుంచి 50వేలకు పెంపు.
స్వయం ఉపాధి పథకాలకు వయో పరిమితి 50 నుంచి 60 ఏళ్లకు పెంపు.
బీసీలకు చెందిన ట్యాక్సీలు, క్యాబ్‌ల వంటి రవాణా వాహనాలపై 25% సబ్సిడీ.



అగ్నికుల క్షత్రియులను ఎస్టీల్లో చేర్చే ప్రక్రియ వేగవంతం.
వాల్మీకులను ఎస్టీల్లో చేర్చేందుకు కేంద్రంతో పోరాటం!
రజకులను ఎస్సీల్లో చేర్చేందుకు కృషి.


● అందరికీ అండ

అర్చకులకు వంశపారంపర్య హక్కులు

10లోపు తుది నోటిఫికేషన్ జారీ
40వేల మంది అర్చకులకు లబ్ధి
పదవీ విరమణ వయసు 75 ఏళ్లు?



11



సంక్షేమ ఫలాలు.. ప్రతి ఒక్కరికి!


ఇళ్లు.. స్థలాలు.. రేషన్ కార్డులు మంజూరు
గ్రామాల్లో 152 అన్న క్యాంటీన్ల ఏర్పాటు
చుక్కల భూములపై ఆర్డినెన్స్!



12

జగన్‌తో దగ్గుబాటి

వైసీపీతో కలిసి సాగాలని నిర్ణయం
హితేశ్‌కు టికెట్‌పై పార్టీయే ఫైనల్
పురందేశ్వరి మారరు: దగ్గుబాటి



12

ఏపీ హైకోర్టు ఏర్పడిన తీరు రాజ్యాంగ విరుద్ధం

పార్లమెంట్‌ను బైపాస్ చేశారు
3న ప్రారంభోత్సవానికి వెళ్లాలో వద్దో సీజే గొగోయే తేల్చుకోవాలి
జస్టిస్ జాస్తి చలమేశ్వర్ వ్యాఖ్యలు

లంకా పలాస్!

కొలంబోకు క్యూ కడుతున్న జూదరులు

ఏడాదిలో రెట్టింపైన తెలుగు ప్రయాణికులు





కొలంబోలోని ప్రఖ్యాత స్టార్ డస్ట్ క్యాసినో. బెల్లి క్యాసినోలో జూదరుల కోసం సిద్ధంగా ఉంచిన పేకాట బల్లలు

- వారాంతాల్లో విమానాల రద్దీ.. నో టికెట్స్
- క్యాసినోల్లో పేకాటతోపాటు ఆటాపాటా
- రెగ్యులర్ కస్టమర్లకు వసతి, మద్యం ఫ్రీ
- శ్రీలంకతోపాటు థాయ్‌లాండ్‌కు కూడా

ఆఠీన్ ఆసు! కళావరు కింగ్! డైమండ్ రాణి! ఇస్పేట్ జాకీ! మూడు ఆసులు.. మూడు జాకీలతో డంకా పలాస్! తిరగేసి మరగేసే అడ్డాట! కోత కోస్తే.. ముక్క పడే కోతాట! బ్లాక్ జాక్, బకరాత్, పోకర్, రూలెట్ లంకలో ఫేమస్! కొలంబో క్యాసినోల్లో తెలుగోళ్ల హల్‌చల్!

(రంగారెడ్డి జిల్లా ప్రతినిధి - ఆంధ్రజ్యోతి)

తెలంగాణలో పేకాట క్లబ్బులు కంప్లీట్‌గా బంద్! సీమాంధ్రలో అక్కడక్కడా పేకాట ఉన్నా... దొంగచాటుగా ఆడాల్సిందే! ఇంకేముంది! 'ఎస్కో నా రాజా' అంటూ సాధికారికంగా కులాసాగా కార్డు విసరాలని ఉబలాట పడుతున్న పేకాటరాయుళ్లు 'లంక'లో వాలుతున్నారు. క్యాసినోలకు వెళ్లేందుకు సముద్రం దాటేస్తున్నారు. వీకెండ్‌లో శ్రీలంక రాజధాని కొలంబో, థాయ్‌లాండ్ రాజధాని బ్యాంకాక్ చెక్కేస్తున్నారు. ఇటీవలి కాలంలో వీరి సంఖ్య భారీగా పెరిగింది. హైదరాబాద్‌తోపాటు రాయలసీమ, కోస్తాంధ్ర, ఉత్తరాంధ్రల నుంచీ విమానాలు ఎక్కేస్తున్నారు. వీరి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది కూడా. దీంతో, కొలంబో, బ్యాంకాక్ రూట్లలో విమానాల రద్దీ పెరిగిపోయింది. వీకెండ్‌లో కొలంబో వెళ్లేందుకు టికెట్లు కూడా దొరకడం లేదు. శ్రీలంకకు వెళ్లేందుకు హైదరాబాద్ నుంచి శ్రీలంక ఎయిర్ లైన్స్ ఒక్కటే నేరుగా సర్వీసులు

మిగతా 2వ పేజీలో...



గుంటూరు సభలో మాట్లాడుతున్న పవన్

హోదా కోసం ఒక్కటిగా..!

ఎన్నికల్లో ఎవరికి వారుగా పోటీ చేద్దాం

- ఏపీ కోసం ఒక్కటిగా నిలుద్దాం.. జగన్ కలిసి రావడం లేదు
- వైసీపీ నేతలు ఆలోచించాలి.. గజనీలా చంద్రబాబు
- ఢిల్లీ దద్దరిల్లేలా పోరాటం.. గుంటూరు శంఖారావంలో పవన్

12



పరంజ్యోతి

ఆలయాలు ఎలా ఉండాలంటే..



ఆలయాలు మన సంస్కృతికి పట్టుగొమ్మలు. స్వయం వ్యక్తములు, దివ్యములు, ఆర్షములు, సిద్ధములు, మానుషములు అనే విభజన ఉన్నప్పటికీ.. ఏ ఆలయమైనా శిల్పం, నిర్మాణం, వాస్తు విజ్ఞానం, ప్రకృతివిజ్ఞానం, కళాకృతులున్యాయకేంద్రం, అన్నదానం, సాధుఆవాసం, ధర్మోపదేశం వంటి వాటికి నిలయాలుగా ఉండేవి. పారాయణం, అధ్యయనం, మత విజ్ఞానం, వేదవిద్య, మంత్ర విజ్ఞాన పరిశోధనలకు ఆలవాలమై నిలిచేవి. నృత్యం, గానం, శిల్పం, చిత్రలేఖనం, కవిత్వం, గానం వంటివాటి ద్వారా శబ్దబ్రహ్మ అయిన పరమాత్మను సాధించే స్థలంగా కూడా ఆలయాలు ఉండేవి. నిత్యం ఆలయానికి వెళ్లడంవల్లనియమబద్ధమైన జీవనం, క్రమశిక్షణ అలవడతాయి. ఆత్మపరమాత్మల తాదాత్మ్యం ఆలయంలో కలుగుతుంది. మత సంబంధమైన పరిజ్ఞానం కలిగించి ఆచరణకు అనువుగా మనుషులను తీసుకెళ్లే స్థలంగా ఆలయాలు ఉండేవి. ఫలితంగా ఆలయ సందర్శనతో ధార్మిక భావనలు పెంపొంది.. ఏకత్వ భావన, సామాజికదృష్టి కలిగేవి. 'నేను' అన్న అహంకారం తొలగేందుకు, పరమాత్మ వైపు మళ్లేందుకు ఆలయం దారి చూపించేది. కానీ క్రమేణా ఆ పరిస్థితి మారిపోయింది. ఆలయాలు కేవలం భక్తిప్రదర్శనకు వేదికలుగా మారుతుండడం దురదృష్టకరం. అలా కాకుండా.. నేటి కాలధర్మం ప్రకారం ఆలయాల్లో ధ్యానకేంద్రం, పుస్తకాలయం, సమావేశమందిరం వంటివాటిని నిర్మిస్తే భక్తితో పాటు వ్యక్తిత్వ నిర్మాణానికి ఆస్కారం కలుగుతుంది. ఆలయంలో అన్నదానం, ఉచిత ఆసుపత్రి సేవ అనుబంధంగా ఏర్పాటు చేయడంవల్ల సనాతనధర్మం లక్ష్యం సమగ్రంగా నెరవేరుతుంది. ఆలయ కుడ్యాలపై, ప్రాంగణంలో దైవిక ప్రబోధాలు, నీతి సూత్రాలు స్తోత్రాలతో పాటుగా ఉండేట్లు ఏర్పాటు చేస్తే దివ్యమానవ నిర్మాణానికి మార్గం సుగమమవుతుంది. సంగీత, సాహిత్యాల మేళవింపు ఉన్న భక్తిగీతాలు, కీర్తనలు, తత్వాలునిర్ణీత సమయంలో వినిపిస్తే దేనికీ లొంగని మనస్సును భక్తి తన్మయత్వంతో నింపవచ్చు. దేవాలయాల్లో ఆయా నిర్ణీత సమయాల్లో జరిగే ఉత్సవాల్లో హరికథలు, బుర్రకథలు, పురాణకాలక్షేపం వంటి వాటిని ఏర్పాటుచేయాలి; లేదంటే వ్యక్తిత్వ వికాసం జరగకుండా హృదయమాలిన్యం అలాగే ఉంటుంది. అలాంటి వ్యక్తులు ఎన్నిప్రదక్షిణలు చేసినా, ఎన్ని కొబ్బరికాయలు కొట్టినా, ఎంత అర్చన చేసినా మనోమాలిన్యం తొలగదు. ఎక్కడ మనోమాలిన్యం ఉంటుందో అక్కడ దేవుడు నివాసం ఉండడని శాస్త్రాలు చెబుతున్నాయి. అందుకే దేహాన్ని దేవాలయంగా చెప్పారు.

> దేహోదేవాలయః ప్రోక్తో జీవదేవ సనాతనః
> త్యజేదజ్ఞాన నిర్మాల్యం సోహం భావేన పూజయేత్॥

దేహమే దేవాలయం, జీవుడే దేవుడు, అజ్ఞానాన్ని వదిలి పెట్టి నేనే దైవం అనే భావంతో నిత్యం పూజచేయాలి. అనేది సనాతన ధర్మ సూత్రం.

- డా॥ పి.భాస్కరయోగి



అకాంకోగువా పర్వతంపై జాతీయ జెండాతో ఇమాంస

జయహో భారత్

- అకాంకోగువా శిఖరంపై తిరంగా రెపరెపలు
- 4 పర్వతాల అధిరోహణతో ఒంగోలు వాసి రికార్డు



ఇమాంస

ఒంగోలు(కార్పొరేషన్), జనవరి 27: దక్షిణ అమెరికాలోని అకాంకోగువా శిఖరంపై త్రివర్ణ పతాకం రెపరెపలాడింది. ప్రకాశం జిల్లా ఒంగోలుకు చెందిన ఇమాంస ఈనెల 14న ఈ పర్వతాన్ని అధిరోహించి రికార్డు సృష్టించాడు. ఇమాంసతో పాటు తెలంగాణకు చెందిన ఐపీఎస్ అధికారి తరుణ్ జోషి, స్విడ్జర్లాండ్‌కు చెందిన ఇద్దరు, ఒక జర్మన్(ఐదుగురు) బృందంగా వెళ్లి ఈ ఘనత సాధించారు. వరుసగా నాలుగో పర్వతాన్ని దిగ్విజయంగా అధిరోహించడం ద్వారా ఇమాంస పర్వతారోహణలో రికార్డు సృష్టించాడు. గత ఏడాది మే 16న ఎవరెస్ట్ శిఖరంపై దేశ జెండాను ఎగురవేసిన ఆయన అదే సంవత్సరం సెప్టెంబరు 23న యూరప్‌లోని ఎల్‌బ్రూస్ శిఖరాన్ని, అక్టోబరు 4న ఆఫ్రికాలోని కిలిమంజారోను అధిరోహించాడు. తాజాగా దక్షిణ అమెరికాలోని 6960.8 మీటర్ల ఎత్తైన అకాంకోగువా శిఖరాన్ని ఎక్కి దేశ కీర్తిపతాకను ఎగురవేశాడు.

చుక్కల భూములపై ఆర్డినెన్స్

జారీకి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు.. జాయింట్ కలెక్టర్లకే పరిష్కార బాధ్యతలు

- అసైన్డ్ ఇంటిస్థలంపై 20 ఏళ్లకు హక్కులు
- అప్పటి వరకూ అమ్ముకోడానికి వీల్లేదు
- గవర్నర్‌కు ఫైళ్లు పంపిన సర్కారు

అమరావతి, జనవరి 27(ఆంధ్రజ్యోతి): చుక్కల భూముల చట్టంలో ఉన్న సంక్లిష్టతలను తొలగించడానికి ప్రభుత్వం ప్రత్యేక ఆర్డినెన్స్‌ను తీసుకురానుంది. కలెక్టర్‌కు ఉండే పని ఒత్తిడి దృష్ట్యా... చుక్కల భూముల దరఖాస్తుల పరిష్కార జిల్లాస్థాయి కమిటీకి ఇక నుంచి జాయింట్ కలెక్టర్ నేతృత్వం వహించేలా సవరణలు ప్రతిపాదించింది. జేసీ ఛైర్మన్‌గా ఉండే ఈ కమిటీలో రెవెన్యూ డివిజన్ పరిధిలోని సబ్ కలెక్టర్ లేదా ఆర్‌డీవో, సంబంధిత మండల తహశీల్దార్ సభ్యులుగా ఉంటారు. ఈ కమిటీ పునర్వ్యవస్థీకరణ వల్ల చుక్కల భూముల దరఖాస్తుల పరిష్కారంలో వేగం పెరుగుతుందని ప్రభుత్వం భావిస్తోంది. ఇంకా... దరఖాస్తులను రెండు నెలల్లోగా పరిష్కరించేలా కీలక సవరణ ప్రతిపాదించారు. 2017లో తీసుకొచ్చిన చుక్కల భూముల చట్టంలో కనీస పరిష్కార సమయం ఆరు నెలలు ఉండేది. ఇప్పుడు ఈ సమయాన్ని భారీగా కుందించారు. కనీస పరిష్కార సమయం రెండు నెలలే ఉండేలా ప్రతిపాదించారు. ఒక్కసారి ప్రభుత్వానికి వచ్చిన దరఖాస్తులు ఏ కారణంతోనూ రెండు నెలలకు మించి పెండింగ్‌లో ఉండటానికి వీల్లేదు. ఒకవేళ పెండింగ్‌లో ఉంటే సంబంధిత అధికారులదే బాధ్యత. దీనివల్ల దరఖాస్తుల పరిష్కారంలో జవాబుదారీతనం వస్తుందని ప్రభుత్వం ప్రతిపాదిస్తూ... ఆంధ్రప్రదేశ్ చుక్కల భూముల ఆర్డినెన్స్‌ను రూపొందించింది. ఇటీవలే న్యాయశాఖ దీన్ని ఆమోదించింది. గవర్నర్ నరసింహన్ ఆమోదం కోసం ఆర్డినెన్స్‌ను పంపించారు.

అసైన్డ్ చట్టానికీ సవరణలు

వివిధ వర్గాలకు కేటాయించిన ఇళ్లస్థలాలు(అసైన్డ్) అన్యాక్రాంతం కాకుండా నిరోధించేందుకు ఆంధ్రప్రదేశ్ అసైన్‌మెంట్ చట్టం-1977లో కీలక సవరణలు ప్రతిపాదిసూ ప్రభుత్వం మరో ఆర్డినెన్స్‌ను తీసుకురానుంది. పక్కా ఇళ్లకోసం ప్రభుత్వం కేటాయించే స్థలం, లేదా ఇళ్లను వెనువెంటనే అమ్ముకోవడం, లేదా తాకట్టుపెట్టుకోవడాన్ని నిరోధించడానికి కీలక సవరణలు ప్రతిపాదించింది. అసైన్డ్ ఇంటిస్థలంపై 20 ఏళ్ల తర్వాతే పూర్తి హక్కులు సంక్రమించేలా సెక్షన్(3)లోని 2(ఏ)లో ప్రతిపాదనలు చేశారు. అంటే ప్రభుత్వం నుంచి ఇంటిస్థలం పొందిన తర్వాత 20 ఏళ్లపాటు అమ్మకూడదు. ఇతరులు కొనకూడదు. సొంత అవసరాల కోసం ఆ ఇంటి స్థలాన్ని తాకట్టుపెట్టకూడదు. అనధికారిక లావాదేవీలు, ఇతరుల పేరుమీదకు బదిలీ చేయకుండా నిరోధించారు. దీంతోపాటు జీవిత కాలంలో ఒక వ్యక్తికి ఒక్కసారికే ఇంటి స్థలాన్ని కేటాయించేలా ఆర్డినెన్స్‌లో సెక్షన్(2)(సీ) కింద ప్రతిపాదించారు. చుక్కల భూములతో పాటు అసైన్డ్ భూముల ఆర్డినెన్స్‌కు న్యాయశాఖ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. గవర్నర్ ఆమోదం కోసం పంపించారు.

ఆమోదంపై అనుమానాలు!

ప్రభుత్వం అత్యంత కీలకమైనవిగా భావిస్తున్న ఈ రెండు ఆర్డినెన్స్‌లపై సందిగ్ధత నెలకొంది. ఈ నెల 30 నుంచి అసెంబ్లీ సమావేశాలు ఉన్నందున వీటిని గవర్నర్ ఆమోదిస్తారా? అన్న సందిగ్ధత సర్వత్రా వ్యక్తమవుతోంది. ఇందుకు కారణం లేకపోలేదు. అసెంబ్లీ సమావేశాలకు నోటిఫికేషన్ విడుదలయ్యాక ఆర్డినెన్సులు జారీ చేయకూడదన్న నిబంధనలు ఉన్నాయని అధికారవర్గాలు చెబుతున్నాయి. ఈ నియమాన్ని పరిగణనలోకి తీసుకొని గవర్నర్ ఆర్డినెన్సులకు ఆమోదం తెలుపుతారా? లేదా? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో సాగుభూములను సాగేతర అవసరాలకు మళ్లించే నాలా ఫీజు వసూలును భారీగా తగ్గిస్తూ ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ భూమి ఆర్డినెన్స్‌ను పంపించినప్పుడు గవర్నర్ అనేక సందేహాలు, సాంకేతిక అంశాలను లేవనెత్తారు. దీనికి తోడు ఈ సారి అసెంబ్లీ సమావేశాల నోటిఫికేషన్ విడుదలైంది. ఈ పరిస్థితుల్లో ఆర్డినెన్సులు ఎందుకని ప్రశ్నలు వస్తే పరిస్థితి మొదటికొస్తుందని అధికారులు చెబుతున్నారు. అయితే, ప్రభుత్వం న్యాయనిపుణులను సంప్రదించిన తర్వాతే ఆమోదం కోసం ఆర్డినెన్సులను పంపించిందని ఉన్నతస్థాయి అధికారులు చెబుతున్నారు. 'సభ జరుగుతున్నప్పుడు ఆర్డినెన్సులు ఇవ్వకూడదని రాజ్యాంగం చెబుతోంది. కానీ ఇంకా సమావేశాలు మొదలుకాలేదు. ఈ లోగా వాటిని ఆమోదించడానికి ఎలాంటి నిబంధనలూ అడ్డురావు' అని సీనియర్ అధికారి ఒకరు 'ఆంధ్రజ్యోతి'కి చెప్పారు. ఇదిలా వుంటే, ఒకవేళ రెండు ఆర్డినెన్సులనూ ఆమోదించినా... 30 నుంచి జరిగే సమావేశాల్లో మళ్లీ ఎలాగూ సవరణ బిల్లులను ఆమోదించుకోవాల్సిందే. ఒక్కసారి ఆర్డినెన్స్ ఆమోదం పొందితే దాని కాలపరిమితి ఆరు నెలలే. ఈ లోగా చట్టసవరణ బిల్లును అసెంబ్లీలో ఆమోదించుకోవాలి. అయితే, ఇప్పుడున్న పరిస్థితి భిన్నంగా ఉంది. శాసనసభ సమావేశాలకు ముందు ఏదైనా ఆర్డినెన్స్ తీసుకొస్తే దాని కాలపరిమితి ఆరు వారాలే ఉంటుందని చెబుతున్నారు. కాబట్టి ఎలాగైనా ఆ రెండూ సభలో ఆమోదం పొందాల్సిందే. తీరా సభ జరుగుతున్న సమయంలోనే ఎమ్మెల్సీ నోటిఫికేషన్ వస్తే అది సాధ్యం కాదు. ప్రభుత్వానికి ఓట్-ఆన్-అకౌంట్ బడ్జెట్ సమావేశాలే చివరివి. త్వరలో అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలకు నోటిఫికేషన్ రానుంది. అదే జరిగితే ఎన్నికల అనంతరం వచ్చే ప్రభుత్వమే ఈ అంశాలపై నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది.



రోశయ్యకు పురస్కారం అందిస్తున్న కోడెల, ఆనందబాబు, రాజకుమారి

అపర చాణక్యుడు రోశయ్య!

- 16 సార్లు బడ్జెట్ పెట్టిన ఘనత సొంతం: కోడెల
- కొణిజేటికి 'నన్నపనేని వెంకట్రావు' పురస్కారం

తెనాలి, జనవరి 27: మంచి వ్యక్తిత్వం, మేధస్సుతో రాజకీయాలకు వన్నె తెచ్చిన మాజీ సీఎం, మాజీ గవర్నర్ కొణిజేటి రోశయ్య అపర చాణక్యుడిగా పేరు తెచ్చుకున్నారని శాసన సభ స్పీకర్ కోడెల శివప్రసాదరావు కొనియాడారు. 16 సార్లు అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశ పెట్టిన ఘనత దేశంలో మరెవరికీ లేదన్నారు. మాజీ ఎమ్మెల్యే, విద్యాదాత నన్నపనేని వెంకట్రావు స్మారక పురస్కారాన్ని ఆదివారం తెనాలిలో జరిగిన కార్యక్రమంలో రోశయ్యకు ప్రదానం చేశారు. రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి అధ్యక్షతన జరిగిన సభలో కోడెల మాట్లాడుతూ, రోశయ్యకు చేస్తున్న సన్మానం రాజకీయాలకు చేస్తున్నట్లేనని, 30 ఏళ్ల పాటు ఎన్నో పదవులు ఆయనను వరించాయని చెప్పారు. రాజకుమారి మాట్లాడుతూ, ఎవరికీ తలవంచని తమిళనాడు దివంగత సీఎం జయలలిత సైతం రోశయ్యకు పాదాభివందనం చేయడం.. ఆయన వ్యక్తిత్వానికి నిదర్శనమన్నారు. మంత్రి నక్కా ఆనందబాబు మాట్లాడుతూ, దేశ వ్యాప్తంగా తెనాలికి గుర్తింపు తెచ్చిన వారిలో రోశయ్య ముఖ్యుడని కొనియాడారు. ఎమ్మెల్యే ఆలపాటి రాజేంద్రప్రసాద్, డాక్టర్ పాటిబండ్ల దక్షిణామూర్తి, నన్నపనేని సుధాకర్ పాల్గొన్నారు.



ప్రకాశం జిల్లా తోకపల్లిలో నీళ్లల్లో మిర్చి

ముంచిన అకాల వర్షం!

- నీట మునిగిన పంటలు.. రైతన్నకు అపార నష్టం
- తడిసి ముద్దయిన మిర్చి.. నేడూ వర్షాలకు అవకాశం: వాతావరణ శాఖ

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్): అకాల వర్షాలు పంటలను ముంచెత్తాయి. చేతికి అంది వచ్చిన పంట నీట మునగడంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. కర్నూలు జిల్లాలో రెండు రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. కర్నూలులో ఆదివారం తెల్లవారుజాము నుంచి కుండపోత వర్షం కురిసింది. వివిధ మండలాల్లో కురిసిన వర్షానికి ఉల్లి, వేరుశనగ, వరి, శనగ, మినుము పంటకు తీవ్రనష్టం జరిగింది. కొన్నిచోట్ల పంటలు నీటమునిగాయి. జిల్లా వ్యాప్తంగా ఆదివారం 231.2 మి.మీ. వర్షపాతం నమోదైంది. ప్రకాశం జిల్లాలో పలుచోట్ల ఆదివారం వర్షం కురిసింది. పెద్దారవీడు మండంలోని మిర్చి రైతులకు తీవ్ర నష్టం కలిగింది. తోకపల్లి గ్రామంలో కోతకోసి కళ్లాల్లో ఆరబోసిన 150 క్వింటాళ్ల మిర్చి తడిసి ముద్దయింది. దీంతో రూ.12లక్షల వరకూ నష్టం చేకూరినట్లు రైతులు తెలిపారు. మద్దిపాడు, జరుగుమల్లి, చీరాల, రాచర్ల తదితర ప్రాంతాల్లో ఓ మోస్తరు వర్షం కురిసింది. పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా చిరుజల్లులు పడ్డాయి. అయితే ఈ వర్షాలు రబీపంటలకు అనుకూలమేనని రైతులు అంటున్నారు. కాగా, బంగాళాఖాతం నుంచి కోస్తాపైకి తూర్పుగాలులు వీస్తున్నాయి. ఇదే సమయంలో ఉత్తరాదిలో నెలకొన్న వాతావరణం ప్రభావంతో పడమర గాలులు కూడా కొనసాగుతున్నాయి. ఈ రెండింటి కలయికతో మధ్యభారతం దానికి ఆనుకుని ఏపీ, తెలంగాణలో దట్టంగా మేఘాలు ఆవరించాయి. దీంతో కోస్తా, రాయలసీమలో పలుచోట్ల ఉరుములతో వర్షాలు కురిశాయి.

లంకా పలాస్!



(మొదటి పేజీ తరువాయి)

నిర్వహిస్తోంది. గురు, శనివారం మినహా మిగతా రోజుల్లో డైరెక్ట్ ఫ్లైట్ ఉంది. ఇలా నేరుగా వెళితే హైదరాబాద్ నుంచి కొలంబోకు ప్రయాణ సమయం గంటా 50 నిమిషాలు మాత్రమే. దీంతో, ఈ సర్వీసుకు వారం రోజుల ముందే టికెట్లు అమ్ముడైపోతున్నాయి. ఇది కాక, ఎయిర్ ఇండియా, ఇండిగో సంస్థలు వయా చెన్నై మీదుగా సర్వీసులు నడుపుతున్నాయి. లింక్ సర్వీసు విమాన చార్జీలు తక్కువగానే ఉంటున్నా.. ప్రయాణ సమయం ఎక్కువ. ఐదు నుంచి ఎనిమిది గంటల సమయం పడుతుంది. దాంతో, నేరుగా నడిపే సర్వీసులకు డిమాండ్ ఎక్కువగా ఉంది. శ్రీలంక ఎయిర్‌లైన్స్‌కు రెగ్యులర్ కస్టమర్లు కూడా ఎక్కువగానే ఉంటారు. ఈ వారాంతం వరకు హైదరాబాద్ నుంచి కొలంబోకు డైరెక్ట్ ఫ్లైట్‌కు టికెట్లు లేవంటే ఎంత డిమాండ్ ఉందో అర్థం చేసుకోవచ్చు. కొలంబోకు విమాన టికెట్ 10-11 వేల నుంచి ప్రారంభమవుతుంది. కానీ, శుక్రవారం ప్రయాణానికి చివరి టికెట్ రూ.33 వేలకు అమ్ముడు కావడం గమనార్హం. ఇక, బ్యాంకాక్ సర్వీసులకు కూడా వారాంతంలో డిమాండ్ ఉంది. గురువారం బ్యాంకాక్‌కు రూ.9,359 ఉంటే.. శుక్రవారం రూ.17,571కు పెరిగింది. తెలుగు రాష్ట్రాల నుంచి ఈ రెండు ప్రాంతాలకు వారాంతాల్లో వెళ్లే వారి సంఖ్య గణనీయంగా పెరిగింది. దీనిని దృష్టిలో పెట్టుకుని శ్రీలంక ఎయిర్‌లైన్స్ గత ఏడాది విశాఖపట్నం నుంచి కూడా కొలంబోకు నేరుగా విమాన సర్వీసులు ప్రారంభించింది. అయితే, కొన్ని కారణాల వల్ల ఈ సర్వీసును గత ఏడాది చివర్లో నిలిపేసింది. ఇక్కడి నుంచి కొందరు జూదం ఆడేందుకు సముద్ర మార్గంలో కొలంబో వెళుతున్నారు. కోస్తా జిల్లాల నుంచి ఎక్కువమంది రైలు లేదా కారులో చెన్నై వెళ్లి... అక్కడి నుంచి కొలంబో ఫ్లైట్ ఎక్కుతున్నారు. కృష్ణా, గుంటూరు జిల్లాల నుంచి ప్రతివారం దాదాపు వెయ్యిమంది కొలంబో వెళ్తున్నట్లు అంచనా!

24 గంటలూ ఎంజాయ్

కొలంబో, బ్యాంకాక్‌కు వెళ్లే జూదరులకు 24 గంటలపాటు అన్ని రకాల వినోదాలు అందిస్తారు. ఇందుకు కొన్ని టూరిస్టు సంస్థల ప్యాకేజీలున్నాయి. క్యాసినోలు నడిపే సంస్థలు తమ రెగ్యులర్ కస్టమర్ల కోసం అనేక ఆఫర్లు ఇస్తున్నాయి. కొన్ని క్యాసినోల్లో అడుగు పెట్టాలంటే కనీసం రూ.6 లక్షలు చేతిలో ఉండాల్సిందే. ఇలాంటి వారికి స్టార్ హోటల్‌లో వసతి కల్పిస్తున్నారు. విందు, వినోదాలను పంచుతున్నారు. కస్టమర్ల అభిరుచుల మేరకు సంగీత కార్యక్రమాలు, డీజేలు ఏర్పాటు చేస్తున్నారు. వీటిలో ఎక్కువగా శ్రీలంక లోకల్ ఆర్టిస్టులే ఉంటారు.

ఏడాదిలో రెట్టింపు ప్రయాణికులు

కొలంబోకు వెళ్లే ప్రయాణికుల సంఖ్య ఏడాదిలో రెట్టింపైంది. 2017లో జూలై నుంచి సెప్టెంబరుకు ముగిసిన త్రైమాసికంలో భారత్ నుంచి కొలంబోకు విమానాల్లో 2,78,996 మంది రాకపోకలు సాగించగా.. 2018లో అదే సమయంలో ప్రయాణికుల సంఖ్య 6,18,856కి పెరగడం గమనార్హం.

ఎంత క్యాష్‌కు అంత క్యాసినో

స్తోమతను బట్టి కొలంబోలో సెక్షన్లవారీగా క్యాసినో ఉంటుంది. మధ్య, సంపన్నవర్గాలకు వేర్వేరుగా ఏర్పాట్లుంటాయి. కొలంబోలో ఏడు క్యాసినోలున్నాయి. ఇవి 24 గంటలూ తెరిచే ఉంటాయి. ఇక్కడ అన్ని రకాల జూదాలు అందుబాటులో ఉంటాయి. జూదరులకు ఇవి సభ్యత్వాలు ఇస్తాయి. వీటిలో సభ్యులైన వారికి భోజనం, మద్యం, వసతి కల్పిస్తాయి. విదేశీయుల కోసం ఎయిర్‌పోర్టు నుంచి వాహనాలు ఏర్పాటుచేసి తీసుకురావడం, తిరిగి పంపించడం వంటి సౌకర్యాలూ కల్పిస్తున్నాయి. వీరికి ప్రత్యేక వసతి కల్పించేందుకు నాలుగైదు స్టార్‌హోటళ్లు ఉన్నాయి. వీరికి ఎలాంటి లోటు లేకుండా చూస్తారు. ఇండియన్, అరబిక్, చైనా తదితర నచ్చిన వంటకాలు అందిస్తారు. అందుకే, తెలుగు రాష్ట్రాల నుంచి కొలంబోకు క్యూ కడుతున్నారు.

కొలంబో క్యాసినోలివి...

కొలంబోలో ప్రముఖంగా ఏడు క్యాసినో కేంద్రాలున్నాయి. ఇవన్నీ అనుమతులతో నడుస్తున్నాయి. అవి ఇవే..

బెల్లజియో క్యాసినో, బెల్లి క్యాసినో, క్యాసినో మెరీనా, కాంటినెంటల్ క్లబ్, ఎంజీఎం కొలంబో, స్టార్ డస్ట్ క్యాసినో, ది రిట్జ్ క్లబ్



వైభవంగా లగడపాటి కుమారుడి

'పంచెల వేడుక'

మాజీ ఎంపీ లగడపాటి రాజగోపాల్ కుమారుడు హర్మన్ పంచెల వేడుక విజయవాడలోని ఎస్ఎస్ కన్వెన్షన్ హాలులో ఆదివారం ఘనంగా జరిగింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, స్పీకర్ కోడెల శివప్రసాద్, ఎమ్మెల్యేలు బొండా ఉమామహేశ్వరరావు, జలీల్ ఖాన్, ఆర్టీసీ ఛైర్మన్ వర్ల రామయ్య, మేయర్ కోనేరు శ్రీధర్, గజల్ శ్రీనివాస్, మాజీ మంత్రులు ధర్మాన ప్రసాదరావు, గీతారెడ్డి, షబ్బీర్ అలీ, సినీ నిర్మాత బండ్ల గణేష్, వైసీపీ నేత అంబటి రాంబాబు, ఏపీఎన్జీవో సంఘ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు పి.అశోక్‌బాబు, లలితా జువెలరీస్ ఎండీ కిరణ్‌కుమార్ తదితరులు ఈ కార్యక్రమానికి హాజరై హర్మన్‌ను ఆశీర్వదించారు.

లోకం తీరు



ఇంకొంచెం మెరుగులు దిద్దితే చెల్లి అచ్చం నాయనమ్మలాగే ఉంటుంది కదా అమ్మ..

చలికాలం

కేంద్రం	కనిష్ఠం	గరిష్ఠం
శ్రీకాకుళం	16.0	29.0
హైదరాబాద్	18.4	21.2
విజయవాడ	18.5	29.0
విజయనగరం	19.0	29.0
గుంటూరు	19.5	26.2
ఏలూరు	20.0	28.0
అనంతపురం	21.6	31.4
కడప	23.0	35.0
ఒంగోలు	23.5	29.4

పలుచోట్ల అకాల వర్షాలు

విశాఖపట్నం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతం నుంచి కోస్తాపైకి తూర్పుగాలులు వీస్తున్నాయి. ఇదే సమయంలో ఉత్తరాదిలో నెలకొన్న వాతావరణం ప్రభావంతో పడమర గాలులు కూడా కొనసాగుతున్నాయి. ఈ రెండింటి కలయికతో మధ్యభారతం దానికి ఆనుకుని ఏపీ, తెలంగాణలో దట్టంగా మేఘాలు ఆవరించాయి. దీంతో కోస్తా, రాయలసీమలో పలుచోట్ల ఉరుములతో వర్షాలు కురిశాయి. ఆదివారం ఉదయంతో ముగిసిన 24 గంటల కాలంలో మాచర్లలో నాలుగు, పత్తికొండలో మూడు సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. రానున్న ఇరవై నాలుగు గంటల్లో కోస్తా, రాయలసీమలో అక్కడక్కడా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది.



సన్యాసులను విస్మరించారేం?

స్వతంత్ర భారతంలో ఇప్పటివరకూ ఒక్క సన్యాసికీ భారతరత్న ఇవ్వకపోవడం దురదృష్టకరం. క్రీడాకారులకు, కళాకారులకు భారత అత్యున్నత పౌర పురస్కారం ఇచ్చినపుడు సన్యాసులకు ఎందుకు ఇవ్వరు? మదర్ థెరిసా క్రిస్టియన్ కాబట్టి ఆమెకు భారతరత్న ఇచ్చారు. సన్యాసులు హిందువులు కాబట్టి వారికి ఇవ్వరు. దేశంలో హిందువుగా ఉండటం నేరమా?

- యోగా గురు బాబా రామ్‌దేవ్



ప్రియాంక రాక కాంగ్రెస్‌కు బలం

కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా ప్రియాంక గాంధీని నియమించడాన్ని స్వాగతిస్తున్నా. కొత్త నాయకులను కాంగ్రెస్ కూడా తెరపైకి తీసుకురావడం ఆనందంగా ఉంది. ఈ నిర్ణయం యూపీలోని క్షేత్రస్థాయిలో కాంగ్రెస్‌ను బలోపేతం చేస్తుందని ఆశిస్తున్నా.

- అఖిలేశ్ యాదవ్, సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు

ప్రసవ సమయంలో

గుండెపోటు ముప్పు!

బీజింగ్, జనవరి 27: గర్భిణులు ప్రసవించే సమయంలో గుండెకు సంబంధించిన జబ్బులు ఎక్కువగా వచ్చే అవకాశం ఉందని తాజా అధ్యయనం ఒకటి వెల్లడించింది. ప్రసవ సమయంలో ఏర్పడే ఒత్తిడి, రక్తపోటు వంటివి గుండె సంబంధిత సమస్యలను పెంచుతున్నాయని చైనాలోని హుజాంగ్ సైన్స్ అండ్ టెక్నాలజీ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు వెల్లడించింది. ప్రపంచ వ్యాప్తంగా సుమారు 30 లక్షల మంది గర్భిణులకు సంబంధించిన సమాచారాన్ని విశ్లేషించిన శాస్త్రవేత్తలు.. ప్రసవ సమయంలో కలిగే మార్పుల కారణంగా 4% మేర గుండె జబ్బులకు సంబంధించిన లక్షణాలు వృద్ధి చెందుతున్నాయని గుర్తించారు.

రాత్రి విధులతో కేన్సర్ ముప్పు

బీజింగ్, జనవరి 27: రాత్రి వేళల్లో విధులు నిర్వహించే వారికి డీఎన్ఏ ముప్పు పొంచి ఉందని, అదేవిధంగా కేన్సర్, గుండెపోటు వంటి ప్రమాదకర జబ్బులు వచ్చే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు వెల్లడించారు. ఈ వివరాలను జర్నల్ అనెస్థీషియాలో ప్రచురించారు. సుమారు 49 మంది ఫుల్‌టైం వైద్యుల నుంచి సేకరించిన రక్త నమూనాలను పరీక్షించి ఈ విషయాన్ని పేర్కొన్నారు.

గుంటూరు జిల్లా రాజపత్రము
అధీకృత అధికారిచే ప్రచురించబడినది
అసాధారణము

గెజిట్ నెం.11 — తేది : 25.01.2019

ఆర్.సి.నెం. 1301/2017-G3 — తేది: 25.01.2019

ఫారము -6(A)

(భూ సేకరణ ఆర్ & ఆర్, చట్టం 2013 లోని సెక్షన్ 11 (1) మరియు రూలు 19 (1) క్రింద)

ప్రాథమిక ప్రకటన

ఈ క్రింది షెడ్యూలు లో నిర్దిష్ట పరచిన గుంటూరు జిల్లా, నాదెండ్ల మండలము, సాతులూరు గ్రామము నందు ఈ దిగువున చూపబడిన భూములు ప్రజా ప్రయోజనాలకై అనగా గుంటూరు నుండి గుంతకల్ రైల్వే లైన్ డబ్లింగ్ కొరకు అవసరమైనట్లుగా చట్టములోని విభాగము 3 (ఇ) ప్రొవిజో మరియు ఆంధ్రప్రదేశ్ భూసేకరణ ఆర్ & ఆర్, రూల్స్ 2014 లోని నిబంధన 2(1)(బి) క్రింద అనుగుణమైన ప్రభుత్వముగా అధీకృతులైన గుంటూరు జిల్లా కలెక్టరు గారు భావించినందున, భూ సేకరణ పునరావాస మరియు పునర్నిర్మాణములో న్యాయమైన పరిహారం మరియు పారదర్శకత హక్కు చట్టం, 2013 లోని విభాగం 11(1) లో ఉన్న నిబంధనల మేరకు ఈ విషయము గురించి అందుకు సంబంధించిన వారందరికీ ఎరుక నిమిత్తం ఇందుమూలముగా నోటీసు ఇవ్వడమైనది.

సెంటర్ ఫర్ మేనేజ్ మెంట్ మరియు సోషల్ రీసెర్చ్ (CMSR), హైదరాబాద్ వారు సామాజిక ప్రభావము మదింపు అధ్యయనము చేసి నివేదిక సమర్పించినారు. సదరు నివేదిక ప్రకారం నాదెండ్ల మండలము, సాతులూరు గ్రామము లో గుంటూరు - గుంతకల్ డబ్లింగ్ రైల్వే లైన్ నిర్మాణమునకు ప్రతి పాదించిన భూమి య. 3.53 సెంట్లు వ్యవసాయ భూమి గుండా పోవుచున్నది. సదరు వ్యవసాయ భూమి ఒక పంట మెట్ట భూమి అయినందున, ప్రత్తి, సుబాబులు మొదలగు పంటలు మాత్రమే సాగుచేయుచున్నారు. వ్యవసాయ ఉత్పాదకత మీద కలుగు ప్రభావం పరిగణనలోకి స్వల్పమైనది. ప్రాజెక్టు వలన ప్రజలకు మరియు సమాజానికి కలుగు సంభావ్య ప్రయోజనాలు సామాజిక వ్యయాలు ప్రతికూల సాంఘిక ప్రభావాలకన్నా అధికముగా ఉన్నవి.

ఈ భూసేకరణ వలన నిర్వాసితులైన కుటుంబములు ఏమియు లేవు

చట్టములోని సెక్షన్ 43 (1) మేరకు ప్రభావిత వ్యక్తులు సహాయ పునరావాస చర్యలు చేపట్టుట కొరకు ప్రభుత్వ ఉత్తర్వు నెం.1, రెవిన్యూ (భూ.సే.) శాఖ తేది.02.01.2015 నందు ఇవ్వబడిన ప్రకటన ద్వారా సంయుక్త కలెక్టర్ గారు ప్రాజెక్ట్ అడ్మినిస్ట్రేటర్ గా నియమించ బడినారు.

పైన పేర్కొనిన చట్టములో సెక్షన్ -12 క్రింద ఇవ్వబడిన అధికారములను వినియోగించి శ్రీయుత జిల్లా కలెక్టరు, గుంటూరు వారు శ్రీయుత భూసేకరణ అధికారి మరియు రెవిన్యూ డివిజనల్ అధికారి, నరసరావుపేట వారికి, వారి సిబ్బందికి మరియు పనివారలకు ఆ భూములు భూసేకరణకై పై సెక్షన్ క్రింద ఇవ్వబడిన అధికారములను వినియోగించుటకు అధికారము ఇవ్వబడినది.

పై చట్టంలో సెక్షన్ 11(4) ననుసరించి, ఈ ప్రాథమిక ప్రకటన వెలువడిన తేది నుండి కలెక్టర్ / భూ సేకరణాధికారివారి ముందస్తు అనుమతి లేనిదే ఏవ్యక్తి ఈ ప్రకటనలో తెలిపిన భూమికి ఏవిధమైన అమ్మకం/కొనుగోలు (క్రయ విక్రయములు) లేదా ఏవిధమైన లావాదేవీలు జరుపరాదని తెలియచేయడమైనది.

పై చట్టములో సెక్షన్ 15(1) ననుసరించి భూసేకరణ పై ఏ విధమైన అభ్యంతరములు/ఆక్షేపణలు వున్నయెడల సంబంధించిన వ్యక్తి/వ్యక్తులు ఈ ప్రకటన ప్రచురించబడిన తేది నుంచి 60 (అరువది) దినముల లోగ రెవిన్యూ డివిజనల్ అధికారి, నరసరావుపేట వారి ఎదుట అభ్యర్థనలు దాఖలు చేసుకొనవచ్చును

షెడ్యూలు

జిల్లా : గుంటూరు — మండలము : నాదెండ్ల — గ్రామము : సాతులూరు

వరుస నెం.	సర్వే నెం.	మొత్తం విస్తీర్ణము ఎ.సెంట్లు	భూ సేకరణ క్రింద విస్తీర్ణము ఎ.సెంట్లు	భూమి యొక్క వర్గీకరణ	ఆసక్తి గలిగిన వ్యక్తి పేరు	హద్దులు: ఉత్తరం	దక్షిణం	తూర్పు	పడమర	చెట్లు, నిర్మాణాలు మొదలైనవి, ఏదైనా ఉంటే వివరాలు
1	2	3	4	5	6	7	8	9	10	11
1	523/F-1	0.57	0.05	సర్కారు పుంజ	కుంచాల చెన్నకేశవరావు తండ్రి వెంకటరత్నం	523-E	523-F1 (Part)	525-D	523-F1 (Part)	తాటి చెట్లు 11
			0.05		కుంచాల ఏడుకొండలు తండ్రి చిన్న వెంకయ్య	523-E	523-F1 (Part)	523-E1 (Part)	523-F1 (Part)	
			0.01		కుంచాల పిన్నారావు తండ్రి రామకోటయ్య	523-E	523-F1 (Part)	523-F1 (Part)	527-B	
2	525/D1	0.75	0.11	సర్కారు పుంజ	వజ్జా రాధాకృష్ణ తండ్రి లింగయ్య	525-C	525-D-1 (Part)	586-A	523-F	సుబాబులు
3	526/1	0.33	0.01	సర్కారు పుంజ	వజ్జా రాధాకృష్ణ తండ్రి లింగయ్య	525-C 525-D	526-1 (Part)	525-D	523-F	సుబాబులు
4	527/B-A1	0.14	0.01	సర్కారు పుంజ	కుంచాల భాస్కరరావు	523-E	527-B-A1(Part)	523-F	532-C	జమ్మిచెట్లు-1
5	586/A1	0.63	0.05	సర్కారు పుంజ	వజ్జా రాధాకృష్ణ తండ్రి లింగయ్య	581-D	586-A-1 (Part)	587-A	525-D	
6	587/A-B1	0.83	0.06	సర్కారు పుంజ	బందారుపల్లి చెన్నయ్య తండ్రి వెంకటకృష్ణయ్య	581-B	587-A-B1	587-A-D	586-A	సుబాబులు, మర్రిచెట్లు-1, తాటిచెట్లు-35
7	587/A-C	0.12	0.03	సర్కారు పుంజ	బందారుపల్లి చెన్నయ్య తండ్రి వెంకటకృష్ణయ్య	581-B	587-A-C	587-A-C	586-A-C	సుబాబులు
			0.03	సర్కారు పుంజ	బందారుపల్లి శ్రీనివాసరావు తండ్రి పెద్దబ్బాయి	581-B	587-A-C	587-A-D	587-A-C	కంది పంట, తాటిచెట్లు-20
8	587/A-D	0.16	0.03	సర్కారు పుంజ	బందారుపల్లి శ్రీనివాసరావు తండ్రి పెద్దబ్బాయి	581-B	587-A-D (Part)	587-A-E1 (Part)	587-A-C	కంది పంట
9	587/A-E1	1.01	0.08	సర్కారు పుంజ	బందారుపల్లి శ్రీనివాసరావు తండ్రి పెద్దబ్బాయి	581-B	587-A-E1 (Part)	587-A-2	587-A-D	కంది పంట
10	587/A-E3A	0.20	0.04	సర్కారు పుంజ	బందారుపల్లి శ్రీనివాసరావు తండ్రి పెద్దబ్బాయి	581-B	587-A-E3A	587-A-E3A	587-A-2	కంది పంట
11	596/A-C	1.86	0.01	సర్కారు పుంజ	ఈదర మస్తాన్‌రావు తండ్రి తిరుపతయ్య	596-B	596-A-C (Part)	596-A-D	596-A-C(Part)	ప్రత్తి పంట
			0.14	సర్కారు పుంజ	వెంప రామారావు	596-B	596-A-C (Part)	596-A-C (Part)	581-A	
12	596/A-D	0.17	0.05	సర్కారు పుంజ	ఈదర విజయలక్ష్మి భర్త మస్తాన్‌రావు	596-B	596-A-C (Part)	596-A-C (Part)	581-A	ప్రత్తి పంట
13	596/B	0.44	0.15	సర్కారు పుంజ	బోరుగడ్డ రాజారావు తండ్రి ఆనందరావు	596-C	596-A-D (Part)	596-A-C (Part)	597-A	ప్రత్తి పంట
			0.29		ఈదర విజయలక్ష్మి భర్త మస్తాన్‌రావు	596-C	596-A	581-B (Part)	581-B	సుబాబులు
14	597/A-B	2.23	0.03	సర్కారు పుంజ	బోరుగడ్డ రాజారావు తండ్రి ఆనందరావు	596-B	597-A-B (Part)	597-A-B (Part)	596-A	ప్రత్తి పంట తాటిచెట్లు-8
			0.07		ఈదర విజయలక్ష్మి తండ్రి మస్తాన్‌రావు	596-B	597-A-B (Part)	598-A	597-B-B (Part)	చింత చెట్లు-1, వేపచెట్లు-8, మర్రిచెట్లు-1
15	599/A	0.54	0.02	సర్కారు పుంజ	వజ్జా నాగేశ్వరరావు తండ్రి రత్తయ్య	598-B	599-A (Part)	606-A	598-A	గడ్డి కొన్న
16	636/A-1	1.37	0.01	సర్కారు పుంజ	బోరుగడ్డ ఏసోబు తండ్రి ఆనందరావు	636-B	636-A-1 (Part)	636-A-1 (Part)	637-A	ప్రత్తి పంట
			0.01		ఈదర శేషయ్య తండ్రి కోటేశ్వరరావు	636-B	636-A-1 (Part)	635	636-A-1 (Part)	
17	636/B-A	0.28	0.28	సర్కారు పుంజ	వజ్జా సంపూర్ణమ్మ భర్త రత్తయ్య	636-C	649-A, 651-A,635	693-B	636-B-B	
18	636/B-B	0.10	0.05	సర్కారు పుంజ	బోరుగడ్డ ఏసోబు తండ్రి ఆనందరావు	636-C	636-A	636-B-B	643-B	ప్రత్తి పంట
			0.05		ఈదర శేషయ్య తండ్రి కోటేశ్వరరావు	636-C	636-A	636-B-B	636-B-A	
19	637/A	2.83	0.04	సర్కారు పుంజ	బోరుగడ్డ ఏసోబు తండ్రి ఆనందరావు	643-B	637-A (Part)	636-A	638-A	
20	638/A	2.78	0.06	సర్కారు పుంజ	కొండుల రామారావు తండ్రి వెంకటేశ్వర్లు	643-B	638-A (Part)	637-A	639-A	ప్రత్తి పంట
21	639/A-1	0.72	0.06	సర్కారు పుంజ	ఈదర మస్తానమ్మ భర్త రామమోహనరావు	643-B	639-A-1	638-A	643-A	
22	641/A-F	2.27	0.07	సర్కారు పుంజ	కొరిటాల రామకోటేశ్వరరావు తండ్రి చిన్న కోటేశ్వర్లు	642-D	641-A-F (Part)	641-A-G	641-A-F (Part)	
			0.08		ఈదర సుధ, భర్త శ్రీనివాసరావు	642-D	641-A-F (Part)	641-A-F (Part)	641-A-F (Part)	
			0.05		ఈదర వెంకటేశ్వర్లు తండ్రి మస్తానయ్య	642-D	641-A-F (Part)	641-A-F (Part)	606-A	
23	641/A-G	3.15	0.07	సర్కారు పుంజ	బందారుపల్లి జగన్మోహనరావు తండ్రి రామకోటయ్య	642-D	641-A-G (Part)	641-A-F	642-E 643-A	జూట్ పంట
24	642/D	0.35	0.03	సర్కారు పుంజ	కొరిటాల రామకోటేశ్వరరావు తండ్రి చిన్న వెంకటేశ్వర్లు	642-C	642-E	643-B	642-D (Part)	
			0.06		ఈదర సుధ, భర్త శ్రీనివాసరావు	642-C	641-A	642-D (Part)	642-D (Part)	
			0.05		ఈదర వెంకటేశ్వర్లు తండ్రి మస్తానయ్య	642-C	641-A	642-D (Part)	642-D (Part)	ప్రత్తి పంట
			0.13		బందారుపల్లి జగన్మోహనరావు తండ్రి రామకోటయ్య	642-C	641-A	642-D (Part)	642-D	జూట్ పంట, జమ్మిచెట్లు-1, తాటిచెట్లు-17
			0.08		వల్లగుండ్ల హనుమంతరావు తండ్రి శేషయ్య	642-C	641-A	642-D (Part)	598-B	సుబాబులు
25	642/E	0.09	0.04	సర్కారు పుంజ	వల్లగుండ్ల హనుమంతరావు తండ్రి శేషయ్య	642-D	642-E (Part)	643-A	643-A	సుబాబులు
26	643/A-1	1.03	0.05	సర్కారు పుంజ	పాటిబండ్ల రైతుబాబు తండ్రి సారంగయ్య	642-E, 642-D	643-A1 (Part)	643-A-2 (Part)	642-E	చింతచెట్లు-4, రావిచెట్లు-1
			0.07		ఈదర ఆంజనేయులు తండ్రి కోటేశ్వరరావు	642-E	643-A1 (Part)	643-A-2 (Part)	641-A	
27	643/A-2	0.40	0.01	సర్కారు పుంజ	వల్లగుండ్ల హనుమంతరావు తండ్రి శేషయ్య	643-B	643-A-2 (Part)	639-A	643-A-2 (Part)	సుబాబులు తాటిచెట్లు-1
			0.01		ఈదర ఆంజనేయులు తండ్రి కోటేశ్వరరావు	643-B	643-A-2 (Part)	643-A-2 (Part)	642-E	తాటిచెట్లు-15
28	643/B-A	0.22	0.12	సర్కారు పుంజ	పాటిబండ్ల రైతుబాబు తండ్రి సారంగయ్య	643-C	643-A	643-B-A (Part)	642-D (Part)	
			0.10		ఈదర ఆంజనేయులు తండ్రి కోటేశ్వరరావు	643-C	643-A	643-B-B	643-B-A (Part)	
29	643/B-B	0.14	0.14	సర్కారు పుంజ	ఈదర మస్తానమ్మ భర్త రామమోహనరావు	643-C	639-A-1	643-B-C	643-B-A	తాటిచెట్లు-5
30	643/B-C	0.13	0.13	సర్కారు పుంజ	కొండుల రామారావు తండ్రి వెంకటేశ్వర్లు	643-C	638-A (Part)	643-B-D	643-B-B	ప్రత్తి పంట తాటిచెట్లు-1
31	643/B-D	0.13	0.13	సర్కారు పుంజ	బోరుగడ్డ ఏసోబు తండ్రి ఆనందరావు	643-C	637-D	643-B-C	636-B	
32	693/B-B	0.23	0.23	సర్కారు పుంజ	పాటిబండ్ల రాజశేఖర్ తండ్రి రఘుపతిరావు	693-C	694-A	693-B-A	636-D	
Total		26.20	3.53							

సం/- కోన శశిధర్,
జిల్లా కలెక్టరు మరియు మేజిస్ట్రేట్, గుంటూరు





తమిళనాడులోని కన్నియాకుమారిలో టీటీడీ నిర్మించిన శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం ఉదయం మహా కుంభాభిషేకం వైభవంగా జరిగింది. కుంభలగ్నంలో గోపురం వద్ద నిర్మించిన వేదికపై వేదపండితులు పుణ్య జలాలతో కుంభాభిషేకం నిర్వహించారు.
-ఆంధ్రజ్యోతి, చెన్నై



అనాథాశ్రమం నుంచి అమెరికాకు!

ఐదేళ్లపాటు డాడీ హోంలో పెరిగిన చిన్నారి.. నేడు దంపతులకు అప్పగించనున్న అధికారులు

మైలవరం, జనవరి 27: కడప జిల్లా జమ్మలమడుగు నియోజకవర్గం మైలవరంలోని డాడీహోం అనాథాశ్రమంలో పెరుగుతున్న బన్ని అనే ఐదు సంవత్సరాలు చిన్నారిని అమెరికాకు చెందిన దంపతులకు సోమవారం జిల్లా అధికారులు అప్పగించనున్నట్లు రాజా ఫౌండేషన్ నిర్వాహకులు జయరాజు తెలిపారు. ఐదేళ్ల క్రితం ప్రొద్దుటూరు ప్రాంతంలో గుర్తు తెలియని దంపతులు మగబిడ్డకు జన్మనిచ్చారు. అప్పటికే తండ్రికి హెచ్ఐవీ ఉంది, కాన్పు అయ్యే నాటికి అది తల్లికి సోకింది. ఈ పరిస్థితుల మధ్య ఆ తల్లి ఏడాది వయస్సున్న తన బిడ్డను ప్రొద్దుటూరు ప్రాంతంలో ఓ చెట్టు కింద వదిలిపెట్టి వెళ్లింది. ఆ చిన్నారిని ఓ డాక్టర్ తన ఇంటికి తీసుకెళ్లాడు. కొద్దిరోజులకే ఆ పసికూనకు అనారోగ్యం రావడంతో డాడీ హోం (రాజా ఫౌండేషన్) అధినేత రాజారెడ్డి చేతిలో పెట్టి వెళ్లిపోయాడు. అప్పటినుంచి ఆ చిన్నారిని డాడీ హోంలో అల్లారుముద్దుగా పెంచారు. అభిలాష్ అని పేరుపెట్టారు. హోంలోని మిగిలిన పిల్లలు ఆ చిన్నారిని అభి అని, బన్నీ అంటూ పిలవడం మొదలు పెట్టారు. కోలుకున్న అభి కోల్పోయిన ఆత్మీయతలను తిరిగి పొందాడు. ప్రభుత్వ నియమాల ప్రకారం డాడీ హోం అధినేత రాజారెడ్డి అభి పేరును కుటుంబ దత్తత కార్యక్రమ వెబ్‌సైట్‌లో పెట్టారు. ఆదర్శ దంపతులు అభి (బన్ని) కొరకు పోటీ పడ్డారు. అమెరికాకు చెందిన దంపతులు బన్నీని దక్కించుకున్నారు. డాడీ, స్త్రీ శిశు సంక్షేమ శాఖ, శిశు గృహం వారి ద్వారా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ద్వారా కావాల్సిన సమాచారాన్ని ప్రభుత్వానికి అందించి పాస్‌పోర్టు ఏర్పాటుచేశారు. సోమవారం డాడీహోం నుంచి అమెరికా నుంచి వస్తున్న ఆదర్శ దంపతుల ఒడిలోకి బన్ని వెళ్లనున్నాడు. కలెక్టర్ హరి కిరణ్, ఎస్పీ అభిషేక్ మహంతి, జిల్లా జడ్జి శ్రీనివాస్, స్త్రీ, శిశు సంక్షేమశాఖ అధికారుల సమక్షంలో ఆ దంపతులకు అప్పగించనున్నట్లు రాజా ఫౌండేషన్ (డాడీ హోం) నిర్వాహకుడు జయరాజ్ తెలిపారు.



బన్నీని అక్కున చేర్చుకున్న కడప జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాస్ (ఫైల్)

కొండవీడులో బౌద్ధం ఆనవాళ్లు



అమరావతి, జనవరి 27(ఆంధ్రజ్యోతి): రాజధానికి అమరావతి పేరును సార్థకం చేసే ఆధారాలు కొండవీడు కోటలో లభ్యమయ్యాయి. కొండవీడు కోటలో ఉన్న శివాలయం వద్ద రెండు వేల ఏళ్ల నాటి బౌద్ధ స్థూపం, శాసనాలు బయల్పడ్డాయి. గుంటూరు జిల్లా ఎడ్లపాడు మండలం కొండవీడు కోట వద్ద పురాతన శివాలయం, లక్ష్మీ నరసింహస్వామి ఆలయాలు ఉన్నాయి. రెడ్డిరాజుల కాలం నాటి ఈ ఆలయాలను సుందరంగా తీర్చిదిద్దేందుకు పురావస్తుశాఖ సన్నద్ధమయ్యింది. దీనిలో భాగంగా శివాలయం గర్భగుడిలో ఉన్న రాళ్లను తొలగించగా.. కింద బౌద్ధానికి సంబంధించిన ఆనవాళ్లు కనిపించాయి. మరింత లోతుగా తవ్వకాలు జరపగా... బౌద్ధ స్థూపాలు, బౌద్ధ శాసనం కూడా లభించాయి.

ప్రపంచశాంతి కోసమే బైబిల్ మిషన్ మహోత్సవాలు

- కన్వీనర్ రెవరెండ్ జె శామ్యూల్ కిరణ్
- వర్షంతో మహోత్సవాలకు ఆటంకం
- వేదిక కాకాని స్వస్థిశాలకు మార్పు



పెదకాకాని, జనవరి 27: ప్రపంచంలో శాంతి స్థాపన కోసమే బైబిల్ మిషన్ 81వ మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు బైబిల్ మిషన్ ఉపాధ్యక్షుడు, మహోత్సవాల కన్వీనర్ రెవరెండ్ డాక్టర్ జె.శామ్యూల్ కిరణ్ తెలిపారు. మూడు రోజుల పాటు జరిగే బైబిల్ మిషన్ మహోత్సవాలు ఆదివారం గుంటూరు జిల్లా ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎదుట గల సువిశాల ప్రాంగణంలో ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ప్రారంభ ప్రార్థనలో శామ్యూల్ కిరణ్ మాట్లాడుతూ క్రీస్తు బోధనలను సర్వమానవాళి ఆచరించాలని సూచించారు. సమాజంలో నానాటికి పెరుగుతున్న అశాంతి, అహింసను నివారించేందుకు బైబిల్ మిషన్ కృషి చేస్తుందన్నారు. ఏ మతాన్ని, ఏ కులాన్ని, ఎవరిని కూడా దూషించడం, ద్వేషించకుండా మానవత్వాన్ని పెంపొందించడమే బైబిల్ మిషన్ లక్ష్యం అని తెలిపారు. మూడు రోజుల పాటు జరిగే బైబిల్ మిషన్ మహోత్సవాల్లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర, ఢిల్లీ, ఒరిస్సా, ఛత్తీస్‌గఢ్‌తో పాటు ఇతర దేశాల నుంచి సుమారు నాలుగు లక్షల మంది భక్తులు పాల్గొంటారని అంచనా. కాగా.. ఆదివారం సాయంత్రం కురిసిన వర్షంతో మహోత్సవాల నిర్వహణకు ఆటంకం ఏర్పడింది. దీంతో నిర్వహణను ఇక్కడి నుంచి కాకాని స్వస్థిశాలకు (తోట) మార్చినట్లు శామ్యూల్ కిరణ్ తెలిపారు. సోమ, మంగళవారాలు మహోత్సవాలు కాకాని స్వస్థిశాల నుంచి నిర్వహిస్తామని భక్తులంతా స్వస్థిశాల వద్దకు రావాలని ఆయన కోరారు.



'ఉరి' సినిమా చూస్తున్న రక్షణమంత్రి నిర్మలా సీతారామన్ తదితరులు

'ఉరి' సినిమా చూసిన రక్షణమంత్రి

బెంగళూరు, జనవరి 27(ఆంధ్రజ్యోతి): సర్జికల్ స్ట్రైక్స్ నేపథ్యంలో రూపొందించిన 'ఉరి' సినిమాను రక్షణమంత్రి నిర్మలా సీతారామన్ సైనిక అధికారులతో కలిసి వీక్షించారు. ఆదివారం స్థానిక బెళ్లందూరులోని పీవీఆర్ సెంట్రల్ స్పిరిట్‌మాల్‌లో ప్రస్తుత, మాజీ సైనిక అధికారులు, అమరవీరుల కుటుంబాలతో కలసి ఆమె చిత్రాన్ని తిలకించారు. అనంతరం సైనికుల త్యాగాలను వారి కుటుంబీకులతో కలిసి స్మరించుకున్నారు. సైనికుల కుటుంబాలతో సెల్ఫీలు తీసుకున్నారు. దీనికి సంబంధించిన వీడియో, ఫొటోలను ఆమె ట్విటర్‌లో పోస్ట్ చేశారు. 'భారతమాతాకీ జై.. వందే మాతరం.. ఎలా ఉంది జోష్' అంటూ ట్వీట్ చేశారు. అలాగే, 'ఎస్ ఐ జోష్...' అంటూ మరో ట్వీట్ చేశారు. ఈ సినిమా సంతోషం కలిగించిందన్నారు. నటులు విక్కీ కౌశల్, యామినీగౌతం, దర్శక, నిర్మాతలను ఆమె అభినందించారు. 2016లో ఇండియన్ ఆర్మీ విజయాలను గుర్తు చేసుకున్నారు.

నా తండ్రే నా గురువు: ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం

తిరుపతి(కల్చరల్), జనవరి 27: 'మా నాన్నగారే నా మొదటి గురువు. ఆయనే నాకు దేవుడు. ఉదయాన్నే ఆయన ఫొటో చూసి స్మరించుకుంటాను. ఆయన చిరునవ్వే నాకు కనిపిస్తుంది' అని గానగంధర్వుడు, ప్రముఖ సినీ గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. ఆయన తండ్రి శ్రీపతి పండితారాధ్యుల సాంబమూర్తి భాగవతార్ సంస్మరణార్థం.. తిరుపతిలోని అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారుల యూనియన్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు హరికథా ఉత్సవాలు జరిగాయి. అన్నమాచార్య కళా మందిరంలో ఆదివారం జరిగిన ముగింపు కార్యక్రమానికి బాలసుబ్రహ్మణ్యం ముఖ్య అతిథిగా విచ్చేశారు. గతంలో హరికథలకు ఉన్న ప్రాధాన్యం, హరిదాసుల సంస్కృతి నేడు కనిపించడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా ఆయన హరికథా కళాకారులు కేశవమూర్తి, సీతారామయ్య, కృష్ణప్పలకు స్వర్ణ పతకాలను అందించి 'హరికథా విద్వన్మణి' బిరుదు ప్రదానం చేశారు.

ముద్రగడకు ఆహ్వానం లేదా?: మోహన్‌బాబు

పాలకొల్లు, జనవరి 27: ప్రముఖ సినీ దర్శకుడు దాసరి నారాయణరావు విగ్రహావిష్కరణకు ముద్రగడ పద్మనాభాన్ని ఆహ్వానించకపోవడంపై సినీ నటుడు మోహన్‌బాబు ఆవేదన వ్యక్తం చేశారు. పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లులో శనివారం మోహన్‌బాబు చేతుల మీదుగా దాసరి విగ్రహావిష్కరణ జరిగింది. ఆదివారం మోహన్‌బాబును కలిసేందుకు ముద్రగడ పాలకొల్లు వచ్చారు. విగ్రహావిష్కరణకు రాలేదని ప్రశ్నించడంతో.. తనకు ఆహ్వానం లేదని చెప్పడంతో మోహన్‌బాబు ఆవేదన చెందారు. ఆహ్వానించి ఉండాల్సిందని, దాసరి తనకు గురువైతే, ముద్రగడకు సన్నిహితులని పేర్కొన్నారు. వీరిద్దరి భేటీ రాజకీయంగా చర్చనీయాంశమైంది.

టీడీపీ, వైసీపీలను ప్రజలు నమ్మరు: కేఏ పాల్

ఒంగోలు(కార్పొరేషన్, క్రైం), జనవరి 27: రాష్ట్రాన్ని సింగపూర్ చేస్తానన్న చంద్రబాబే ఆ విషయంలో విఫలమయ్యారని, ఇక వైసీపీ అధ్యక్షుడు జగన్ ఏం చేస్తారని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ విమర్శించారు. ప్రకాశం జిల్లా ఒంగోలులో ఆదివారం పార్టీ కన్వీనర్ల అత్యవసర సమావేశాన్ని ఆయన నిర్వహించారు. అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడుతూ అధికార, ప్రతిపక్ష పార్టీలపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. లక్షల కోట్లు దోచుకొని ఒకరినొకరు విమర్శించుకుంటున్న టీడీపీ, వైసీపీలను నమ్మే పరిస్థితుల్లో ప్రజలు లేరన్నారు. ఇటీవల మరో నాయకుడు తిరుగుతున్నాడని, ఆయనకు కనీసం డిపాజిట్‌లు కూడా రావని జనసేన పార్టీ అధినేత పవన్‌ను పరోక్షంగా విమర్శించారు. వంగవీటి రాధా ప్రజాశాంతి పార్టీలో చేరేందుకు ఫిబ్రవరి 9 వరకు ఎదురు చూస్తామని చెప్పారు. పార్టీలో చేరతారా? లేదా? అన్నది ఆయన ఇష్టమన్నారు. జీఎంసీ బాలయోగి స్పీకర్ కావడానికి తాను సహకరించానని, ఆయనకు భారతరత్న ఇవ్వాలని కోరితే ఇవ్వలేదన్నారు. పీఏ సంగ్మాకు భారతరత్న ఇవ్వాలని కోరినా పట్టించుకోలేదన్నారు.

హత్యాయత్నం కేసులో పాల్‌కు సమన్లు

ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్‌కు ఒంగోలు కోర్టు నుంచి సమన్లు జారీ అయ్యాయి. ఒంగోలు వచ్చిన ఆయనకు ఆదివారం సమన్లు అందజేసేందుకు పోలీసులు వెళ్లగా తీసుకునేందుకు ఆయన నిరాకరించారు. 2012లో పాల్ బావమరిది కోటేశ్వరరావుపై హత్యాయత్నం జరిగింది. దీనికి తానే కుట్ర పన్నినట్టు పాల్ తనతో చెప్పారని అప్పటి తాలూకా సీఐ శ్రీనివాసన్ ఫిర్యాదు చేయగా, కందుకూరు డీఎస్పీ విచారణ నిర్వహించారు. తర్వాత సరైన ఆధారాలు లభించక కేసును మూసివేస్తున్నట్లు పోలీసులు కోర్టుకు తెలపగా, అప్పట్లో మేజిస్ట్రేట్ శ్రావణ్‌కుమార్ అందుకు అనుమతివ్వలేదు. పోలీసు దర్యాప్తు సక్రమంగా లేదన్న న్యాయమూర్తి.. కోర్టు నేరుగా ఈ కేసును విచారిస్తుందని ప్రకటించారు. ఆ మేరకు నిందితులకు సమన్లు పంపారు.

ANDHRA PRADESH CAPITAL REGION DEVELOPMENT AUTHORITY
LENIN CENTER, GOVERNORPET, VIJAYAWADA-520002 (A.P.)

E-PROCUREMENT TENDER NOTICE

NIT No: APCRDA-13023(38)/18/2019, Dt: 24-01-2019

Sub: AP CRDA - Construction of Advocate block consisting G+4 pattern having approximate BUA of 71,506 Sq.ft (140 Cabins & 16 Shops) with sub structure, Super Structure, Civil finishes, Electrical, Piping, CP and Sanitary fixtures, Fire protection system including cycle/walking track with paver block and Tensile roof covering at Judicial Complex in Super block "F" of Amarvati Government Complex Area in Amaravati Capital City **(Est Rs. 23.15 Crore).**

The bids can be downloaded on AP e-procurement portal **from 28-01-2019 to 12-02-2019 (14.00 Hrs)** for the above mentioned works. **Due date for submission of bid 12-02-2019 @ 15.00 Hrs, Technical Bid opening on 12-02-2019 @ 16:00 Hrs. Price Bid opening on 13-02-2019 @ 11:00 Hrs.** Please refer to **www.apeprocurement.gov.in** or **www.crda.ap.gov.in** for details. For any further clarifications contact **Sri.Ch.Dhanunjaya, Superintending Engineer (H&B) on 7095599008 / dhanunjaya.ch@apcrda.org**

Sd/- Commissioner, APCRDA

భారతీయ రిజర్వ్ బ్యాంక్
RESERVE BANK OF INDIA
www.rbi.org.in

13 సంవత్సరాల రాష్ట్ర ప్రభుత్వ సెక్యూరిటీస్ వేలం

ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ₹1,000.00 కోట్ల (ముఖ విలువ) మొత్తాన్ని వేలం ద్వారా విక్రయించడానికి ప్రతిపాదించింది.

మల్టిపుల్ ప్రైస్ ఫార్మాట్ క్రింద రాబడి ఆధారిత వేలం భారతీయ రిజర్వ్ బ్యాంకు కోర్ బ్యాంకింగ్ సొల్యూషన్స్ (E-Kuber) మీద **జనవరి 29, 2019** (మంగళవారం) న నిర్వహించబడుతుంది. మరింత సమాచారం కొరకు **జనవరి 25, 2019** (శుక్రవారం) తేదీ నాటి భారతీయ రిజర్వ్ బ్యాంకు వారి పత్రికా ప్రకటనను RBI వెబ్ సైట్ **(www.rbi.org.in)** ను చూడండి.

" మీకు డబ్బు ఆశచూపుతూ వచ్చే ఇమెయిల్స్ / ఎస్ఎంఎస్‌లకు / కాల్స్ వల్ల మీరు మోసపోవద్దు "



పదేళ్ళ ప్రరవే

ఏ అంశం మీదుగానైనా ఒక దశాబ్దకాలం అంటే తక్కువేం కాదు. ఒక భావజాలం, లేదా ఒక సంస్థ నడకను అంచనా వేయటానికి సరిపడా సమయమే. పదేళ్ళ కిందట ఉత్తరాంధ్రగడ్డపై శీతాకాలపు తెరల్ని తొలుచుకుంటూ 'మనలో మనం'గా పడిన విత్తు, ఈ దశాబ్దంలో పదుగురి ఆలోచనలకు నీడనిచ్చే 'ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక' అనే చెట్టుగా రూపాంతరం చెందింది. భిన్న అస్తిత్వాలు కొమ్మలై విస్తరించాయి. కొత్త కలాలు కవాతు చేసాయి. భూ నిర్వాసితులు, లైంగికహింస, రచయితలపై దాడులు, కుల మత ప్రాంత తెగ తదితర అణచివేతకి గురైనవారి పోరాటాలకి గొంతు కలిపింది. సోంపేట, పోలవరం, వాకపల్లి, మల్లన్నసాగర్, గోదావరి మెగా ఫుడ్ ప్రాజెక్ట్, బాక్సైట్ తవ్వకాల వ్యతిరేక పోరాటాలు, రోహిత్ వేముల ఘటన... ఒకటేమిటి ఈ పదేళ్ళల్లో అనేక సమస్యలపై ప్రరవే సైన్యం క్షేత్రస్థాయి కార్యాచరణకు నడుం బిగించింది. సామాజిక చైతన్యం దిశగా ప్రయాణిస్తూ దానిని, సాహిత్యరూపాల్లో రికార్డు చేసే పనిని తన బాధ్యతగా భావించింది. అందుకే ప్రరవే అంటే మహిళా గొంతుక మాత్రమే కాదు, బాధితులకు స్వరం కూడా. దేశంలోనే తొలి నిర్మాణాత్మక రచయిత్రుల వేదిక అయిన ప్రరవే తన పదేళ్ళ ప్రస్థానాన్ని, వార్షిక సదస్సుని పురస్కరించుకుని ఫిబ్రవరి 2, 3 తారీఖులలో విశాఖపట్నం, ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఒక సదస్సుని ఏర్పాటు చేసింది. ఆ సందర్భంగా యువ రచయిత్రులు రెహన, మానస ఎండ్లూరిలతో ప్రరవే జాతీయ కార్యవర్గం పంచుకున్న 'పదేళ్ళ ప్రరవే' అనుభవాలు, జ్ఞాపకాలు.

■ రెహన, మానస ఎండ్లూరి

సంస్థ ప్రాధాన్యత సమాజ సాహిత్యాల అనుబంధానికి...



సమాజంలో సాహిత్యంలో స్త్రీలు మార్జినలైజ్ చేయబడ్డ వర్గం. అందులోనూ పాలకవర్గాల, కులాల ఆధిపత్య ప్రాంతాల రచయిత్రులకి అధిక ప్రాధాన్యత ఉంటూ వస్తున్నది. వెనకబడిన కులాల అస్తిత్వాల స్త్రీలు - సాహిత్య కళారంగాల్లో అనామకులుగానే ఉండిపోతున్నారు. సాహిత్య వేదికల్లో వారి ఉనికి అరకొరగా ఉంటున్నది. ఈ వివక్షకి భిన్నంగా వివిధ అస్తిత్వాల రచయిత్రులు 'దామాషా' ప్రాతిపదికగా 'ప్రరవే'లో భాగమయ్యారు. దాన్ని దశాబ్ద కాలంగా రాజీ లేకుండా కొనసాగిస్తూ రావడం వేదిక నిబద్ధతకు నిదర్శనం. ఈ పునాది పటిష్టంగా ఉండటమే 'ప్రరవే' తొలి విజయంగా భావించాలి. సంస్థ ప్రాధాన్యత సమాజ సాహిత్యాల అనుబంధానికి. మార్పులను ఆహ్వానిస్తూ కొత్తనీటిని ఒడిసిపట్టి నూతనసృష్టికి సమాయత్తమవుతుంది ప్రరవే.

అనిశెట్టి రజిత, జాతీయ అధ్యక్షురాలు

నా సామాజిక అవగాహన మెరుగయింది



నలుగురం కలిసి చేసే పనులు మరింత శక్తివంతంగా ఉంటాయని నమ్మిన కొందరి వలన ప్రరవే నడుస్తోంది. ఎంచుకున్న ప్రత్యేక కార్యరంగం స్త్రీల సాహిత్యం, సమాజం కావడాన ఇది రచయిత్రుల వేదిక అయింది. ప్రరవే వల్ల నా సామాజిక అవగాహన మెరుగయింది. కానీ సంస్థ ప్రత్యక్ష ప్రభావంతో ఎపుడూ ఫిక్షన్ రాయలేకపోయాను. అనుకునీ పూనుకునీ ఫిక్షన్ రాయడం సాధ్యం కాదేమో! కానీ ప్రరవే ఇచ్చిన సామాజిక అవగాహన రచనలో అంతర్లీనంగా ఉండటం గ్రహించుకోగలిగాను. చాలా సామాజిక సమస్యల మీద క్షేత్ర పర్యటనలు చేసి, వ్యాసాలు రాయడానికి సంస్థలో ఉండటమే కారణం. సాహిత్యేతర పాఠకుల నుంచి, సమస్యల మీద పోరాటాలు చేస్తున్న వారి నుంచీ విస్తృతంగా వస్తున్న స్పందనలు వ్యాసరచనకి నిబద్ధయ్యేలా చేసాయి.

కె. ఎన్. మల్లీశ్వరి, జాతీయ కార్యదర్శి

ప్రజాస్వామిక విలువల కోసం కొత్త ఆలోచనలను చేస్తూ...



అనేక ఆశల, ఆకాంక్షల, ఆశయ ఆకాశాలతో పదేళ్ళ క్రితం ఏర్పడిన ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక, ప్రజాస్వామిక విలువల కోసం కొత్త ఆలోచనలను చేస్తూ కదులుతున్నది. దశాబ్ది సమీక్షకి సన్నద్ధం అవుతున్నవేళ ప్రరవే సభ్యులందరిలో జ్ఞాపకాల వెల్లువ ఉరకలేస్తుంది. ఎప్పటికప్పుడు సాహిత్య సామాజిక కార్యక్రమాలతో కొత్త వెలుగులను వెదజల్లుతున్నది. రచనల ద్వారా, ప్రత్యక్ష ఆచరణ ద్వారా ప్రగతిశీల సమూహాలతో కలిసి వివక్షారహిత సమాజం కోసం అడుగులు వేస్తున్నది. ఫాసిస్టు హిందూ మతోన్మాదానికి వ్యతిరేకంగానూ దళిత, ఆదివాసీ మైనారిటీ వర్గాలకి సంఘీభావంగానూ రచనలు చేయడం సదస్సులు నిర్వహించడం చేస్తోంది. నిన్న మొన్నటి యాదాద్రి దొమ్మరి కులవ్యవస్థకు అండగా విస్తృత అధ్యయనం, రచనలు చేయడం, ప్రరవే చైతన్యానికి నిదర్శనం.

భండారు విజయ, జాతీయ సమన్వయకర్త

రచనలకే పరిమితమైన సంస్థ కాదు



ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక కేవలం రచనలకే పరిమితమైన సంస్థ కాదు. సమాజంలో అనేక సంఘటనలు జరిగినప్పుడు బాధితుల పక్షాన నిలిచినది. పోలవరం ఆనకట్ట నిర్మాణం వలన చుట్టుపక్కల ఊళ్లు మునిగిపోయాయి. ప్రరవే సభ్యులు ఆ గ్రామాలకు వెళ్ళి వాళ్లతో మాట్లాడి వాళ్ళ కష్ట సుఖాలు తెలుసుకున్నారు. నిర్వాసితుల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తెచ్చేలా వ్యాసాలు రాసారు. సంఘాల నిర్మాణం, ఆచరణ గురించి, దళిత సాహిత్యం, బిసి సాహిత్యం, మైనారిటీ వాద సాహిత్యం, విప్లవ సాహిత్యాలపై చారిత్రక సభలు నిర్వహించింది. ప్రరవే పదేళ్ళ ప్రయాణంలో నా అడుగులు కూడా ఉన్నందుకు ఎంతో ఆనందిస్తున్నాను. ప్రరవే ప్రయాణం ఎక్కడా కుంగిపోకుండా మరింత ముందుకుపోవాలనీ యిలాంటి పదేళ్ళ ఉత్సవాలు మరెన్నో చేసుకోవాలనీ ఆకాంక్ష.

మందరపు హైమవతి, సమన్వయకర్త, ఏపి శాఖ

ప్రజాస్వామిక విలువల్ని విశ్వసించే వారిని కలుపుకుంటూ...



కొన్ని ప్రత్యేక లక్ష్యాల కోసం పనిచేస్తూ రెండు తెలుగు రాష్ట్రాల్లోని అన్ని ప్రాంతాలకూ, అన్ని అస్తిత్వాలకూ ప్రాధాన్యత ఇస్తూ ముందుకు సాగుతున్న ప్రరవేలో బాధ్యతలు నిర్వహిస్తూ ఉండటం నాకు సంతృప్తినిచ్చే అంశం. ప్రజాస్వామిక విలువల్ని విశ్వసించేవారిని కలుపుకుంటూ ఆంధ్ర, తెలంగాణాలతో పాటు జాతీయస్థాయిలో కమిటి ఏర్పడి లక్ష్యాలకు అనుగుణంగా వివిధ అంశాలపై కార్యక్రమాలు చేపట్టగలగడం ప్రరవే సంఘటిత శక్తికి నిదర్శనం. ప్రరవే కార్యకలాపాల పట్ల కొంతమంది వ్యక్తులు నిబద్ధతతో చేస్తున్న కృషి ప్రశంసనీయం. దామాషా పద్ధతిలో సభ్యులను ఎన్నుకుంటూ, కొత్త తరం రచయిత్రులకు ప్రాధాన్యత ఇవ్వాలన్న సంకల్పబలంతో ముందుకు వెళుతున్న ప్రరవే సామాజిక అవగాహనను పెంపొందించుకోవటంలో పదేళ్లుగా నాకు తోడ్పడిందనే నా భావన.

కొమర్రాజు రామలక్ష్మి, సమన్వయకర్త, తెలంగాణ శాఖ

క్షేత్రస్థాయిలో పని చేయడం కొత్త అనుభవం



ప్రరవే పుట్టినప్పటి నుంచి ఇప్పటివరకూ వరకు సంస్థతో నా అనుబంధం, ప్రాతినిధ్యం కొనసాగుతూ వస్తోంది. పదేళ్ల ప్రస్థానంలో చాలామంది రచయిత్రులను రచయితలను ప్రభావితం చేసిన సందర్భాలు ఉన్నాయి. నా ప్రయాణంలో వివిధ స్థాయిలలో బాధ్యతలు నిర్వహించాను. ఎప్పటికప్పుడు నూతన ఉత్సాహాన్ని నింపుకుంటూ విశ్లేషించుకుంటూ ప్రశ్నించుకుంటూ రచనలు చేస్తున్నాను. సమకాలీన సమస్యల పట్ల అవగాహన కోసం క్షేత్రస్థాయిలో పని చేయడం కొత్త అనుభవాలను ఇచ్చింది. ఆ అనుభవ సంపదను సమాజానికి అందించడంలో నా వంతు కృషి చేస్తున్నాను. ఈ ప్రయాణంలో నా పాత్ర చాలా సంతోషాన్ని ఆశ్చర్యాన్ని కలిగిస్తూ ఎప్పటికప్పుడు మళ్ళీ మళ్ళీ చిగురిస్తున్న భావనని కలిగిస్తుంది.

పి. రాజ్య లక్ష్మి, కార్యదర్శి, ఏపి శాఖ

సమస్యలను, పరిష్కారాలను సాహిత్యంలో రూపుకట్టిస్తోంది



మధ్యలో కొంత విరామం తీసుకున్నా ప్రరవే తొలిదశలోనూ ఇపుడూ రచయిత్రులతో కలిసి పనిచేయడం ఆనందం కలిగించే విషయం. అందరం కలిసి నిర్మించిన సంస్థ ఈ రోజు పదేళ్ళ సమాలోచనలోకి ప్రవేశించింది. భిన్న అస్తిత్వాలను కూడగట్టుకుంటూ ఆయా అస్తిత్వాలు ఎదుర్కునే అణచివేతను, అవి ఎదుర్కొంటున్న అనేక సమస్యలను గమనిస్తూ వెలికితీస్తూ అందుకు గల కారణాలను చర్చిస్తూ వాటి పరిష్కారానికై మార్గాలను వెతుకుతుంది. అంతటితో ఆగకుండా సాహిత్యంలోనూ ఆయా సమస్యలను, పరిష్కారాలను సాధించదలచుకున్న సవాళ్ళను రూపుకట్టించి పాఠకలోకానికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తోంది. భిన్న అస్తిత్వాల ప్రాతినిధ్యాన్ని క్రమం తప్పకుండా నిర్మాణంలో పొందుపరుస్తున్నది.

తిరునగరి దేవకీ దేవి, అధ్యక్షురాలు, తెలంగాణ శాఖ

గిరిజన ప్రాంతాలలో పర్యటనలు విస్తరించాలి



పదేళ్ల క్రితం ఏర్పడిన ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక ఆదివాసీ సమాజంలోకి సాహిత్యంలోకి అడుగు పెడుతున్న నాలాంటి వాళ్ళకు ఒక ఉత్సాహాన్ని ఇచ్చింది. ప్రరవే నిర్వహిస్తున్న సమావేశాలు సదస్సులు కవితను కథలను ఎలా రాయాలో అవగాహన కలిగిస్తున్నాయి. గిరిజన సమాజంలోకి వచ్చే కొత్త వాళ్ల కోసం శిక్షణ తరగతులను నిర్వహించాలి. గిరిజన ప్రాంతాలలో సమస్యలు వచ్చినప్పుడు క్షేత్రస్థాయిలో పర్యటనలు విస్తరించాలి.

పద్దం అనసూయ, జాతీయ కార్యవర్గ సభ్యురాలు, ప్రరవే, తెలంగాణ

ఈ వేదిక వల్ల ఎన్నో అనుభవాలు, ఎంతోమంది స్నేహితులు...



ప్రరవే ఒక మంచి ఉద్దేశంతో కార్యచరణ దిశగా అడుగు ముందుకేసిన వేదిక. తొలిసారి అనకాపల్లిలో జరిగిన మనలో మనం కలయిక పదేళ్లుగా కొనసాగుతూనే ఉన్నందుకు చాలా సంతోషంగా ఉంది. మనలో మనం ప్రజాస్వామిక విలువల దిశగా అడుగులు వేయడానికి ఎంతో ఉత్సాహాన్ని స్ఫూర్తిని నింపుకున్నామో ఇప్పటికీ అదే ఉత్సాహం మా వెంట నడుస్తూనే ఉంది. పదిమంది కలిసి ప్రయాణించేటప్పుడు కొన్నితేడాలు ఇబ్బందులు కలగవచ్చు. అంతమాత్రం చేత నిరాశపడి ప్రయాణం ఆపేస్తే గమ్యాలను చేరుకోలేము. వేదిక ఎన్నో అనుభవాలను నేర్పించింది. ఎంతో మంది స్నేహితులను దగ్గరచేసి మనుషులను చదివే అవకాశం ఇచ్చింది. ఇక ముందు ఏం సాధించాలో అంచనా వేసుకుంటూ మరికొంత దూరం నడుస్తాను.

పుట్ల హేమలత, అధ్యక్షురాలు, ఏపి శాఖ

నా ఆలోచనకు, రాజకీయ అవగాహనకు విస్తృతినిచ్చింది



లక్ష్యాలను చేరుకోగలిగామని చెప్పే సాహసం చెయ్యను కానీ ప్రరవే ప్రస్థానం ఆ దిశగానే సాగుతున్నది. వాకపల్లి అత్యాచార ఘటన నుండి, యాదగిరిగుట్ట సెక్స్ వర్కర్ల కేసు వరకు స్త్రీల మీద జరుగుతున్న హింసకు వ్యతిరేకంగా ప్రరవే స్పందిస్తున్నది. సామాజిక రాజకీయ ఘటనలను, ప్రాజెక్టుల నిర్మాణం వంటి అభివృద్ధి విధానాల మంచిచెడులను, స్త్రీలపై వాటి ప్రభావం గురించిన అధ్యయనానికి క్షేత్ర పర్యటనలు చేసింది. ఆ అనుభవం నుండి బాధిత ప్రజల పక్షాన ప్రరవే మాట్లాడుతున్నది. ఆ అనుభవాల నుండి సభ్యులు రచనలు చేస్తున్నారు. ప్రరవే ప్రయాణంలో నేను కూడా ఉన్నాను అనేది నాకు సంతోషం కలిగించే విషయం. వ్యక్తిగా ప్రరవే నా ఆలోచనకు, రాజకీయ అవగాహనకు విస్తృతిని ఇచ్చిందని భావిస్తున్నాను.

కాత్యాయని విద్మహే, కార్యదర్శి, తెలంగాణ శాఖ

ఇట్స్ మై హౌస్... బట్ ఫర్ యూ!

నేను ఒక ఇల్లు కడుతున్నాను
అది నాకోసం అనుకుంటాను ముందు
తీరా నిర్మాణం అయ్యాక చూస్తే
అది నీకోసమే!

నేను ఎక్కడెక్కడో సంచరించాను కదా
కొన్ని భావాలు ఆలోచనలు పోగయ్యాయి
కొన్ని సంఘటనలు..
కొంతమంది మనుషులు..
నామీద దయతోనో కోపంతోనో ప్రేమతోనో
నాక్కొన్ని అనుభూతుల్నిస్తారు

వాటిని
నేను పోగేసిన పదాల ఇటుకల మధ్య
తాపడం చేస్తాను
అప్పుడు వాక్యాలు, పేరాలు గోడలై
నా ఎదురుగా ఒక నిర్మాణం రూపుకడుతుంది

పుస్తకాల్ని అలమరాలో పేర్చినట్టు
నేను నా భావాలన్నీ పేర్చేస్తాను
ఇప్పుడు అక్షరాలు, పదాలు, వాక్యాలు
అన్నీ నా నిర్మాణంలో భాగస్వామ్యమై
ఒక అత్యద్భుత రూపం సంతరించుకుంటుంది
అది ఒక పసిపాపలా నవ్వేస్తుంది
అప్పుడే విరిసిన పూవులా పలకరిస్తుంది

ఇంకాస్త కష్టపడి కొన్ని అలంకారాలతో
నిర్మాణాన్ని నింపేస్తాను
అప్పుడు నాకది కొంచెం నచ్చుతుంది
నాకు నచ్చిందంటే నీకు నచ్చుతుంది
ఎందుకంటే నువ్వు కూడా
నాకోసం ఇలాంటిదే ఏదో ఒక నిర్మాణం
చేపట్టే ఉంటావని ఒక తీయని ఊహ!

గడ్డిని తెంపి, చీల్చిన నారలతో
పిట్ట ఆకుపచ్చ గూడును అల్లినట్టు
నేను ప్రకృతిని కూర్చి ఒక కవితను అల్లేస్తాను
అది ఇల్లై నిన్ను ఆహ్వానిస్తుంది

నువ్వు ఎన్ని మార్లైనా
నా ఇంట్లోకి గృహప్రవేశం చేయొచ్చు

కాలాలకతీతంగా
అనుగుణంగా
సేద తీరొచ్చు
దోస్త్..
అవును అది నా సృష్టే.. కానీ నీ కోసం!
కొన్ని పార్శ్వాలు సున్నితంగా
మరికొన్ని కఠినంగా...
నువ్వు దర్శిస్తున్నకొద్దీ కొత్త కోణాలెన్నో

వసంతమొక్కటేనా.. ఋతువులన్నీ
విరగనవ్వుతాయి ఈ ఇంట్లో
వర్షమూ ఎండా చలీ..
త్రికాలాలు మనకోసం ఇక్కడ
తీరుబడిగా తిష్టవేస్తాయ్


ఇల్లంతా తేనె రంగు వెలుగుతుంది
చీమొకటి ప్రపంచాన్ని లాక్కొచ్చి
నట్టింట్లో రచిస్తుంది

ఎవరు నాకు ఇల్లు లేదని నవ్వింది?
నా అపురూపమైన
నా స్వహస్త నిర్మాణమైన
నా ఆత్మ నిండిన
ఈ ఇంటికి ఎవరు వెల కట్టగలరు?

రంగులన్నీ కమ్ముకొని
ఒక్కోసారి ఇల్లు వానవిల్లవుతుంది
అప్పుడు నువ్వు
నా చెక్కిళ్లపైనా
కనురెప్పలపైనా
పెదవులపైనా
ఒక్కో అనుభూతిని చదువుతుంటావు
నా ఇల్లంటే ఏమిటో నీకు పూర్తిగా తెలిసిపోతుంది

అప్పుడు మనం కేవలం రెండు అట్టలుగా కాక
ఆత్మల కలయికతో అక్షరాలుగా మొలకెత్తుతూ
పుస్తకాలుగా రూపొందుతూ
సహజీవనం మొదలు పెడతాం!

■ **షాజహానా**



'లైఫ్ ఈజ్ ఎ మూవ్‌మెంట్'

ఎస్వీ సత్యనారాయణ రచన 'జీవితం ఒక ఉద్యమం' కవితా సంపుటికి స్వాతి శ్రీపాద ఆంగ్ల అనువాదం 'లైఫ్ ఈజ్ ఎ మూవ్‌మెంట్' ఆవిష్కరణ సభ జనవరి 29 మ.3గం.లకు సమావేశ మందిరం, తెలుగు విశ్వవిద్యాలయం, నాంపల్లి, హైదరాబాద్‌లో జరుగుతుంది. పి. సత్యనారాయణ, నందిని సిధారెడ్డి, దేశపతి శ్రీనివాస్ తదితరులు పాల్గొంటారు.

జి.ఎస్. గాబ్రియల్

'బ్లాక్ వాయిస్'

తంగిరాల సోని కవితా సంపుటి 'బ్లాక్ వాయిస్' ఆవిష్కరణ సభ ఫిబ్రవరి 3 సా.5 గం.లకు ప్రెస్ క్లబ్, గాంధీ నగర్, విజయవాడనందు జరుగుతుంది. చల్లపల్లి స్వరూపరాణి, నూకతోటి రవి కుమార్, బొనిగల రామారావు, పింగళి చైతన్య, షేక్ కరీముల్లా, బెందాళం కృష్ణారావు, దుర్గం సుబ్బారావు, దుగ్గినపల్లి ఎజ్రాశాస్త్రి, పల్నాటి శ్రీరాములు తదితరులు పాల్గొంటారు.

సామాజిక పరివర్తన కేంద్రం

బాల సాహిత్య పురస్కారం

విజయనగరం జిల్లా పార్వతీపురంకు చెందిన 'నారంశెట్టి బాల సాహిత్య పీఠం' 2018 సంవత్సరానికి బాల సాహిత్య పురస్కారాలను ఎం.వి.వి. సత్యనారాయణ, టి.వేదాంత సూరిలకు ఇస్తున్నది. పురస్కార ప్రదానసభ ఫిబ్రవరి 3 ఉదయం విశాపట్టణం పౌర గ్రంథాలయంలో జరుగుతుంది. నారంశెట్టి ఉమామహేశ్వరరావు, పొట్లూరి హరికృష్ణ, కొల్లూరు సరాజ్యమ్మ తదితరులు పాల్గొంటారు.

- గుడ్ల అమ్మాజీ

క్రీడలపై కథలకు ఆహ్వానం

క్రీడలపై కథల సంకలనం తయారీకి తోడ్పడండి. క్రీడలు కేంద్ర బిందువుగా ఉన్నవి మీకు తెలిసిన కథల వివరాలు గానీ, మీరు రాసిన కథలు గానీ పంపితే పరిశీలిస్తాము. కథలను మార్చ్10లోగా చిరునామా: కస్తూరి మురళీ కృష్ణ, ప్లాట్ నెం.32, ఇం.నెం.8-48, రఘురామ్ నగర్ కాలనీ, ఆదిత్య హాస్పిటల్ లేన్, దమ్మాయిగూడ, హైదరాబాద్-83కు పంపాలి. kmkp2025@gmail.com కు ఈమెయిల్, 9849617392కు వాట్సాప్ చేయొచ్చు.

- కోడిహళ్లి మురళీమోహన్

అంగవైకల్యం గల మహిళల కథలు/ అనుభవాలకు ఆహ్వానం

అంగవైకల్యం గల మహిళల కథలు/ అనుభవాలను పుస్తకంగా వేసేందుకు రచనలను ఆహ్వానిస్తున్నాం. 'మిగతావారికన్నా వేరుగా ఉన్నాను' అనిపించిన సందర్భాలు, వాటిని ఎదుర్కొన్న తీరు, 'మిగతా వారికైతే ఇలా ఉండేది కాదు' అనిపించిన ప్రతి భిన్నత్వాన్నీ రాయవచ్చు. మీ రచనలు ఇతరులకు స్థైర్యాన్నిస్తాయి. రచనలను పంపాల్సిన చిరునామా: బి. అరుణ, రూం.నం.129, లేడీస్ హాస్టల్-1, యూనివర్శిటీ ఆఫ్ హైదరాబాద్, గచ్చిబౌలి, హైదరాబాద్, తెలంగాణ-500046. ఫోన్:9395532951, ఈమెయిల్:arunaborra9@gmail.com.

- పి. కృష్ణ ప్రియ



నేను పెద్దయ్యాక!

గబగబా 10వ తరగతి చదివేసి
ఇంటర్ చదివి, డిగ్రీ చేసి, పీజీ చేసి
పెద్ద ఉద్యోగం లక్షల కోట్లు సంపాదించే
ఉద్యోగంలో చేరి
ఇంట్లో ఉన్నవాళ్ళందరికీ
అమ్మకీ, నాన్నకీ, అన్నకీ, నాకు, నా భార్యకీ,
నా పిల్లలకీ తలొక్క కారు కొంటాను
బంటుమిల్లి బ్రదర్స్ పేరుతో
ప్రక్క ప్రక్కనే పెద్ద పెద్ద ఇళ్ళు కట్టేసి
అందులో ఎవరి గదులు వాళ్ళకి
మెత్తటి పరుపులు ఏర్పాటు చేస్తాను
నా పిల్లలకి
అడిగినన్ని బొమ్మలు కప్‌బోర్డునిండా కొంటాను
పిల్లల సిడీలు ఒక ర్యాక్‌లో నింపుతా
నా పిల్లల్ని గేమ్స్ ఆడుకొనేంతవరకు
లాప్‌టాప్‌లో ఆడుకోనిస్తాను
పెద్ద సినిమాహాల్‌కి నెలకొకసారి పిల్లల్ని తీసుకెళ్తాను
వీకెండ్‌లో షికారుకి తీసుకెళ్తాను

■ **భువన్**, 3వ తరగతి

(నీవు పెద్దయ్యాక ఏం చేస్తావంటే
మా ప్రక్క ఇంటివాళ్ళ బాబు ఏమాత్రం
తడుముకోకుండా చెప్తుంటే వ్రాశాను.
ముప్పాళ్ళ భార్గవశ్రీ, 98481 20105.)



వికసిత పద్మాలు

ఒకరు దేశీయ వంగడాలను కాపాడడం కోసం... ఒకరు అంధ బాలికల జీవితాల్లో వెలుగు కోసం... మరొకరు పర్యావరణ పరిరక్షణ కోసం... ఇంకొకరు శాస్త్రసాంకేతిక రంగ పురోగతి కోసం... వారంతా సమాజం శ్రేయస్సు కోసం తపించారు. తమతమ రంగాలపై చెరిగిపోని ముద్ర వేశారు. పద్మ పురస్కారాలకు ఎంపికైన స్ఫూర్తి ప్రదాతల్లో కొందరు...



1 పొదుపుతో బతుకు పాఠం


చిన్నపిళ్లై

'ప్రతి సమస్యకు ప్రభుత్వాలను బాధ్యులను చేయడం కాదు, బాధ్యతను చేతుల్లోకి తీసుకుని పరిస్థితులను చక్కదిద్దుకోవడం నేర్చుకోవాలి' అదే మధురై చిన్నపిళ్లై జీవితం నేర్పే బతుకు పాఠం. కుటుంబం, సమాజం, దేశ సంక్షేమం అంతా చిన్నమొత్తాల పొదుపులోనే దాగుందని గాఢంగా నమ్మారు చిన్నపిళ్లై. తాను చదువుకోకపోయినా గ్రామీణ పేద, నిరక్షరాస్యులైన మహిళలను పొదుపు దిశగా నడిపించారు. పేదరికం, అవిద్య నుంచి బయటపడేశారు. మధురై చిన్నపిళ్లైగా పేరుపొందారు. రుణాల ఊబి నుంచి గ్రామీణ మహిళలను కాపాడేందుకు దేశంలోనే తొలిసారిగా 'కలాంజియం' పేరుతో గ్రామీణ మహిళల పొదుపు, రుణ సమాఖ్యను నెలకొల్పారు. సూక్ష్మరుణ ఉద్యమాన్ని నిర్మాణం చేశారు. తమిళనాడు గ్రామీణ ప్రాంతాలలో చదువురాని, గ్రామీణ పేద మహిళలకు చిన్నమొత్తాల పొదుపు ద్వారా కలిగే లాభాలను వివరించారు. మహిళలు రాయితీల కోసం ప్రభుత్వం మీద ఆధారపడకూడదని హితవు చెప్పేవారు. గ్రామీణ పేదరికాన్ని రూపుమాపడం, మహిళా సాధికారతను సాధించడమే లక్ష్యంగా పనిచేశారు. పేదరికంలో మగ్గిపోతున్న అనేకమంది మహిళలను అప్పుల బారి నుంచి బయటపడేశారు. పుల్లుచేరి అనే గ్రామం పూర్తిగా రుణాల ఊబి నుంచి బయటపడడంతో చిన్నపిళ్లై సూక్ష్మరుణ ఉద్యమం వెలుగులోకి వచ్చింది. 1999లో ఆమె స్త్రీశక్తి పురస్కారం అందుకున్నారు. అవార్డు ఇచ్చే సందర్భంలో అప్పటి ప్రధాని వాజ్ పేయి శిరసు వంచి ఆమె పాదాలకు నమస్కరించిన సంఘటన చిన్నపిళ్లై గొప్పతనాన్ని లోకానికి చాటింది. ఆమె కృషి వల్ల 'కలాంజియం కమ్యూనిటీ బ్యాంకింగ్' నాలుగు రాష్ట్రాలకు విస్తరించింది. పొదుపు ఉద్యమం వల్ల ఎంతో మంది గ్రామీణ మహిళలు చదువు నేర్చుకున్నారు. తమకాళ్ల మీద తాము నిలబడ్డారు. చిన్నపిళ్లై పిలుపుతో అనేక మంది విద్యార్థులు పీడిత ప్రజల బాగు కోసం పల్లెబాట పట్టారు. చిన్నపిళ్లై నెదర్లాండ్, మెక్సికో దేశాలలో పర్యటించారు. తన అనుభవాలను అక్కడి ప్రజలతో పంచుకున్నారు.

ఎంత గొప్ప పేరు వచ్చినా ఆమె ఆడంబరాలు దరిచేరనీయకుండా సాధారణ జీవితాన్ని గడుపుతున్నారు. తన ఆశయ సాధనకు అహరహం శ్రమిస్తున్నారు. పదిమంది మంచికి పాటుపడ్డ గొప్ప మానవతావాదిగా కీర్తి గడించారు. చదువు లేకపోయినా సంకల్పం మంచిది అయితే సాధించలేనిది లేదని రుజువు చేశారు.

2 ఉపకార వేతనంతో మొదలై....


రోహిణి గోడ్‌బోలె

రోహిణి గోడ్‌బోలె... పుణెలో పుట్టారు. బాలికల విద్య కోసం ప్రభుత్వం దేశవ్యాప్తంగా కొత్తగా స్కూళ్లు ఏర్పాటు చేస్తున్న రోజులవి. పుణెలోనే 'హిజ్ హైనెస్ చింతమన్‌రావ్ పట్‌వర్ధన్'కి గర్ల్స్ స్కూల్‌కు ఎంతో పేరు ఉంది. అందులోనే చేరారు రోహిణి. కానీ అక్కడ ఏడో తరగతి వరకూ సైన్స్ చెప్పేవారు కాదు. అప్పట్లో స్టేట్ స్కాలర్‌షిప్ ఇచ్చేవారు. కానీ అక్కడి నుంచి ఏ ఒక్కరూ ఎంపిక కాలేదు. ఎందుకంటే స్కాలర్‌షిప్ రావాలంటే ఆ పరీక్ష రాయాలి. అందులో ఉన్నది ఒకే ఒక్క సబ్జెక్ట్ జనరల్ సైన్స్. ఎలాగైనా స్కాలర్‌షిప్ తెచ్చుకోవాలన్న ఉద్దేశంతో సైన్స్ నేర్చుకోవాలని ఆమె టీచర్‌ను కలిశారు. సదరు టీచర్ భర్త కూడా సైన్స్ బోధకుడు కావడంతో రోహిణి ట్యూషన్ కోసం వాళ్లింటికి వెళ్లేవారు. అలా ఆమె జీవితంలోకి సైన్స్ ప్రవేశించింది. అలాగే లెక్కలను బాగా ఇష్టపడి చదివారు. స్కాలర్‌షిప్ కూడా తెచ్చుకున్నారు. అలా పదో తరగతిలో టాప్ టెన్‌లో నిలిచారు. ఆ సందర్భంలో మీడియా ఓ ప్రశ్న అడిగింది... "మీ లక్ష్యం ఏంటి?" అని! ఆమె తడుముకోకుండా 'శాస్త్రవేత్త' అవుతానని దృఢంగా చెప్పారు. ఒకానొక దశలో గణితం వైపు వెళదామనుకున్నారు. కానీ ఆ రంగంలో ఉద్యోగాలు లేవన్న ఉద్దేశంతో ఫిజిక్స్‌లో రాటుదేలారు. డిగ్రీ పూర్తి చేశారు. బాంబే ఐఐటీలో మాస్టర్ డిగ్రీ చేస్తున్న సమయంలో థియరిటికల్ ఫిజిక్స్ అధ్యాపకుని ప్రోత్సాహంతో పార్టికల్ ఫిజిక్స్ వైపు దృష్టి సారించారు. ఆ తర్వాత ఉన్నత చదువుల కోసం న్యూయార్క్ వెళ్లారు. అక్కడే పార్టికల్ ఫిజిక్స్‌లో పీహెచ్‌డీ చేసి తనకంటూ ఓ గుర్తింపు తెచ్చుకున్నారు. అప్పుడే న్యూట్రినో ప్రతిచర్యల్లో హిగ్స్ బోసన్ పార్టికల్ కోసం శాస్త్రవేత్తలు అధ్యయనం చేస్తున్న రోజులవి. ఆ తర్వాత సెర్న్ (యూరోపియన్ ఆర్గనైజేషన్ ఫర్ న్యూక్లియర్ రిసెర్చ్)లో పార్టికల్ ఫిజిక్స్ శాస్త్రవేత్తగా గుర్తింపు తెచ్చుకున్నారు. 'కొలైడర్స్'పై చేసిన అధ్యయనం ఆమె కెరీర్‌ను మలుపు తిప్పింది. ఇప్పుడు ఆమె ఇండియన్ అకాడమీ ఆఫ్ సైన్సెస్‌లో ప్యానెల్ ఇన్ సైన్స్ ఛైర్‌పర్సన్ కూడా. అంతేకాదు దేశంలోని ప్రసిద్ధ మహిళా శాస్త్రవేత్తలపై రాసిన 'లీలావతి డాటర్స్' అనే పుస్తకానికి సహ రచయితగా వ్యవహరించారు. ఇప్పటికీ సైన్స్ అధ్యయనంవైపు మహిళలు పెద్దగా దృష్టి సారించకపోవడంపై రోహిణి ఆందోళన చెందుతూ ఉంటారు. ఆమెకు బోధన అంటే ఇష్టం. 67 ఏళ్ల రోహిణి.... పాతికేళ్లుగా బెంగళూరు ఐఐటీలో ఫిజిక్స్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు.

3 నాట్య మయూరి


నర్తకీ నటరాజ్

"నా అస్తిత్వం కోసం నృత్యం చేశాను. నా పోషణ కోసం ఆడాను. నర్తకి నటరాజ్‌గా మళ్లీ నాకు జన్మనిచ్చింది మాత్రం భరతనాట్యం" అని గతంలో సంగీత్ నాటక్ అకాడమీ అవార్డు అందుకున్న సందర్భంలో నర్తకీ నటరాజా చెప్పిన మాటలివి. 1964లో మధురైలో జన్మించారు నర్తకి. ఊళ్లో వేసే నాటకాలు, నృత్యాలు చూసి ఆసక్తి కలిగింది. ఆడుతూ పాడుతూ బాల్యాన్ని అనుభవించాల్సిన సమయంలో తనలో శారీరకంగా, మానసికంగా వస్తున్న మార్పును గమనించారు. తను అబ్బాయి కాదనే సత్యాన్ని గ్రహించడానికి ఎంతో సేపు పట్టలేదు. అలాగని అమ్మాయీ కాదు! తోటివాళ్లు ఏడిపించడం మొదలుపెట్టారు. కుటుంబం అవమానంతో కుంగిపోయింది. పదేళ్ల వయసులో అనాథగా మారిన ఆ సమయంలో మరో స్నేహితుడు శక్తి భాస్కర్ తోడుగా నిలిచాడు. చిన్న చిన్న ఉద్యోగాలు చేసి నర్తకిని పోషించాడు. నర్తకి నాట్య గురువు కోసం అన్వేషణ మొదలుపెట్టినా, ఎవరూ ఆమెను తీసుకునే సాహసం చేయలేదు... తంజావూరు నాట్యకారుడు కిట్టప్ప పిళ్లై తప్ప! అతని వద్ద 1984లో శిష్యరికం మొదలుపెట్టారు నర్తకి. 15 ఏళ్లు భరతనాట్యాన్ని అభ్యసించారు. అలా క్రమంగా నృత్యకారిణిగా దేశ, విదేశాల్లో గుర్తింపు తెచ్చుకున్నారు. అయినా అవమానాలు తప్పలేదు. ఎంతో మంది సంప్రదాయవాదులు పట్టించుకోలేదు. దానికి ఆమె కుంగిపోలేదు. తన అద్భుత నృత్య ప్రదర్శనతో విమర్శకుల నోళ్లు మూయించారు. తర్వాతి కాలంలో చెన్నై, మధురైలలో నాట్యశాలలు కూడా ఏర్పాటు చేశారు. 2007లో తమిళనాడు ప్రభుత్వం 'కలైమమణి' పురస్కారంతో సత్కరించింది. ఆ తర్వాత నాలుగేళ్లకు సంగీత్ నాటక్ అకాడమీ పురస్కారం వచ్చింది. భరతనాట్యంలో ఈ గౌరవం దక్కించుకున్న తొలి ట్రాన్స్‌జెండర్‌గా నిలిచారు. 14వ శతాబ్దంలో తమిళ సమాజంలో ఎంతో మంది ట్రాన్స్‌జెండర్ భరతనాట్యకారులున్నారు. దానిపై ఆమె అధ్యయనం చేశారు. ఎంతో వివక్షను ఎదుర్కొని చివరికి విజేతగా తనను తాను నిరూపించుకున్న నర్తకి నటరాజా 'పద్మశ్రీ'తో జీవితంలో మరో మెట్టు ఎదిగారు.

4 సేంద్రియ కమలం


కమలా పూజారి

"మా విత్తనం, మా వంగడాలు మాకు మేలు చేస్తాయి. దేశీ విత్తనంతోనే దిగుబడీ, సాగుబడీ! కార్పొరేట్ కంపెనీల వంగడాలు వాడితే నాశనమే" అని తేల్చిచెప్పి, స్వదేశీ వ్యవసాయ విధానాలపై ప్రజల్లో అవగాహన పెంచిన మహిళ కమలా పూజారి! వ్యవసాయ రంగంలో ఆమె చేసిన కృషికి పద్మశ్రీ పురస్కారం దక్కింది.

ఒడిశాలోని కోరాపుట్ జిల్లా పత్రపూటా కమల స్వగ్రామం. ఎంతో ప్రయాసకు ఓర్చి కార్పొరేట్ కుట్రల బారి నుంచి వందలాది దేశీ వరి వంగడాలను కాపాడుకుంటూ వస్తున్నారు ఆమె. అంతరించిపోయే దశలో ఉన్న వరి, పసుపు, నువ్వు తదితర పంటల దేశీ వరి వంగడాలను దశాబ్దాలుగా సంరక్షిస్తున్నారు. అంతేకాదు ఆమె అమాయక గిరిజనులను రసాయన సేద్యం బారినుంచి కాపాడి ప్రకృతి సేద్యం వైపు నడిపిస్తున్నారు. లోకం పోకడ అంతగా తెలియకపోయినా 'సేంద్రియ సేద్యమే మిన్న' అని నమ్మి ఆచరించారు. రైతు సంఘాలను ఏర్పాటు చేసి.. సేంద్రియ సేద్యం చేపట్టేలా నచ్చజెప్పి, వారిని ఒప్పించారు.

2002లో జొహెన్నెస్‌బర్గ్‌లో జరిగిన సేంద్రియ సేద్య సదస్సులో కమల తన కృషిని వివరించారు. ప్రపంచ దేశాల ప్రశంసలు పొందారు. అనేక జాతీయ, అంతర్జాతీయ సంస్థలు కమలను సన్మానించాయి. 'ఒడిశా అగ్రికల్చర్ అండ్ టెక్నాలజీ యూనివర్సిటీ'లో నిర్మించిన బాలికల హాస్టల్‌కు కమల పేరు పెట్టి గౌరవించారు ఆ రాష్ట్ర సీఎం నవీన్ పట్నాయక్. ఐదుగురు సభ్యులున్న ఒడిశా ప్లానింగ్ బోర్డులోనూ సభ్యురాలిగా నియమించారు.ఇతర ప్రజా సమస్యలపైనా ఆమెకు లోతైన అవగాహన ఉంది. గొప్ప పేరు వచ్చినా, అధికార పదవులు దరిజేరినా ఎన్నడూ వాటిని ఆమె తన స్వార్థానికి వాడుకోలేదు. కుటుంబ సభ్యులందరూ ఇప్పటికీ రోజు కూలీలుగా పని చేస్తున్నారు. చాలా కాలం పాటు కమల పూరింట్లోనే నివసించారు. ఆ నేలతల్లి ముద్దుబిడ్డ ఎప్పటికీ మట్టికి దగ్గరగానే ఉన్నారు.

5 తీజన్ 'పాండవాని' చిరునామా..


తీజన్‌బాయ్

తీజన్‌బాయ్ అంటే తెలియని వారుండరు. ఆమె ప్రతిభకు అవార్డుల పంట కొత్త కాదు. 'పాండవాని' అనే చత్తీస్‌గఢ్ సంప్రదాయ కళా ప్రదర్శనలో తీజన్ రసగుళిక. ఖంగుమని మోగే ఆమె గొంతులో వాచకం, అభినయం, భావోద్వేగాలు, నాటకీయతలు పరిమళిస్తాయి.

'పాండవాని' అంటే పాండవుల కథ. భారతాన్ని పాడుతూ... అందులోని వేల పాత్రలను అభినయిస్తూ.. మాటలతో దృశ్యాలను కళ్లముందు ఆవిష్కారమయ్యేలా వర్ణిస్తూ సాగే గొప్ప కళ. ఇందులో తీజన్ కాకలుతీరిన కళాకారిణి. ఈ కళను తన తాత బ్రిజ్‌లాల్ (అమ్మగారి నాన్న) నుంచి నేర్చుకున్నారు. ఎన్నో వ్యతిరేకతల మధ్య ఈ కళలో పట్టు సాధించి అంతర్జాతీయంగా తీజన్ ప్రశంసలు, అవార్డులు అందుకున్నారు. కానీ తీజన్ మహిళగా, ఆదివాసీగా ఎదుర్కొన్న సమస్యలెన్నో. అయినా పాండవాని కళాసౌరభాన్ని వదలకుండా దాన్నే ఊపిరిగా ముందుకుసాగారామె. ఆడది వేదికలెక్కి పాడి, అభినయించడం ఏమిటంటూ కుటుంబం, సమాజం నుంచి వ్యతిరేకత ఎదురైనా ఆమె లెక్కచేయలేదు. ఆమె సాధించిన విజయం అణచివేతకు గురవుతున్న ఎందరో మహిళలకు ధైర్యాన్నిచ్చింది.

తీజన్‌ది చత్తీస్‌గఢ్ రాష్ట్రం భిలాయ్ సమీపంలోని గనియారి గ్రామం. ఆమెది పార్ధి ఆదివాసీ తెగ. స్త్రీలంటే ఆ తెగలో చిన్నచూపు. పన్నేండేళ్లప్పుడే తీజన్‌కు బలవంతంగా వివాహం చేశారు. అప్పటికే ఆమె భర్తకు ముగ్గురు భార్యలు. పదమూడేళ్లకు తీజన్ తన తొలి పాండవాని ప్రదర్శనను కాపాలిక్ శైలిలో ఇచ్చారు. మహిళ అలా ప్రదర్శన ఇవ్వడం అదే ప్రథమం. అయితే ఆమె కుటుంబం, బంధువులు వేదికలెక్కి ప్రదర్శన ఇవ్వడాన్ని వ్యతిరేకించారు. ఇది ఆమెకు నచ్చలేదు. భర్త నుంచి విడాకులు తీసుకున్నారు. ఆ తర్వాత తీజన్ కళను ఇష్టపడే తుకారం ఆమెను పెళ్లి చేసుకున్నాడు. కళా పరంగానే కాదు సామాజిక పరంగా కూడా మహిళా స్వేచ్ఛ, సాధికారతల కోసం తీజన్ గట్టిగా నిలిచారు.

జీవితం... పర్యావరణ హితం 6


తిమ్మక్క

పిల్లలు పుట్టలేదని దిగులు పడలేదు ఆమె. చెట్లనే కన్న బిడ్డల్లా చూసుకుంది. కాలుష్యం కమ్మేసి... పర్యావరణం మసకబారిపోతుంటే... మహా వృక్షాలను పేర్చి పచ్చందాలు పరిచింది సాలుమరద తిమ్మక్క! కర్ణాటకలోని తన సొంత గ్రామంలో మొదలైన ఈ యజ్ఞం రాష్ట్రమంతా విస్తరించి స్వచ్ఛమైన గాలులు వెదజల్లుతోంది.

కన్నడ భాషలో 'సాలుమరద' అంటే 'చెట్ల వరుస' అని అర్థం. కర్ణాటకలోని టుముకూరు జిల్లా గుబ్బిలో పుట్టిన తిమ్మక్క ఇష్టంతోనే కాదు... బాధ్యతగా చెట్లను పెంచుతున్నారు. అందుకే ఆమె పేరు ముందు 'సాలుమరద' వచ్చి చేరింది. 107 ఏళ్ల ఆమె ఏడు దశాబ్దాలుగా ఇదే పనిలో ఉన్నారు. బెంగళూరు రూరల్ జిల్లా హులికల్ గ్రామంలో నివసిస్తున్నా తిమ్మక్క పెద్దగా చదువుకోలేదు. స్థానిక క్వారీలో కూలీగా పనిచేసేవారు. చిక్కయ్యను పెళ్లి చేసుకున్నారు. ఆయన కూడా కూలీనే! వారికి పిల్లలు లేరు.అలాగని బాధపడుతూ కూర్చోలేదు. కమ్ముకొస్తున్న కాలుష్యాన్ని తగ్గించేందుకు తమవంతు బాధ్యతగా మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.

తిమ్మక్క ఊరు సమీపంలో మర్రి చెట్లు ఎక్కువగా ఉండేవి. వాటి నుంచి అంటుకట్టు విధానం ద్వారా కుదూర్ గ్రామం వద్ద తొలుత ఐదు కిలోమీటర్ల మేర పది చెట్లు నాటారు. రెండో ఏడాది పదిహేను, మూడో సంవత్సరం ఇరవై... అలా ఏటికేడూ పెంచుకుంటూ వెళ్లారు. నాలుగు కిలోమీటర్ల దూరం నుంచి నీళ్లు తెచ్చి, మొక్కలకు పోసేవారు.వాటికి రక్షణ కవచాలను ఏర్పాటు చేశారు. చెట్ల పెంపకాన్ని పూర్తి స్థాయిలో చేపట్టడానికి చిక్కయ్య తన కూలి పని మానేశాడు. ఆ క్రమంలోనే హులికుల్ నుంచి కుదూర్ వరకు రహదారి పక్కన 4 కిలోమీటర్ల మేర 384 మర్రి చెట్లు నాటారు. దీంతో తిమ్మక్క పేరు జాతీయ స్థాయిలో మారుమోగింది.

పర్యావరణానికి ఆమె చేసిన కృషికి గుర్తింపుగా కేంద్ర ప్రభుత్వం భారత జాతీయ పౌర పురస్కారంతో సత్కరించింది. 1991లో తిమ్మక్క భర్త చనిపోయారు. అయినా ఆమె లక్ష్యం నుంచి తప్పుకోలేదు. అమెరికాలోని లాస్‌ఏంజిల్స్, ఓక్లాండ్, కాలిఫోర్నియాల్లో స్థాపించిన పర్యావరణ సంస్థలకు 'తిమ్మక్క రిసోర్సెస్ ఫర్ ఎన్విరాన్‌మెంటల్ ఎడ్యుకేషన్' అని పేరు పెట్టుకోవడం విశేషం. ప్రస్తుతం వాన నీటిని భద్ర పరిచే ట్యాంకు నిర్మాణ పనుల్లో ఆమె బిజీగా ఉన్నారు. 'ఇన్నేళ్లకైనా నా సేవలను ప్రభుత్వం గుర్తించినందుకు సంతోషం'అంటూ 'పద్మశ్రీ' పురస్కారం వచ్చిన సందర్భంగా ఆమె స్పందించారు. చెట్లనే కన్నబిడ్డల్లా పెంచుకున్న తిమ్మక్కకు... తన భర్త పేరు మీద గ్రామంలో ఓ ఆసుపత్రి నిర్మించాలన్నది కల!

అందరికీ కంటి వెలుగు 7


ముక్తాబెన్

"మేమెప్పుడూ మదర్ థెరీసాని చూడలేదు. కానీ మా ముక్తాబెన్ ఉన్నారు కాబట్టి, ఆ లోటు మాకు లేదు" అంటారు గుజరాత్‌లోని సురేంద్రనగర్ ప్రాంతవాసులు.

1962 జూలై 2న గుజరాత్‌లోని అమ్రేలీ జిల్లా నానా అంకాడియా గ్రామంలో ఆమె జన్మించారు. ఏడేళ్ళ వయసులో మెనింజైటిస్ సోకి రెండు కళ్ళనూ కోల్పోయారు. కానీ ఆత్మవిశ్వాసాన్ని పోగొట్టుకోలేదు. బాల్యం నుంచీ చదువు అంటే ఎంతో ఆపేక్ష కలిగిన ముక్తా భావనగర్‌లోని అంధ ఉద్యోగ్‌శాలలో ప్రాథమిక విద్య అభ్యసించారు. అహ్మదాబాద్‌లో చదువు కొనసాగించారు. ఉపాధ్యాయ శిక్షణ పొంది ఫస్ట్ గ్రేడ్‌లో డిగ్రీ తీసుకున్నారు. బీఏ ఫస్ట్ క్లాస్‌లో పాసయ్యారు. బ్రెయిలీ రీడింగ్, బ్రెయిలీ రైటింగ్, క్రీడలు, కవిత్వం, కథా రచన... ఇలా తనకు ఆసక్తి ఉన్న ఏ అంశాన్నీ వదిలిపెట్టలేదు. వివిధ పోటీల్లో పాల్గొన్నారు. ఖాళీగా ఉండడం ఆమెకు నచ్చని వ్యవహారం. సెలవు రోజుల్లో టెలిఫోన్ ఆపరేటింగ్, వ్యక్తిత్వ, నాయకత్వ అభివృద్ధి, వివిధ హస్తకళలు... ఇలా పలు విషయాల్లో శిక్షణ పొందారు. 1980లో అహ్మదాబాద్ లయన్స్ క్లబ్, బ్లయిండ్ వెల్‌ఫేర్ సెంటర్‌ల నుంచి అవార్డులు అందుకున్నారు. సాంస్కృతిక అంశాల పట్ల ఆమె ఆసక్తిని అంధజన్ ప్రగతి మండల్ కార్యదర్శి బాబూబాయ్ బబ్వానీ ప్రోత్సహించారు. ఆ మండలికి పన్నెండేళ్ళపాటు ముక్తాబెన్ సేవలందించారు. అంధుల సమస్యలపై ప్రభుత్వం నియమించిన ఒక కమిటీకి సంయుక్త కార్యదర్శిగా వ్యవహరించారు. ఆ సంస్థ అభివృద్ధికోసం దేశమంతా తిరిగి విరాళాలు సేకరించారు. అమ్రేలీలో వికలాంగుల కోసం ప్రాథమిక పాఠశాల ఏర్పాటు చేశారు. ఆమె సంకల్పం, సేవా తత్పరత సురేంద్రనగర్ వాసి వినోద కె.షాకు స్ఫూర్తి కలిగించింది. సేవా కార్యక్రమాల కోసం తన ఆస్తిని ఆమె విరాళం ఇచ్చారు. ఆ సాయంతో, ముక్తాబెన్ సారథ్యంలో సురేంద్రనగర్‌లో 1995లో 'శ్రీ ప్రజ్ఞా చక్షు మహిళా కుంజ్' ఏర్పాటైంది. ఇప్పటి వరకూ ఈ సంస్థ ద్వారా 1,200 మంది వికలాంగ విద్యార్థులు సాయం పొందారు. రెండు వేలమందికి పైగా పునావాస ప్రయోజనాలు పొందారు. డెబ్భై మంది ఉద్యోగులు సేవలందిస్తున్నారు. ప్రాథమిక విద్య నుంచి ఉన్నత విద్య వరకూ ఈ సంస్థ శిక్షణ అందిస్తోంది. అంతే కాదు, వక్తృత్వం, క్రీడలు, హస్తకళలు, కంప్యూటర్ వినియోగం, నృత్య నాటకాలు... ఇలా పలు అంశాల్లో ఇక్కడి అంధబాలికలకు శిక్షణ ఇస్తారు. ఉపాధ్యాయ శిక్షణ సంస్థ, వృద్ధాశ్రమం కూడా సేవాకుంజ్‌కు అనుబంధంగా నడుస్తున్నాయి. అంధబాలికలకు చదువు, వంటింటి పనుల్లో శిక్షణ ఇస్తూ ఉంటారు ముక్తా. 1984లో పంకజ్ భాయ్ దగ్లీతో ఆమెకు వివాహం అయింది. ఆయన కూడా అంధుడే. వ్యక్తిగతమైన ఆస్తులు కానీ, అనుబంధాలు కానీ పెట్టుకోకూడదని తొలి నాళ్ళలోనే వారు నిర్ణయించుకున్నారు. అందుకే తమకు పిల్లలు వద్దనుకున్నారు. ఖైమంత్లీ బ్రెయిలీ పత్రిక 'దీదీ'కి ఆమె సంపాదకురాలు. అనేక పురస్కారాలు, ప్రముఖుల ప్రశంసలు అందుకున్నారు. "మనిషికి సేవ చెయ్యడం అంటే మానవత్వానికి సేవ చెయ్యడమే" అంటారు ముక్తాబెన్.

పొడి జుట్టుకు పరిష్కారమిలా..

హెయిర్ కేర్



చలికాలంలో మాడు భాగం దురద పెట్టడం, పొడిబారడం వంటి సమస్యలు వేధిస్తుంటాయి. ప్రొబయాటిక్స్ ఎక్కువగా తీసుకోవడం, నీళ్ల ఎక్కువగా తాగడం ద్వారా ఈ సమస్యలు పరిష్కారమై, ఆరోగ్యకరమైన కురులు మీ సొంతమవుతాయి. శిరోజాల సంరక్షణ కోసం చర్మ నిపుణుడు గౌరాంగ్ కృష్ణ సూచిస్తున్న జాగ్రత్తలివి...

- **తల స్నానం:** షాంపూ ఎక్కువగా వాడడం వల్ల వెంట్రుకల ఆరోగ్యానికి అవసరమైన నూనెలు తొలగిపోయి, మాడుభాగం మరింత పొడిబారిపోతుంది. రోజూ తలస్నానం చేయడం వల్ల కూడా జుట్టు ఆరోగ్యం దెబ్బతింటుంది. తక్కువ పీహెచ్, సోడియం, సల్ఫేట్స్ రహిత షాంపూను ఉపయోగించాలి. జుట్టును శుభ్రం చేసుకున్న తరువాత కండీషనర్‌ను వాడాలి.
- **ప్రొబయాటిక్స్, నీళ్లు:** ఫంగస్ ఇన్‌ఫెక్షన్ల వల్ల చుండ్రు ఏర్పడుతుంది. ప్రొబయాటిక్స్ రోగనిరోధక శక్తిని పెంచి, ఫంగస్‌ను నిర్మూలిస్తాయి. రోజుకు ఎనిమిది గ్లాసులు నీళ్లు తాగితే మాడు భాగం ఆరోగ్యంగా ఉంటుంది. వెంట్రుకలు కూడా బాగా పెరుగుతాయి.
- **హెయిర్ ఉత్పత్తులు:** కేశాల స్టయిలింగ్ కోసం ఉపయోగించే క్రీమ్స్, కలర్స్ జుట్టుకు తేమ అందకుండా చేస్తాయి. దీంతో వెంట్రుకలకు హాని జరుగుతుంది. కాబట్టి వీటిని వాడకపోవడం మంచిది.
- **నూనెతో మర్దన:** కేశాలకు తేమనందించి, వాటిని ఆరోగ్యంగా ఉంచేందుకు జుట్టుకు చక్కగా నూనె రాసుకొని మర్దన చేసుకోవాలి. కొబ్బరి, ఆలివ్, నువ్వులు, ఆముదం, లావెండర్ నూనెలతో వెంట్రుకలకు మసాజ్ చేసుకుంటే కురులు నిగనిగలాడుతాయి.

భయానికి మరపు తోడవుతుంది

పేరెంటచ్



పిల్లలు ఏదైనా వస్తువును ఎక్కడో పెట్టి మరిచిపోతే, పెద్దవాళ్లు పిల్లాడికి బొత్తిగా భయం లేదనో, శ్రద్ధ లేదనో అనేస్తూ ఉంటారు. అంతేగానీ, భయం వల్ల కూడా మరపు వస్తుందనే విషయాన్ని చాలా మంది గుర్తించరు.

పుస్తకాలు, నోట్‌బుక్స్, స్కెచ్ పెన్నులు, కంపాక్స్ బాక్స్ లాంటి వాటిని ఎక్కడో పెట్టి, ఎక్కడో వెతకడం పలుమార్లు చేస్తుంటారు. ఎంతసేపూ పుస్తకాల మీదే ఎక్కువగా మనసు పెట్టే హృదయాలు కొన్ని ఇతర విషయాల్ని మరిచిపోవడం చాలా సహజం. ముఖ్యంగా పరీక్షల వేళల్లో విపరీతమైన ఒత్తిడికీ, భయానికీ గురవుతున్న సమయాల్లోనే ఇలా ఎక్కువగా జరుగుతూ ఉంటుంది. తలిదండ్రులు అలాంటి సమయాల్లో ఆ వస్తువులేవో వెతికి పెట్టే సాయం చేయాలి గానీ, తిట్లూ, చీవాట్లకూ దిగిపోతే ఫలితంల ఏముంటుంది. ఫలితమేమీ లేకపోగా, ఉన్న ఆ సమస్యేదో మరింత తీవ్రమవుతుంది. ఎవరైనా అదే పనిగా నసపెడితే, ఏమవుతుంది? వస్తువుల్ని మరిచి పోయినట్లు, అప్పటిదాకా చదివిన విషయాల్ని కూడా మరిచిపోయే ప్రమాదం ఏర్పడుతుంది. వస్తువుల్ని వెతికి పెట్టడమే కాదు, తలిదండ్రులకు కాస్త అవగాహన కూడా ఉంటే, పుస్తకాల్లోని మూలాంశాల్ని వాళ్ల దృష్టికి తీసుకురావడం మరీ మంచిది. పిల్లల వ్యవహారాల్లో ఎక్కడ ఏ తేడా వచ్చినా కసురుకోవడం, గద్దించడం వంటివి అసలే చేయకూడదు. నిజంగానే ఏదైనా తప్పు జరిగినా అనునయంగానే మాట్లాడాలి తప్ప మరింత గాబరా పెట్టేలా ప్రవర్తించకూడదు. మౌలికంగా వాళ్ల మనసు ఎంత ప్రశాంతంగా ఉంటే పరీక్షలు అంత బాగా రాయగలుగుతారనే విషయాన్ని తలిదండ్రులు ఎప్పుడూ మరిచిపోకూడదు.

టెక్ గురు

నోటితో ఒక చిన్న కమాండ్ జారీ చేస్తే చాలు.. పాటలు వినిపిస్తాయి. వాతావరణ విశేషాలు చెబుతాయి. ఏ ప్రశ్న వేసినా అప్పటికప్పుడు సమాధానం వెతికి వినిపిస్తాయి. చివరకు ఇంట్లో ఉన్న టీవీ, ఫ్రిజ్ లాంటి వాటిని నియంత్రించడానికి ఉపయోగపడతాయి. ఈ పనులన్నీ చేసేవి ఏంటో తెలుసా? అమెజాన్ ఎకో, గూగుల్ హోమ్ వంటి స్మార్ట్ అసిస్టెంట్లు. వీటి వినియోగం పెరిగిన నేపథ్యంలో అవి మనకు అందించే ప్రయోజనాలు, అందుబాటులో ఉన్న వాటిలో ఏది బెటర్ వంటి అంశాలు తెలుసుకుందాం..

ఈ స్పీకర్లు చాలా స్మార్ట్

చేయాల్సినవి!

ముఖ్యమైన పనులు గుర్తు చేయడం కోసం పైన చెప్పుకున్న అన్ని వాయిస్ అసిస్టెంట్‌లలో టైమర్లు, అలారంలు సెట్ చేసుకోవచ్చు. ఒక నిర్దిష్టమైన సమయానికి అలారం సెట్ చేసుకోవచ్చు. ఎవరైనా ముఖ్యమైన వ్యక్తిని కలవాలంటే దానికి సంబంధించిన రిమైండర్లు కూడా క్రియేట్ చేసుకోవచ్చు. అలాగే షాపింగ్ లిస్ట్ వంటి వాటిని కూడా సృష్టించుకోడానికి ఇవి అవకాశం కల్పిస్తాయి.





ఏమేం ఉన్నాయి?

ప్రస్తుతం మార్కెట్లో అమెజాన్ ఎకో, ఎకో డాట్, గూగుల్ హోమ్ మ్యాక్స్, గూగుల్ హోమ్ మినీ, సోనోస్ బీమ్, సోనోస్ వన్, జెబిఎల్ లింక్ 10, యాపిల్ హోమ్‌పాడ్ వంటి పలు రకాల స్మార్ట్ స్పీకర్లు లభిస్తున్నాయి. వీటిలో ప్రధానంగా అమెజాన్ సంస్థకు చెందిన అలెక్సా, గూగుల్ సంస్థకు చెందిన గూగుల్ అసిస్టెంట్, ఆపిల్ డెవలప్ చేసిన సిరి, శాంసంగ్ బిగ్స్‌బి టెక్నాలజీలు వినియోగించబడుతున్నాయి. ఇంట్లో నిలకడ గృహోపకరణాలు స్మార్ట్ హోమ్ సెటప్‌లో భాగంగా ఉన్నట్లయితే అలాంటప్పుడు అమెజాన్ అలెక్సా అనువుగా ఉంటుంది. ఒకవేళ పాటలు వినడం, పలు రకాల ప్రశ్నలకు సమాధానాలు పొందటం వంటివి మీకు ప్రయారిటీలు అయితే గూగుల్ అసిస్టెంట్ ఆధారంగా పనిచేసే గూగుల్ హోమ్ అనువుగా ఉంటుంది. ఇక యాపిల్ సంస్థ ఉత్పత్తులను ఇష్టపడే వారికి యాపిల్ సిరి ఆధారంగా పనిచేసే యాపిల్ హోమ్‌పాడ్ నచ్చుతుంది. వాయిస్ అసిస్టెంట్ల ఆధారంగా పనిచేసే స్పీకర్లు మాత్రమే కాదు, ఇటీవలి కాలంలో స్మార్ట్ డిస్‌ప్లే కలిగి ఉండే అమెజాన్



ఎకో షో, ఎకో స్పాట్, గూగుల్ హోమ్ హబ్, ఫేస్‌బుక్ పోర్టల్ వంటి డివైజ్‌లు కూడా అందుబాటులోకి వచ్చాయి. ఇవి కేవలం ఆడియో రూపంలో పని చేయడం మాత్రమే కాకుండా మనకు కావాల్సిన సమాచారాన్ని స్క్రీన్ మీద కూడా చూపిస్తాయి.

ఇలా కూడా సాధ్యం!

సహజంగా ఈ మధ్య చాలామంది యూట్యూబ్ వీడియోల వంటి వాటిని తమ టీవీలో నేరుగా చూడడం కోసం గూగుల్ క్రోమ్ కాస్ట్ వంటి వాటిని వినియోగిస్తున్నారు. ఒకవేళ మీ దగ్గర గూగుల్ హోమ్ కూడా ఉన్నట్లయితే, నేరుగా గూగుల్ హోమ్‌కి ఒక వాయిస్ కమాండ్ జారీ చేయటం ద్వారా, మీకు కావాల్సిన కంటెంట్ మీ టీవీలో ప్లే అయ్యే విధంగా ఏర్పాటు చేసుకోవచ్చు.



అలాగే అమెజాన్ సంస్థ కూడా అమెజాన్ ఫైర్ స్టిక్ అనే మీడియా స్ట్రీమింగ్ డివైస్ అందిస్తోంది. దాన్ని కూడా అమెజాన్ ఇకో డాట్ స్మార్ట్ స్పీకర్ ద్వారా కంట్రోల్ చేయవచ్చు. ఇదిలా ఉంటే, గూగుల్ అసిస్టెంట్ దాదాపు మనం వాడే అన్ని రకాల ఆండ్రాయిడ్ ఫోన్స్‌లో అంతర్గతంగా పొందుపరచబడి ఉంటుంది. ప్రత్యేకంగా స్పీకర్ కొనుగోలు చేయాల్సిన పనిలేకుండా నేరుగా ఫోన్లో కూడా వాయిస్ కమాండ్లు జారీ చేసి ఫలితాలు పొందవచ్చు. ఇదే పద్ధతిలో యాపిల్ ఐఫోన్లు వాడే వినియోగదారులకు యాపిల్ సిరి, మైక్రోసాఫ్ట్ విండోస్ ఆపరేటింగ్ సిస్టం వాడే వారికి మైక్రోసాఫ్ట్ కార్టన వంటి వాయిస్ అసిస్టెంట్ టెక్నాలజీలు లభిస్తున్నాయి.

పలు ప్రొఫైళ్లు

ఒక స్మార్ట్ స్పీకర్‌ను కొనుగోలు చేసిన తర్వాత ఇంట్లో ఉన్న పలువురు సభ్యులు దాన్ని వాడాల్సి రావచ్చు. అలాంటప్పుడు పలు యూజర్ ప్రొఫైళ్ల సపోర్ట్ చేసే సదుపాయం ఉంటే బాగుంటుంది. అమెజాన్ ఎకో, గూగుల్ హోమ్ వంటి స్మార్ట్ స్పీకర్లు ఇలా పలువురు వ్యక్తుల యూజర్ అకౌంట్లని లింక్ చేసుకుని, వారి అభిరుచులకు తగ్గట్లు సమాచారాన్ని అందించే ఏర్పాటు కలిగి ఉన్నాయి. అయితే యాపిల్ సిరి, మైక్రోసాఫ్ట్ కార్టన మాత్రం ఒక యూజర్ అకౌంట్‌ని మాత్రమే సపోర్ట్ చేస్తాయి. ఒకసారి మీ అకౌంట్ లింక్ చేసిన తర్వాత కాలెండర్‌లో మీరు చేయాల్సిన పెండింగ్ పనులు స్పీకర్ ద్వారా తెలుసుకోవచ్చు. అమెజాన్ అలెక్సా ఐక్లౌడ్, జీమెయిల్, జీసూట్, ఆఫీస్ 365, ఔట్‌లుక్ సర్వీసులను సపోర్ట్ చేస్తుంది. గూగుల్ అసిస్టెంట్ జీమెయిల్ నుండి మాత్రమే సమాచారాన్ని అందిస్తుంది. అలాగే అన్ని అసిస్టెంట్లు ప్రస్తుతం మనం ఉన్న లోకేషన్ ఆధారంగా వాతావరణం కూడా తెలియజేస్తాయి. అలాగే వార్తలు చదివి పెడతాయి. గూగుల్ అసిస్టెంట్ వాడాలంటే తప్పనిసరిగా ఓకే గూగుల్ అనే వాయిస్ కమాండ్‌తో దాన్ని ప్రారంభించాలి. కేవలం ఆ ఒక్క వాయిస్ కమాండ్ మాత్రమే దాంట్లో



పనిచేస్తుంది. అయితే అమెజాన్ అలెక్సా విషయంలో.. 'అలెక్సా, ఎకో, అమెజాన్, కంప్యూటర్ వంటి నాలుగు పదాల్లో ఏది వాడినా మన పని పూర్తవుతుంది. మనకు సమాచారాన్ని చదివి వినిపించే వాయిస్‌ల విషయంలో సిరి, గూగుల్ అసిస్టెంట్ మగా, ఆడా గొంతులను రెండింటినీ సపోర్ట్ చేస్తుంది. అయితే అమెజాన్ అలెక్సా మాత్రం కేవలం ఆడ గొంతును మాత్రమే కలిగి ఉంటుంది.

పాటల కోసం...

స్మార్ట్ స్పీకర్లు, వాయిస్ అసిస్టెంట్ల ద్వారా చాలామంది మ్యూజిక్ వినడానికి ఇష్టపడతారు. ఆడియో క్వాలిటీ పరంగా చూస్తే మిగతా వాటితో పోలిస్తే సోనోస్ ఓన్, సోనీ, జెబిఎల్ స్మార్ట్ స్పీకర్లు నాణ్యమైన ఆడియోని వినిపిస్తాయి. మీ ఫోన్లో ఉన్న పాటల్ని దాదాపు అన్ని స్మార్ట్ స్పీకర్లు ప్లే చేయగలుగుతాయి. అయితే మన ఫోన్లో పరిమితంగా మాత్రమే పాటలు ఉంటాయి కాబట్టి, ఆన్‌లైన్ మ్యూజిక్ స్ట్రీమింగ్ సర్వీసులు ఎన్ని



ఎక్కువ సపోర్ట్ చేయగలిగితే అంత మెరుగ్గా ఉంటుంది. ఈ నేపథ్యంలో గూగుల్ అసిస్టెంట్ మరియు అమెజాన్ అలెక్సా రెండూ స్పాటిఫై ప్రీమియం, పండోర, ట్యూన్‌ఇన్, ఐహార్ట్ రేడియో వంటి ఉచిత మ్యూజిక్ స్ట్రీమింగ్ సర్వీస్‌ల నుండి పాటలు ప్లే చేయగలుగుతాయి. వీటితో పాటు అదనంగా అమెజాన్ ఎకో స్మార్ట్ స్పీకర్ అమెజాన్ మ్యూజిక్ నుండి పాటల్ని ప్లే చేస్తుంది. గూగుల్ అసిస్టెంట్ ఆధారంగా పనిచేసే గూగుల్ హోమ్ మాత్రం గూగుల్ ప్లే మ్యూజిక్, యూట్యూబ్ మ్యూజిక్ సర్వీసుల నుండి ఆడియోని ప్లే చేస్తుంది. యాపిల్ సిరి విషయానికి వస్తే కేవలం యాపిల్ మ్యూజిక్, మీ ఐక్లౌడ్ లైబ్రరీ నుండి మాత్రమే పాటలు వినిపిస్తుంది. ఇండియాలో బాగా వినియోగంలో ఉన్న వివిధ రకాల భారతీయ ఆన్‌లైన్ స్ట్రీమింగ్ మ్యూజిక్ సర్వీసులను ఇవి సపోర్ట్ చేయకపోవడం కొద్దిగా నిరుత్సాహపరిచే అంశం.


ఫోన్ కాల్స్

నేరుగా మీ స్మార్ట్ స్పీకర్ల ద్వారా వాయిస్ కాల్స్ చేసుకునే అవకాశాన్ని అన్ని వాయిస్ అసిస్టెంట్లు కల్పిస్తున్నాయి. అలెక్సా, గూగుల్, కార్టన వంటివి యుఎస్, కెనడా, మెక్సికో వంటి ప్రదేశాల్లో ఉన్న ఫోన్ నెంబర్లకు ఉచితంగా కాల్స్ చేసుకునే అవకాశం అందిస్తాయి. వీటితోపాటు ఏ అంశం గురించైనా పూర్తిస్థాయి సమాచారం ఆడియో రూపంలో వినాలంటే స్మార్ట్ స్పీకర్ అనువుగా ఉంటుంది. ఇంటర్నెట్లో లభించే దేని గురించైనా మీరు ప్రశ్నించి వివరాలు తెలుసుకోవచ్చు. అమెజాన్ అలెక్సా కోసం అదనపు ప్రయోజనాలు అందించే థర్డ్ పార్టీ స్కిల్స్ కూడా మనకు లభిస్తున్నాయి.

కొనడం మంచిదేనా?

గూగుల్ హోమ్ వంటి స్మార్ట్ స్పీకర్లు కొనుగోలు చేయాలని చాలామంది తాపత్రయపడుతుంటారు. అయితే దాదాపు అవి చేసి పెట్టే అన్ని రకాల పనులు మీ ఆండ్రాయిడ్ ఫోన్లో ఉన్న గూగుల్ అసిస్టెంట్ వంటివి చేసి పెడతాయి కాబట్టి, ప్రత్యేకంగా మీ ఇంట్లో స్మార్ట్ హోమ్ సెటప్ వంటివి ఉంటే తప్పించి ప్రాక్టికల్‌గా పెద్దగా ప్రయోజనం ఉండదు. అయితే మున్ముందు వీటిలో మరిన్ని సదుపాయాలు వచ్చే అవకాశం ఉంది కాబట్టి అప్పటివరకు వేచి ఉండటం మంచిది.

నల్లమోతు శ్రీధర్
fb.com/
nallamothus-
ridhar



ఇట్టే కనిపెట్టవచ్చు!

నయా ఫీచర్

వాట్సాప్ ఇప్పుడు కొత్త అప్‌డేట్స్‌లో స్మార్ట్‌ఫోన్ వినియోగదారులను ఆకట్టుకోవడానికి ప్రణాళికలు రచిస్తోంది. తాజాగా మరో కొత్త ఫీచర్‌ను సిద్ధం చేస్తోంది వాట్సాప్. చాటింగ్ చేస్తున్నప్పుడు ఎన్నో ఫోటోలు, వీడియోలు పంపించుకుంటూ ఉంటాం. కొన్ని రోజులు గడిచాక, అవి ఎప్పుడు వచ్చాయో... ఏంటో తెలుసుకోవాలనుకుంటే కష్టంగా మారుతుంది. అందుకే త్వరలోనే వాట్సాప్ ఓ కొత్త ఫీచర్‌ను పొందుపరచడానికి సిద్ధమవుతోంది. అదే 'షో ఇన్ చాట్'. ఏదైనా ఫోటో లేదా వీడియో ఎప్పటితో ఏంటో తెలుసుకోవాలంటే దాని మీద క్లిక్ చేసి 'షో ఇన్ చాట్' అనే ఆప్షన్‌ను క్లిక్ చేయాలి. ఇప్పటికే ఐఓఎస్ వెర్షన్‌లో అందుబాటులో ఉంది. త్వరలోనే ఆండ్రాయిడ్ వెర్షన్‌లోనూ అందుబాటులోకి రానుంది.



ఇంకా ఫిట్‌గా!

నయా గ్యాడ్జెట్

ఇప్పటికే సరికొత్త స్మార్ట్‌ఫోన్లతో మార్కెట్లో శామ్‌సంగ్, మోటోరోలా లాంటి బ్రాండ్లకు గట్టి పోటీనిస్తున్న హానర్ ఓ ఫిట్‌నెస్ బ్యాండ్‌ను రూపొందించింది. గ్జియోమీ ఎమ్‌ఐ బ్యాండ్ 3కి పోటీగా దీన్ని మార్కెట్లోకి దించింది. ఇందులో హార్ట్‌రేట్‌తో పాటు స్విమ్మింగ్ ట్రాకర్ కూడా ఉంది. మొదటి సారి ఓ ఫిట్‌నెస్ బ్యాండ్‌ను ఉపయోగించేవారికి కూడా ఎంతో సులువుగా అర్థమయ్యేలా దీన్ని డిజైన్ చేశారు. ఆండ్రాయిడ్, ఐఓఎస్ ఫోన్లకు కూడా ఈ ఫిట్‌నెస్ బ్యాండ్ సెట్ అవుతుంది. ట్రెడ్‌మిల్‌లో, సైక్లింగ్‌లో, రన్నింగ్‌లో.... ఇలా ఎందులో ఎన్ని క్యాలరీలు కరిగాయో... వేర్వేరుగా తెలుసుకునే ఫీచర్ ఈ బ్యాండ్‌లో ఉంది. దీని ధర రూ. 2,599.



ఎక్కడ.. ఎంత వేగం!

బ్రాడ్‌బ్యాండ్ ఇంటర్‌నెట్ వేగం
(డౌన్‌లోడ్ వేగం mbpsలలో)

ర్యాంక్	దేశం	వేగం
1	సింగపూర్	60.39
2	స్వీడన్	46.00
3	డెన్మార్క్	43.99
4	నార్వే	40.12
5	రొమేనియా	38.60
6	బెల్జియం	36.71
7	నెదర్లాండ్స్	35.95
88	ఇండియా	5.19

సోర్స్ : వరల్డ్‌వైడ్ బ్రాడ్‌బ్యాండ్ స్పీడ్ లీగ్, మే- 2018

అప్లికేషన్లు ఎందుకలా?

నేను ల్యాప్‌టాప్ ఆన్ చేసిన వెంటనే టొరెంట్ మరియు ఐఎంఓ అప్లికేషన్లు ఆటోమేటిక్‌గా ఓపెన్ అవుతున్నాయి. అవి రాకుండా ఎలా చేసుకోవాలి?

- సాయికృష్ణ సిహెచ్, హైదరాబాద్

టెక్ సందేహాలు



కొన్ని అప్లికేషన్లు మన కంప్యూటర్లో ఇన్‌స్టాల్ అయిన వెంటనే కంప్యూటర్ ఆన్ చేసిన ప్రతీసారీ వాటంతట అవే ప్రారంభించబడే విధంగా విండోస్ స్టార్టప్‌లో ఎంట్రీలను సృష్టించుకుంటాయి. మన ఇష్టంతో ప్రమేయం లేకుండా, అవి తమకు తాము అతి ముఖ్యమైనవి అని భావించడం వల్ల ఏర్పడే ఇబ్బంది ఇది. వీటిని డిజేబుల్ చేసుకోవడానికి రెండు మార్గాలున్నాయి. మీరు చెప్పిన రెండు యాప్స్‌లో సెట్టింగ్స్‌లోకి వెళితే ఆటోమేటిక్‌గా స్టార్ట్ అవడాన్ని డిసేబుల్ చేసే విధంగా ఒక ఆప్షన్ ఉంటుంది. దాన్ని ఎంపిక చేసుకోండి. కొన్ని ఇతర అప్లికేషన్ల విషయంలో ఇలాంటి సెట్టింగ్ ఏదీ లేనట్లయితే, మీ కంప్యూటర్లో టాస్క్ మేనేజర్ ఓపెన్ చేసి, అందులో స్టార్టప్ అనే విభాగంలోకి వెళ్లి మీకు ఇష్టం లేకపోయినా ఆటోమేటిక్‌గా ఓపెన్ అవుతున్న ప్రోగ్రామ్‌ని గుర్తించి దాన్ని డిసేబుల్ చేసుకుంటే సరిపోతుంది.

ఫోన్‌లో స్టోరేజ్ పెరిగేదెలా?

నేను శాంసంగ్ ఆన్ 7 ప్రో ఫోన్ వాడుతున్నాను. వాట్సప్‌లో అన్నీ డిలీట్ చేసినా స్టోరేజ్ స్పేస్ ముందు ఉన్నంతే ఉంటోంది. స్టోరేజ్ పెరగాలంటే ఏం చేయాలి?

- శ్రీనివాసరావు, అవనిగడ్డ

పెద్ద పరిమాణంలో ఉన్న వీడియోలు తప్పించి సహజంగా వాట్సప్ ఫొటోలు, టెక్స్ వాయిస్ క్లిప్‌లు పెద్దగా స్టోరేజ్ ఆక్రమించవు. మీ ఫోన్లో స్టోరేజ్ స్పేస్ నిండిపోవటానికి ఇతర అప్లికేషన్లు గానీ, వాటి ద్వారా క్రియేట్ అయ్యే కంటెంట్ గానీ కారణం కావచ్చు. అసలు మీ ఫోన్లో ఏ ఫైళ్లు, ఫోల్డర్లు ఎక్కువ స్పేస్ ఆక్రమిస్తున్నాయో విశ్లేషించడం ద్వారా.. అనవసరమైన వాటిని గుర్తించి తొలగించుకుంటే స్పేస్ అవుతుంది. దీనికోసం దాదాపు అన్ని ఫోన్లలో ఫైల్ మేనేజర్ యాప్స్‌లో స్టోరేజ్ స్పేస్‌ని విశ్లేషించే సదుపాయం ఉంటుంది. అది ప్రయత్నించండి. ఒకవేళ మీ ఫోన్‌లో అలాంటి సదుపాయం లేకపోతే గూగుల్ ప్లే స్టోర్ నుండి స్టోరేజ్ అనలైజర్ అండ్ డిస్క్ యూసేజ్ అనే యాప్ డౌన్‌లోడ్ చేసుకుని ప్రయత్నించండి.



ఈమెయిల్ అడ్రస్ తెలుసుకోవచ్చా?

మనం యూట్యూబ్‌లో ఒక ఛానెల్‌కి సబ్‌స్క్రైబ్ చేస్తూ ఉంటాం కదా! దానికి సంబంధించిన ఈమెయిల్ అడ్రస్ తెలుసుకునే అవకాశం ఉంటుందా?

- భరత్ బత్తుల, నిజామాబాద్



యూట్యూబ్‌లో ఉన్న ప్రతీ ఛానెల్ ఒక నిర్దిష్టమైన ఇమెయిల్ అడ్రస్‌తో లింక్ చేయబడి ఉంటుంది. అయితే ఆ ఈ-మెయిల్ అడ్రస్ వివరాలు ప్రత్యక్షంగా తెలుసుకోవటానికి యూట్యూబ్ అవకాశం కల్పించదు. కేవలం ఏదైనా పోలీస్ కేస్ అయినప్పుడు మాత్రమే, నేర పరిశోధనా సంస్థలకు గూగుల్ సంస్థ ఆ యూట్యూబ్ అకౌంట్ లింక్ అయి ఉన్న మెయిల్ ఐడీ, దాన్ని ఆపరేట్ చేస్తున్న వ్యక్తి యొక్క తాజా ఐపీ అడ్రస్ వంటి వివరాలు తెలియజేస్తుంది. సాధారణ యూజర్లు చేయగలిగిందేమీ లేదు.

మీ టెక్ సందేహాలకు సమాధానాల కోసం
navya@andhrajyothy.com

డైలీ సుడోకు - 437

			1	7	3			
					2	3	5	
3							7	
		2	8				1	
6	4						2	9
	8				4	7		
	7							6
	5	8	6					
			4	1	8			

ఎలా పూరించాలి?

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. నిలువుగా, అడ్డంగానూ ప్రతీ లైనులోనూ 1 నుంచి 9 వరకు అంకెలను పూరించాలి. ఒకసారి పూరించిన అంకెను తిరిగి వాడకూడదు.

సుడోకు- 436 సమాధానం

2	8	6	5	9	3	7	1	4
1	9	7	8	6	4	2	3	5
4	3	5	2	7	1	6	8	9
7	2	9	3	1	5	4	6	8
5	1	8	6	4	7	3	9	2
3	6	4	9	8	2	1	5	7
8	4	2	1	3	9	5	7	6
6	7	3	4	5	8	9	2	1
9	5	1	7	2	6	8	4	3


'వాల్మీకి' ప్రారంభోత్సవ దృశ్యం

వాల్మీకి... ఓ కొత్త అధ్యాయం!

“వాల్మీకి... ఓ కొత్త అధ్యాయం మొదలైంది!” అని వరుణ్‌తేజ్ అన్నారు. హరీశ్ శంకర్ దర్శకత్వంలో ఆయన కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'వాల్మీకి'. 14 రీల్స్ ప్లస్ పతాకంపై రామ్ ఆచంట, గోపీ ఆచంట నిర్మిస్తున్నారు. హైదరాబాద్‌లో ఆదివారం పూజా కార్యక్రమాలతో లాంఛనంగా ప్రారంభమైంది చిత్రం. వరుణ్‌తేజ్‌పై చిత్రీకరించిన తొలి సన్నివేశానికి రామ్ బొబ్బ కెమెరా స్విచ్చాన్ చేయగా... నిహారిక కొణిదెల క్లాప్ ఇచ్చారు. వి.వి. వినాయక్ గౌరవ దర్శకత్వం వహించారు. సుకుమార్ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. చిత్రకథను ప్రతిబింబించేలా తుపాకీ, సినిమా రీలుతో టైటిల్ లోగోను విడుదల చేశారు. “ప్రేక్షకులకు ఈ టైటిల్ నచ్చుతుందని ఆశిస్తున్నా” అని హరీశ్ శంకర్ అన్నారు. త్వరలో చిత్రానికి సంబంధించిన మరిన్ని వివరాలు వెల్లడిస్తామని నిర్మాతలు తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: దేవిశ్రీ ప్రసాద్, ఛాయాగ్రహణం: అయానంకా బోస్, కథ: కార్తీక్ సుబ్బరాజ్, కథనం: మధు, చైతన్య, కళ: అవినాశ్ కొల్ల, కూర్పు: ఛోటా కె. ప్రసాద్, పోరాటాలు: రామ్-లక్ష్మణ్, ఎగ్జిక్యూటివ్ నిర్మాత: హరీశ్ కట్టా.


అన్నకు క్లాప్ కొడుతున్న చెల్లెలు

ఎన్టీఆర్‌తో చిత్రానికి ధైర్యం... మరింత అనుభవం సంపాదించాలి!



“మణిరత్నం, త్రివిక్రమ్ స్ఫూర్తితో రచయితగా, దర్శకుడిగా ప్రయాణం ప్రారంభించా. సంభాషణలను సులభంగా ఎలా రాయాలో... త్రివిక్రమ్ గారు తన చిత్రాల్లో రచన ద్వారా చూపించారు. ఆయన చిత్రాలు లేకపోతే నేను రాసేవాణ్ణి కాదేమో! 'స్నేహగీతం' చిత్రంలో ఒక్కో సన్నివేశానికి ఆరేడు వెర్షన్లు రాసినా ఇబ్బంది అనిపించేది కాదు. కానీ, మేకప్ వేసుకున్నాక రెండో టేక్ చేయమంటే చాలా ఇబ్బంది పడేవాణ్ణి. నేను నేచురల్ యాక్టర్‌ని కాదు. మళ్లీ ముఖానికి మేకప్ వేసుకోను. పౌడర్ కూడా పూసుకోను” అని వెంకీ అట్లూరి అన్నారు. ఆయన దర్శకత్వంలో అఖిల్ అక్కినేని హీరోగా నటించిన చిత్రం 'మిస్టర్ మజ్ను'. బీవీఎస్ఎన్ ప్రసాద్ నిర్మాత. నిధీ అగర్వాల్ హీరోయిన్. ఈ నెల 25న విడుదలైన ఈ చిత్రానికి ప్రేక్షకుల నుంచి చక్కటి స్పందన లభిస్తోందని వెంకీ అట్లూరి తెలిపారు. ఇంకా ఆయన మాట్లాడుతూ “అఖిల్ నటనకు, చిత్రానికి ప్రేక్షకుల నుంచి అద్భుత స్పందన లభిస్తోంది. నా అంచనాలను మించి అఖిల్ నటించాడు. తనకు ఎప్పుడూ ఇలా నటించమని చెప్పలేదు. సన్నివేశంలో ఎమోషన్ ఏంటని అడిగి నటించేవాడు. తమన్, శ్రీమణి, సినిమాటోగ్రాఫర్ జార్జ్ అందరూ మంచి అవుట్‌పుట్ ఇచ్చారు. కొండబాబు కామెడీ, 'హైపర్' ఆది పాత్ర అందరికీ నచ్చింది. నన్ను నమ్మి ఈ చిత్రం చేసిన అఖిల్, నిర్మాత బీవీఎస్ఎన్ ప్రసాద్ అందరూ హ్యాపీగా ఉన్నారు. ప్రస్తుతం రెండు, మూడు కథలు రాస్తున్నాను” అన్నారు. చిన్న ఎన్టీఆర్ గురించి మాట్లాడుతూ “నిజంగా... మిస్టర్ మజ్ను ప్రీ రిలీజ్ ముందువరకూ ఎన్టీఆర్ 'తొలి ప్రేమ' గురించి నాతో మాట్లాడలేదు. ప్రేక్షకుల ముందు నన్ను మెచ్చుకుంటే చాలా ఆనందపడ్డా. ఎన్టీఆర్‌తో సినిమా చేయాలని నాకూ ఉంది. అయితే... అంత పెద్ద స్టేచర్ ఉన్న హీరోతో చిత్రం అంటే నాకు మరింత అనుభవం కావాలి. ధైర్యం కావాలి. ధైర్యాన్ని పోగేసుకుని కథ రాశాక... ఆయన దగ్గరకు వెళతా” అన్నారు.

హీరోయిన్లు కావలెను..!

తమ హీరో కొత్త సినిమాకు సంతకం చేశారని తెలియగానే అభిమానులు ఆరా తీసే అంశం 'హీరోయిన్ ఎవరు?' అని. దర్శకుడు-హీరో కాంబినేషన్‌కి ఎంత క్రేజ్ ఉంటుందో, నాయకానాయికల కాంబినేషన్‌కు కూడా అంతే క్రేజ్ ఉంటుంది. అభిమాన హీరోలకు జతకడుతోంది... టాప్ హీరోయిన్లా? కొత్తవారా? అనే ఆత్రుత నిత్యం ఉంటూనే ఉంటుంది. ప్రస్తుతం టాలీవుడ్‌లో పలువురు హీరోల చిత్రాలు సెట్స్ మీద ఉన్నాయి. వారందరికీ హీరోయిన్లు కావలెను... ఎవరా హీరోలు? ఏంటా హీరోయిన్ల వేట..? వివరాలు మీకోసమే...

ఆ నలుగురితో..!


చిరంజీవి

చిరంజీవి ప్రస్తుతం 'సైరా నరసింహారెడ్డి' సినిమాతో బిజీగా ఉన్నారు. ఈ సినిమా తర్వాత కొరటాల శివ దర్శకత్వంలో ఓ సినిమా కమిట్ అయ్యారు. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులతో పాటు చిరు సరసన కథానాయికను వెతికే వేటలో పడ్డారు కొరటాల శివ. తన సినిమాల్లో కథానాయికలకు నటనకు ప్రాధాన్యంతోపాటు గ్లామర్ హంగులు కూడా ఉండేలా ప్లాన్ చేస్తారాయన. చిరంజీవి సరసన నయనతార, అనుష్క లాంటి కథానాయికల్ని జతగా తీసుకొస్తారో లేక కొత్త అందాల్ని దింపే ప్రయత్నంలో ఉన్నారో తెలుసుకోవాలంటే... కొద్దిరోజులు వేచి చూడాల్సిందే. 'యన్.టి.ఆర్ మహానాయకుడు' విడుదల తర్వాత బోయపాటి శ్రీను దర్శకత్వంలో నందమూరి బాలకృష్ణ ఓ సినిమా అంగీకరించారు. మార్చిలో ప్రారంభం కానున్న ఈ చిత్రంలో కథానాయిక ఎవరన్నది ఇంకా చిత్ర బృందం వెల్లడించలేదు. మరో పక్క వెంకటేశ్, నాగచైతన్య హీరోలుగా కె.ఎస్.రవీంద్ర దర్శకత్వంలో 'వెంకీ మామ' సినిమా సెట్స్ మీదుంది. నాగచైతన్యకు జోడీగా రకుల్ ప్రీత్‌సింగ్ ఎంపికైంది. వెంకటేశ్ పక్కన బాలీవుడ్ నటి హుమా ఖురేషి నటించబోతుందని వినిపిస్తోంది. కానీ నిర్మాణ సంస్థ నుంచి ఎలాంటి ప్రకటనా రాలేదు. 2002లో నాగార్జున హీరోగా వచ్చిన 'మన్మథుడు' ఎంతగా విజయం సాధించిందో తెలిసిందే. 16 ఏళ్ల తర్వాత ఆ సినిమాకు సీక్వెల్ రానుంది. 'చి.ల.సౌ'తో దర్శకుడిగా పరిచయమైన రాహుల్ రవీంద్రన్ 'మన్మథుడు' సీక్వెల్‌కు దర్శకత్వం వహించనున్నారు. ఈ సినిమాలో నాగ్ సరసన సోనాలి బెంద్రే, అన్షు నటించారు. సీక్వెల్‌లో ఇద్దరు హీరోయిన్లు ఉంటారా? లేక ఒకరే ఉంటారా అన్నది తెలియాల్సి ఉంది.


బాలకృష్ణ


నాగార్జున


వెంకటేశ్

జక్కన్న ఎంపిక చేశారా?

'బాహుబలి' తర్వాత కొంత విరామం తీసుకున్న రాజమౌళి ప్రస్తుతం 'ఆర్ ఆర్ ఆర్' తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. ఎన్టీఆర్, రామ్‌చరణ్ నాయకులుగా గత ఏడాది నవంబర్‌లో ప్రారంభమైన ఈ చిత్రం ఇప్పుడు రెండో షెడ్యూల్ చిత్రీకరణతో బిజీగా ఉంది. కానీ ఎన్టీఆర్, రామ్‌చరణ్ సరసన కథానాయికలు ఎవరనేది ఇంకా బయటకు రాలేదు. టాలీవుడ్‌లో స్టార్ కథానాయికలుగా చలామణీలో ఉన్నవారిలో చాలా వరకు ఇంతకు ముందే తారక్, చరణ్ సరసన జత కట్టినవారే. అందువల్ల జక్కన్న వీరిద్దరికీ జతగా కొత్త నాయికల్ని దిగుమతి చెయ్యనున్నారని ఫిల్మ్ నగర్ టాక్.


ఎన్టీఆర్, రామ్‌చరణ్

త్రివిక్రమ్ కథానాయికలేనా?


అల్లు అర్జున్

'నా పేరు సూర్య.. నా ఇల్లు ఇండియా' సినిమా తర్వాత అల్లు అర్జున్ సినిమా ఎవరితో ఉండబోతుందా అన్న ఆసక్తి అభిమానుల్లో గట్టిగా ఉంది. విక్రమ్.కె.కుమార్, లింగుస్వామితో ఉంటుందని వార్తలు వినిపించినా, చివరికి త్రివిక్రమ్‌తో కథ ఫైనల్ అయిందని ఇటీవల నిర్మాణ సంస్థలు ప్రకటించిన విషయం తెలిసిందే. బన్నీ, త్రివిక్రమ్ కాంబినేషన్‌లో ఇంతకు పూర్వం 'జులాయి', 'సన్నాఫ్ సత్యమూర్తి' చిత్రాలు వచ్చాయి. త్వరలో సెట్స్ మీదకెళ్లనున్నది వీరిద్దరి కలయికలో వస్తున్న మూడో సినిమా. ఇందులో బన్నీ సరసన జతకట్టేది ఎవరనేది ఇంకా ప్రకటించలేదు. ఆయన ఎనర్జీకి సరిపడే కథానాయిక వేటలో ఉన్నారు మాటల మాంత్రికుడు. కియారా అద్వాణీని సంప్రతించారనే పుకార్లు వచ్చాయి. కానీ అధికారిక ప్రకటన అయితే ఇప్పటిదాకా రాలేదు. ఇంతకు ముందు త్రివిక్రమ్‌తో పనిచేసిన కథానాయికలే ఈ సినిమాలో నటించే అవకాశాలున్నాయని మరో టాక్.

వాళ్లా ఇద్దరేనా?

సినిమా ప్రారంభం రోజే విడుదల తేదీని ప్రకటిస్తారు పూరీ జగన్నాథ్. అతి తక్కువ సమయంలో షూటింగ్ పూర్తి చేసే పూరీ జగన్నాథ్ గత ఏడాది తన తనయుడు ఆకాశ్ హీరోగా 'మెహబూబా' సినిమా తీశారు. అది పరాజయం పాలవ్వడంతో ఏడు నెలలు విరామం తీసుకుని ఆయనే దర్శకనిర్మాతగా రామ్ హీరోగా 'ఇస్మార్ట్ శంకర్' చిత్రం ప్రారంభించారు. రామ్‌తో పూరీ తీస్తున్న తొలి సినిమా ఇది. అయితే రామ్ సరసన కథానాయిక ఎవరనేది ఇంకా చెప్పలేదు. మలబారు భామ అనూ ఇమ్మాన్యుయేల్‌ను ఎంపిక చేశారంటూ వార్తలొచ్చాయి. అనూని సంప్రతించిన మాట వాస్తవమే కానీ ఇంకా ఆమె అంగీకారం తెలపలేదని సమాచారం. దాంతో తాజాగా నభా నటేశ్, నిధి అగర్వాల్‌తో కూడా చర్చలు జరుగుతున్నాయని తెలుస్తోంది. కొత్త అందాల్ని వెతికి పట్టడంలో పూరీ సిద్ధహస్తుడు. మరి రామ్‌కి జోడీగా ఎవరిని తీసుకొస్తాడనేది చూడాలి.


రామ్

మలబారు బ్యూటీ ఖాయమేనా?


నాని

'జెర్సీ' సినిమా తర్వాత విక్రమ్.కె.కుమార్ దర్శకత్వంలో ఓ సినిమాలో నటించనున్నారు నాని. ఇప్పటికే ఆ సినిమాకు సంబంధించిన కాన్సెప్ట్ పోస్టర్‌ను విడుదల చేశారు. అందులో నానికి జతగా... కన్ను గీటులో సోషల్ మీడియాలో సంచలనం సృష్టించిన మలయాళ బ్యూటీ ప్రియా ప్రకాష్ వారియర్ హీరోయిన్‌గా నటించనున్నారనే వార్త హల్‌చల్ చేస్తోంది. ఇటీవల హైదరాబాద్ వచ్చిన ప్రియా ప్రకాశ్ మాత్రం తన మొదటి సినిమా రిజల్ట్ చూశాకే తర్వాతి సినిమా గురించి ఆలోచిస్తానని చెప్పారు. రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ సినిమాను మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మిస్తోంది.

తమిళ అందమేనా?

గోపీచంద్ హీరోగా తమిళ దర్శకుడు తిరు దర్శకత్వంలో ఇటీవల కొత్త సినిమా ప్రారంభమైంది. హై ఓల్టేజ్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందనున్న ఈ చిత్రం ప్రస్తుతం ఢిల్లీ, రాజస్థాన్‌లో షూటింగ్ జరుగుతోంది. ఈ షెడ్యూల్ యాభై రోజులపాటు అక్కడే జరగనుంది. గోపీచంద్ సరసన కథానాయిక ఎవరనేది తిరు వెల్లడించలేదు. తమిళ అందమే గోపీ సరసన మెరవబోతుందని యూనిట్ వర్గాల సమాచారం.


గోపీచంద్

ప్రియాంకను నిక్ పెళ్లి చేసుకోవడం తప్పా?


సోఫీ టర్నర్

హాలీవుడ్‌లోనూ నటిస్తున్న భారతీయ నటి ప్రియాంకా చోప్రాను అమెరికన్ పాప్ సింగర్, యాక్టర్ నిక్ జొనాస్ పెళ్లి చేసుకోవడం తప్పని ఓ నెటిజన్ పేర్కొన్నాడు. “తెల్లవారు తెల్లవారినే ప్రేమించండి. పెళ్లి చేసుకోండి. నిక్ జొనాస్ తన సోదరుడిలా తెల్లవారిని ప్రేమించలేదు” అని ట్విట్టర్‌లో జాతి వివక్ష వ్యాఖ్యలు చేశాడు. అతని వ్యాఖ్యలపై 'గేమ్ ఆఫ్ థ్రోన్స్' ఫేమ్, హాలీవుడ్ నటి సోఫీ టర్నర్ అభ్యంతరం వ్యక్తం చేశారు. “జాతి వివక్షను ప్రేరేపించడానికి నా పేరును వాడొద్దు” అని ట్వీట్ చేశారామె. దాంతో సదరు నెటిజన్ ఖాతాను ట్విట్టర్ శాశ్వతంగా తొలగించింది. ప్రియాంక-నిక్ వివాహంపై నెటిజన్ చేసిన వివాదాస్పద వ్యాఖ్యలపై సోఫీ టర్నర్ స్పందించడం వెనుక ఓ కారణం ఉంది. త్వరలో ఈమె ప్రియాంకా చోప్రాకు తోడికోడలు కాబోతోంది. నిక్ జొనాస్ సోదరుడు జోతో సోఫీ నిశ్చితార్థం జరిగింది. త్వరలో జరగబోయే వీరి వివాహానికి, ప్రియాంక-నిక్ వివాహానికి ముడి పెట్టాడు ఆ నెటిజన్. అదన్నమాట సంగతి! పెళ్లి తర్వాత ప్రియాంకా చోప్రాపై పలువురు ఇటువంటి జాతి వివక్ష వ్యాఖ్యలు, విమర్శలు చేస్తున్నారు. తనపై వస్తున్న విమర్శలపై స్పందించారామె. “చెత్త మాటల్ని నేను పట్టించుకోను. నెగటివ్ వ్యాఖ్యలను వదిలేసి, నన్ను ఇష్టపడేవారు చేసే పాజిటివ్ వ్యాఖ్యలను తీసుకుంటా” అని ప్రియాంకా చోప్రా పేర్కొన్నారు.





అమ్మాయిలూ తీసుకెళ్తారు

\- రకుల్ ప్రీత్ సింగ్


అబ్బాయిలే రైడ్‌కు తీసుకెళ్తారా? అమ్మాయిలు తీసుకెళ్లలేరా? ఇకపై అమ్మాయిలూ తీసుకెళ్తారు... అని అంటున్నారు రకుల్ ప్రీత్‌సింగ్. 'దేవ్' చిత్రంలో ఆమె బైక్ నడిపే సన్నివేశాలున్నాయి. ఈ సినిమా షూటింగ్‌లో భాగంగా రకుల్ బైక్ నడపడాన్ని ఆ చిత్ర దర్శకుడు రజత్ రవిశంకర్ కెమెరాలో బంధించారట. ఆ వీడియో రకుల్ ఇన్‌స్టాలో పోస్ట్ చేశారు. ఫిబ్రవరి 14న విడుదల కానుంది 'దేవ్'. అదే రోజు ఆమె నటించిన 'ఎన్‌జీకే' టీజర్ ప్రేక్షకుల ముందుకు రానుంది. 'ఫిబ్రవరి 14 నాకు డబుల్ ధమాకా. కార్తీ సరసన నటించిన 'దేవ్' విడుదలవుతుంది. సూర్య సరసన నటించిన 'ఎన్‌జీకే' టీజర్ ప్రేక్షకుల ముందుకు రానుంది” అని ఇటీవల రకుల్ ట్వీట్ చేశారు.

భగవంతుడి దయతో తిరిగి వస్తాను

\- రిషికపూర్



“నాకు ప్రస్తుతం చికిత్స జరుగుతోంది. త్వరలోనే కోలుకుంటాననే నమ్మకం ఉంది. భగవంతుడి దయతో త్వరలోనే తిరిగి వస్తాను. ప్రస్తుతం నేను తీసుకుంటున్న చికిత్సకు ఎక్కువ సమయం పడుతుంది. ఓపిగ్గా ఉండాలి. కానీ నాకు లేనిదే ఓపిక” అని రిషి కపూర్ అన్నారు. గత ఏడాది సెప్టెంబర్ నుంచి ఆయన యు.ఎస్‌లో ట్రీట్‌మెంట్ చేయించుకుంటున్న సంగతి తెలిసిందే. ఆయనకు కేన్సర్ సోకిందని వచ్చిన వార్తలను ఆయన సోదరుడు రణ్‌ధీర్ కపూర్ కొట్టిపారేశారు. సరైన సమయంలో మీడియాకు పూర్తి వివరాలను వెల్లడిస్తామని అన్నారు. అయితే తాజాగా రిషి కపూర్ తన ఆరోగ్యం గురించి మాట్లాడారు. ప్రొఫెషనల్ లైఫ్‌ని కొన్నాళ్లు హోల్డ్‌లో పెట్టినట్టు తెలిపారు. “రిలాక్స్ మైండ్‌తో ఉండాలని అనుకుంటున్నాను. అందుకే ప్రస్తుతం సినిమాల గురించి ఆలోచించడం లేదు. ఈ బ్రేక్ నేను పూర్తిగా కోలుకోవడానికి సహకరిస్తుందని నమ్ముతున్నా” అని చెప్పారు. కుమారుడు రణ్‌బీర్, భార్య నీతు ప్రస్తుతం ఆయనతోనే ఉన్నారు.


సప్తగిరి

దొంగ గోవిందు

“ఆ దొంగ పేరు గోవిందు. అతనికో లక్ష్యం ఉంటుంది. దాన్ని సాధించుకోడానికి ఏం చేశాడనేది మా 'వజ్రకవచధర గోవింద'లో చూడాల్సిందే” అని అన్నారు సప్తగిరి. ఆయన హీరోగా నటిస్తున్న చిత్రమది. శివశివమ్ ఫిలిమ్స్ పతాకంపై నరేంద్ర యెడల, జీవీయన్ రెడ్డి నిర్మిస్తున్నారు. దర్శకుడు అరుణ్ పవార్ మాట్లాడుతూ “సప్తగిరి వ్యావహారికశైలికి తగ్గట్టు కుదిరింది ఈ కథ. నిర్మాతలు కొత్తవారైనా ఖర్చుకు వెనకాడకుండా తెరకెక్కిస్తున్నారు. కడుపుబ్బా నవ్వించే అంశాలతో పాటు యాక్షన్, ఎమోషన్స్ సమపాళ్లలో ఉంటాయి” అని అన్నారు. నిర్మాతలు మాట్లాడుతూ “80 శాతం షూటింగ్ పూర్తయింది. మైసూర్ సమీపంలోని మేల్‌కోటె గుడిలో 10 రోజులు కీలక సన్నివేశాలను తెరకెక్కిస్తాం. దాంతో చిత్రీకరణ పూర్తవుతుంది. మా టైటిల్ ప్రకటించగానే సినిమా మీద అటెన్షన్ పెరిగింది” అని చెప్పారు. వైభవీ జోషి నాయికగా నటిస్తున్న ఈ చిత్రానికి ఎగ్జిక్యూటివ్ నిర్మాత: సలాన బాలగోపాలరావు.

భావోద్వేగానికి గురయ్యా

\- శాలినీ పాండే



“మనల్ని మనం అత్యద్భుతంగా వ్యక్తపరచుకోవడానికి భాష ప్రధానం. భాషమీద పట్టున్నప్పుడు నటనలో మరింత లీనం కావచ్చు. నా మాతృభాష హిందీలో డైలాగులు చెప్పే అవకాశం వచ్చినప్పుడు ఈ విషయం నాకు స్పష్టంగా బోధపడింది. వెంటనే భావోద్వేగానికి గురయ్యాను” అని శాలినీ పాండే అన్నారు. 'అర్జున్‌రెడ్డి' చిత్రంలో ప్రీతి పాత్రలో శాలినీ నటన కుర్రకారును కట్టిపడేసింది. ఆ తర్వాత దక్షిణాదిన మరికొన్ని చిత్రాలు చేసిన ఆమె తాజాగా బాలీవుడ్‌లో 'బామ్‌ఫాద్'లో నటిస్తున్నారు. రంజన్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో పరేష్ రావల్ తనయుడు ఆదిత్య హీరో.

సీఏ ర్యాంకర్లలో తెలుగు తేజాలు

టాపర్స్ వాయిస్

చిన్న వయసులోనే సమాజంలో హోదా, గౌరవంతోపాటు మంచి వేతనం అందుకునే అవకాశం ఉండటంతో సీఏ కోర్సు టాప్ ప్లేస్‌లో నిలుస్తోంది. ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక, వ్యాపార, వాణిజ్య రంగాల్లో వేగంగా వస్తున్న మార్పులతో చార్టర్డ్ అకౌంటెన్సీ (సీఏ) నిపుణులకు డిమాండ్ ఏర్పడింది. సీఏ ఫైనల్ కోర్సు పరీక్షల్లో ఏపీ విద్యార్థులు మరోసారి సత్తా చాటారు. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) సీఏ కోర్సు ఫైనల్ ఫలితాలను ఇటీవల ప్రకటించింది. ఎప్పటిలాగే ఈ ఫలితాల్లో తెలుగు విద్యార్థులు మంచి ర్యాంకులు దక్కించుకున్నారు. జాతీయ స్థాయిలో టాప్ - 50లో 4 (కమతం విజయ లక్ష్మీ), 13 (మారెడ్డి భానుప్రసాద్), 22 (పిట్టల లక్ష్మీ దీపిక), 29 (కటికెల జగదీశ్వర్ బాబు) ర్యాంకులను తెలుగు విద్యార్థులు సొంతం చేసుకున్నారు. ఈ నేపథ్యంలో ఉత్తమ ర్యాంకుల సాధన వెనుక వారి కృషి, చేసిన సన్నాహాలు, సీఏ కోర్సును ఎంచుకోవడానికి కారణాలు తదితర అంశాలను దిక్సూచితో పంచుకున్నారు.

ఆ విశేషాలు వారి మాటల్లోనే..



కమతం విజయలక్ష్మీ
4వ ర్యాంకు

ఇష్టపడి చదివాను

మొదటి రోజు నుంచే

కోర్సులో చేరిన మొదటి రోజు నుంచే లక్ష్యం దిశగా సాగాను. కష్టంతోకాకుండా ఇష్టపడి చదివాను. ఏ కోర్సు చదివినా మొదటి ప్రయత్నంలోనే పూర్తి చేయాలి, రెండో అవకాశం తీసుకోకూడదు అనే లక్ష్యం ఉండేది. అదే స్ఫూర్తితో సీఏ కోర్సులోని అన్ని దశలను పూర్తి చేశాను. సీఏ సీపీటీలో 200కుగాను 183 మార్కులను సాధించాను. అదే నమ్మకంతో సీఏ ఐపీసీసీని మొదటి ప్రయత్నంలోనే పూర్తి చేశాను. అక్క వైష్ణవి ఇచ్చిన సూచనలు, మాస్టర్ మైండ్స్ ఇన్‌స్టిట్యూట్ వారు ఇచ్చిన ప్రోత్సాహంతో సీఏ ఫైనల్లో జాతీయ స్థాయిలో నాలుగో ర్యాంకు వచ్చింది. దక్షిణ భారతదేశంలో మొదటి ర్యాంకు సాధించాను.

కుటుంబ నేపథ్యం

మాది గుంటూరు. నాన్న రమేష్, అమ్మ అరుణ. 10వ తరగతి వరకు గుంటూరులో చదివాను. 10వ తరగతిలో 9.5 గ్రేడ్ పాయింట్లు వచ్చాయి. సీఏలో చేరడానికి ప్రేరణ మా అక్క వైష్ణవి. తాను సీఏ పూర్తి చేసింది. ప్రస్తుతం ప్రముఖ కంపెనీలో సీఏగా విధులు నిర్వహిస్తుంది. తమ్ముడు అమరనాథ్ కూడా సీఏ ఐపీసీసీలో క్వాలిఫై అయ్యాడు. అక్కకు కూడా నా లాగే సీఏ ఫైనల్లో జాతీయ స్థాయిలో 45వ ర్యాంక్ వచ్చింది.

మంచి అవకాశాలు

సీఏ పూర్తి చేస్తే మంచి అవకాశాలు ఉంటాయని నాన్న, అక్కా ఎప్పుడూ చెప్తుండేవారు. వివిధ మాధ్యమాల ద్వారా సీఏ కెరీర్ గురించి తెలుసుకున్నాను. సీఏ చేయాలని లక్ష్యంగా నిర్ణయించకున్నా. ఆ క్రమంలో ఇంటర్మీడియెట్‌లో ఎంఈసీ ఎంచుకున్నాను. ఇంటర్‌లో 977 మార్కులు వచ్చాయి.

ఏకాగ్రత ఉండాలి

10వ తరగతి తరవాత 6 సంవత్సరాల్లో సీఏ పూర్తి చేయాలనుకున్నాను. అదేవిధంగా చేశాను. చక్కని ఉద్యోగంలో స్థిరపడాలనే ఆలోచనతో ఉన్నాను. సీఏ చేయాలనుకునే వారికి పట్టుదల, ఏకాగ్రత ఉంటే అన్ని దశలను పూర్తి చేయవచ్చు. ప్రెజెంటేషన్ స్కిల్స్‌ను మెరుగుపరుచుకోవాలి. కష్టపడేతత్వాన్ని అలవర్చుకోవాలి.

ఒత్తిడి లేకుండా ప్రణాళిక ప్రకారం



మారెడ్డి భానుప్రసాద్
13వ ర్యాంకు

ఆందోళనకు దూరంగా: సీఏ చదివేటప్పుడు ఆందోళనకు దూరంగా ఉండేవాణ్ని. ఫలితాల గురించి ఆలోచన ఉండేది కాదు. ముందు నుంచే ప్రణాళిక ప్రకారం పరీక్షలకు ప్రిపరేషన్ సాగించాను. ఫలితంగా సీఏ సీపీటీలో నాది జాతీయ స్థాయిలో 7వ ర్యాంకు. సీఏ ఐపీసీసీలో 378 మార్కులతో మొదటి ప్రయత్నంలోనే రెండు గ్రూపులను పూర్తి చేశాను. ఇన్‌స్టిట్యూట్‌లో నిర్వహించే రివిజన్ ఎగ్జామ్స్ తప్పకుండా రాసే వాణ్ని. అందులో మార్కులు బాగా వచ్చేవి. దాంతో నాకు నమ్మకం పెరిగింది. ఇవే జాతీయ స్థాయిలో 13వ ర్యాంకు సాధించటానికి దోహదం చేశాయి.

కుటుంబ నేపథ్యం: మాది తూర్పుగోదావరి జిల్లా తుని. నాన్న వెంకటరమణ. అమ్మ సుబ్బలక్ష్మీ. నాన్నతోపాటు ఇద్దరన్నయ్యలు కూడా ట్రాన్‌పోర్ట్ కంపెనీలో పని చేస్తుంటారు. 10వ తరగతి వరకు తునిలో చదువుకున్నా. 10వ తరగతిలో 9.8 గ్రేడ్ పాయింట్లు వచ్చాయి. కెరీర్‌పరంగా లభించే అవకాశాలు, సమాజంలో దక్కే గౌరవమర్యాదలు వంటి కారణాలతో సీఏ కోర్సును ఎంచుకున్నాను. ఈ క్రమంలో ఇంటర్మీడియెట్‌లో ఎంఈసీ గ్రూపు తీసుకున్నా. ఇంటర్మీడియెట్‌లో 985 మార్కులు వచ్చాయి.

నిరాశకు లోనుకాకుండా: మంచి సీఏగా రాణించాలన్నదే భవిష్యత్ లక్ష్యం. సీఏ కోర్సులో చేరాలనుకునేవారు ముందుగా కోర్సు గురించి అవగాహన ఏర్పర్చుకోవాలి. పట్టుదలతోపాటు కష్టపడేతత్వం, ప్రణాళిక ప్రకారం ప్రిపరేషన్ సాగించే ఓర్పు ఉండాలి. పొరపాటున ఒక ప్రయత్నంలో విఫలమైనా నిరాశకు లోనుకాకుండా ముందుకు సాగాలి. అప్పుడే ఇందులో సక్సెస్ సాధించవచ్చు.

స్వీయ ప్రేరణతో ముందుకు

అదే స్ఫూర్తితో: సీఏ సీపీటీలో 200కుగాను 179 మార్కులను సాధించాను. అదే స్ఫూర్తితో సీఏ ఐపీసీసీలో 378 మార్కులతో రెండు గ్రూపులను పూర్తి చేశాను. సీఏ ఫైనల్ కోసం కోచింగ్ మెటీరియల్ బాగా ఉపయోగపడింది. ఏకాగ్రతతో చదివేదాన్ని. మూడు గంటలకోసారి చిన్న బ్రేక్ తీసుకునేదాన్ని. చివరి మూడు నెలలు చాలా కష్టపడ్డాను. ఫోన్‌కు దూరంగా ఉన్నాను. ఎప్పటికప్పుడు స్వీయ ప్రేరణతో ముందుకు సాగేదాన్ని. ఫలితంగానే జాతీయ స్థాయిలో సీఏ ఫైనల్లో 22వ ర్యాంక్ దక్కింది.

కుటుంబ నేపథ్యం: మాది గుంటూరు. నాన్న కోటేశ్వర రావు, అమ్మ మల్లీశ్వరి. అమ్మ మున్సిపల్ కార్పొరేషన్ ఉద్యోగి. 10వ తరగతి భాష్యం స్కూళ్లో చదివాను. 10వ తరగతిలో 9.7 గ్రేడ్ పాయింట్లు వచ్చాయి. అక్క సివిల్స్ ప్రిపేర్ అవుతుంది. సైన్స్ గ్రూపులో మాదిరి పోటీ అధికంగా ఉండదు, ర్యాంకులు సాధించాల్సిన అవసరం లేదు, పోటీ తక్కువ, ఉద్యోగావకాశాలు ఎక్కువ కావడంతో స్నేహితురాలి సలహా మేరకు సీఏ కోర్సును ఎంచుకున్నాను. ఇంటర్‌లో ఎంఈసీ గ్రూపు తీసుకున్నా. 970 మార్కులు వచ్చాయి.

కష్టపడే తత్వం: సీఏగా బాగా రాణించాలన్నదే భవిష్యత్ లక్ష్యం. సీఏలో చేరాలనుకునే వారు మొదటి నుంచే కష్టపడే తత్వాన్ని అలవర్చుకోవాలి. అప్పుడే ఈ కోర్సులో విజయం సాధించగలం అనే విషయాన్ని గుర్తుంచుకోవాలి.



పిట్టల లక్ష్మీ దీపిక
22వ ర్యాంకు

రోజూ 8 గంటలు



కటికెల జగదీశ్వర్ బాబు
29వ ర్యాంకు

మొదటి ప్రయత్నంలోనే

సీఏ కోర్సులోని అన్ని దశలను మొదటి ప్రయత్నంలోనే పూర్తి చేశాను. ప్రణాళిక ప్రకారం రోజుకు 8 గంటలు కష్టపడ్డాను. ఏరోజు సిలబస్‌ను ఆరోజే పూర్తి చేసే వాణ్ని. ఏ సబ్జెక్ట్‌లో స్ట్రాంగ్, ఏ సబ్జెక్ట్‌లో వీక్.. ఇలా విశ్లేషించుకుంటూ ప్రిపరేషన్ సాగించాను. తద్వారా వీక్ సబ్జెక్ట్‌లో కనీసం 40-50 మార్కులు తెచ్చుకునే వాణ్ని. సీఏ ఐపీసీసీలో నాది జాతీయ స్థాయిలో 26వ ర్యాంకు.

కుటుంబ నేపథ్యం

మాది అనంతపురం జిల్లా కదిరి. నాన్న కులాయప్ప ప్రభుత్వ ఉపాధ్యాయుడు. అమ్మ భారతీదేవి. అక్క ఇంజనీరింగ్ పూర్తి చేసింది. 10వ తరగతిలో 9.3 గ్రేడ్ పాయింట్లు వచ్చాయి. ఇంటర్‌లో నాది ఎంపీసీ గ్రూపు. 948 మార్కులు వచ్చాయి. అయితే ఇంజనీరింగ్ వంటి రొటీన్ కోర్సులను కాకుండా భిన్నమైన రంగాన్ని ఎంచుకోవాలనుకున్నా. ఆ క్రమంలో సీఏ గురించి తెలుసుకొని ఇందులో చేరా. ఇందులో అయితే పోటీ తక్కువ, స్వల్ప కాలంలోనే కెరీర్‌పరంగా స్థిరపడొచ్చు.

మరీ సులభం కాదు


ప్రముఖ కంపెనీలో మంచి హోదాలో స్థిరపడాలన్నదే భవిష్యత్ లక్ష్యం. సీఏ అనుకున్నంత కష్టం కాదు, అలాగని మరీ సులభం కాదు. చదివినంతసేపు ఏకాగ్రతతో చదవాలి. సబ్జెక్ట్‌ను కష్టమని భావించకుండా ఇష్టపడి చదవాలి.

ర్యాంకర్ల సూచనలు

సీఏ ఫైనల్ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు ర్యాంకర్లు ఇస్తున్న కొన్ని సూచనలు, సలహాలు...

- అన్ని పేపర్లకు సమాన ప్రాధాన్యం ఇవ్వాలి.
- ప్రతి సబ్జెక్ట్, అందులోని అన్ని చాప్టర్లలోని ప్రశ్నలను క్షుణ్నంగా చదవాలి.
- కోచింగ్ మెటీరియల్‌తోపాటు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) ఇచ్చే మెటీరియల్‌ను చదవడం తప్పనిసరి.
- రివిజన్ టెస్ట్ పేపర్స్, మాక్ టెస్ట్ పేపర్స్‌ను తప్పకుండా ప్రాక్టీస్ చేయాలి.
- ఇటువంటి పరీక్షల్లో విజయం సాధించాలంటే ఎంతో ఓపిక, శ్రమ, సమయపాలన అవసరం.
- రివిజన్ ఎగ్జామ్స్‌కు తప్పకుండా హాజరు కావాలి. ఇటువంటి పరీక్షల్లో పునశ్చరణ (రివిజన్) లేకుండా విజయం సాధించడం కష్టం.
- ఫోన్స్‌కు, సోషల్ మీడియాకు సాధ్యమైనంత వరకు దూరంగా ఉండాలి.

ఇగ్నో నుంచి స్పెషలైజ్డ్ బీకామ్, ఎంకామ్



మనదేశంలో దూర విద్యను అందించడంలో ఇగ్నో (ఇందిరాగాంధీ నేషనల్ ఓపెన్ యూనివర్సిటీ)ది ప్రముఖ పాత్ర. నిరంతరం కరిక్యులంలో మార్పులు చేస్తూ నూతన కోర్సులను ప్రవేశపెట్టడంలో ఇగ్నో ఎప్పుడూ ముందుంటుంది. అందులో భాగంగా సీఏ (చార్టర్ట్ అకౌంటెన్సీ) విద్యార్థుల కోసం ప్రత్యేకంగా రూపొందించిన స్పెషలైజ్డ్ బీకామ్, ఎంకామ్ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. వివరాలు..

- సీఏ విద్యార్థులకు ఉపయోగపడే విధంగా ఐసీఏఐ (ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా) సహకారంతో ఇగ్నో ఈ కోర్సులను రూపొందించింది. ఆ కోర్సులు.. బీకామ్ (అకౌంటింగ్ అండ్ ఫైనాన్స్), ఎంకామ్ (ఫైనాన్స్ & ట్యాక్సేషన్).
- సీఏ సీపీటీలో ఉత్తీర్ణులై, ఐపీసీసీలో చేరిన విద్యార్థులు బీకామ్ (అకౌంటింగ్ అండ్ ఫైనాన్స్) కోర్సులో ప్రవేశం పొందొచ్చు. వీరు ఐపీసీసీ పూర్తి చేసే నాటికి ఇగ్నో నుంచి బీకామ్ డిగ్రీని పూర్తి చేయవచ్చు. ఐపీసీసీ పూర్తి అయిన తరవాత సీపీటీ, ఐపీసీసీ, ఇగ్నో మార్కులు అన్నింటినీ కలిపి బీకామ్ డిగ్రీని ప్రదానం చేస్తారు. దీనికి మిగిలిన డిగ్రీల మాదిరిగానే గుర్తింపు ఉంటుంది.
- డిగ్రీ చదివి, సీఏ ఫైనల్ ఉత్తీర్ణులైన లేదా చదువుతున్న విద్యార్థులు ఎంకామ్ (ఫైనాన్స్ అండ్ ట్యాక్సేషన్) కోర్సులో ప్రవేశం పొందొచ్చు. ఇందులో భాగంగా ఇగ్నో ఆఫర్ చేసే ఐదు కోర్సులను పూర్తి చేయాలి. మిగిలిన కోర్సులు సీఏ ఫైనల్లో ఉంటాయి. ఈ రెంటి మార్కులను కలిపి సీఏ పూర్తయిన తరవాత ఎంకామ్ డిగ్రీని ప్రదానం చేస్తారు.
- సీఏలో చదివే అన్ని పేపర్లకు ఇగ్నో బీకామ్ కోర్సులో క్రెడిట్ ట్రాన్స్‌ఫర్ చేస్తుంది. అంతేకాకుండా సీఏలో చదివిన పేపర్లకు మినహాయింపు లభిస్తుంది. దీనికి తోడు మొదటి సంవత్సరంలో కొన్ని తప్పనిసరిగా చదవాల్సిన పేపర్లు ఉంటాయి. వీటి ద్వారా 32 క్రెడిట్స్ సాధిస్తే బీకామ్ స్పెషలైజ్‌డ్ డిగ్రీ ఇస్తారు. ఇదే తరహా విధానం ఎంకామ్‌లో కూడా ఉంటుంది.
- ఆసక్తి గల విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి. మరిన్ని వివరాలను ఇగ్నో రీజనల్ సెంటర్ల నుంచి పొందొచ్చు.
- దరఖాస్తుకు చివరి తేదీ: జనవరి 31, 2019.
- దరఖాస్తు లింక్: https://onlineadmission.ignou.ac.in/admission/
- వెబ్‌సైట్: www.ignou.ac.in
- విశాఖపట్నం రీజనల్ సెంటర్ చిరునామా: వుడా కాంప్లెక్స్, ఉషోదయ జంక్షన్, ఎంవీపీ కాలనీ - విశాఖపట్నం.
- ఫోన్ నెంబర్లు: 08912511 200 / 300
- విజయవాడ రీజనల్ సెంటర్ చిరునామా: 9-76-18, ఫస్ట్ ఫ్లోర్, ఎస్‌కేపీవీవీ హిందూ హైస్కూల్, కొత్తపేట, విజయవాడ - 520001 .
- ఫోన్ నెంబర్: 0866-256 5253, 256 5959

జాబ్ కార్నర్

ఇండియన్ ఆర్మీ



ఖాళీలు 191

ఇండియన్ ఆర్మీ షార్ట్ సర్వీస్ కమిషన్ (ఎస్ఎస్‌సీ) ఆఫీసర్ పోస్టుల భర్తీకి అవివాహితులైన పురుష, మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది. వివరాలు... షార్ట్ సర్వీస్ కమిషన్ (ఎస్ఎస్‌సీ) టెక్నికల్.

- ఎస్ఎస్‌సీ (టెక్): 189. ఇందులో పురుషులకు 175, మహిళలకు 14 ఉన్నాయి.
- విభాగాలు: సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్ / ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, ఏరోనాటికల్ / బాలిస్టిక్స్ / ఏవియోనిక్స్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ / కంప్యూటర్ టెక్నాలజీ / ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ / ఎంఎస్సీ కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ టెలికామ్ / టెలీకమ్యూనికేషన్ / ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ / శాటిలైట్ కమ్యూనికేషన్, ఎలక్ట్రానిక్స్ / ఆప్టో ఎలక్ట్రానిక్స్ / ఫైబర్ ఆప్టిక్స్ / మైక్రో ఎలక్ట్రానిక్స్ అండ్ మైక్రోవేవ్, ప్రొడక్షన్ ఇంజనీరింగ్, ఆర్కిటెక్చర్ / బిల్డింగ్ కనస్ట్రక్షన్ టెక్నాలజీ.
- అర్హత: సంబంధిత విభాగాల్లో గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఇంజినీరింగ్ డిగ్రీ. ఫైనలియర్ విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. నిర్దేశించిన విధంగా శారీరక ప్రమాణాలు ఉండాలి.
- వయసు: 20 - 27 ఏళ్ల మధ్య ఉండాలి (అక్టోబరు 1, 2019 నాటికి).
- విడోస్ ఆఫ్ డిఫెన్స్ అభ్యర్థులకు మాత్రమే
- ఎస్ఎస్‌సీ (ఉమెన్) (నాన్‌టెక్) (నాన్ యూపీఎస్సీ): 1
- అర్హత: ఏదైనా డిగ్రీ.
- ఎస్ఎస్‌సీ (ఉమెన్) టెక్: 01
- అర్హత: ఏదైనా ఇంజనీరింగ్ విభాగంలో బీఈ/బీటెక్.
- వయసు: 35 ఏళ్లు మించకూడదు (అక్టోబరు 7, 2019 నాటికి).
- ఎంపిక: ఎస్ఎస్‌బీ ఇంటర్వ్యూ, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా.
- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
- దరఖాస్తుకు చివరి తేదీ: ఫిబ్రవరి 21, 2019.
- వెబ్‌సైట్: https://joinindianarmy.nic.in

హోంగార్డ్

ఖాళీలు 91

ఆంధ్రప్రదేశ్ స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ ఫైర్ సర్వీసెస్ డిపార్ట్‌మెంట్ హోంగార్డ్ (బి-కేటగిరీ) పోస్టుల భర్తీకి పురుష అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది. వివరాలు...

- హోంగార్డు (ఫైర్‌మ్యాన్): 73
- హోంగార్డు (డ్రైవర్ ఆపరేటర్): 18
- అర్హత: ఏడో తరగతి ఉత్తీర్ణతతోపాటు ఫైర్ ఫైటింగ్ అండ్ రెస్క్యూ ఆపరేషన్లలో అయిదేళ్ల పని అనుభవం ఉండాలి. అభ్యర్థుల ఎత్తు 160 సెం.మీ. ఉండాలి.
- వయసు: 18 - 50 ఏళ్ల మధ్య ఉండాలి.
- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా
- దరఖాస్తుకు దరఖాస్తుకు చివరి తేదీ: ఫిబ్రవరి 18, 2019.
- బేసిక్ స్కిల్ టెస్ట్ తేదీ: మార్చి 1, 2019.
- డ్రైవింగ్ టెస్ట్ తేదీ: మార్చి 6, 2019.
- వెబ్‌సైట్: http://fireservices.ap.gov.in/fire/

టెక్నికల్ ఎక్స్‌పర్ట్

ఖాళీలు 6

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పీఆర్ అండ్ ఆర్‌డీ విభాగం.. స్టేట్ లెవెల్ నీరాంచల్ సెల్‌లో ఒప్పంద ప్రాతిపదికన పలు పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. వివరాలు...

- పోస్టులు: స్టేట్ టెక్నికల్ ఎక్స్‌పర్ట్, అసిస్టెంట్ టెక్నికల్ ఎక్స్‌పర్ట్.
- దరఖాస్తుకు చివరి తేదీ: ఫిబ్రవరి 4, 2019.
- వెబ్‌సైట్: http://neeranchal.ap.gov.in/

రీసెర్చ్ ఆఫీసర్

ఖాళీలు 2

ఆంధ్రప్రదేశ్ లెజిస్లేచర్ సెక్రటేరియట్ సర్వీస్‌లో రీసెర్చ్ ఆఫీసర్ పోస్టుల భర్తీ కోసం ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) దరఖాస్తులు కోరుతోంది. వివరాలు....

- అర్హత: ప్రథమ శ్రేణి మార్కులతో బీఏ / బీఎస్సీ / బీకామ్‌తోపాటు లైబ్రరీ సైన్స్‌లో డిగ్రీ. పొలిటికల్ సైన్స్ లేదా జర్నలిజంలో పీజీ ఉన్నవారికి ప్రాధాన్యం ఉంటుంది.
- వయసు: 18 - 42 ఏళ్ల మధ్య ఉండాలి.
- దరఖాస్తుకు చివరి తేదీ: మార్చి 6, 2019.
- వెబ్‌సైట్: https://psc.ap.gov.in/

ట్రైనీ

ఖాళీలు 260

నేషనల్ సీడ్స్ కార్పొరేషన్ లిమిటెడ్ - న్యూఢిల్లీ, వివిధ విభాగాల్లో ఖాళీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. వివరాలు..

- విభాగాల వారీగా ఖాళీలు: డిప్యూటీ మేనేజర్ (విజిలెన్స్) - 1, అసిస్టెంట్ (లీగల్) గ్రేడ్ 1 - 4, మేనేజ్‌మెంట్ ట్రైనీ - 18, సీనియర్ ట్రైనీ - 85, డిప్లొమా ట్రైనీ (ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్) - 2, ట్రైనీ - 132, ట్రైనీ మేట్ (అగ్రికల్చర్) - 18.
- అర్హత: పోస్టులను బట్టి సంబంధిత విభాగంలో ఇంటర్, ఐటీఐ, ఇంజనీరింగ్, బీఎస్సీ, పీజీ, ప్రొఫెషనల్ డిగ్రి (లా), ఎంబీఏ ఉత్తీర్ణత. కంప్యూటర్ పరిజ్ఞానం, పని అనుభవం ఉండాలి.
- దరఖాస్తుకు చివరి తేదీ: ఫిబ్రవరి 9, 2019.
- వెబ్‌సైట్: www.indiaseeds.com


ఎగ్జిక్యూటివ్ ట్రైనీ

ఖాళీలు 207

భారత ప్రభుత్వ రంగ సంస్థ ఎన్‌టీపీసీ లిమిటెడ్ గేట్ - 2019 ద్వారా ఇంజనీరింగ్ ఎగ్జిక్యూటివ్ ట్రైనీ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. వివరాలు..

- విభాగాలు-ఖాళీలు: ఎలక్ట్రికల్ - 47, మెకానికల్ - 95, ఎలక్ట్రానిక్ ఇన్‌స్ట్రుమెంటేషన్ - 50, మైనింగ్ - 15.
- అర్హత: సంబంధిత విభాగాల్లో బీఈ / బీటెక్ / ఏఎంఐఈ.
- వయసు: 27 ఏళ్లు మించకూడదు (జనవరి 31, 2019 నాటికి).
- ఎంపిక: గేట్ స్కోరు - 2019, ఆన్‌లైన్ బిహేవియరల్ / ఆప్టిట్యూడ్ టెస్ట్, గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా.
- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా
- దరఖాస్తుకు చివరి తేదీ: జనవరి 31, 2019.
- వెబ్‌సైట్: https://www.ntpc.co.in

ఆంధ్రజ్యోతి
బిజినెస్
9 | విజయవాడ • సోమవారం 28 జనవరి 2019
andhrajyothibusiness@gmail.com



మెహుల్ చోక్సీని భారత్ పంపడం లేదు..

ఆంటిగ్వా అధికారి

న్యూఢిల్లీ: పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ)ను రూ.13,500 కోట్ల మేరకు ముంచిన కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న వజ్రాల వ్యాపారి మెహుల్ చోక్సీని భారత్‌కు పంపించడం లేదని ఆంటిగ్వా ప్రభుత్వ సీనియర్ అధికారి ఒకరు పేర్కొన్నారు. ప్రస్తుతం ఆయన ఆంటిగ్వా పౌరుడిగా ఉన్నారని తెలిపారు. మెహుల్ చోక్సీని భారత్‌కు తెచ్చేందుకు మన ప్రభుత్వం అధికారులను పంపిస్తున్నట్టు వార్తలు వస్తున్న నేపథ్యంలో ఆంటిగ్వా ప్రధాన మంత్రి గ్యాస్టన్ బ్రౌన్ కార్యాలయంలోని అధికారి లియోనెల్ హస్ట్ ఓ టీవీ చానల్ ఇంటర్వ్యూలో మాట్లాడారు.

పేటెంట్ ఔషధాల ధరలకు కళ్లెం వేయాల్సిందే..

తప్పనిసరి లైసెన్స్‌తో స్థానిక కంపెనీల్లో ఉత్పత్తి

ప్రభుత్వానికి ఉన్నతాధికార కమిటీ సిఫారసు



న్యూఢిల్లీ: కేన్సర్‌తో సహా అరుదైన వ్యాధుల చికిత్సతో ఉపయోగించే పేటెంట్ ఔషధాల ధరలకు సంబంధించి ప్రభుత్వం నియమించిన ఉన్నతాధికారుల కమిటీ కీలక సిఫారసులు చేసింది. బహుళ జాతి (ఎంఎన్‌సీ) కంపెనీలు ఎక్కువగా ఉత్పత్తి చేసే ఈ ఔషధాల ధరలకు కళ్లెం వేయడంతోపాటు, దేశీయంగా వీటిని ఉత్పత్తి చేసేందుకు స్థానిక కంపెనీలకు 'తప్పనిసరి లైసెన్స్'లు జారీ చేయాలని కోరింది. లేకపోతే ఈ వ్యాధులతో బాధపడే వారికి అందుబాటు ధరల్లో ఔషధాలు అందించడం కష్టమవుతుందని పేర్కొంది. గత సంవత్సరం మార్చిలోనే వివిధ మంత్రిత్వ శాఖలకు చెందిన జాయింట్ సెక్రటరీలతో కూడిన ఈ కమిటీ తన నివేదికను ప్రభుత్వానికి సమర్పించింది. మన దేశంలో ఈ ఔషధాల ధరలు నియంత్రించేందుకు కొనుగోలు శక్తి (పీపీపీ) ఆధారంగా పశ్చిమ దేశాల్లో అనుసరిస్తున్న విధానాన్ని అనుసరించాలని సూచించింది. ఆయా ఔషధాలకు ఏ దేశంలో తక్కువ ధర ఉంటే దాన్ని ప్రామాణికంగా తీసుకుని మన దేశంలోనూ వాటి ధరలను ఆ స్థాయిలో కట్టడి చేయాలని కోరింది. దేశంలో మార్కెట్ చేసే పేటెంట్ ఔషధాలను ఐదేళ్ల పాటు ఔషధ ధరల నియంత్రణ చట్టం నుంచి మినహాయిస్తూ ఈ నెల 3న కేంద్ర ఔషధాల శాఖ (డీఓపీ) ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వులు వెలువడిన కొద్ది రోజులకే ఈ కమిటీ నివేదిక విషయాలు బయటికి రావడం విశేషం.

ఇదీ చరిత్ర

బహుళ జాతి ఔషధ కంపెనీలు మేధో సంపత్తి హక్కుల(ఐపీఆర్) పేరుతో భారత్‌లో తమ పేటెంట్ ఔషధాల ధరలపై నియంత్రణను వ్యతిరేకిస్తున్నాయి. అలాగే మరో స్థానిక కంపెనీ జనరిక్ వెర్షన్‌లో ఆ ఔషధాలు ఉత్పత్తి చేసేందుకు 'తప్పనిసరి లైసెన్స్' జారీ చేయడాన్ని తీవ్రంగా ఆక్షేపిస్తున్నాయి. ఈ విషయంలో ప్రభుత్వం తమ మాట వినకపోతే భారత్‌లో ఆ ఔషధాల అమ్మకాలను ఆపేస్తామని హెచ్చరిస్తున్నాయి. అమెరికా, యూరోపియన్ కంపెనీలైతే ఇందుకోసం తమ ప్రభుత్వాల ద్వారానూ ఒత్తిడి తెస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఈ కమిటీ సిఫారసులను అమలు చేస్తుందా? లేదా? అనే సందేహాలు వ్యక్తం అవుతున్నాయి.

నియంత్రణ ఎందుకు?

ఏదైనా ఒక ఔషధానికి పేటెంట్ జారీ చేస్తే భారత పేటెంట్ చట్టం ప్రకారం ఆ పేటెంట్ 20 సంవత్సరాల పాటు చెల్లుబాటవుతుంది. ఈ కాలంలో మరే కంపెనీ ఆ ఔషధాన్ని ఉత్పత్తి చేసేందుకు చట్ట ప్రకారం అవకాశం ఉండదు. దీంతో ఆ ఔషధానికి కంపెనీ ఎంత ధర నిర్ణయిస్తే అంత ధర చెల్లించాల్సిందే. అయితే విస్తృత ప్రజా ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఏదైనా దేశీయ కంపెనీకి, పేటెంట్ ఔషధానికి జనరిక్ వెర్షన్‌ను తయారు చేసేందుకు 'తప్పనిసరి లైసెన్స్' జారీ చేయవచ్చు. ప్రపంచ వాణిజ్య సంస్థ(డబ్ల్యూటీవో) ట్రిప్స్ ఒప్పందం కూడా ఇందుకు వెసులుబాటు కల్పించింది. 2012లో నాట్కో ఫార్మాకు ఇలానే బేయర్ కంపెనీ ఉత్పత్తి చేసే 'సొరాఫినిబ్ టొసిలేట్' అనే క్యాన్సర్ ఔషధం జెనరిక్ వెర్షన్ తయారీకి లైసెన్స్ ఇచ్చింది. లివర్, కిడ్నీ కేన్సర్ల ట్రీట్‌మెంట్ కోసం వాడే ఈ ఔషధాన్ని అప్పట్లో బేయర్ కంపెనీ ఉత్పత్తి చేసి మార్కెట్ చేసేది. అందుకు కేన్సర్ రోగులు నెలకు రూ.2.8 లక్షల వరకు ఖర్చు పెట్టాల్సి వచ్చేది. నాట్కో ఫార్మా అదే మందును జనరిక్ వెర్షన్‌లో రూ.8,880కు తయారు చేసి సరఫరా చేసింది.

దూసుకుపోతాం

వ్యయ నియంత్రణ, లాభదాయకత పైనే ఫోకస్ : స్పైస్‌జెట్ అధినేత అజయ్ సింగ్

ఐదేళ్లలో 200 కొత్త విమానాలు



దావోస్: భారీ ఎత్తున విమానాల కొనుగోలు, రూట్ల విస్తరణ చేపట్టిన ప్రైవేటు విమానయాన దిగ్గజం స్పైస్‌జెట్ వ్యయనియంత్రణ ద్వారా లాభదాయకతపై దృష్టి కేంద్రీకరించనుంది. వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ వార్షిక సమావేశాలకు హాజరైన కంపెనీ అధిపతి అజయ్‌సింగ్ ఒక ఇంటర్వ్యూలో ఈ విషయం తెలిపారు. ప్రాంతీయ విమానయాన అనుసంధాన కార్యక్రమం ఉడాన్ కింద త్వరలో సీప్లేన్లు కూడా ప్రవేశపెట్టనున్నట్టు ఆయన చెప్పారు. పరిస్థితులన్నీ బాగున్నాయని, ఇటీవలికాలంలో తాము ఎన్నో కొత్త విమానాలు కొనుగోలు చేశామని ఆయన తెలిపారు. ఇటీవలే తాము ప్రారంభించిన కార్గో విమాన సర్వీసులు కూడా అద్భుతమైన పనితీరు కనబరుస్తున్నాయని ఆయన చెప్పారు. త్వరలోనే మరిన్ని కొత్త విమానాలు కూడా తమ నెట్‌వర్క్‌కు జత చేస్తామని, లాభదాయకంగా నిలిచేందుకు వ్యయ నియంత్రణపై ఎక్కువగా దృష్టిపెడుతూ వృద్ధిపథంలో దూసుకుపోవడం తమ వ్యూహమని అజయ్‌సింగ్ అన్నారు. తాము లాభదాయకత లక్ష్యాన్ని చేరగలమనే విశ్వాసం తనకున్నదని ఆయన చెప్పారు. 200 విమానాలకు ఇప్పటికే ఆర్డర్లు ఇచ్చామంటూ అవన్నీ 2024 నాటికి తమకు చేరగలవని, వాటిలో 10 విమానాలు డిసెంబరునాటికి వస్తాయని ఆయన తెలిపారు. ఇవి కాకుండా 50 చిన్న ప్రొపెల్లర్ విమానాలకు కూడా ఆర్డర్లు జారీ చేశామని, వాటిలో 27 ఇప్పటికే తమకు చేరాయని, మరిన్ని విమానాలు త్వరలో రాబోతున్నాయని ఆయన చెప్పారు.

ఎటిటికి తొలి భారత అధ్యక్షుడు

2015 సంవత్సరంలో స్పైస్‌జెట్ సారథ్య బాధ్యతలు మరోసారి చేపట్టిన ఆయన సారథ్యంలో వరుసగా 14 త్రైమాసికాలు కంపెనీ లాభాలు ప్రకటించింది. ఇటీవలే ముగిసిన డబ్ల్యుఇఎఫ్ సదస్సులో అజయ్‌సింగ్ ఏవియేషన్, ట్రావెల్, టూరిజం గవర్నర్ల సమావేశానికి అధ్యక్ష బాధ్యతలు నిర్వర్తించారు. ఎటిటి గవర్నర్ల బోర్డుకు సారథ్య బాధ్యతలు వహించిన తొలి భారతీయుడు ఆయన.

కొత్త టెక్నాలజీల అండ

స్పైస్‌జెట్ వరుసగా 14 లేదా 15 త్రైమాసికాలు తాము లాభాలు ప్రకటించామని, కేవలం రెండు, మూడు నెలల నుంచే ఆయిల్ ధరల పెరుగుదల వల్ల కొంచెం కష్టంగా ఉన్నదని అజయ్‌సింగ్ తెలిపారు. దాన్ని అధిగమించేందుకు కొత్త టెక్నాలజీలు అనుసరిస్తున్నామని ఆయన చెప్పారు. రాబోయే కొత్త విమానాలన్నీ అత్యధిక ఇంధన సామర్థ్యం గలవని, అవి 15 నుంచి 20 శాతం మేరకు ఇంధనం ఆదా చేస్తాయన్నారు. కొత్త విమానాలన్నీ ఇలాంటివే కావడం వల్ల మా వంటి విమానయాన సంస్థలన్నీ లాభదాయకత సాధించడం ఖాయమని ఆయన నమ్మకంగా చెప్పారు.

సీప్లేన్ల మీద ఆశలు

త్వరలో సీప్లేన్లు ప్రారంభించే ప్రణాళికలు సిద్ధం చేశామని అజయ్‌సింగ్ తెలిపారు. రెండు అంశాల కోసం తాము ఎదురు చూస్తున్నామని ప్రభుత్వం నుంచి ఆ రంగానికి చెందిన నిబంధనల జారీ ఒకటని, ఉడాన్ రూట్ల అనుమతి మరొకటన్నారు. ఉడాన్ స్కీమ్ కింద తాము కొన్ని సీప్లేన్ల రూట్లకు కూడా బిడ్ చేసినట్టు చెబుతూ ఆ రూట్లు కూడా సాధించగలిగితే త్వరలోనే సీప్లేన్లు ప్రారంభిస్తామని ఆయన తెలిపారు.

ప్రభుత్వరంగ సాధారణ బీమా కంపెనీలకు రూ.4,000 కోట్లు

న్యూఢిల్లీ: ప్రభుత్వరంగంలోని సాధారణ బీమా కంపెనీలకు వచ్చే బడ్జెట్‌లో నిధుల కేటాయింపు జరిగే అవకాశం ఉందని తెలుస్తోంది. రూ.4,000 కోట్ల మూలధనం అందించేందుకుగాను కేటాయింపులు జరగవచ్చని, ఈ నిధులతో ఆయా కంపెనీల మూలధనం పెరుగుతుందని భావిస్తున్నారు. 2019-20 సంవత్సరానికి సంబంధించిన మధ్యంతర బడ్జెట్‌ను ఫిబ్రవరి ఒకటో తేదీన ప్రవేశపెట్టనున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వరంగంలోని నేషనల్ ఇన్సూరెన్స్ కంపెనీ, ఓరియెంటల్ ఇన్సూరెన్స్ కంపెనీ, యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీలకు రూ.4,000 కోట్ల మూలధనం అందించాలని ఆర్థిక సర్వీసుల శాఖ కోరినట్టు ఈ వ్యవహారంతో సంబంధం ఉన్నవర్గాలు తెలిపాయి. బడ్జెట్‌లో కేటాయింపులను బట్టి కంపెనీలకు మూలధనం అందించనున్నారు. ఈ కంపెనీలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు మూలధనం అందించాలని భావిస్తున్నారు. అండర్‌రైటింగ్ నష్టాలు, అధిక క్లెయిమ్‌ల కారణంగా ప్రభుత్వరంగ బీమా కంపెనీలపై ఒత్తిడి పెరుగుతోంది. ఇదిలా ఉంటే.. గత బడ్జెట్‌లోనే నేషనల్ ఇన్సూరెన్స్ కంపెనీ, ఓరియెంటల్ ఇన్సూరెన్స్ కంపెనీ, యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీలను విలీనం చేయాలన్న ప్రతిపాదన వెలువడింది. వీటి విలీనం ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో పూర్తయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది. 2017 మార్చి 31 వరకు ఈ మూడూ కంపెనీల బీమా ఉత్పత్తుల సంఖ్య 200కు పైగా ఉంది. వీటి మొత్తం ప్రీమియం రూ.41,461 కోట్లు ఉండగా.. మార్కెట్ వాటా 35 శాతంగా ఉంది. ఈ కంపెనీల ఉమ్మడి నికర విలువ రూ.9,243 కోట్లు ఉండగా.. ఉద్యోగుల సంఖ్య 44,000, కార్యాలయాల సంఖ్య 6,000 వరకు ఉంది.



మీడియా, వినోదానికి ఇంటర్నెట్ దన్ను

2022 నాటికి రూ.3.73 లక్షల కోట్ల టర్నోవర్ : అసోచామ్-పీడబ్ల్యూసీ నివేదిక

న్యూఢిల్లీ: దేశంలో మీడియా, వినోద పరిశ్రమకు ఇంటర్నెట్ మరింత ఊతంకానుంది. ప్రస్తుతం (2017నాటికి) ఈ పరిశ్రమ వార్షిక టర్నోవర్ సుమారు రూ.2.15 లక్షల కోట్లు. 2022 నాటికి ఇది 11.7 శాతం వార్షిక వృద్ధి రేటుతో రూ.3.73 లక్షల కోట్లకు చేరనుంది. సంప్రదాయ సినిమా, టీవీ వంటి మీడియాతో పాటు కొత్త తరానికి చెందిన ఓవర్ ది టాప్ (ఓటీటీ) వంటి డిజిటల్ మీడియా వాటా ఇందులో 46 శాతం వరకు ఉంటుందని అసోచామ్-పీడబ్ల్యూసీ సంస్థలు సంయుక్తంగా నిర్వహించిన ఒక అధ్యయన నివేదిక పేర్కొంది. పెరుగుతున్న జనాభా, కాంటెంట్ వినియోగంతోపాటు పెరుగుతున్న ప్రజల ఆదాయాలు ఇందుకు దోహదం చేయనున్నాయి.

ఓటీటీ సేవలకు పెరుగుతున్న డిమాండ్

ప్రస్తుతం ఓటీటీ సంప్రదాయ మీడియా పరిశ్రమను కుదిపేస్తోంది. గత ఏడాది రూ.1,932 కోట్లున్న ఓటీటీ మార్కెట్, 2022 నాటికి రూ.5,363 కోట్లకు చేరుతుందని అసోచామ్-పీడబ్ల్యూసీ నివేదిక పేర్కొంది. అప్పటికి ప్రపంచంలోని పది అగ్రశ్రేణి వీడియో ఓటీటీ మార్కెట్లలో భారత ఓటీటీ మార్కెట్ ఒకటి కానుంది. ఓటీటీ మార్కెట్‌ను మరింత ముందుకు తీసుకు వెళ్లేందుకు ఈ సేవలు ప్రారంభించిన నెట్‌ఫ్లిక్స్, అమెజాన్ కంపెనీలు, కంటెంట్ కోసం సంప్రదాయ స్టూడియోల స్థాయిలో ఖర్చు చేస్తున్న విషయాన్ని గుర్తు చేసింది. 2017-2022 మధ్య కాలంలో అంతర్జాతీయ ఓటీటీ మార్కెట్ వార్షిక వృద్ధి రేటు 10.1 శాతం ఉంటే, భారత ఓటీటీ మార్కెట్ వృద్ధి రేటు మాత్రం 22.6 శాతం వరకు ఉంటుందని ఈ అధ్యయనం పేర్కొంది.

స్మార్ట్‌ఫోనే ఊతం

పెరుగుతున్న స్మార్ట్‌ఫోన్ల వినియోగం కూడా దేశంలో ఓటీటీ డిమాండ్‌ను మరింత పెంచుతుందని ఈ అధ్యయనం పేర్కొంది. ప్రస్తుతం దేశంలో వినియోగంలో ఉన్న మొబైల్ ఫోన్లలో 40 శాతంగా ఉన్న స్మార్ట్‌ఫోన్ల సంఖ్య 2022నాటికి మరింత పెరగనుంది. దీనికి తోడు చార్జీలు తగ్గడంతో సమాచార (డేటా) వినియోగమూ భారీగా పెరుగుతోంది. ఇవన్నీ దేశంలో ఓటీటీ సేవలను మరింత విస్తృతం చేయనున్నాయి. ఇంటర్నెట్ అడ్వర్‌టైజ్‌మెంట్‌లోనూ మొబైల్ వీడియో అడ్వర్‌టైజ్‌మెంట్ వేగంగా పెరుగుతోంది. ఏటా 32.8 శాతం వార్షిక వృద్ధి రేటుతో 2022నాటికి ఈ మార్కెట్ రూ.2,064 కోట్లకు చేరుకుంటుందని అంచనా.

అధ్యయనంలోని ప్రధాన అంశాలు

- 2022నాటికి 1.09 కోట్ల ఎంబీపీఎస్‌కు చేరనున్న డేటా వినియోగం
- 2021 నాటికి భారత్‌లో మీడియా, వినోదంపై సగటు ఖర్చు 32 డాలర్లు
- ఇదే సమయంలో చైనాలో 222 డాలర్లు, అమెరికాలో 2,260 డాలర్ల ఖర్చు

నిత్యాంక్ ఇన్‌ఫ్రాతో సంబంధం లేదు

జీ ఎంటర్‌టైన్‌మెంట్, డిష్ టీవీ వెల్లడి

న్యూఢిల్లీ: నిత్యాంక్ ఇన్‌ఫ్రాపవర్ అండ్ మల్టీవెంచర్స్ లిమిటెడ్‌తో తమకెలాంటి సంబంధం లేదని సుభాష్ చంద్ర సారథ్యంలోని ఎస్సెల్ గ్రూప్‌నకు చెందిన రెండు కంపెనీలు..జీ ఎంటర్‌టైన్‌మెంట్ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్ (జెడ్‌ఈఈఎల్), డిష్ టీవీ ప్రకటించాయి. 2016లో పెద్ద నోట్ల రద్దు సమయంలో ఈ రెండు సంస్థల్లోకి నిత్యాంక్ ఇన్‌ఫ్రా నుంచి వచ్చిన అనుమానస్పద డిపాజిట్లపై సీరియస్ ఫ్రాడ్ ఇన్వెస్టిగేటివ్ ఆఫీస్ (ఎస్ఎఫ్ఐఓ) దర్యాప్తు చేపట్టినట్లు వార్తలు వచ్చాయి. నిత్యాంక్ ఇన్‌ఫ్రాపవర్.. ఒక ఇండిపెండెంట్ కంపెనీ అని ఇది ఎస్సెల్ గ్రూప్‌నకు చెందిన సంస్థ కాదని జెడ్‌ఈఈఎల్.. ఆదివారం నాడు రెగ్యులేటరీ ఫైలింగ్‌లో తెలిపింది. నిత్యాంక్‌పై ఎస్ఎఫ్ఐఓ చేపట్టిన దర్యాప్తులో ఎస్సెల్ గ్రూప్ సంస్థలకు సంబంధం ఉందంటూ వచ్చిన వార్తలన్నీ పూర్తిగా నిరాధారమైనవని స్పష్టం చేసింది. ఈ అసత్య ఆరోపణలపై న్యాయపరంగా చర్యలు తీసుకునేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిపింది. పెద్ద నోట్ల రద్దు సమయంలో గ్రూప్ సంస్థల్లో భారీగా అక్రమంగా నగదు (మనీ లాండరింగ్) లావాదేవీలు జరిగినట్లు ఆన్‌లైన్ వెబ్‌సైట్ 'ది వైర్' కథనం ప్రకటించిందని, ఈ వార్తతో జెడ్‌ఈఈఎల్‌కు ఎలాంటి సంబంధం లేదని తెలిపింది. నోట్ల రద్దు సమయంలో ఎస్సెల్ గ్రూప్ కంపెనీలు చేపట్టిన లావాదేవీల వివరాలను అందించాలని ఎస్ఎఫ్ఐఓ కోరగా తమ వద్ద ఉన్న సమాచారాన్ని అందజేసినట్లు పేర్కొంది. మరోవైపు వీడియోకాన్ డీ2హెచ్ విలీన స్కీమ్‌లో నిత్యాంక్‌తో ఎలాంటి లావాదేవీలను చేపట్టలేదని డిష్ టీవీ ప్రకటించింది. ఇందుకు సంబంధించిన వివరాలు సమర్పించాలని 2018 జూలైలో ఎస్ఎఫ్ఐఓ కోరిందని, దీంతో సమాచారమంతా అందజేసినట్లు తెలిపింది. ఈ డీల్‌లో నిత్యాంక్‌కు ఎలాంటి సంబంధం లేదని, ఆ సంస్థతో ఎలాంటి లావాదేవీలను చేపట్టలేదని డిష్ టీవీ తెలిపింది.

10650 దిగువన బేరిష్

(జనవరి 28-ఫిబ్రవరి 1 తేదీల మధ్య వారానికి)



డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

ఆస్ట్రో గైడ్

గత వారం నిఫ్టీ : 10781 (-126)

నిఫ్టీ గత వారం 10987-10756 పాయింట్ల మధ్యన కదలాడి 126 పాయింట్ల నష్టంతో 10781 వద్ద పాజిటివ్‌గా ముగిసింది. కుంభ-మీన రాశుల సంచార సమయంలో ఏర్పడిన పరిధి 10692-10870. ఇందులో గరిష్ఠ స్థాయిని దాటి 10987 వరకు వెళ్లింది.

- 20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 10834, 10780, 10786, 10837 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి.
- ప్రస్తుతం నిఫ్టీ ఇప్పుడు ఒక్క 50 డీఎంఏ కన్నా స్వల్పంగా పైన ఉంది. 50 డీఎంఏ 200 డీఎంఏ కన్నా దిగువకు (డెత్ క్రాస్) రావడం దీర్ఘకాలిక ట్రెండ్ బేరిష్ అయిందనేందుకు సంకేతం.
- స్వల్పకాలిక, మధ్యకాలిక ట్రెండ్ తటస్థంగా మారాయి. దీర్ఘకాలిక ట్రెండ్ బేరిష్‌గా ఉంది. ఈ వారాంతంలో 10900పైన ముగిస్తే స్వల్పకాలిక ట్రెండ్ బుల్లిష్ అవుతుంది.

బ్రేకౌట్ స్థాయి : 10900
బ్రేక్‌డౌన్ స్థాయి : 10625
నిరోధ స్థాయిలు: 10925, 11000 (10850 పైన బుల్లిష్)
మద్దతు స్థాయిలు: 10625, 10550 (10700 దిగువన బేరిష్)

ఇన్వెస్టర్లకు సూచన

వారం ప్రారంభ స్థాయి అత్యంత కీలకం. ఇండెక్స్ గత వారం ప్రారంభ స్థాయి కన్నా పైన ట్రేడవుతూ ఉంటే లాంగ్ పొజిషన్లను పరిశీలించవచ్చు.

గ్రహగతులివే..

- తులలోని స్వాతి పాదం 4 నుంచి ధనుస్సులోని మూల పాదం 4 మధ్యలో చంద్ర సంచారం
- మకరంలోని శ్రవణం పాదం 2-3 మధ్యలో రవి సంచారం
- మకరంలోని శ్రవణం పాదం 2-3 మధ్యలో బుధ సంచారం
- వృశ్చికంలోని జ్యేష్ఠ పాదం 4 నుంచి ధనుస్సులోని మూల పాదం 1 మధ్యలో శుక్ర సంచారం
- మీనంలోని రేవతి పాదం 3-4 మధ్యలో కుజ సంచారం
- ధనుస్సులోని పూర్వాషాఢ పాదం 3లో తుల నవాంశలో శని సంచారం
- వృశ్చికంలోని జ్యేష్ఠ పాదం 2లో మకర నవాంశలో బృహస్పతి సంచారం
- కర్కాటకంలోని పునర్వసు పాదం 4లో రాహువు, మకరంలోని ఉత్తరాషాఢ పాదం 2లో కేతువు సంచారం

సాధారణ నిస్తేజం (సోమవారానికి)

తిథి : పుష్య బహుళ అష్టమి
నక్షత్రం: స్వాతి; ఆశ్లేష, జ్యేష్ఠ, రేవతి నక్షత్ర జాతకులు, వృశ్చిక, మీన రాశులవారు అప్రమత్తంగా ఉండాలి.

ట్రెండ్ మార్పు వేళలు : 2.26; 3.16

ధోరణి: నిఫ్టీ ఫ్యూచర్స్ నిలకడగా ప్రారంభమై 10.25 నుంచి 12.25 మధ్యలో నిస్తేజంగా ట్రేడ్ కావచ్చు. ఆ తర్వాత 2.20 వరకు మెరుగ్గా ట్రేడవుతూ తదుపరి చివరి వరకు మరోసారి నిస్తేజంగా మారే ఆస్కారం ఉంది.

ట్రేడింగ్ వ్యూహం: నిఫ్టీ ఫ్యూచర్స్ 10.30 సమయానికి ప్రారంభ స్థాయి/సగటు (ఎటిపి)కన్నా దిగువన ట్రేడవుతుంటే తగు స్టాప్‌లాస్‌తో షార్ట్ పొజిషన్లు తీసుకుని 12.15 సమయానికి క్లోజ్ చేసుకోవాలి. 12.30 తర్వాత ఎటిపి కన్నా పైకి వస్తే లాంగ్ పొజిషన్లు తీసుకుని 2.15 సమయానికి క్లోజ్ చేసుకోవాలి. తిరిగి ఎటిపి కన్నా దిగువకు వస్తే షార్ట్ పొజిషన్లు తీసుకుని ముగింపు సమయంలో క్లోజ్ చేసుకోవచ్చు.

నిరోధం : 10820, 10855
మద్దతు స్థాయిలు : 10740, 10705


గమనిక: ఇది పూర్తిగా ఆస్ట్రోటెక్నికల్ అంశాల ఆధారంగా ఇచ్చిన సూచన. మార్కెట్ వాస్తవిక కదలికల ఆధారంగా నిర్ణయాలు తీసుకోవాలి.

AUROBINDO
Committed to healthier life!

యూఎస్ మార్కెట్ నుంచి రక్తపోటు ఔషధం రీకాల్

న్యూఢిల్లీ : అమెరికా మార్కెట్ నుంచి 5 లక్షల రక్తపోటును తగ్గించే ఔషధ బాటిళ్లను వెనక్కు తీసుకున్నట్లు అరబిందో ఫార్మా వెల్లడించింది. కరెంట్ గుడ్ మాన్యుఫ్యాక్చరింగ్ ప్రాక్టీస్ (సీజీఎంపీ) నిబంధనలకు అనుగుణంగా ఈ ఔషధాలు లేనట్లు అమెరికా ఔషధ నియంత్రణ మండలి (యూఎస్ఎఫ్‌డీఏ) గుర్తించటంతో ఈ ఔషధ బాటిళ్లను వెనక్కు తీసుకున్నట్లు తెలిపింది. ఆమ్లోడిపైన్, వలసార్టన్ టాబ్లెట్లతో కూడిన 1,62,301 బాటిళ్లు, వలసార్టన్, హైడ్రోక్లోరోథియాజైడ్ టాబ్లెట్లతో కూడిన 3,12,095 బాటిళ్లు, వలసార్టన్ టాబ్లెట్లతో కూడిన 20,604 బాటిళ్లను రీకాల్ చేసినట్లు తెలిపింది.

రిటైల్ (ఒక గుడ్డు) ధర రూ. 4.60		నెక్ (100 గుడ్లు)	
హైదరాబాద్	402	చిత్తూరు	423
వరంగల్	404	చెన్నై	430
విజయవాడ	408	నమక్కల్	420
గోదావరి	408	బెంగళూరు	425
విశాఖపట్నం	410	ముంబై	457



ఫామ్‌గేట్ ధర (కిలో) రూ.		వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్	
హైదరాబాద్	83	విజయవాడ	84
కరీంనగర్	84	గుంటూరు	85
వరంగల్	83	ఒంగోలు	86
మహబూబ్‌నగర్	83	చిత్తూరు	88
కర్నూలు	83	నెల్లూరు	88
విశాఖపట్నం	81	అనంతపురం	80
గోదావరి	82		



పరిధి పరిమితమే



వి సుందర్ రాజా

టెక్ వ్యూ



నిఫ్టీ గత వారం మానసిక అవధి 11000 వరకు వెళ్లి రియాక్షన్‌లో పడింది. నాలుగు రోజుల కరెక్షన్ ధోరణి అనంతరం చివరికి వారం కనిష్ఠ స్థాయిలో క్లోజయింది. కీలక నిరోధం 11000 వద్ద నిలదొక్కుకోలేకపోవడం తక్షణ బుల్లిష్ ధోరణికి అవకాశాలు లేవనేందుకు సంకేతం. వీక్లీ చార్టుల్లో కూడా దిగువకు రివర్సల్ బార్ పాటర్న్ ఏర్పడడం ఈ వారానికి మరింత అప్రమత్త ధోరణిని సూచిస్తోంది. కాని ప్రధాన మద్దతు స్థాయిల కన్నా పైనే ఉన్నందు వల్ల ప్రధాన ధోరణి ఇప్పటికీ ఎగువకే ఉంది.

గత నాలుగు నెలలుగా మార్కెట్ పరిధి పరిమితంగానే ఉంది. గరిష్ఠ స్థాయిల్లో రియాక్షన్ ఏర్పడుతున్నా దిగువన కీలక స్థాయిల్లో మద్దతు కూడా పొందుతోంది. కాని సంస్థాగత కొనుగోళ్లు బ్రేకౌట్ ఏర్పడడానికి కావలసినంత బలంగా లేవు. బ్రేక్‌డౌన్ ఏర్పడేంత బలంగా అమ్మకాలూ లేవు.

బుల్లిష్ స్థాయిలు : అంతర్జాతీయ సంకేతాల మద్దతుతో పాజిటివ్ ధోరణిలో పడితే మరింత అప్‌ట్రెండ్ కోసం ప్రధాన నిరోధం 10850కన్నా పైన బలంగా క్లోజ్ కావాలి. గత గురువారం ఏర్పడిన మైనర్ టాప్ ఇదే. స్వల్పకాలిక టార్గెట్ 11000. గత కొద్ది నెలల్లో ఈ స్థాయిలో ఐదు మేజర్ టాప్‌లు ఏర్పడ్డాయి.

బేరిష్ స్థాయిలు: మద్దతు స్థాయి 10700 వద్ద విఫలమైతే స్వల్పకాలిక కరెక్షన్ మరింతగా కొనసాగుతుంది. ప్రధాన స్వల్పకాలిక మద్దతు స్థాయి 10500.

బ్యాంక్ నిఫ్టీ : ఈ సూచీ వారం కనిష్ఠ స్థాయిలో ముగిసింది. స్వల్పకాలిక మద్దతు స్థాయి 27000 కన్నా స్వల్పంగా పైన ఉంది. అంతకన్నా దిగజారితే స్వల్పకాలిక కరెక్షన్‌లో పడుతుంది. ప్రధాన మద్దతు స్థాయి 26400. ఇదే డిసెంబరు 26వ తేదీన ఏర్పడిన ప్రధాన బాటమ్. ఎగువన ప్రధాన నిరోధం, గత శుక్రవారం ఏర్పడిన గరిష్ఠ స్థాయి 27500. మరో ప్రధాన నిరోధం 27800.

స్వల్పకాలిక వ్యూహం : స్వల్పకాలిక ఇన్వెస్టర్లు తగు స్టాప్‌లాస్‌తో ఎంపిక చేసిన షేర్లు మాత్రం హోల్డ్ చేయవచ్చు. బుల్లిష్ ట్రెండ్ ఏర్పడే వరకు కొనుగోళ్ల జోలికి వెళ్లకపోవడమే మంచిది.

పాటర్న్ : నిఫ్టీకి 11000 వద్ద "ట్రిపుల్ టాప్" ఏర్పడింది. మరింత అప్‌ట్రెండ్ కోసం దీన్ని బ్రేక్ చేయాలి. ప్రస్తుతం మార్కెట్ "ఏటవాలుగా ఎగువకు కనిపిస్తున్న సపోర్ట్ ట్రెండ్‌లైన్" వద్ద ఉంది. 50, 100 డీఎంఏల వద్ద పరీక్ష ఎదుర్కొంటోంది. 10700 వద్ద "అడ్డంగా కనిపిస్తున్న సపోర్ట్ ట్రెండ్‌లైన్" కన్నా దిగువకు వస్తే స్వల్పకాలిక కరెక్షన్‌లో పడుతుంది.

టైమ్ : ఈ సూచీ ప్రకారం మంగళవారంనాడు తదుపరి రివర్సల్ ఉంది. వీక్లీ చార్టుల ప్రకారం గత వారంలో టాప్ కనిపిస్తున్నందు వల్ల కన్సాలిడేషన్ లేదా కరెక్షన్‌కు ఆస్కారం ఉంది.

సోమవారం స్థాయిలివే...

నిరోధం : 10850, 10910
మద్దతు : 10800, 10750

అజంతా ఫార్మా (రూ.1126)- అమ్మకపు స్థాయిలకు చేరువలో..

రూ.1120 దిగువన డౌన్‌ట్రెండ్	మొదటి మద్దతు రూ.1080	రెండో మద్దతు రూ.1050
రూ.1140 ఎగువన అప్‌ట్రెండ్	మొదటి నిరోధం రూ.1170	రెండో నిరోధం రూ.1200

వాసిరాజు సుందర్ రాజా
www.sundartrends.in

రుణానికి కొత్త మార్గం క్రెడిట్ లైన్



ప్రస్తుతం మన ఆర్థిక అవసరాలు తీర్చే పలు కంపెనీలు, ఆర్థిక సంస్థలు అనేకం అందుబాటులోకి వస్తున్నాయి. వాటిలో వ్యక్తిగత రుణాలందించే కంపెనీలతో పాటుగా క్రెడిట్ లైన్ అందించే కంపెనీలు కూడా ఉన్నాయి. వాటిలో క్రెడిట్ లైన్‌కు ఇప్పుడు ప్రాచుర్యం పెరుగుతోంది. అసలు క్రెడిట్ లైన్ అంటే ఏమిటి, దాని వల్ల ప్రయోజనం ఏమిటి వివరిస్తున్నారు మనీట్యాప్ సహ వ్యవస్థాపకుడు, సీఓఓ అనుజ్ కాకర్.

మన స్వల్ప, దీర్ఘకాలిక ఆర్థిక అవసరాలు తీర్చేందుకు ఎన్నో కంపెనీలు, సాధనాలు ఉన్నాయి. వాటిలో వ్యక్తిగత రుణం ఒకటైతే క్రెడిట్ లైన్ మరొకటి. వ్యక్తిగత రుణమే పర్సనల్ లోన్. క్రెడిట్ లైన్ సుమారుగా క్రెడిట్ కార్డు మాదిరిగానే పని చేస్తుంది. అయితే క్రెడిట్ కార్డులో మంజూరైన సొమ్ము అంతా కార్డులో ఉంటే క్రెడిట్ లైన్‌లో నగదుగానే చేతిలో ఉంటుంది. ఒకసారి కొంత మొత్తంలో రుణం మంజూరైతే దాన్ని ఏకమొత్తంగా తీసుకోవచ్చు/అవసరానికి ఎంత కావాలంటే అంత తీసుకునే స్వేచ్ఛ రుణగ్రహీతకే ఉంటుంది. తిరిగి చెల్లింపు విషయంలోనూ దీనికి వెసులుబాటు ఉంటుంది. కష్టమర్లు తమకు అనుకూలమైన పేమెంట్ షెడ్యూల్‌ను ఎంచుకోవచ్చు. ఎంత మొత్తం ఉపయోగించుకుంటే అంత మాత్రమే వడ్డీ చెల్లించాల్సి ఉంటుంది. పర్సనల్ రుణంతో పోల్చితే వడ్డీ భారం తక్కువ ఉంటుంది. ఇఎంఐలు చెల్లించిన కొద్దీ ఖాతాలో అందుబాటులో ఉండే సొమ్ము ఆ మేరకు పెరుగుతుంది.



షరతులేవీ ఉండవు

ఒకసారి క్రెడిట్‌లైన్ నిర్ణయం అయితే అది ఎంతకాలంపాటు ఉంచుకోవచ్చు అనేందుకు ఎలాంటి షరతు ఉండదు. వినియోగించుకోని సొమ్ముపై వడ్డీ చెల్లించాల్సిన అవసరం లేకుండానే ఎంత కాలంపాటైనా దాన్ని కొనసాగించుకోవచ్చు. అలాగే ఒక సారి క్రెడిట్ లైన్ మంజూరైతే భవిష్యత్తులో తీసుకునే క్రెడిట్ లైన్‌కు ప్రాసెసింగ్ ప్రక్రియ ఏమీ ఉండదు. ఇంటి మెరుగులకు, ఓవర్ డ్రాఫ్ట్ రక్షణ, ఆరోగ్య ఎమర్జెన్సీలు, ఆకస్మికంగా ఎదురయ్యే ఖర్చులు, సాధారణ ఆదాయానికి మద్దతుగా వినియోగించుకునేందుకు క్రెడిట్ లైన్ పొందవచ్చు. అలాగే దీర్ఘకాలికంగా ఎదురుచూస్తున్న విడిది ప్రదేశాల్లో పర్యటించేందుకు, పెట్టుబడులు/పండగ సీజన్‌లో షాపింగ్ అవసరాలకు క్రెడిట్ లైన్ ఉపయోగించుకోవచ్చు.

ఆర్థిక క్రమశిక్షణ చాలా అవసరం

పర్సనల్ లోన్, లైన్ ఆఫ్ క్రెడిట్ రెండింటిలో దేనికైనా మౌలిక ఆర్థిక క్రమశిక్షణ పాటించడం అత్యంత అవసరం. ప్రప్రథమంగా వడ్డీ క్రమం తప్పకుండా చెల్లించేయాలి. దరఖాస్తు చేసుకునే ముందే తమ స్వల్పకాలిక, దీర్ఘకాలిక లక్ష్యాలకు అనుగుణంగా తమ అవసరాలేమిటో ఒక అంచనాకు వచ్చి అంత మొత్తానికి దరఖాస్తు చేయడం మంచిది. సాధారణంగా ఇక్కడే చాలా మంది తప్పటడుగు వేస్తారు. హడావుడిగా దరఖాస్తు చేసేస్తారు. కానీ ఆ తర్వాతే అది స్వల్పకాలిక అవసరం అని గుర్తిస్తారు.

కానీ అప్పటికే రుణానికి దరఖాస్తు చేసి ఉండడం వల్ల లేదా రుణం తీసుకుని ఉండడం వల్ల వారిపై దీర్ఘకాలిక భారం పడుతుంది. ఒకవేళ అవసరం తీరిందనుకుని ఆ సొమ్ము ఏకమొత్తంలో తిరిగి చెల్లిస్తే ముందస్తు చెల్లింపు జరిమానాల భారం భరించక తప్పదు.

పర్సనల్ లోన్

నిర్దిష్ట కాలపరిమితికి నిర్దేశిత వడ్డీ రేటుతో ఏక మొత్తంలో సొమ్ము అందించే సాధనం ఇది. స్వల్పకాలిక రుణాలు తీర్చి వడ్డీల భారం తగ్గించుకునేందుకు, కొన్ని రకాల కొనుగోళ్లు, వ్యయాలకు అవసరం అయిన సొమ్ము సమకూర్చుకునేందుకు, ఇంట్లో ప్రధాన వేడుకల వ్యయాలు భరించేందుకు, విద్యారుణాల చెల్లింపునకు మనం పర్సనల్ లోన్ తీసుకుంటూ ఉంటాం. పర్సనల్ లోన్ కనిపించడానికి ఎంతో అనుకూలం అనిపించినా దానితో ముడిపడి ఉన్న ఇబ్బందులు కూడా ఉన్నాయి. అది మనకి అర్హత ఎంత ఉంటే అంత సొమ్ము ఏక మొత్తంలోనే అందిస్తారు. దానికి వడ్డీరేటు కూడా సాధారణ రుణాల కన్నా చాలా ఎక్కువగా ఉంటుంది. మొదటి నుంచి చివరి వరకు కూడా వడ్డీరేటు ఒకేలా ఉంటుంది. తిరిగి చెల్లించే షెడ్యూల్ పరిమితంగానే ఉంటుంది. ఇఎంఐ ఒక్క నెల సరిగ్గా చెల్లించకపోయినా రుణం తీసుకున్న వ్యక్తి క్రెడిట్ స్కోర్‌పై ప్రభావం పడుతుంది. పర్సనల్ లోన్ ఆమోదించే ప్రక్రియ సుదీర్ఘంగా ఉంటుంది. మొత్తం రుణం చెల్లించి తాజాగా రుణం తీసుకోవాలంటే మళ్లీ దరఖాస్తు చేయాల్సిందే. రుణం చెల్లింపులో క్రమశిక్షణ పాటించి నిర్ణయించిన గడువులోగానే ఇఎంఐలన్నీ చెల్లించిన వారికి ఎలాంటి మినహాయింపులు లేదా ప్రోత్సాహకాలు ఉండవు. ప్రతీ దరఖాస్తు సమయంలోనూ చోటు చేసుకునే జాప్యం అత్యవసర సమయాల్లో ఇబ్బందికరంగా మారవచ్చు.

2017-18 రిటర్నుల్లో ఏవైనా పొరపాట్లు చేసి ఉంటే ?



రాంబాబు గొండాల

వస్తు సేవల పన్ను (జీఎస్‌టీ) 2017, జూలై 1, నుంచి అమల్లోకి వచ్చింది. అప్పటి నుంచి ఆ ఆర్థిక సంవత్సరం ముగింపు నాటికి అంటే 2018 మార్చి 31నాటికి చాలా మంది పన్ను చెల్లింపుదారులు తెలిసోతెలియకో అనేక పొరపాట్లు చేశారు. కొత్త పన్ను వ్యవస్థ గురించి అవగాహన లేకపోవటం ఒక కారణమైతే, మొదట్లో ఎదురైన సాంకేతిక ఇబ్బందులు మరొక కారణం. చాలా మంది చేసిన పొరపాట్లు ఏమిటంటే..

- కొనుగోళ్లకు సంబంధించిన ఇన్వాయిస్ మీద క్రెడిట్ తీసుకోకపోవటం
- మీరు లేదా మీ సరఫరాదారుడు జీఎస్‌టీఆర్ -1 రిటర్నులో సరైన వివరాలు నింపకపోవటం
- ఇన్వాయిస్‌లకు తీసుకున్న క్రెడిట్‌కి పొంతన లేకపోవటం
- జారీ చేసిన ఇన్వాయిస్‌లకు జీఎస్‌టీఆర్-1లో చూపిన ఇన్వాయిస్‌లకు మధ్య తేడా
- చెల్లించిన పన్నుకు, జీఎస్‌టీఆర్-1లో చూపిన పన్నుకు తేడా
- జీఎస్‌టీఆర్-1 లో రిజిస్ట్రేషన్ ఉన్న కొనుగోలుదారుని, రిజిస్ట్రేషన్ లేని కేటగిరీలో (బీ2బీను బీ2సీ) చూపటం

ఇలా పలు పొరపాట్లు చాలా మంది వ్యాపారస్తులు చేశారు. వాస్తవానికి, ఇవన్నీ సరిదిద్దుకోవటానికి 2018, అక్టోబరు 25 వరకు చట్టప్రకారం సమయం ఉన్నప్పటికీ చాలా మంది దీన్ని సద్వినియోగం చేసుకోలేకపోయారు. దీంతో ప్రభుత్వం ఈ గడువును మరికొంత కాలంపాటు పొడిగించింది. దీని ప్రకారం 2017-18 ఆర్థిక సంవత్సరానికి గాను ఎవరైనా తమ జీఎస్‌టీర్-1 రిటర్నుల్లో ఏవైనా పొరపాట్లు చేసి ఉంటే వాటిని ఈ విధంగా సరిచేసుకోవచ్చు.

- నెలవారీ జీఎస్‌టీఆర్-1 ఫైల్ చేసే వారు అయితే 2019 మార్చి జీఎస్‌టీఆర్-1 రిటర్న్ దాఖలు చేసే గడువు తేదీ వరకు
- త్రైమాసిక రిటర్న్ దాఖలు చేసే వారయితే 2019 జనవరి-మార్చి జీఎస్‌టీఆర్-1 ఫైల్ చేసే గడువు తేదీ లోపు సరిచేసుకోవచ్చు.

అలాగే 2017-18 ఆర్థిక సంవత్సరంలో చేసిన కొనుగోళ్లకు సంబంధించిన ఇన్వాయిస్‌ల మీద ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్ మరిచిపోయి ఉంటే దానిని 2019 మార్చి నెలకు గాను జీఎస్‌టీర్-3బీ ఫైల్ చేయాల్సిన గడువు తేదీ అంటే ఏప్రిల్ 20 లోపు తీసుకోవచ్చు. అయితే ఆయా వివరాలు వారివారి సరఫరాదారుల జీఎస్‌టీఆర్-1లో విధిగా నమోదై ఉండాలి.

వ్యాపారస్తులు ఏ జాగ్రత్తలు తీసుకోవాలి?

- ముందుగా వారు తీసుకున్న ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్‌కు ఇన్వాయిస్‌లను సరి చూసుకోవాలి. ఎక్కడైనా తేడా అనిపిస్తే ఆ వివరాలు తదుపరి దాఖలు చేయబోయే రిటర్నుల్లో సవరించుకోవాలి. అంతే కాకుండా ఈ వివరాలు వారి జీఎస్‌టీఆర్-2ఏతో సరిపోయేటట్లు చూసుకోవాలి. ఎక్కడైనా తేడా వస్తే ఆయా సరఫరాదారులను సంప్రదించి వారు తదుపరి ఫైల్ చేయబోయే జీఎస్‌టీర్-1లో తగు సవరణ జరిగేటట్లు చూసుకోవాలి.



- అలాగే, జీఎస్‌టీఆర్-1 రిటర్న్‌లో, జీఎస్‌టీఆర్-3బీ రిటర్న్‌లో చూపిన టర్నోవర్, పన్ను వివరాలు మీ అసలు వివరాలతో సరిపోయేటట్లు చూసుకోవాలి. ఎక్కడైనా తేడా ఉంటే పైన చెప్పిన గడువు తేదీ లోపు ఆయా రిటర్నుల్లో సవరణ జరిగేటట్లు చూసుకోవాలి.



ఇటీవలి కాలంలో హెల్త్‌కేర్ వ్యయాలు గణనీయంగా పెరిగిపోయాయి. చిన్న రుగ్మతలకే వైద్యుల ఫీజులు, ఔషధ వ్యయాలు వంటివి భారీగా ఉంటున్నాయి. మరి అనుకోని ఉపద్రవం ఏదైనా విరుచుకుపడితే ఆస్పత్రుల చుట్టూ తిరిగేందుకు, చికిత్సకు భారీగా ఖర్చు చేయక తప్పడంలేదు. ఈ అంశాలన్నింటినీ పరిగణనలోకి తీసుకుని ఇప్పుడు అధిక శాతం మంది ఆరోగ్య బీమాకు మొగ్గు చూపుతున్నారు. ఆరోగ్య బీమాపై ప్రజల్లో చైతన్యం పెంచేందుకు పలు సంస్థలు చొరవ చూపుతున్నాయి. ఇప్పుడిప్పుడే గ్రూప్ ఇన్సూరెన్స్‌కు కూడా చాలా కంపెనీలు మొగ్గు చూపిస్తున్నాయి. ఈ చర్యలన్నీ ఆరోగ్యబీమా పట్ల ప్రజల్లో చైతన్యం పెరిగేందుకు దోహదపడుతున్నాయి. గ్రూప్ ఇన్సూరెన్స్‌లో అయినా, వ్యక్తిగత ఆరోగ్య బీమాలో అయినా బీమా కంపెనీలు కొన్ని ముందస్తు నిబంధనలు, షరతులు విధిస్తాయి. అలాంటి వాటిలో ఈ ఐదూ ప్రధానం.

ఆరోగ్య బీమాలో 5 కీలకం

1 వేచి ఉండే కాలపరిమితి

ఆరోగ్య బీమా తీసుకున్నంత మాత్రాన తక్షణమే ఆ ప్రయోజనం అందుతుందనుకోవడం పొరపాటు. పాలసీ కొనుగోలు చేసిన రోజుల వ్యవధిలోనే ఏదైనా అనారోగ్యం ఏర్పడితే దానికి కవరేజీ ఉండకపోవచ్చు. ఏ కంపెనీ అయినా బీమా పాలసీ తీసుకున్న రోజు నుంచి దాని ప్రయోజనం వినియోగించుకునే అవకాశం ఇవ్వడానికి మధ్య కొంత కాలవ్యవధిని నిర్దేశిస్తుంది. ఆ ప్రయోజనం ఉపయోగించుకోవాలంటే ఆ కాలవ్యవధి ఎంత అన్న అంశంపై స్పష్టమైన అవగాహన ఉండాలి. ఉదాహరణకు ఇలాంటి కాలవ్యవధి 60 రోజులుంటే జనవరి 30వ తేదీన తీసుకున్న పాలసీపై మార్చి 31వ తేదీ తర్వాత మాత్రమే క్లెయిమ్ చేసుకునే అవకాశం లభిస్తుంది. ఈ లోగా ఏర్పడే అవసరాలకు సొంతంగానే భరించుకోవాలి.

2 గది అద్దె

ఆరోగ్య బీమా కవరేజీ ఉన్న వారు ఏదైనా అనారోగ్యం బారిన పడి ఆస్పత్రిలో ఇన్ పేషెంట్లుగా చికిత్స పొందాల్సిన పరిస్థితి ఏర్పడితే వారు బస చేసే గది అద్దె కూడా బీమా కంపెనీ చెల్లిస్తుంది. కాని కొంత మొత్తం వరకు మాత్రమే గది అద్దె కంపెనీ చెల్లిస్తుంది. ఆ పరిమితి దాటితే ఆ వ్యయాన్ని సొంత జేబులో నుంచి చెల్లించాల్సి ఉంటుంది. అంతే కాదు మనం తీసుకునే గదిని బట్టి మిగతా చార్జీలు కూడా ఉంటాయి. అలా చూసుకుంటే గది అద్దె కవరేజి తక్కువగా ఉన్నట్టయితే ఆ పైన అయ్యే వ్యయం, దానికి దీటుగా చికిత్సా చార్జీలు కూడా మనం సొంత వనరుల నుంచే భరించాల్సి వస్తుంది. అందుకే గది అద్దెకి ఎంత పరిమితి ఉన్నది అన్న విషయం తప్పనిసరిగా తెలుసుకోవాలి. లేదంటే లేనిపోని భారం మీద వేసుకున్నట్టవుతుంది.

3 నెట్‌వర్క్ పరిధి

ఆ సంస్థ ఎంత నెట్‌వర్క్‌కు విస్తరించింది అన్నది తెలుసుకోవాలి. నెట్‌వర్క్ ఎంతగా విస్తరించి ఉంటే అంతగా క్యాష్‌లెస్ సదుపాయంతో చికిత్స పొందే అవకాశం ఉంటుంది. అందుకే ఆరోగ్య బీమా అందిస్తున్న కంపెనీ నెట్‌వర్క్ ఎంతగా విస్తరించింది అన్న అంశంపై అవగాహన పొందడం అవసరం. నెట్‌వర్క్ పరిధిలోని ఆస్పత్రులైతే క్లెయిమ్ ప్రాసెసింగ్‌కు సంబంధించి ఎలాంటి సంప్రదింపులతో పని లేకుండా నేరుగా కార్డు వివరాలు అందించి చికిత్స పొందవచ్చు. లేదంటే ముందు సొంత వనరుల నుంచి ఖర్చులు భరించి ఆ తర్వాత క్లెయిమ్ సొమ్ము కోసం వేచి చూడాల్సి ఉంటుంది.

5 సబ్ లిమిట్ పరిధి

ఆరోగ్య బీమా పాలసీ ఇచ్చే మినహాయింపుల గురించి కూడా సవివరంగా తెలుసుకోవాలి. చికిత్సా వ్యయాల్లో ప్రతి ఒక్క దానికి కంపెనీ కొంత సబ్ లిమిట్ నిర్దేశిస్తూ ఉంటుంది. అ పరిధి దాటేంతవరకు బీమా కంపెనీ చిత్రంలోకి రాదు. అంటే ఆ పరిధిలోపు వ్యయాలన్నింటినీ పాలసీదారులే భరించాల్సి ఉంటుంది. ఇలాంటి సబ్ లిమిట్‌లు ఎంత ఎక్కువగా ఉంటే అంత భారం పాలసీదారులు భరించక తప్పదు.

4 చికిత్సానంతర వ్యయాలు

ఆస్పత్రి ఖర్చులు, చికిత్సకు అయ్యే వ్యయాలు ఎంత ప్రధానమో చికిత్సానంతర వ్యయాలు కూడా అంతే ప్రధానం. ముఖ్యంగా సర్జరీలు చేయించుకున్న వారికి ఇది మరింత ప్రధానం. సర్జరీలకు ముందూ, వెనుకా కూడా చాలా మెడికల్ పరీక్షలు, డాక్టర్ల కన్సల్టేషన్లు, ఔషధాలు అవసరం అవుతాయి. ఆస్పత్రిలో ఇన్ పేషెంట్‌గా ఉన్నప్పుడు ఇచ్చే కవరేజీతోపాటు ముందు వెనుక అయ్యే ఖర్చులకు కూడా కవరేజీ ఉండేలా చూసుకోవడం వల్ల తక్కువ భారంతో బయటపడవచ్చు.

బీమా.. కంపెనీకి, పాలసీదారునికి మధ్య కుదిరే చట్టబద్ధమైన కాంట్రాక్టు. ఆరోగ్య బీమాకు ఇదే సూత్రం వర్తిస్తుంది. కాబట్టి ఆరోగ్య బీమా పాలసీ తీసుకునే ముందే అన్ని అంశాలూ క్షుణ్ణంగా తెలుసుకుని సరైన అవగాహనతో నిర్ణయం తీసుకోవాలి. ప్రధానంగా మీరు చెల్లించే ప్రీమియంకు పాలసీ తగిన విలువ అందిస్తోందా, కంపెనీ ఇచ్చిన హామీలను కచ్చితంగా నెరవేరుస్తుందా అన్నవి ధ్రువీకరించుకోవాలి. ఆ తర్వాతే సరైన కంపెనీని ఎంచుకుని అందులో పాలసీ తీసుకోవడం శ్రేయస్కరం.

గరిష్ఠ ప్రయోజనం అందించే టర్మ్ ప్లాన్ + మ్యూచువల్ ఫండ్ పెట్టుబడి



బీమా పాలసీలపై ఎంతగా చైతన్యం పెరిగిందనుకుంటున్నా పాలసీ తీసుకునే ముందు ప్రజలకు ఎన్నో అనుమానాలు వెంటాడుతూ ఉంటాయి. ఏ పాలసీ తమకు సరిపోతుంది? రాబడులకు ఎంత హామీ ఉంటుంది? అనే విషయం తేల్చుకోలేక సతమతమైపోతారు. ముఖ్యంగా తొలిసారి పాలసీ తీసుకునే వారు మరింత ఇబ్బంది పడతారు. వారందరికీ మార్గదర్శకమైన అంశాలు వివరిస్తున్నారు బ్యాంక్ బజార్ సీఈఓ అదిల్ షెట్టి.

జీవిత బీమా చేసే సమయంలో తమకు మంచి లాభాలు అందించే పాలసీలో ఇన్వెస్ట్ చేయాలనే ఎవరైనా అనుకుంటారు. తాము భరించగల స్థాయిలో ప్రీమియం లుండి, చక్కని బీమా రక్షణ కల్పించడం, మరిన్ని అదనపు ప్రయోజనాలు అందించడం అనే అంశాలన్నీ సమతూకం చేసుకోవాలని భావిస్తారు. ఈ అన్వేషణలో టర్మ్ ప్లాన్లకు అత్యల్ప ప్రాధాన్యం ఇస్తూ తాము చెల్లించిన ప్రీమియంలు నష్టపోకుండా తిరిగి చెల్లించగల (ప్రీమియం భరోసా) పాలసీలపైనే దృష్టి సారిస్తారు. పాలసీ తీసుకునే సమయంలో ప్రజలు తప్పనిసరిగా ఈ దిగువ అంశాలు దృష్టిలో పెట్టుకోవాలి.

టర్మ్ ప్లాన్ వర్సెస్ ప్రీమియం ప్లాన్

టర్మ్ ప్లాన్ అనేది నేరుగా జీవితానికి మాత్రమే బీమా అందించే పాలసీ. మీ మరణానంతరం నామినీలకు ప్రయోజనాలు అందించడం కోసమే మీరు ప్రీమియం చెల్లిస్తారు. అంతే తప్ప పాలసీ గడువు ముగిసిన నాటికి మీరు సజీవంగా ఉంటే మీకు అందే ప్రయోజనం ఏదీ ఉండదు. కాని రిటర్న్ ఆఫ్ ప్రీమియం (ఆర్‌ఓపి) ప్లాన్లలో బీమా సంస్థ పాలసీ గడువు ముగిసిన తర్వాత కూడా మీరు సజీవంగా ఉంటే సర్వైవల్ బెనిఫిట్ అందిస్తుంది. అంటే మీరు చెల్లించిన ప్రీమియం మీకు అందుతుందన్న భరోసా ఉంటుందన్న మాట. అంటే ఉదాహరణకి మీరు 15 ఏళ్లపాటు రూ.7,000 వంతున వార్షిక ప్రీమియం చెల్లిస్తే గడువు ముగిసేనాటికి మీకు రూ.1.05 లక్షలు తిరిగి చెల్లించేందుకు భరోసా ఉంటుంది.

చెల్లుబాటు, లక్షణాలు, అందుబాటు ధర

ఈ రెండు రకాల పాలసీలు పదేసి సంవత్సరాల కాలపరిమితికి కవరేజీ కల్పిస్తాయి. కానీ సమ్ అష్యూర్డ్ (హామీ ఇచ్చే ప్రయోజనం) కోణంలో చూస్తే టర్మ్ ప్లాన్‌లు ఆర్‌ఓపి ప్లాన్లకన్నా చౌక ధరల్లో అందుబాటులో ఉంటాయి. రెండు రకాల పాలసీలు సమ్ అష్యూర్డ్‌తోపాటు టెర్మినల్ ఇల్‌నెస్ కవర్, ప్రీమియం మినహాయింపు, ప్రమాద మరణానికి కవరేజి సమానంగా కల్పిస్తాయి. ఎన్ని అదనపు ప్రయోజనాలు ఆశిస్తే అంతగా ప్రీమియం పెరుగుతుంది. అయితే తాము చెల్లించిన ప్రీమియం తిరిగి వస్తుందన్న ఆశతో కొందరు ఆర్‌ఓపిల వైపే మొగ్గు చూపుతారు. కాని వాపసు అయ్యే ఈ ప్రీమియం ఎంతమేరకు ఉపయోగకరం అనేది చర్చనీయాంశమే.



వ్యయ ప్రయోజన విశ్లేషణ

ఉదాహరణకు 30 సంవత్సరాల ఒక వ్యక్తి 30 సంవత్సరాల కాలపరిమితికి రూ.50 లక్షల టర్మ్ ప్లాన్ తీసుకుంటే వార్షిక ప్రీమియం రూ.5,000 అవుతుంది. అంటే పాలసీ అమలులో ఉన్న 15 సంవత్సరాల కాలంలోనూ వారు చెల్లించే మొత్తం ప్రీమియం రూ.1.5 లక్షలు. అదే ప్రయోజనాలకి ఆర్‌ఓపి ప్లాన్ తీసుకున్నట్టయితే వార్షిక ప్రీమియం రూ.10 వేలు అవుతుంది. అంటే 30 సంవత్సరాల కాలపరిమితిలో చెల్లించే ప్రీమియం మొత్తం రూ.3 లక్షలు. టర్మ్ పాలసీకి, ఆర్‌ఓపి పాలసీకి చెల్లించే ప్రీమియం వ్యత్యాసం రూ.5,000 వార్షికంగా 12 శాతం రాబడి అందించే మ్యూచువల్ ఫండ్‌లో ఇన్వెస్ట్ చేసినట్టయితే 30 సంవత్సరాలు ముగిసే నాటికి రూ.13.51 లక్షల కార్పస్ మీ చేతికి వస్తుంది. అదే ఆర్‌ఓపిపై వచ్చే రాబడి రూ.3 లక్షలే.

నికర ప్రయోజనం ఎంతో చూడండి

ముందుగానే చెప్పినట్టుగా సర్వైవల్ ప్రయోజనం అందుతుంది గనుక ఆర్‌ఓసి ప్లాన్ కాగితం మీద ఎంతో ఆకర్షణీయంగా కనిపించవచ్చు. కాని మీరు చెల్లిస్తున్న అదనపు ప్రీమియంపై మీకు వస్తున్న రాబడి వాస్తవంగా లాభదాయకమేనా అన్నది మీరు పరిశీలించుకోండి. అప్పుడే రెండు రకాల పాలసీల మధ్య లాభనష్టాల బేరీజులో మీకే స్పష్టత వస్తుంది. అప్పుడు మీరు టర్మ్‌ప్లాన్ తీసుకుని మిగులు మొత్తాన్ని దీర్ఘకాలిక ఈక్విటీ ఫండ్‌లో పెట్టుబడి పెట్టడానికే మొగ్గు చూపుతారు.

ఎక్కడ పాలసీ కొనుగోలు చేయవచ్చు?

మీరు ఏ బీమా కంపెనీ నుంచైనా లేదా మీ బ్యాంకు ద్వారా బీమా పాలసీ నేరుగా తీసుకోవచ్చు. కానీ ఆన్‌లైన్‌లో కొనుగోలు చేయడం ఉత్తమమైన అంశం. అది మరింత అందుబాటు ధరలో లభించడంతో పాటు వివిధ పాలసీలు, అవి అందించే ప్రయోజనాలు సరిపోల్చుకోవచ్చు. అలాగే ఆ పాలసీలపై అంతకు ముందు వాటిని కొనుగోలు చేసిన వారు రాసిన సమీక్షలు, ఇతర సమాచారం అంతటినీ ఒకే చోట చూసి మీకు ఏది సరైనదో ఎంచుకోగలుగుతారు.

మీరు కేవలం బీమా రక్షణ పొందాలనుకుంటే టర్మ్ పాలసీకి ప్రాధాన్యం ఇవ్వండి, పెట్టుబడి ప్రధానం అనుకుంటే మ్యూచువల్ ఫండ్ స్కీమ్‌కు వెళ్లడం మంచిది.



చంద్రబాబు ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న బీసీలు



రాజమండ్రిలో జయహో బీసీ సభలో టీడీపీ జెండాల రెపరెపలు

వైఎస్ అలా... మేం ఇలా...

2004 నుంచి 2009 వరకూ వైఎస్ సీఎంగా ఉన్నప్పుడు బీసీలకు చేసిందేమీ లేదు. బీసీలకు మేలు చేస్తే టీడీపీ బలోపేతమవుతుందని భావించి వారిని అణచివేశారు. తొమ్మిదేళ్లలో వైఎస్ బీసీల కోసం 3వేల కోట్లు ఖర్చుపెడితే... బీసీల బాగుకోసం సబ్ ప్లాన్‌తో కలుపుకొని మేం 41వేల కోట్లు వెచ్చించాం. ఉపాధి కోసం ఐదేళ్లలో వైఎస్ ఖర్చు పెట్టింది 127 కోట్లు. మేం ఖర్చు పెట్టింది 1129 కోట్ల రూపాయలు! 31 కులాలను కొత్తగా బీసీల్లోకి తెచ్చి.. వారికి రిజర్వేషన్లు పెంచకుండా వైఎస్ అన్యాయం చేశారు. 11 బీసీ ఫెడరేషన్లను నిర్వీర్యం చేశారు. బీసీ నాయకులను హత్య చేయించారు. సోంపేట, గంగవరంలో మత్స్యకారులను చంపేశారు.

టీడీపీ అంటే బీసీలు... బీసీలంటే టీడీపీ!

1987లో స్థానిక సంస్థల్లో బీసీలకు 20 శాతం రిజర్వేషన్లు తెచ్చింది ఎన్టీఆర్! బీసీల నుంచి కొత్త నాయకత్వం రావడానికి అది నాంది. ఆ రిజర్వేషన్లను నేను 33 శాతం చేశాను. బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ పెట్టాలని, బడ్జెట్‌లో 25 శాతం నిధులు ఈ వర్గాలకు కేటాయించాలని తీర్మానం చేసి కేంద్రానికి పంపింది మేమే. రాష్ట్రంలోని 113 మంది కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లలో 93 మంది బీసీలే.

- చంద్రబాబు



జయహో బీసీ!

(మొదటి పేజీ తరువాయి)

పని చేస్తోంది. 75 రోజుల్లో ఎన్నికలు ఉన్నాయి. టీడీపీ జెండా ప్రతి ఒక్క బీసీ ఇంటిపైనా రెపరెపలాడాలి. వచ్చే ఎన్నికలలో 175 సీట్లకు 150 సీట్లు మనమే గెలవాలి. పాతిక ఎంపీ స్థానాలూ టీడీపీకి సొంతం కావాలి. రాష్ట్రానికి న్యాయం జరగాలి. అందుకు... బీసీలంతా టీడీపీకి అండగా నిలవాలి" అని కోరారు. ఆదివారం రాజమహేంద్రవరంలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా, భారీ ఎత్తున నిర్వహించిన 'జయహో బీసీ' సదస్సులో చంద్రబాబు ప్రసంగించారు. నేత, గీత, కమ్మరి, కుమ్మరి, యాదవ, రజక, నాయీ బ్రాహ్మణ.... ఇలా బీసీల్లోని అనేక కులాలపై వరాల వర్షం కురిపించారు. సెలూన్లు, లాండ్రీలకు ఉచిత విద్యుత్తు... చేనేత కార్మికులకు ఇచ్చే ఉచిత విద్యుత్తు, నూలు రాయితీ పెంపు... అనేక కులాలకు కొత్తగా కార్పొరేషన్లు... గతంలో ఉన్న 8 ఫెడరేషన్లు కార్పొరేషన్లుగా మార్పు... తదితర హామీలను గుప్పించారు. వైఎస్ హయాంలో ఏం జరిగింది... తాము వచ్చాక ఏం జరుగుతోందో గణాంకాలతో సహా వివరించారు. 137 బీసీ కులాల ప్రతినిధులతో చర్చించి, సమస్యలు అధ్యయనం చేసి... బీసీలకు ఇంకా ఏం చేయాలో నిర్ణయించామన్నారు. రూ.3 వేల కోట్ల విలువైన వరాలు ప్రకటించారు.

జగన్ ఉలిక్కిపడేలా నినదించండి..

"బీసీలు ఒక సంఘటిత శక్తిగా మారితే తిరుగే ఉండదు. రాజమహేంద్రవరం జయహో బీసీ గర్జనతో దద్దరిల్లుతోంది. ఈ గర్జన తర్వాత ప్రతి గ్రామంలో టీడీపీ జెండా రెపరెపలాడాలి. ప్రతిపక్షం గుండెల్లో రైళ్లు పరుగెత్తించాలి. మనమందరం కలిస్తే విపక్షాలకు డిపాజిట్లు వస్తాయా; అన్యాయం చేసిన పార్టీలను వదిలిపెడతామా?" అని చంద్రబాబు ప్రశ్నించారు. రాష్ట్ర విభజన తర్వాత తెలంగాణలో 32 కులాలను కేసీఆర్ బీసీ జాబితా నుంచి తొలగించి అన్యాయం చేశారన్నారు. అలాంటి కేసీఆర్‌కు జగన్ వత్తాసు పలుకుతున్నారని మండిపడ్డారు. "లోటస్‌పాండ్‌లో ఉండే జగన్ ఉలిక్కిపడి లేవాలి. మా బీసీలకు అన్యాయం చేసిన వాళ్లతో మీరు జతకట్టారు... ఇది మంచిది కాదని గట్టిగా హెచ్చరించండి" అని పిలుపునిచ్చారు. బీసీల ఐకమత్యాన్ని దెబ్బ తీయాలని కుట్రలు, కుతంత్రాలు చేస్తారన్నారు. బీజేపీ, వైసీపీ 'విభజించి పాలించు' అనే సూత్రాన్ని అమలు చేస్తాయని.. వారి వలలో పడొద్దని అప్రమత్తం చేశారు. బీసీలకు టీడీపీ రుణపడి ఉంటుందని చంద్రబాబు తెలిపారు. "కష్టకాలంలో మీరే అండగా ఉన్నారు. టీడీపీని కాపాడుకుంటూ వచ్చింది బీసీలే. నేను ఏపని చేసినా మీ కోసమే చేస్తా. నా జీవితంలో మొదటి ప్రాధాన్యత వెనుకబడిన వర్గాలకే. భగవంతుడు ఇచ్చిన శక్తినంతా బీసీల మేలుకు ఉపయోగిస్తాను' అని తెలిపారు. "మీ కుల వృత్తే మీకు ఆస్తి. కులవృత్తులను ఆదరించాలని నిర్ణయించుకున్నాం. ఆదరణ పథకంలో పనిముట్లు అందజేస్తున్నాం" అని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల్లో 50% బీసీలకే దక్కుతున్నాయని చంద్రబాబు చెప్పారు. "బీసీల కోసం మొట్టమొదట పోరాడింది జ్యోతిరావు పూలే! తర్వాత చేయూతనిచ్చింది ఎన్టీఆర్. ఆ ఒరవడిని నేనూ కొనసాగిస్తున్నాను. నాకు చేయూత నివ్వండి" అని కోరారు.

అడిగినవన్నీ ఇస్తున్నాం..

ఆయా కులాల ప్రతినిధుల వినతి మేరకు రజక, నాయీ బ్రాహ్మణ, సగర, వడ్డెర, ఉప్పర, కృష్ణ బలిజ, వాల్మీకి, కుమ్మరి, భట్రాజ ఫెడరేషన్లను కార్పొరేషన్లుగా మారుస్తున్నట్లు చంద్రబాబు ప్రకటించారు. గోదావరి జిల్లాల్లో శెట్టి బలిజలు ఎక్కువగా ఉన్నారని... వీరికి ప్రత్యేకంగా కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. టీడీపీకి అండగా ఉండే యాదవులకు, రాయలసీమలో అధికంగా ఉన్న కురబలకూ కార్పొరేషన్లు పెడతామన్నారు. గొర్రెలన్నింటికీ ప్రభుత్వమే ప్రీమియం చెల్లించి బీమా చేస్తామన్నారు. మత్స్యకారులకూ ప్రత్యేక ఫెడరేషన్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. వీరిని ఎస్టీలో చేర్చడానికి ఇప్పటికే కమిషన్ వేస్తామని, నివేదిక రాగానే కేంద్రానికి పంపిస్తామన్నారు. కొప్పుల వెలమలకు, పూర్తిగా వ్యవసాయంపైనే ఆధారపడిన తూర్పు కాపులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. "చేనేత కార్మికులు ఎన్నో కష్టాల్లో ఉన్నారు. వారికి కూడా కార్పొరేషన్ ఏర్పాటు చేస్తున్నాం' అన్నారు. వారికి ఇస్తున్న ఉచిత విద్యుత్తును 150 యూనిట్లకు పెంచారు. నూలు కొనుగోలుకు ఇస్తున్న రూ.వెయ్యిని 2వేలకు పెంచుతామన్నారు. "నన్ను నమ్ముకున్న వర్గాలకు ఏం కావాలన్నా చేయడానికి సిద్ధంగా ఉన్నాను' అని తెలిపారు. వాల్మీకులను ఎస్టీల్లో చేర్చాలని కేంద్రానికి ప్రతిపాదనలు పంపినా పట్టించుకోలేదని... దీనిపై పోరాడతామని ప్రకటించారు. రజకులను ఎస్సీల్లో చేర్చడానికి అన్ని రకాలుగా ప్రయత్నిస్తామన్నారు.

రాజధానిలో బీసీలకు స్థానం

రాజధాని అమరావతిలో బీసీలకు ప్రత్యేక స్థానం కల్పిస్తామని చంద్రబాబు తెలిపారు. "పది ఎకరాల్లో జ్యోతిరావు పూలే ఉద్యానవనం, స్మారక భవనం, ఆయన విగ్రహం ఏర్పాటు చేస్తాం. ఇక్కడే బీసీ వర్గాలకు భవనాలు నిర్మిస్తాం. ఈ సముదాయం కోసం రూ.వంద కోట్లు వెచ్చిస్తున్నాం" అని చంద్రబాబు తెలిపారు. బీసీలకు సబ్ ప్లాన్ తీసుకొచ్చి... దానికి చట్టబద్ధత కల్పించే బాధ్యత తీసుకుంటామన్నారు. అత్యంత వెనుకబడిన కులాల్లో(ఎంబీసీ) రెండు లక్షల కుటుంబాలున్నాయని... వీరందరికీ వంద యూనిట్ల కరెంటు ఉచితంగా ఇస్తామని ప్రకటించారు. నియోజకవర్గానికి ఒకటి చొప్పున ఏర్పాటు చేస్తున్న ఎంఎస్ఎంఈల్లో 25% ప్లాట్లు కేటాయించి.. బీసీలను పారిశ్రామిక వేత్తలుగా మారుస్తామన్నారు. బీసీల్లో కేటగిరీ మార్పు అంశంపై అధ్యయనానికి కమిషన్‌ను నియమిస్తామన్నారు. దొమ్మర, ఉప్పర, మందుల, మొండిబండ, పాముల ఇలాంటి కొన్ని కులాల పేర్లను కించపరిచేలా వాడుతున్నారని... అలా వాడకుండా నిషేధం విధిస్తూ ఉత్తర్వులు జారీ చేస్తామని ప్రకటించారు. బుడబుక్కల, దొమ్మర సంక్షేమానికి జిల్లా స్థాయిలో కమిటీ వేస్తామన్నారు. వైఎస్ హయాంలో స్వర్ణకారులపై తప్పుడు కేసులు పెట్టి, అరాచకంగా వ్యవహరించారన్నారు. "మా ప్రభుత్వంలో ప్రతి ఒక్కరి కుల, చేతి వృత్తులను గౌరవిస్తాం' అని తెలిపారు. "ఇప్పుడు చెప్పండి... తెలుగుదేశం బీసీల పార్టీ కాదా? దీనిపై మాట్లాడే హక్కు ఇతరులకు ఉందా? జయహో బీసీ సదస్సు మీ జాతకాలను తిరగ రాస్తుంది" అని తెలిపారు. "బీసీలకు అన్నిరంగాల్లో ప్రాతినిధ్యం కల్పిస్తున్నది, ప్రాధాన్యం ఇస్తున్నది టీడీపీయే. కేఈ కృష్ణమూర్తి, యనమల రామకృష్ణుడు, కళా వెంకట్రావుతో పాటు అనేక మంది బీసీలకు కీలక శాఖలు ఇచ్చాం. బీసీలను హైకోర్టు, సుప్రీంకోర్టు జడ్జిలుగా నియమించాలని సిఫారసు చేశాను. ఇప్పటిదాకా ఇంత పెద్ద సభ ఎప్పుడూ జరగ లేదు" అని సీఎం అన్నారు.



చంద్రబాబు వరాల జల్లుతో బీసీ మహిళల ఆనంద హేల!

మరిన్ని వరాలు...

- అన్ని సంగీత పాఠశాలల్లో డోలు, నాదస్వర శిక్షణ. రాజధానిలో టీటీడీ ద్వారా సన్నాయి, డోలు ఆధునిక సంగీత పాఠశాల.
- వంద కోట్లతో పది ఎకరాల్లో అమరావతిలో జ్యోతిరావు పూలే స్మారక భవనం, ఉద్యానవనం! అక్కడే అన్ని బీసీ వర్గాలకు భవనాల నిర్మాణం!
- బీసీలకు సబ్ ప్లాన్ తెచ్చి.. చట్టబద్ధత.
- ఎంఎస్ఎంఈలలో 25 శాతం ప్లాట్లు వెనుకబడిన వర్గాలకు కేటాయింపు. అందులో మూడో వంతు మహిళలకు.
- ప్రతి నియోజకవర్గంలో వెనుకబడిన వర్గాలకు గురుకుల పాఠశాల ఏర్పాటు!
- సగర, ఉప్పర కులస్తుల వినతి మేరకు రాష్ట్ర పండుగగా భగీరథ జయంతి.
- శాలివాహనల కోరిక మేరకు అమరావతిలో మొల్లమాంబ విగ్రహం ఏర్పాటు.
- బుడబుక్కల, దొమ్మర సంక్షేమానికి జిల్లా స్థాయిలో ఒక కమిటీ నియామకం.

బీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్లు

- ప్రైవేటు సంస్థల్లోనూ కల్పనకు ప్రయత్నం
- దేశవ్యాప్తంగా బీసీ గణన జరగాలి: యనమల
- బీసీలకు మరిన్ని నామినేటెడ్ పోస్టులు
- చంద్రబాబుకు అండగా ఉండాలి
- జయహో సభలో మంత్రులు, నేతల పిలుపు



రాజమహేంద్రవరం, జనవరి 27(ఆంధ్రజ్యోతి): 'బీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్ కావాలి. దీనిపై ఇప్పటికే అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపించాం. ఉద్యోగాలు తగ్గిపోయాయి. దీనివల్ల రాజ్యాంగ సవరణ చేసైనా ప్రైవేట్ సంస్థల్లోనూ రిజర్వేషన్ ఇవ్వాలి. అందుకు టీడీపీ ప్రభుత్వం కృషి చేస్తుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు సానుకూలంగా ఉన్నారు. బీసీల భవిష్యత్తు బ్రహ్మాండంగా ఉంటుంది' అని రాష్ట్ర ఆర్థికమంత్రి యనమల రామకృష్ణుడు అన్నారు. 'జయహో బీసీ' సభలో ఆయన మాట్లాడుతూ... బీసీల్లో అనైక్యత సృష్టించేందుకు కొందరు కుట్రలు చేస్తున్నారని, వాటిని ఐక్యంగా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో టీడీపీ మద్దతుతోనే కేంద్రంలో ప్రభుత్వం ఏర్పడే అవకాశం వస్తుందని, అప్పుడు దేశవ్యాప్తంగా బీసీ జన గణన జరిపించడానికి ఒత్తిడి తెస్తామన్నారు. కొందరు కులాలు, మతాలు, ప్రాంతాల పేరిట చిచ్చుపెట్టాలని చూస్తున్నారని యనమల ఆరోపించారు. బీసీలు కలిసిమెలిసి ఉండాలని, టీడీపీ వల్లే మన జీవితాలు బాగుపడతాయన్నారు.

ఇంకా ఎవరేమన్నారంటే...

బీసీ సబ్ ప్లాన్‌కు చట్టబద్ధత కల్పించి, నామినేటెడ్ పదవుల్లో ఎక్కువ మందికి అవకాశం ఇచ్చేందుకు టీడీపీ ప్రభుత్వం కృషి చేస్తుంది.

- మంత్రి పితాని సత్యనారాయణ

ప్రాణాలు పోయినా మా ఇల్లు తెలుగుదేశమే. బీసీగా పుట్టడం అదృష్టం. గతంలో బీసీ అంటే చిన్నచూపు. వైఎస్ పదేళ్ల పాలనలో బీసీలను అణచివేశారు. టీడీపీ ఆదుకుంది. ఎవరైనా ప్రలోభాలకు లొంగితే హత్య చేసుకున్నట్టే

- మంత్రి అచ్చెన్నాయుడు

టీడీపీ వల్లే బీసీలకు గుర్తింపు వచ్చింది. దానికి మరింత పెంచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది.

- మంత్రి కళా వెంకట్రావు

జగన్ నవరత్నాలుగా చెప్పుకుంటున్నవి నకిలీ రత్నాలు. వాటిని ప్రజలు నమ్మరు. బీసీలంతా ఐక్యంగా ఉండి మళ్లీ చంద్రబాబును సీఎంను చేస్తామని బీసీలందరి తరఫున హామీ ఇస్తున్నా.

- మంత్రి కేఈ కృష్ణమూర్తి

విచక్షణ జ్ఞానంలేని జగన్‌ని బీసీలెవరూ దగ్గరకు రానివ్వొద్దు. బీసీ నేతగా ప్రధాని పదవి చేపట్టిన నరేంద్ర మోదీ రాష్ట్రానికి మొండిచెయ్యి చూపారు. బీసీలను మోసం చేశారు. బీసీలంతా ఐక్యంగా ఉండి చంద్రబాబు నాయకత్వంలో ఢిల్లీ కోటను బద్దలుకొట్టాలి.

- ఎంపీ రామ్మోహననాయుడు

పులితోలు కప్పుకొన్న తెలంగాణ నాయకుడు తలసాని శ్రీనివాసయాదవ్ మొన్న కోడిపందాలు ఆడటానికి ఆంధ్రాకు వచ్చాడు. పందేలు ఆడి వెళ్లిపోకుండా రాష్ట్రంలో బీసీలకు నాయకత్వం లేదని చిలకపలుకులు మాట్లాడాడు. చంద్రబాబు దయతో మంత్రి పదవులు అనుభవించిన శ్రీనివాసయాదవ్ మరోసారి రాష్ట్రగడ్డపై అడుగుపెట్టి విమర్శలు చేస్తే తెలంగాణ వరకూ తరిమితరిమి కొడతాం.

-ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న

మోదీకి సినిమా చూపిస్తాం : లోకేశ్



'కర్ణాటక ఎన్నికల్లో మోదీకి ట్రయల్స్ మాత్రమే చూపించాం. ఈ ఏడాది జరిగే లోక్‌సభ ఎన్నికల్లో మొత్తం సినిమా చూపిస్తాం. ఇక మూడు నెలల్లో ఎన్నికలు జరగనున్నాయి. 25 మంది ఎంపీలను గెలిపించాలి. పీఎం ఎవరో చంద్రబాబే నిర్ణయిస్తారు' అని మంత్రి లోకేశ్ అన్నారు. 'జయహో బీసీ' సభలో మాట్లాడుతూ... "వైసీపీ ప్రజలను మభ్యపెడుతూ నాలుగు డ్రామాలకు తెర తీసింది. మొదటిది... ఎంపీ పదవులకు రాజీనామా డ్రామా, రెండోది... కోడికత్తి డ్రామా. మూడోది... ఆవు-అంబులెన్స్ డ్రామా. జగన్ సభలోకి ఆవు వచ్చినా, అంబులెన్స్ వచ్చినా చంద్రబాబే పంపారని ఆరోపిస్తున్నారు. నాలుగోది... ఫెడరల్ ఫ్రంట్ డ్రామా. ఆంధ్రులకు ద్రోహం చేసిన కేసీఆర్‌తో కలిసి వెళుతున్నారు. ఆంధ్రా ప్రజలను రాక్షసులు అన్న కేసీఆర్‌తో జగన్ దోస్తీ చేస్తున్నాడు. అతని పేరు జగన్మోహనరెడ్డి కాదు, జగన్ మోదీ రెడ్డి. స్థానిక బీజేపీ నేతలకు దమ్ముంటే రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై కేంద్రాన్ని నిలదీయాలి' అని లోకేశ్ సవాల్ విసిరారు.

అర్చకులకు.. వంశపారంపర్య హక్కులు

- 10లోపు తుది నోటిఫికేషన్ జారీ
- 40వేల మందికి లబ్ధి
- రూ.5లక్షల లోపు ఆలయాలూ వారికే
- పదవీ విరమణ వయసు 75ఏళ్లు?

అమరావతి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): అర్చకులకు వంశపారంపర్య హక్కులు కల్పించే విషయంలో రాష్ట్ర ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోనుంది. ఈ అంశంపై ఇప్పటికే పలుమార్లు చర్చలు జరిపిన నేపథ్యంలో ఫిబ్రవరి 10లోపు జీవో 76కు తుది నోటిఫికేషన్ జారీ చేయాలని సూత్రప్రాయంగా నిర్ణయించింది. ఈ నిర్ణయంతో రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 40వేల మంది అర్చకులకు మేలు జరుగుతుందని భావిస్తున్నారు. తుది నోటిఫికేషన్ జారీకి ఉన్న సంక్లిష్టతలపై ఆదివారం రాత్రి సచివాలయంలో ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు. 30న మరోసారి సమావేశమై ఇబ్బందులను ఓ కొలిక్కి తీసుకురావాలని భావిస్తున్నారు. ఉత్తర్వు జారీలోపు దీనిపై సీఎం ప్రకటన చేసే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. అలాగే రూ.5లక్షల లోపు ఆదాయం ఉన్న ఆలయాలను పూర్తిగా అర్చకులకే ఇవ్వాలని ప్రభుత్వం మరో నిర్ణయం తీసుకుంది. పారంపర్య హక్కులు కల్పించిన తర్వాత పదవీ విరమణ వయసును 65నుంచి 75ఏళ్లకు పెంచాలని భావిస్తోంది. వారి కుటుంబంలో వారికే తర్వాత అర్చకునిగా అవకాశం వస్తుంది కాబట్టి ఈ విషయంలో ఎలాంటి ఇబ్బంది ఉండదని అధికారులు చెబుతున్నారు.

సుదీర్ఘకాలంగా పోరాటం

వంశపారంపర్య హక్కుల కోసం అర్చకులు సుదీర్ఘకాలంగా పోరాటం చేస్తున్నారు. 1987కు ముందున్న పారంపర్య హక్కు కోసం వీరు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ వచ్చారు. ఆ తర్వాత నిబంధనల రూపకల్పన జరగ్గా, చివరికి 2017 ఫిబ్రవరి 17న ప్రభుత్వం హక్కుల కల్పనపై ప్రాథమిక నోటిఫికేషన్ ఉత్తర్వు జీవో 76 జారీ చేసింది. దానిపై అభ్యంతరాలకు నెల గడువు ఇచ్చింది. ఈలోపే తిరుమలలో పాత మిరాశీ వ్యవస్థ తెరపైకి రావడంతో తుది నోటిఫికేషన్‌ను విడుదల చేయలేదు. సాంకేతిక, న్యాయపరమైన చిక్కులను అధిగమించేందుకు పలు దఫాలు చర్చలు అనంతరం దీనిపై నివేదిక సమర్పించాలని కోరుతూ బాలసుబ్రమణ్యం నేతృత్వంలో ఓ కమిటీని నియమించింది. కమిటీ నివేదిక, ఇతర అంశాలు పరిగణలోకి తీసుకుని ఎట్టకేలకు తుది ఉత్తర్వు జారీకి ప్రభుత్వం సిద్ధమైంది.

వేల కుటుంబాలకు మేలు

పారంపర్య హక్కులు కల్పిస్తే లక్ష మందికి లబ్ధి చేకూరుతుందని అర్చకులు చెబుతున్నా ఈ సంఖ్య సుమారు 40వేలు ఉండొచ్చని ప్రభుత్వం అంచనా వేస్తోంది. రాష్ట్రంలో సుమారు 28వేల ఆలయాలున్నాయి. వీటిలో తక్కువ ఆదాయం కలిగినవే అత్యధికం. పెద్ద ఆలయాల్లో పనిచేసే అర్చకులకు వేతన స్కేలు అమలు చేస్తున్నారు. ఇప్పుడు వారికీ పారంపర్య హక్కులు కల్పించాలా? లేక చిన్న ఆలయాలకేనా? అనే అంశమై చర్చలు జరుగుతున్నాయి. అలాగే ఫలానా ఆలయంలో వంశపారంపర్య హక్కులు తమకే లభిస్తాయని అర్చకులు నిరూపించుకోవాలని ప్రభుత్వ వర్గాలు నిబంధన పెడుతున్నాయి. లేదంటే భవిష్యత్తులో చిక్కులొస్తాయనే అభిప్రాయాలున్నాయి. అయితే ఈ నిబంధనను వివాదాలున్న ఆలయాలకే పరిమితం చేయాలని, మిగిలినచోట్ల మినహాయించాలని అర్చకులు కోరుతున్నారు. కాగా, అర్చకుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తోందని బ్రాహ్మణ సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ వేమూరి ఆనంద్‌సూర్య 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. ఇచ్చిన హామీ ప్రకారం అర్చకులకు పారంపర్య హక్కు కల్పించేందుకు సీఎం చంద్రబాబు సానుకూలంగా ఉన్నారని, వారికి న్యాయం చేసే విషయంలో మరోమాటే లేదని స్పష్టం చేశారు.

సంక్షేమ ఫలాలు.. ప్రతి ఒక్కరికీ!

- ఇళ్లు.. స్థలాలు.. రేషన్ కార్డులు మంజూరు
- జన్మభూమి దరఖాస్తులకు మోక్షం
- చుక్కల భూముల సమస్యలకు పరిష్కారం
- అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు.. ప్రారంభోత్సవాలు
- గ్రామాల్లో 152 అన్న క్యాంటీన్ల ఏర్పాటు
- నేటి కలెక్టర్ల సదస్సులో దిశానిర్దేశం చేయనున్న సీఎం చంద్రబాబు



అమరావతి, జనవరి 27(ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయం దగ్గరపడుతున్న వేళ.. రాష్ట్రంలోని ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందేలా చూడాలని ప్రభుత్వం నిర్ణయించింది. పసుపు, కుంకుమ కింద 10 వేల రూపాయలు, ఇళ్ల మంజూరు, కొత్త రేషన్ కార్డులు, ఇళ్ల స్థలాల పంపిణీ తదితర పథకాలన్నీ లబ్ధిదారులకు చేరేలా చర్యలు తీసుకుంటోంది. అదే సమయంలో రెవెన్యూ శాఖలో పెండింగ్‌లో ఉన్న చుక్కల భూములు, 22ఏ సమస్యలకూ పరిష్కారం చూపనుంది. అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, పూర్తయిన వాటికి ప్రారంభోత్సవాలు చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని భావిస్తోంది. దీనికి ప్రభుత్వ యంత్రాంగాన్ని సమాయత్తం చేసేందుకు సీఎం చంద్రబాబునాయుడు సోమవారం నిర్వహించే కలెక్టర్ల సదస్సులో దిశానిర్దేశం చేయనున్నారు. ప్రస్తుతం అమల్లో ఉన్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలును వేగవంతం చేయడమే ప్రధాన అజెండాగా ఈ సదస్సు జరగనుంది. కొత్తగా 22వేల మందికి రేషన్‌కార్డులు, 85వేల మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చే అవకాశాలున్నాయి. జన్మభూమి నుంచి ఇప్పటివరకు వచ్చిన దరఖాస్తుల్లో అర్హులను ఎంపికచేసి, వారికి పథకాలు పంపిణీ చేసే దిశగా ఆదేశాలు ఇవ్వనున్నారు. ఇప్పటికే అనుమతి ఇచ్చిన రోడ్లు, భవనాలు, మసీదులు, షాదీఖానాలు, చర్చిలు.. అన్నింటికీ శంకుస్థాపన చేసి వేగంగా పనులు పూర్తిచేసేలా ఆదేశాలు ఇవ్వనున్నారు.

152 మండలాల్లో అన్న క్యాంటీన్లు

రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లోనూ అన్న క్యాంటీన్ల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమవుతోంది. నగరాలు, పట్టణాల్లో శాశ్వత భవనాలు నిర్మించి, అన్న క్యాంటీన్లను ఇప్పటికే ప్రారంభించగా.. గ్రామీణ ప్రాంతాల్లో తాత్కాలిక భవనాల్లోనే వీటిని ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా నగరాలు, పట్టణాల్లో 216 అన్న క్యాంటీన్లకు అనుమతి ఇవ్వగా...వీటిలో దాదాపు 200వరకు ఇప్పటికే ప్రారంభమయ్యాయి. మిగతా వాటిని రెండు మూడు రోజుల్లో ప్రారంభించనున్నారు. ఇప్పుడు గ్రామీణ ప్రాంతాల్లోనూ క్యాంటీన్లు ప్రారంభించేందుకు నిర్ణయం తీసుకున్నారు. అసెంబ్లీ నియోజకవర్గానికి ఒకటి చొప్పున మొత్తం 152 క్యాంటీన్లు ఏర్పాటు చేయనున్నారు. యుద్ధ ప్రాతిపదికపై తాత్కాలికంగా ఏర్పాటు చేసే ఈ క్యాంటీన్లకు తాగు, వాడకం నీటిని అందించే బాధ్యతను పంచాయతీలపై పెడుతున్నారు. ఒక్కో క్యాంటిన్‌లో రోజుకు వెయ్యి మందికి ఆహారం అందించేలా ఏర్పాటు చేస్తారు. దీనిపై కలెక్టర్ల సదస్సులో తుది నిర్ణయం తీసుకుంటారు.

4 ఏళ్లలో 8.66 లక్షల మందికి శిక్షణ

- 'స్కిల్ డెవలప్‌మెంట్'కు జాతీయ గుర్తింపు

అమరావతి, జనవరి 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు శిక్షణనిచ్చి వారికి ఉద్యోగాలు కల్పించడంలో ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు జాతీయ స్థాయి గుర్తింపు లభించింది. గత నాలుగేళ్లలో ఈ సంస్థ ద్వారా 8.66 లక్షల మంది లబ్ధి పొందారు. 1,78,649 మందికి ఉద్యోగాలు లభించాయి. ఈ విషయాన్ని ఇటీవల ఆర్థిక శాఖకు సమర్పించిన నివేదికలో ఆ సంస్థ పేర్కొంది. 2014 నుంచి ఆ సంస్థ 8,66,395 మందికి శిక్షణ ఇచ్చింది. ఇందులో డిగ్రీ, ఇంజనీరింగ్ కాలేజీల విద్యార్థులు 48,428 మందికి ఉద్యోగాలు లభించాయి. వీరిలో 1,30,221 మంది నిరుద్యోగ యువత ఉన్నారు. ఇప్పటి వరకు 650 జాబ్ మేళాలు నిర్వహించారు. వీటి ద్వారా 95,952 మందికి ఉద్యోగాలు లభించాయి. సీఐఐ స్కిల్ రిపోర్ట్ ర్యాంకింగ్స్‌లో అత్యధిక సంఖ్యలో ఉద్యోగాలు కల్పించినందుకు ఏపీకి మొదటి ర్యాంకు దక్కింది.

చిన్నారి పెద్ద మనసు

- బాబు మళ్లీ సీఎం అయితే పోలవరానికి 25 లక్షల పొలం!
- కాలినడకన తిరుమలకు వెళతా
- 'అమరావతి' రాయబారి వైష్ణవి

గుడివాడ/ముదినేపల్లి, జనవరి 27: ఆ చిన్నారి పేరు వైష్ణవి. వయసు 14 సంవత్సరాలు. ఊరు కృష్ణా జిల్లా ముదినేపల్లి. ఆమె తండ్రి అంబుల మనోజ్... ఓ ప్రైవేటు వైద్యుడు. వైష్ణవికి సొంత రాష్ట్రమంటే అంటే ఎంతో అభిమానం. ఇది గుర్తించిన సీఎం చంద్రబాబు ఆమెను గతంలో అమరావతికి బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించారు. గతంలో వైష్ణవి కడప ఉక్కు ఫ్యాక్టరీకి రూ.లక్ష, అమరావతి స్థూపానికి రూ.లక్ష, రాజధాని నిర్మాణానికి రూ.లక్ష విరాళంగా ఇచ్చింది. ఆదివారం మరోమారు తన ఉదారత చాటుకుంది. పామర్రు మండలం కొమరవోలులో సీఎం దంపతులు పాల్గొన్న కార్యక్రమ వేదికపై వైష్ణవి కూడా మాట్లాడింది. "చంద్రబాబు తిరిగి సీఎం కావాలి. ఆయన మళ్లీ ప్రమాణం చేసే రోజునే ముదినేపల్లి మండలంలో మాకున్న 3 ఎకరాల్లో... 25 లక్షల విలువ చేసే ఎకరా భూమిని పోలవరం ప్రాజెక్టుకి విరాళంగా రాసిస్తాను. అదేరోజున తిరుమల కాలినడకన వెళ్ళి మొక్కు తీర్చుకుంటాను" అని వైష్ణవి తెలిపింది. పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి రూ.లక్ష, హైకోర్టు భవనాల నిర్మాణానికి రూ.లక్ష విరాళంగా ప్రకటించింది. తన చేతి వేలికి ఉన్న బంగారపు ఉంగరాన్ని సీఎంకి అందించింది.



వైష్ణవిని అభినందిస్తున్న సీఎం చంద్రబాబు

ఎన్టీఆర్‌కు వెన్నుదన్నుగా బసవతారకం

- ఆయన విజయంలో కీలక పాత్ర
- కొమరవోలును దత్తత తీసుకుని భువనేశ్వరి బ్రహ్మాండంగా అభివృద్ధి చేశారు: సీఎం చంద్రబాబు

విజయవాడ, జనవరి 27(ఆంధ్రజ్యోతి): 'కొమరవోలు మా అత్తగారు(ఎన్టీఆర్ సతీమణి బసవరామతారకం) పుట్టిన గ్రామం. ఆమె ఇక్కడ పుట్టడం ఈ గడ్డ చేసుకున్న అదృష్టం. బసవరామతారకం మా అత్తగారని పొగడటం లేదు. నేను చాలా దగ్గరగా చూశాను. ఎన్టీఆర్ మహోన్నత విజయం వెనుక ఆమె కృషి, సహకారం ఎంతో ఉంది' అని సీఎం చంద్రబాబు అన్నారు. నారా భువనేశ్వరి దత్తత తీసుకున్న కృష్ణాజిల్లా పామర్రు మండలం కొమరవోలులో రూ.10 కోట్లతో పూర్తిచేసిన అభివృద్ధి పనులకు సీఎం ఆదివారం ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా సభలో మాట్లాడుతూ.. 'పిల్లలందరినీ చూసుకుంటూ ఎన్టీఆర్ ఎదుగుదలకు బసవతారకం తోడ్పాటు నందించారు. అందుకే ఎన్టీఆర్, బసవరామతారకం ఆదర్శ దంపతులుగా చరిత్ర సృష్టించారు. భువనేశ్వరి తనతల్లి పుట్టిన ఊరును దత్తత తీసుకుని అభివృద్ధి చేసినందుకు ఆమెను అభినందిస్తున్నాను. కొమరవోలు అభివృద్ధిని చూసి సంతోషపడుతున్నాను. నేను కూడా కొమరవోలును మా అత్తగారి గ్రామంగానే భావిస్తూ భవిష్యత్‌లో మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తాను' అని అన్నారు.



భువనేశ్వరిని పలకరిస్తున్న వృద్ధురాలు

న్యాయ కార్యకలాపాల కేంద్రంగా

అమరావతి

- 450 ఎకరాల్లో న్యాయ నగర నిర్మాణం
- తాత్కాలిక హైకోర్టు భవనాన్ని ప్రారంభించనున్న సీజేఐ
- మరో చారిత్రక ఘట్టానికి శ్రీకారం: సీఎం

అమరావతి, జనవరి 27(ఆంధ్రజ్యోతి): 'నవ్యాంధ్రప్రదేశ్‌లో ఫిబ్రవరి 3న తాత్కాలిక హైకోర్టు ప్రారంభం కానుంది. సీజేఐ జస్టిస్ రంజన్ గొగోయ్, న్యాయమూర్తులు జస్టిస్ ఎన్వీ రమణ, జస్టిస్ లావు నాగేశ్వరరావు, జస్టిస్ ఆర్.సుభాష్‌రెడ్డిలను ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆహ్వానించాను. ఈ మహత్తర ఘట్టం రాష్ట్ర చరిత్రలో నిలిచిపోనుంది. భవన ప్రారంభోత్సవానికి అవసరమైన ఏర్పాట్లన్నీ త్వరగా పూర్తి చేయండి' అని అధికారులను సీఎం ఆదేశించారు. హైకోర్టు నిర్మాణంపై ఆదివారం అధికారులతో చంద్రబాబు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొత్త రాజధానిలో న్యాయ కార్యకలాపాలు ప్రారంభమవడం తనకెంతో సంతోషంగా ఉందని చెప్పారు. రాబోయే రోజుల్లో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు దేశంలోనే ఉత్తమ న్యాయస్థానంగా నిలవాలని కోరుకుంటున్నానని చెప్పారు. అమరావతిలో న్యాయ నగరాన్ని నిర్మించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తున్నదని తెలిపారు. అమరావతిలో న్యాయనగరాన్ని 450 ఎకరాల్లో నిర్మిస్తామని, తొలిదశ 2022 నాటికి, రెండో దశ 2036కు పూర్తవుతుందని వివరించారు. సచివాలయం నిర్మాణంపై మంత్రి నారాయణ మాట్లాడుతూ 55 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంతో నిర్మిస్తున్న సచివాలయానికి సంబంధించిన ఐదు టవర్ల పనులు పురోగతిలో ఉన్నాయని తెలిపారు. 8.25 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణం, 250 మీటర్ల ఎత్తులో నిర్మించనున్న అసెంబ్లీ నిర్మాణ పనులనూ ప్రారంభించనున్నట్లు చెప్పారు. హైకోర్టు భవన సముదాయంలో జ్యుడీషియల్ భవనాలు, నివాసాలు, ఆర్బిట్రేషన్, ధ్యాన కేంద్రాలు, విద్యాసంస్థలు, ప్రైవేటు న్యాయసంస్థలు వంటివి ఉంటాయని సీఆర్‌డీఏ ముఖ్యకార్యదర్శి అజయ్‌జైన్ వివరించారు. హైకోర్టు కాంప్లెక్స్‌ను 42 ఎకరాల్లో రూ.1400 కోట్లతో నిర్మిస్తున్నామని సీఆర్‌డీఏ కమిషనర్ శ్రీధర్ తెలిపారు. సీఎస్ పునేఠ, సీఎం ప్రత్యేక ప్రధానకార్యదర్శి సతీశ్ చంద్ర, ముఖ్యకార్యదర్శి సాయప్రసాద్, ఏడీసీ చైర్‌పర్సన్ లక్ష్మీపార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

హోదా కోసం ఒక్కటిగా..!

- ఎన్నికల్లో ఎవరికి వారుగా పోటీ చేద్దాం
- ఏపీ కోసం ఒక్కటిగా నిలుద్దాం
- జగన్ కలిసి రావడం లేదు
- మోదీ హోదా మర్చి పోయారు: పవన్



గుంటూరు జనసేన శంఖారావంలో ప్రసంగిస్తున్న పవన్ కల్యాణ్, సభకు హాజరైన జనం

గుంటూరు, జనవరి 27(ఆంధ్రజ్యోతి): ప్రత్యేక హోదా కోసం అందరం కలిసి రావాలంటే వైసీపీ రావడం లేదని జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ అన్నారు. అన్ని పార్టీలు ఏకమై విభజన సమస్యలపై పోరాటం చేయాలని, ఆంధ్రప్రదేశ్ ప్రజల ఆత్మగౌరవం, సమస్యలపై ఏకతాటిపైకి వద్దామని పిలుపిచ్చారు. ఆదివారం గుంటూరులో జరిగిన జనసేన శంఖారావ సభలో పవన్ కల్యాణ్ మాట్లాడారు. తొలుత జనసేన పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించిన ర్యాలీగా సభా ప్రాంగణానికి చేరుకొన్నారు. చిరుజల్లుల్లోనే ఆయన ఉపన్యాసం కొనసాగించారు. 'ప్రత్యేక హోదాను బీజేపీ నేతలు, ప్రధాని మోదీ మర్చిపోయారు. మనం మర్చిపోలేదు. సీఎం అప్పుడప్పుడూ గజనిలా మర్చిపోతారు. ఆయనకు ఆరు నెలలకోసారి గుర్తుకొస్తుంది. అప్పుడు హోదా అంటూ హడావుడి చేస్తారు. జగన్‌కు అసలు పట్టదు. 29న ఉండవల్లి అరుణ్‌కుమార్ ఏర్పాటు చేసిన సభకు జనసేన వెళ్తుంది. విభజన చట్టం ప్రకారం మనకు రావాల్సింది చాలా ఉన్నాయి. ఉద్యోగాలు, పరిశ్రమలు రావాలి. దీనిని జగన్ ఎందుకు మరిచిపోయారు. వైసీపీ వాళ్లు ఆలోచించుకోవాలి. ఎవరికి వారుగా పోటీ చేద్దాం. ఏపీ ప్రజల ఆత్మగౌరవం కోసం ఏకతాటిపైకి వద్దాం. ఆంధ్రుల ఆత్మగౌరవం హస్తినలో పిక్కటిల్లాలి' అని పేర్కొన్నారు. ఎలాగైతే ఏపీని అడ్డగోలుగా విభజించారో, అలానే ఉత్తరప్రదేశ్‌ని నాలుగు ముక్కలు చేసే రోజు వచ్చి తీరుతుందని ఆయన అన్నారు. ఇంకా ఆయన ఏమన్నారంటే..!

రాజకీయ ప్రక్షాళన జరగాలి

ఈ రాజకీయ వ్యవస్థకి ఒక చంద్రబాబు, ఒక జగన్ సరిపోరు. 30 ఏళ్లు సీఎంగా ఉండాలని జగన్ అంటారు. చంద్రబాబు ఉంటే తాను, లేకుంటే తన బాబు ఉండాలంటారు. ప్రజలకోసం జనసేనని ఏర్పాటు చేశాం. ఆనాడు పీఆర్పీని కాంగ్రెస్‌లో కలిపేసినా నేను నిలకడగా ఉన్నాను.

కేసీఆర్‌తో భేటీపై..!

గణతంత్ర దినోత్సవం రోజున గవర్నర్ కార్యక్రమం ఏర్పాటు చేస్తే వెళ్లాను. అక్కడ కేసీఆర్‌తో కలిసి మాట్లాడాను. పోరాటం చేసిన వాళ్లు, చట్టసభల్లో పదవుల్లో ఉన్న వారంటే నాకు గౌరవం, సంస్కారం. అంతే తప్పా వారికి తలవంచినట్లు కాదు. నేను ఏ రోజూ ఆంధ్రప్రదేశ్ ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టలేదు. నేను అందరిలా మోసం చేయను. ఏమి చేసినా ప్రజలకు చెప్పి, వారి ఆమోదంతోనే చేస్తాను. వెన్నుపోట్ల వ్యక్తిగా, మోసగాడిగా మాత్రం ఉండను. జగన్‌కు ప్రధాని అంటే భయం. చట్టసభలకు వెళ్లి పోరాటం చేయరు. నాకు జగన్ మీద ఎలాంటి వ్యక్తిగత కోపతాపాలు లేవు. అయితే వాళ్లు ప్రతిపక్ష పాత్ర పోషించకపోవడం వల్లే మాట్లాడాల్సి వస్తోంది.

రాత్రిళ్లు టీడీపీ నేతల ఇళ్లల్లో..!: కొంతమంది నాయకులు పగలు జనసేన అంటూ తిరుగుతూ.. రాత్రిళ్లు టీడీపీ నాయకుల ఇళ్లల్లో ఉంటున్నారు. మన చుట్టుపక్కలే వాళ్లు ఉన్నారు. అది నాకు తెలుసు. ఉదాహరణకు పగలంతా జనసేన అంటూ తిరిగే నేతలు రాత్రివెళ్లి గంటా ఇంట్లో ఉంటున్నారు. నేను అన్నాహజారేను కాదు. అవినీతితో కూడుకొన్న రాజకీయ వ్యవస్థ ప్రక్షాళన జరగాలంటే బురదలో దిగాల్సిందే. చాలామంది నాకు సలహాలిస్తుంటారు. రాజకీయాల్లో ఉన్న సీనియర్లు నిన్ను నలిపేస్తారని అంటుంటారు. నలిపేయడానికి, తొక్కేయడానికి నేను అంత బలహీనుడిని కాదు. సమస్యలు వస్తే సామరస్యంగా మాట్లాడతాను. అప్పటికీ గొడవ పెట్టుకొంటానంటే నీ తలో... నా తలో తెగుద్ది. నేను గుంటూరు బిడ్డని. పల్నాడు గాలి పీల్చినవాడిని, పౌరుషానికి, సంస్కారానికి కొదవ లేదు. ఒక ఎమ్మెల్యే, ఎంపీ పదవి లేకుండానే మీకోసం ఇంత పోరాటం చేశాను. నాకు పదవులు, సీఎం కావడం ముఖ్యం కాదు. మీరు ఎప్పుడు అధికారం ఇస్తే అప్పుడు ముఖ్యమంత్రినై సేవ చేస్తాను. గుంటూరు జిల్లాలో సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులను పవన్ ప్రకటించారు. నాదెండ్ల మనోహర్(తెనాలి అసెంబ్లీ), రావెల కిశోర్‌బాబు(నియోజకవర్గం చెప్పలేదు), తోట చంద్రశేఖర్(గుంటూరు లోక్‌సభ) నుంచి పోటీ చేస్తారన్నారు.



జ్యోతి వెలిగించి ఉత్సవాలను ప్రారంభిస్తున్న వెంకయ్య, కేవీ చౌదరి

పాదాభివందనం చేసిన వాళ్లే..

ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచారు

- ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు వెల్లడి

న్యూఢిల్లీ, జనవరి 27(ఆంధ్రజ్యోతి): "కష్టపడితే ఎవరూ నష్టపోరు. నేను కష్టపడే ఇంత వరకు వచ్చాను. ఎవరికీ పాదాభివందనం చేయలేదు. చేయను. గతంలో నేను ఓసారి ఎన్టీఆర్‌ను కలవడానికి వెళ్లాను. అక్కడ కొంతమంది ఆడపడుచులు ఆయనకు పాదాభివందనం చేస్తున్నారు. ఇది మంచిది కాదన్నాను. దానికి ఆయన స్పందిస్తూ 'అది వాళ్ల ప్రేమ' అని అన్నారు. కానీ, 6 నెలల తర్వాత కాళ్లు పట్టుకున్నవాళ్లందరూ ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచారు" అని ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. పదవులను బట్టి ప్రేమ ఉండరాదని స్పష్టం చేశారు. ఆదివారం ఢిల్లీలోని ఆంధ్ర అసోసియేషన్ ప్లాటినం జూబ్లీ వేడుకల్లో వెంకయ్య ప్రసంగించారు. 84 ఏళ్లుగా ఢిల్లీలోని తెలుగువారికి సేవలు అందిస్తున్న అసోసియేషన్‌ను అభినందించారు. ఆంధ్ర అసోసియేషన్ భవనంలో నూతనంగా నిర్మించిన గోదావరి ఆడిటోరియంను ఉపరాష్ట్రపతి ప్రారంభించారు.

'గ్లోబల్ ఇన్స్పిరేషనల్ బ్రాండ్‌గా నారాయణ'


అమరావతి, జనవరి 27: ప్రతిష్ఠాత్మకమైన వరల్డ్ కన్సల్టింగ్ రిసెర్చ్ కార్పొరేషన్ 2019 అవార్డును నారాయణ విద్యాసంస్థ గెలుచుకుందని నారాయణ గ్రూప్ ఓ ప్రకటనలో తెలిపింది. 2018-19 సంవత్సరానికి గ్లోబల్ ఇండియన్ ఇన్స్పిరేషనల్ బ్రాండ్‌గా తమ సంస్థ ఎంపికైందని వివరించింది. దేశవ్యాప్తంగా దాదాపు 500 బ్రాండ్ల ప్రభావాలను విశ్లేషించిన వరల్డ్ కన్సల్టింగ్ రిసెర్చ్ కార్పొరేషన్ తమ సంస్థకు ఈ అవార్డును ప్రకటించిందని పేర్కొంది. అలాగే సంస్థ చైర్మన్ కె.పునీత్, మేనేజింగ్ డైరెక్టర్ సింధూరలను ఇండియన్ ఇన్స్పిరేషనల్ గ్లోబల్ లీడర్స్‌గా ఎంపిక చేసిందని వివరించింది. శనివారం లండన్‌లో యూకే-ఇండియా బిజినెస్ కౌన్సిల్ సీఈవో రిచర్డ్ చేతుల మీదుగా ఈ అవార్డులు అందుకున్నట్టు తెలిపింది.

సర్వీసు రెగ్యులర్ చేయండి

- ప్రభుత్వానికి కాంట్రాక్టు ఫార్మసిస్టుల డిమాండ్

అమరావతి, జనవరి 27(ఆంధ్రజ్యోతి): కాంట్రాక్టు ఫార్మసిస్టులను రెగ్యులరైజ్ చేయాలని ఫార్మసిస్ట్ అసోసియేషన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఏపీ ఫార్మసిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఆదివారం విజయవాడలో జరిగింది. ఫార్మసిస్టులకు పెరుగుతున్న పనిభారం, ఫార్మసిస్టుల కొరత, భర్తీకాని పోస్టులు తదితర అంశాలపై చర్చించారు. రాష్ట్రంలో ఫార్మసి విద్యను అభ్యసించిన వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించి, ఫార్మసీరంగాన్ని కాపాడాలని అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎమ్.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు.

ప్రత్యామ్నాయ శక్తిగా సీపీఎం: రాఘవులు



మచిలీపట్నం టౌన్, జనవరి 27: ప్రస్తుత రాష్ట్ర రాజకీయ పరిస్థితులకు అనుగుణంగా టీడీపీ, వైసీపీలను ఎదుర్కొనేందుకు ప్రత్యామ్నాయంగా సీపీఎం ఎదుగుతోందని, ఇందుకు వామపక్షాలతోపాటు జనసేనతో కలిసి ప్రయాణిస్తున్నామని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు చెప్పారు. మచిలీపట్నంలో ఆదివారం 'వర్తమాన రాజకీయాలు-కర్తవ్యం' అనే అంశంపై జరిగిన సదస్సులో ఆయన ప్రసంగించారు. బీజేపీ పాలనలో ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నమయ్యిందని, జీఎస్టీ, నోట్ల రద్దు వల్ల సామాన్యులకు ఒరిగిందేమీ లేదన్నారు.

ఈవీఎం టాంపరింగ్‌కు నేనే సాక్ష్యం

- ఎలా చేయొచ్చో నిరూపిస్తా.. ఈసీకి సవాల్: వేదవ్యాస్



విజయవాడ, జనవరి 27: ఈవీఎం టాంపరింగ్ జరిగిందనడానికి తానే సాక్షినని.. అలా జరగడం వల్లే 2014లో నష్టపోయానని మచిలీపట్నం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ(ముడా) చైర్మన్ బూరగడ్డ వేదవ్యాస్ అన్నారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. టెక్నాలజీ అభివృద్ధి చెందిన అమెరికా, ఇంగ్లాండ్ లాంటి దేశాలలో బ్యాలెట్ ప్రక్రియనే కొనసాగిస్తున్నారని అన్నారు. శాటిలైట్‌నే మనం రిమోట్‌తో కంట్రోల్ చేస్తున్నాం, అలాంటి పక్కగదిలో ఉన్న ఈవీఎంలను టాంపరింగ్ చేయడం పెద్ద విశేషం కాదన్నారు. ఈవీఎంలను టాంపరింగ్ చేయవచ్చునని.. ఏ విధంగా టాంపరింగ్ చేయవచ్చో నిరూపించగలనని ఈసీకి సవాల్ విసిరారు. రాబోయే ఎన్నికల్లో ఈవీఎంల స్థానంలో బ్యాలెట్ పత్రాలు వినియోగించాలన్నారు.

పసుపు-కుంకుమపైనా విమర్శలా..?: పోతుల

అమరావతి, జనవరి 27(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి పీఠమే లక్ష్యంగా...ప్రభుత్వంపై ప్రతిదానికీ విమర్శలు చేస్తున్న వైసీపీ...చివరకు పసుపు-కుంకుమపైనా విమర్శలు చేయడం వారి దిగజారుడుతనానికి నిదర్శనమని తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు పోతుల సునీత పేర్కొన్నారు. వైఎస్ హయాంలో డ్వాక్రా మహిళలకు రూ.200 కోట్ల సాయం చేస్తే, ప్రస్తుత ప్రభుత్వం రూ.21 వేల కోట్లు సాయం చేసిందని ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు.

హైదరాబాద్‌లో సర్క్యూట్ బెంచ్

- పది రోజులపాటు వినియోగదారుల వివాదాల విచారణ

హైదరాబాద్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): జాతీయ వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ పది రోజులపాటు తాత్కాలికంగా సర్క్యూట్ బెంచ్‌ను హైదరాబాద్‌లో ఏర్పాటు చేస్తోంది. తెలుగు రాష్ట్రాల్లో పెండింగ్‌లో ఉన్న కేసులను సోమవారం నుంచి ఫిబ్రవరి ఎనిమిదో తేదీ వరకూ ఈ బెంచ్ విచారించనుంది. రెండు తెలుగు రాష్ట్రాల్లో 2,685 వరకూ కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. కోటి రూపాయలకు పైబడిన వివాదాలకు సంబంధించి సర్క్యూట్ బెంచ్‌లో అప్పీళ్లు దాఖలు చేసుకునే వెసులుబాటును వినియోగదారులకు కల్పించింది. ఈ మేరకు సోమవారం నుంచి ఫిబ్రవరి 8 వరకు ఆదర్శనగర్‌లోని తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ కాన్ఫరెన్స్ హాల్‌లో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన సర్క్యూట్ బెంచ్‌లో వినియోగదారుల భద్రతా చట్టం, 1986 ప్రకారం పెండింగ్‌లో ఉన్న కేసుల విచారణ చేపట్టనుంది. జాతీయ వినియోగదారుల కమిషన్ చైర్మన్ జస్టిస్ ఆర్కే అగర్వాల్, సభ్యురాలు ఎం.శిరీష నేతృత్వంలో ఏర్పాటైన బెంచ్ సోమవారం ఉదయం నుంచి కేసుల విచారణ చేపట్టనుంది. ఈ కేసుల విచారణకు హైదరాబాద్ వచ్చిన జాతీయ వినియోగదారుల వివాదాల పరిష్కారాల కమిషన్ చైర్మన్ జస్టిస్ అగర్వాల్‌ను రాష్ట్ర వినియోగదారుల వ్యవహారాల కార్యదర్శి సభర్వాల్ మర్యాదపూర్వకంగా కలిశారు.



ఏపీ ఎక్స్‌ప్రెస్‌లో ఢిల్లీ వెళుతున్న కొణతాల బృందానికి అనకాపల్లి రైల్వే స్టేషన్‌లో సంఘీభావం తెలుపుతున్న స్థానికులు

హామీలన్నీ అమలుచేయాలి

- కేంద్రానికి కొణతాల రామకృష్ణ డిమాండ్
- విశాఖ నుంచి ఢిల్లీకి 'జనఘోష రైలుయాత్ర'

విశాఖపట్నం, జనవరి 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విభజన చట్టంలో పేర్కొన్న అంశాలను, చట్టసభల సాక్షిగా ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఉత్తరాంధ్ర చర్చావేదిక కన్వీనర్ కొణతాల రామకృష్ణ కేంద్రాన్ని డిమాండ్ చేశారు. కొణతాల ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం విశాఖ నుంచి ఢిల్లీకి ఏపీ ఎక్స్‌ప్రెస్‌లో 'జనఘోష రైలుయాత్ర' బయలుదేరింది. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. విభజన చట్టంలో పేర్కొన్న ప్రత్యేకహోదా, రైల్వేజోన్, ఉత్తరాంధ్ర, రాయలసీమకు నిధులు, విశాఖ-చెన్నై పారిశ్రామిక కారిడార్, విద్యాసంస్థలకు నిధులు వంటి హామీల అమలు కోసం కేంద్రంపై ఒత్తిడి తీసుకురావడానికి ఇప్పటికే అన్ని పార్టీల మద్దతు కోరామన్నారు. మేధావులు రూపొందించిన నివేదిక, గతంలో పవన్‌కల్యాణ్ ఆధ్వర్యంలో ఏర్పాటైన ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీ ఇచ్చిన నివేదిక, తాజాగా రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన శ్వేతపత్రాల ఆధారంగా వాస్తవ నివేదికను ఈ నెల 31న ఢిల్లీలో కేంద్ర మంత్రులు, వివిధ రాజకీయ పార్టీలకు అందజేస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వానికి ఇవే చివరి బడ్జెట్ సమావేశాలు కావడంతో మరోసారి కేంద్రంపై ఒత్తిడి తీసుకురావడానికి బయలుదేరామన్నారు. తమ నిరసనలో భాగంగా ఢిల్లీలో ఐదు రోజులపాటు నల్లదుస్తులు ధరిస్తామని కొణతాల ప్రకటించారు. టీడీపీ, వామపక్షాలు, జనసేన, లోక్‌సత్తా నేతలు ఈ యాత్రలో పాల్గొన్నారు. రెండు ప్రత్యేక బోగీల్లో సుమారు 100 మంది సభ్యులు బయలుదేరి వెళ్లారు. 29వ తేదీ నుంచి వీరు ఢిల్లీలో నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నారు. కాగా, విజయవాడ వచ్చిన వీరికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ స్వాగతం పలికారు.

మోదీ హోదా హామీ ఇవ్వలేదు

- ప్రభుత్వ వైఫల్యాలు ఎండగడతాం.. 4 నుంచి బస్సుయాత్ర: కన్నా
- రాష్ట్రంలో అధికారమే బీజేపీ లక్ష్యం: వీర్రాజు

ఆదోని, ఏలూరు, జనవరి 27: అబద్ధాలు చెప్పడంలో చంద్రబాబు దిట్ట అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. కర్నూలు జిల్లా ఆదోనిలో ఆదివారం మాట్లాడారు. అవినీతిని కప్పిపుచ్చుకునేందుకే చంద్రబాబు రోజూ మోదీ పై విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు. ఏపీకి ప్రత్యేక హోదా ఇస్తామని మోదీ ఎప్పుడూ చెప్పలేదన్నారు. ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రానికి ఎన్డీయే ప్రభుత్వం రూ.లక్షల కోట్లు ఇచ్చిందన్నారు. ఈ మొత్తానికి లెక్కలు చూపించకుండా ముఖం చాటేస్తున్నారని ఆరోపించారు. తాను వంద ప్రశ్నలు వేస్తే ఒక్కదానికీ చంద్రబాబు సమాధానం చెప్పలేకపోతున్నారని, కమీషన్ల కోసమే పసుపు-కుంకుమ, సెల్‌ఫోన్ల పంపిణీ చేపట్టారన్నారు. పోలవరం ప్రాజెక్టుకు కేంద్రమే నిధులు ఇస్తోందన్నారు. వచ్చే నెల 4 నుంచి చేపట్టే బస్సుయాత్రలో రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడతామన్నారు. కాగా, రాష్ట్రంలో అధికారమే ధ్యేయంగా బీజేపీ ప్రణాళికలు రూపొందిస్తోందని, బస్సుయాత్ర ఇందులో భాగమేనని ఆ పార్టీ ఎమ్మెల్సీ సోము వీర్రాజు అన్నారు.

1న బంద్‌ను జయప్రదం చేయండి : చలసాని



తిరుపతి అర్బన్, జనవరి 27: ప్రత్యేక హోదా కోసం ఫిబ్రవరి ఒకటో తేదీన చేపట్టనున్న రాష్ట్ర బంద్‌ను జయప్రదం చేయాలని హోదా సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు చలసాని శ్రీనివాస్ కోరారు. తిరుపతిలో ఆదివారం మాట్లాడారు. ప్రత్యేక హోదాకు చట్టబద్ధత కల్పించడంలో కేంద్రం అన్యాయం చేస్తోందన్నారు.

జగన్‌తో దగ్గుబాటి భేటీ

- వైసీపీతో కలిసి నడవాలని నిర్ణయం
- జగన్‌తో హితేశ్ పయనం
- పురందేశ్వరి పార్టీ మారరు: దగ్గుబాటి



జగన్‌తో దగ్గుబాటి వెంకటేశ్వరరావు

అమరావతి/హైదరాబాద్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): వైసీపీతో కలిసి నడవాలని తన కుమారుడు హితేశ్ చెంచురామ్ నిర్ణయించినట్లు మాజీ మంత్రి దగ్గుబాటి వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ అంశంపై ఆ పార్టీ అధ్యక్షుడు జగన్‌తో సమావేశమై చర్చించారు. ఆదివారం హైదరాబాద్ లోటస్‌పాండ్‌లోని జగన్ నివాసంలో కుమారుడు హితేశ్‌తో కలసి జగన్‌తో దగ్గుబాటి భేటీ అయ్యారు. ఈ చర్చల్లో రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి, మాజీ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా తన స్వీయ రచనలు 'ది అదర్‌సైడ్ ఆఫ్ ది ట్రూత్', 'ప్రపంచ దేశాల పాలనా వ్యవహారాలు' పుస్తకాలను జగన్‌కు దగ్గుబాటి అందజేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు జగన్ పాదయాత్ర, సీఎం చంద్రబాబు పాలనపై చర్చించుకున్నారు. డ్వాక్రా సంఘాలకు పోస్టు డేటెడ్ చెక్కులు ఇవ్వడంపైనా.. ఐదో విడత రైతు రుణమాఫీ పైనా చర్చ సాగింది. తాము పార్టీ నియమావళి మేరకు నడచుకుంటామని.. తన కుమారుడు హితేశ్ పర్చూరు నుంచి వైసీపీ తరపున బరిలోకి దిగాలన్న యోచనలో ఉన్నారని జగన్‌కు దగ్గుబాటి వివరించారు.

అంతా ఒకపార్టీలో ఉండాలని లేదు!

ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర ఎన్నికల మేనిఫెస్టో కమిటీ చైర్మన్‌గా కేంద్ర మాజీ మంత్రి పురందేశ్వరి బాధ్యతలు నిర్వర్తించడం..ఆమె బీజేపీలో కొనసాగడం కూడా చర్చకు వచ్చాయి. 'జగన్ నాయకత్వంలో పనిచేసేందుకు హితేశ్ నిర్ణయించుకున్నాడు. కుమారుడి రాజకీయ ఆరంగేంట్రానికి అడ్డంకయ్యే పరిస్థితుల్లో దగ్గుబాటి పురందేశ్వరి రాజకీయాల నుంచి తప్పుకుంటారు. కుటుంబం మొత్తం ఒకే పార్టీలో ఉండాలని లేదు' అని దగ్గుబాటిస్పష్టం చేశారు. కాగా, పురందేశ్వరి రాజకీయానికి సంబంధించి దగ్గుబాటి చేసిన వ్యాఖ్యలు ఆసక్తిని రేపాయి. అలాగే జగన్‌తో అంతర్గతంగా జరిగిన సమావేశం వివరాలను వెల్లడించేందుకు ఆయన నిరాకరించారు. 'భవిష్యత్‌లో వైసీపీలో హితేశ్ ఏ విధంగా పని చేయాలనేదానిపై పార్టీ నిర్ణయిస్తుంది. పార్టీలో విధివిధానాల ప్రకారమే టికెట్ల కేటాయింపు ఉంటుంది. మా శ్రేయోభిలాషులు, సన్నిహితులతో మాట్లాడాకే వైసీపీలో ఎప్పుడు చేరాలనే విషయాన్ని వెల్లడిస్తాము. వైసీపీతో కలిసి పనిచేస్తున్నామనే సంకేతం ఇవ్వాలనే జగన్‌తో భేటీ అయ్యాం' అని పేర్కొన్నారు. జగన్‌ను తాను రెండేళ్లుగా గమనిస్తున్నానని, ఆయన పాదయాత్ర తీరును చూశానని చెప్పారు. ఏపీలో పాలన పూర్తిగా గాడితప్పిందని ఆరోపించారు.

ఏడుసార్లు మారారు: ఏలూరి

బీజేపీ, వైసీపీల తెరచాటు బాగోతానికి ముసుగు తొలగిందని టీడీపీ పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు విమర్శించారు. దగ్గుబాటి కుటుంబం బీజేపీ నుంచి వైసీపీలోకి చేరిందన్నారు. ఇప్పటికే దగ్గుబాటి కుటుంబం ఏడుసార్లు పార్టీ మారిందన్నారు. తమ పార్టీ అధినేత, సీఎం చంద్రబాబు చేసిన అభివృద్ధి టీడీపీని గెలిపిస్తుందని, పర్చూరు ప్రజలు దగ్గుబాటిని నమ్మబోరని పేర్కొన్నారు.

అంతా రాజ్యాంగ విరుద్ధం!

- పార్లమెంట్‌ను బైపాస్ చేశారు
- ఏపీ హైకోర్టు ఏర్పాటు తీరుపై జస్టిస్ చలమేశ్వర్



జస్టిస్ జాస్తి చలమేశ్వర్‌కు జీవన సాఫల్య పురస్కారం అందిస్తున్న బుద్ధప్రసాద్, రామయ్య, ఎన్నారై రంగనాథబాబు

హైదరాబాద్, జనవరి 27: ఆంధ్రప్రదేశ్ హైకోర్టును ఏర్పాటు చేసిన విధానం రాజ్యాంగ విరుద్ధంగా ఉందని సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ జాస్తి చలమేశ్వర్ అన్నారు. ఫిబ్రవరి 3వ తేదీన తాత్కాలిక హైకోర్టు భవనం ప్రారంభోత్సవానికి అమరావతికి వెళ్లాలా? వద్దా? అన్నది సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగోయే తేల్చుకోవాలని ఆయన స్పష్టం చేశారు. ఒక జాతీయ మీడియా సంస్థతో మాట్లాడుతూ జస్టిస్ చలమేశ్వర్ ఈ వ్యాఖ్యలు చేశారు. పార్లమెంట్‌ను తోసిరాజని రాష్ట్రపతి ఉత్తర్వుల ద్వారా హైకోర్టును ఏర్పాటు చేయడం ఘోరమైన రాజ్యాంగ ఉల్లంఘనగా ఆయన వివరించారు. 'అందుకే.. ఆయన రాక వల్ల ఈ లోపాలు సమసిపోతాయో లేదో జస్టిస్ గొగోయ్ తేల్చుకోవాలి' అని పేర్కొన్నారు. వాస్తవానికి 2019 జనవరి 1వ తేదీ నుంచీ కొత్త ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఏర్పాటవుతుందని పేర్కొంటూ గత ఏడాది డిసెంబరు 26న రాష్ట్రపతి నోటిఫికేషన్‌తో గజిట్ విడుదలైంది. తాత్కాలిక హైకోర్టు భవనం పూర్తి కాకపోవడంతో విజయవాడలోని సీఎం క్యాంప్ ఆఫీసులో ప్రస్తుతం కోర్టు కార్యకలాపాలు జరుగుతున్నాయి. రాజ్యాంగం ప్రకారం పార్లమెంట్ చెప్పిన తర్వాతే కొత్త హైకోర్టు ఏర్పాటుకు రాష్ట్రపతి నోటిఫై చేయ్యాల్సి ఉంటుందని జస్టిస్ చలమేశ్వర్ చెప్పారు. 'హైకోర్టుల ఏర్పాటుపై అనుసరించాల్సిన విధానం గురించి రాజ్యాంగంలో వివరించారు. కానీ, ఈ విషయంలో పార్లమెంట్‌ను పూర్తిగా దాటవేశారు. పార్లమెంట్ ఒక తేదీని నిర్ధేశించి రాష్ట్రపతి దగ్గరకు ఒక బృందాన్ని పంపుతుంది. గతంలో ఇలాగే జరిగింది. గతంలో హైకోర్టుల ఏర్పాటు విషయంలో ప్రతీదీ ఒక పద్ధతి ప్రకారం వెళ్లారు. ఒక తేదీని, ప్రదేశాన్ని నిర్ణయించేవారు.

బిహార్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల పునర్విభజన చట్టాలలో హైకోర్టు ఏర్పాటుపై అపాయింటెడ్ తేదీని పేర్కొన్నారు. కానీ, ఇప్పుడలా లేదు. దేశంలోని ప్రతీ రాజ్యాంగ వ్యవస్థ ఇలా తయారైతే ప్రజాస్వామ్యం మనుగడ సాగిస్తుందన్న నమ్మకం నాకు లేదు. ఆ దేవుడే మన దేశ ప్రజాస్వామ్యాన్ని కా పాడాలి' అని చలమేశ్వర్ ఆందోళన వ్యక్తం చేశారు.

నిజాన్ని నిర్భయంగా చెప్పాలి

చల్లపల్లి: నిజాన్ని నిర్భయంగా చెప్పడం ప్రతి విద్యార్థీ అలవరచుకోవాలని జస్టిస్ జాస్తి చలమేశ్వర్ ఉద్బోధించారు. కృష్ణాజిల్లా చల్లపల్లిలో శ్రీవిజయా అకాడమీ వార్షికోత్సవంలో జస్టిస్ చలమేశ్వర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రవాస భారతీయులు గొర్రెపాటి రంగనాథబాబు విజయా అకాడమీ వార్షికోత్సవ సందర్భంగా ఏటా అందించే జీవన సాఫల్య పురస్కారాన్ని జస్టిస్ చలమేశ్వర్‌కు అందచేశారు.

ఆంధ్రజ్యోతి

స్పోర్ట్స్

విజయవాడ ● సోమవారం 28 జనవరి 2019

ఆస్ట్రేలియన్ ఓపెన్ టైటిళ్లు కొట్టాడిలా..



జొకోవిచ్-నడాల్ టైటిల్ పోరు అనగానే అభిమానులు మరో హోరాహోరీ సమరాన్ని ఎంజాయ్ చేయొచ్చనుకున్నారు.. కానీ టైటిల్ ఫైట్ వరకూ ఒక్క సెట్ కూడా కోల్పోకుండా ప్రత్యర్థులను అలవోకగా చిత్తుచేస్తూ వచ్చిన స్పెయిన్ బుల్ అసలు సిసలు పోరులో చతికలపడ్డాడు. నెంబర్ వన్ జొకోముందు నిలువలేకపోయాడు. ఫలితంగా ఉత్కంఠగా సాగుతుందనుకున్న ఫైనల్ ఏకపక్షమైంది. మరోవైపు వరుసగా ఏడో ఆస్ట్రేలియన్ ఓపెన్ టైటిల్ గెలుపే లక్ష్యంగా బరిలోకి దిగిన సెర్బియా వీరుడు జొకో తొలిరౌండ్‌నుంచే అదరగొడుతూ ఫైనల్లోనూ అదేస్థాయి ప్రదర్శనతో నడాల్‌ను మట్టికరిపించాడు. తద్వారా తన నెంబర్ వన్ ర్యాంక్‌కు సార్థకత చేకూర్చాడు. గాయాలనుంచి కోలుకొని పునరాగమనం చేశాక అమోఘ ఆటతీరు ప్రదర్శిస్తూ మొన్న వింబుల్డన్, నిన్న యూఎస్ ఓపెన్, నేడు ఆస్ట్రేలియన్ ఓపెన్..వరుసగా మూడుగ్రాండ్‌స్లామ్‌లతో తనకెవరూ సాటిలేరని నిరూపించుకున్నాడు.



ఆస్ట్రేలియన్ ఓపెన్‌ను అత్యధికంగా ఏడుసార్లు గెలిచిన ఏకైక ఆటగాడు జొకోవిచ్. ఫెడరర్, రాయ్ ఎమర్సన్ చెరో ఆరుసార్లు ఈ టైటిల్ నెగ్గి తర్వాతి స్థానంలో ఉన్నారు.

7 కొట్టేశాడు

- జొకోవిచ్‌దే ఆస్ట్రేలియన్ ఓపెన్
- ఏడో టైటిల్‌తో కొత్త చరిత్ర
- ఫైనల్లో నడాల్ పరాజయం

మెల్‌బోర్న్: గాయాల బెడదకు బెదిరిపోలేదు.. కుటుంబ కలహాలకు కుంగిపోలేదు.. ఆత్మస్థయిర్యం, ఆటపై మక్కువ, అకుంఠిత పట్టుదల.. వెరసి 31 ఏళ్ల సెర్బియా వీరుడు నొవాక్ జొకోవిచ్‌ను టెన్నిస్‌లో మళ్లీ అందనంత ఎత్తుకు తీసుకుపోయాయి. పునరాగమనం తర్వాత వింబుల్డన్, యూఎస్ ఓపెన్ టైటిళ్లు చేజిక్కించుకొని ఎనలేని ఆత్మవిశ్వాసాన్ని కూడగట్టుకున్న జొకో..ఆస్ట్రేలియన్ ఓపెన్‌లోనూ తన విజయపరంపర కొనసాగించాడు. ఆదివారం జరిగిన ఫైనల్లో వరల్డ్ నెంబర్ వన్ జొకో 6-3, 6-2, 6-3తో వరుస సెట్లలో నెంబర్ టు నడాల్‌పై విజయం సాధించాడు. తద్వారా రికార్డు స్థాయిలో ఏడోసారి ఆస్ట్రేలియన్ ఓపెన్ టైటిల్ పట్టేశాడు. ఈనేపథ్యంలో ఆరుసార్లు ఇక్కడ విజేతలుగా నిలిచిన దిగ్గజ ఆటగాళ్లు రోజర్ ఫెడరర్, రాయ్ ఎమర్సన్‌లను పక్కకు నెట్టాడు. రెండు గంటల నాలుగు నిమిషాల్లోన్లే ప్రత్యర్థిని చిత్తుచేసిన హాట్‌ఫేవరెట్ నొవాక్.. 15వ గ్రాండ్‌స్లామ్ తన ఖాతాలో వేసుకున్నాడు. అంతేకాదు..సంప్రాస్ (14)ను అధిగమించి అత్యధిక గ్రాండ్‌స్లామ్‌లు గెలిచిన ఆటగాళ్ల జాబితాలో మూడోస్థానంలో నిలిచాడు.

నాటి ఫైనల్ గుర్తుకొస్తుండగా..: 2012 ఆస్ట్రేలియన్ ఓపెన్ ఫైనల్ ఉద్విగ్నభరిత క్షణాలు గుర్తుకొస్తుండగా ఆదివారంనాడూ అదేస్థాయి సమరం పునరావృతమవుతుందని అటు అభిమానులు, ఇటు విశ్లేషకులు అంచనా వేశారు. ఐదు సెట్లు, ఐదు గంటలా 53 నిమిషాలు జరిగి గ్రాండ్‌స్లామ్ చరిత్రలో అత్యంత సుదీర్ఘంగా సాగిన మ్యాచ్‌గా రికార్డు సృష్టించిన నాటి ఫైనల్లో విజయం జొకోనే వరించింది. దాంతో ఈసారీ టైటిల్‌ఫైట్ అలాగే పోటాపోటీగా జరగనుందని భావించారు. కానీ ఆరంభంలోనే 32 ఏళ్ల నడాల్ ఒత్తిడికి లోనుకాగా.. దాన్ని సద్వినియోగం చేసుకున్న నొవాక్ మ్యాచ్‌పై పట్టుబిగించేశాడు. నడాల్ తొలి సర్వీస్‌నే బ్రేక్‌చేసిన జొకో..36 నిమిషాల్లోనే మొదటి సెట్‌ను చేజిక్కించుకున్నాడు. రెండో సెట్‌లోనూ నొవాక్ అదే దూకుడు కనబరచడంతో నడాల్ బాగా ఒత్తిడికి లోనయ్యాడు. ఇదే అదనుగా విజృంభించిన జొకో.. మరింత సునాయాసంగా 6-2తో ఆ సెట్‌ను నెగ్గాడు. మూడో సెట్ మూడో గేమ్‌లో నడాల్ సర్వీస్ బ్రేక్ చేసిన నొవాక్.. ఆపై సెట్‌ను, మ్యాచ్‌ను గెలుపొందేందుకు ఎంతో సమయం పట్టలేదు. విజయం సాధించిన వెంటనే మోకాళ్లపై కోర్టులో కూర్చుని రెండు చేతులు ఆకాశం వైపు చూపుతూ జొకో విజయనాదం చేశాడు.



గత నాలుగు గ్రాండ్‌స్లామ్స్‌లో మూడింటిని గెలుచుకోవడం అద్భుతంగా ఉంది. ఈ విజయాన్ని వర్ణించడానికి మాటలు రావడం లేదు.
- జొకోవిచ్

ఫైనల్లో ఎవరెలా..

జొకోవిచ్		నడాల్
8	ఏస్‌లు	3
0	డబుల్ ఫాల్ట్‌లు	2
9	అనవసర తప్పిదాలు	28
89	పాయింట్లు	53
34	విన్నర్లు	21

1 ఇటీవల వరుసగా మూడు గ్రాండ్‌స్లామ్ టైటిళ్లు గెలిచిన తొలి ఆటగాడు జొకోవిచ్. 2018లో వింబుల్డన్, యూఎస్ ఓపెన్ గెలిచిన జొకోవిచ్ 2019లో ఆస్ట్రేలియన్ ఓపెన్ నెగ్గాడు.

2013 యూఎస్ ఓపెన్ ఫైనల్ తర్వాత హార్డ్ కోర్ట్‌లో జొకోవిచ్ పై నడాల్ ఒక్కసారీ గెలవలేదు.

3 అత్యధిక గ్రాండ్ స్లామ్‌లు నెగ్గిన ఆటగాళ్ల జాబితాలో జొకోవిచ్ (15) ది మూడోస్థానం. ఫెడరర్ (20), నడాల్ (17) తొలి రెండుస్థానాల్లో ఉన్నారు.

13 నడాల్‌తో తలపడిన గత 16 మ్యాచుల్లో 13సార్లు జొకోదే విజయం. ఓవరాల్‌గా ఇద్దరూ 53సార్లు తలపడితే జొకో 28 మ్యాచ్‌ల్లో పైచేయి సాధించాడు.



నిరీక్షణ ఫలించె..

- సైనాకు ఇండోనేసియా టైటిల్
- ఫైనల్లో మారిన్ రిటైర్డ్ హర్ట్

జకర్తా: భారత ఏస్ షట్లర్ సైనా నెహ్వాల్ సుదీర్ఘ నిరీక్షణ ఫలించింది. రెండేళ్లక్రితం చివరి టైటిల్ నెగ్గిన సైనా తాజాగా ఇండోనేసియా ఓపెన్ విజేతగా నిలిచింది. ఆదివారం జరిగిన ఫైనల్లో ప్రత్యర్థి కరోలినా మారిన్ (స్పెయిన్) కాలి గాయంతో వైదొలగడంతో సైనా టైటిల్‌ను సొంతం చేసుకుంది. తొలి గేమ్‌లో సైనా 4-10తో వెనుకంజలో ఉన్న సమయంలో ఒలింపిక్ చాంపియన్ మారిన్ కాలి నొప్పితో రిటైర్డ్ హర్ట్‌గా వైదొలిగింది. 'మా అందరికీ ఈ ఏడాది ఎంతో కీలకం. ఒక ప్లేయర్ నొప్పితో విలవిల్లాడడం ఎంతో బాధ కలిగించింది. రియో ఒలింపిక్ సమయంలో నా మోకాలికీ గాయమైంద'ని నెహ్వాల్ గుర్తుచేసింది. ఇలా టైటిల్‌ను నెగ్గడం తనకు ఏమాత్రం ఆనందం కలిగించలేదని తెలిపింది. కానీ, ఒకుహర, దినార్, హిబింగ్జియావో లాంటి గట్టి ప్రత్యర్థులను ఓడించి ఫైనల్‌కు చేరడం సంతోషించదగ్గ విషయమంది. తొలి గేమ్ ఆరంభం నుంచే దూకుడుగా ఆడిన మారిన్ 2-0తో ముందంజలో నిలిచింది. కానీ, లాంగ్ ర్యాలీలో ప్రత్యర్థి షాట్ నెట్‌కు తగలడంతో సైనా తొలి పాయింట్ సాధించింది. షాట్‌లను నియంత్రించలేక కోర్టుబయటకు కొట్టడంతో కరోలినా 6-2తో మరింత ఆధిక్యం సాధించింది. అదేజోష్‌లో మారిన్ 9-2తో మరింత ముందుకెళ్లింది. కానీ, షాట్ ఆడే క్రమంలో కుడి మోకాలు బెణకడంతో నొప్పితో కోర్టులోనే కుప్పకూలింది. చికిత్స తీసుకొని మళ్లీ బరిలోకి దిగిన కరోలిన్ 10-4తో ఆధిక్యంలో ఉన్న సమయంలో మరోసారి నొప్పి తట్టుకోలేక కోర్టులోనే విలవిల్లాడింది. దీంతో రిటైర్డ్ హర్ట్‌గా మ్యాచ్ నుంచి తప్పుకొంది.


నొప్పితో కోర్టులో కుప్పకూలిన మారిన్

'గులాబీ' వన్డేలో సఫారీలకు పాక్ షాక్

జోహన్నెస్‌బర్గ్: దక్షిణాఫ్రికాతో జరిగిన నాలుగో వన్డేలో పాకిస్థాన్ జట్టు 8 వికెట్ల తేడాతో గెలిచింది. దీంతో ఐదు వన్డేల సిరీస్‌లో 2-2తో సమంగా నిలిచింది. నిర్ణాయక వన్డే 30న కేప్‌టౌన్‌లో జరుగుతుంది. బ్రెస్ట్ క్యాన్సర్‌పై అవగాహన పెంచేందుకు ఆదివారం పింక్ జెర్సీలతో బరిలోకి దిగిన ఆతిథ్య జట్టు 41 ఓవర్లలో 164 పరుగులు మాత్రమే చేసింది. హషీమ్ ఆమ్లా (59), డుప్లెసిస్ (57) అర్ధ సెంచరీలు చేశారు. పేసర్ ఉస్మాన్ ఖాన్ నాలుగు వికెట్లు తీశాడు. ఆతర్వాత పాక్ జట్టు 31.3 ఓవర్లలో 2 వికెట్లకు 168 పరుగులు చేసి గెలిచింది. ఓపెనర్లు ఇమామ్ ఉల్ హక్ (71), ఫఖర్ జమాన్ (44), బాబర్ ఆజమ్ (41) రాణించారు. అయితే 'గులాబీ' వన్డేల్లో ఓడడం సఫారీలకు ఇదే మొదటిసారి.



సర్ఫరాజ్‌పై నాలుగు మ్యాచ్‌ల నిషేధం

దుబాయ్: పాకిస్థాన్ క్రికెట్ జట్టు కెప్టెన్ సర్ఫరాజ్ అహ్మద్‌పై అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) కొరడా ఝుళిపించింది. దక్షిణాఫ్రికా ఆల్‌రౌండర్ ఆండిలె ఫెలుక్వాయోపై జాతి వివక్ష వ్యాఖ్యలు చేసినందుకు నాలుగు మ్యాచ్‌ల నిషేధం విధించింది. అయితే ఈ విషయాన్ని ఐసీసీ మొదట గోప్యంగానే ఉంచింది. ఆదివారం జరిగిన నాలుగో వన్డేలో టాస్ వేసేందుకు పాక్ తరఫున షోయబ్ మాలిక్ రావడంతో విషయం బయటపడింది. దీంతో ఐసీసీ కూడా సర్ఫరాజ్ నిషేధాన్ని ధ్రువీకరిస్తూ ప్రకటన విడుదల చేసింది. చివరి వన్డేతో పాటు వచ్చేనెల 1 నుంచి జరిగే టీ20 సిరీస్‌లోని తొలి రెండు మ్యాచ్‌లకు సర్ఫరాజ్ దూరం కానున్నాడు. ఈ సమయంలో జట్టుకు షోయబ్ సారథిగా వ్యవహరిస్తాడు. సర్ఫరాజ్ తాను చేసిన తప్పును అంగీకరించాడని, ఇది తమ జాతి వివక్ష వ్యతిరేక కోడ్‌ను ఉల్లంఘించడమేనని ఐసీసీ పేర్కొంది. మంగళవారం జరిగిన రెండో వన్డేలో ఫెలుక్వాయోనుద్దేశించి 'ఒరేయ్.. నల్లోడా! ఈరోజు మీ అమ్మ ఎక్కడ కూర్చుంది? నీకు ఏం కావాలని ఆమెను అడిగావు' అని సర్ఫరాజ్ దూషించిన వ్యాఖ్యలు స్టంప్స్‌మైక్‌లో రికార్డు కావడం తీవ్ర సంచలనం సృష్టించింది.

రాహుల్.. అదే ఆట

భారత్ 'ఎ'దే సిరీస్



తిరువనంతపురం: బీసీసీఐ సస్పెన్షన్ ఎత్తివేసిన తర్వాత ఆడిన తొలి మ్యాచ్‌లో కేఎల్ రాహుల్ నిరాశపరిచాడు. ఇంగ్లండ్ లయన్స్‌తో జరిగిన మూడో వన్డేలో 25 బంతుల్లో 13 పరుగులే చేశాడు. అయితే కృనాల్ పాండ్యా (4/21) అద్భుతంగా రాణించడంతో ఆదివారం జరిగిన ఈ మ్యాచ్‌లో భారత్ 'ఎ' జట్టు 60 పరుగుల తేడాతో నెగ్గింది. దీంతో ఐదు వన్డేల సిరీస్‌ను మరో రెండు మ్యాచ్‌లు మిగిలి ఉండగానే 3-0తో నెగ్గింది. ముందుగా భారత్ 'ఎ' 47.1 ఓవర్లలో 172 రన్స్‌కు ఆలౌటైంది. ఇషాన్ కిషన్ (30), ఆఖర్లో దీపక్ చాహర్ (39) మెరుగ్గా ఆడి జట్టుకు ఓ మాదిరి స్కోరును అందించారు. ఆ తర్వాత స్పిన్నర్ కృనాల్ పాండ్యా ధాటికి ఇంగ్లండ్ లయన్స్ 30.5 ఓవర్లలో 112 పరుగులకే కుప్పకూలింది.

సిరీస్ లక్ష్యంగా..

తాజా ఐదు వన్డేల సిరీస్‌లో భారత్‌కు ఇప్పటిదాకా ఎదురు లేదు. ఇదే ఊపులో మరో విజయం సాధిస్తే చాలు.. దశాబ్దకాలంగా కివీస్‌లో ఊరిస్తున్న వన్డే సిరీస్ టీమిండియా ఖాతాలో చేరుతుంది. అదీగాకుండా కెప్టెన్ విరాట్ కోహ్లీకి ఈ టూర్‌లో ఇదే చివరి మ్యాచ్. దీంతో హ్యాట్రిక్ విజయంతో పాటు సిరీస్ సాధించిన తృప్తితో అతడు స్వదేశానికి బయలుదేరాలనుకుంటున్నాడు. ఇక ఇటీవల వివాదాల్లో ఇరుక్కుని జట్టులో చేరిన ఆల్ రౌండర్ హార్దిక్ పాండ్యా బరిలోకి దిగే అవకాశం ఉంది.



న్యూజిలాండ్‌తో భారత్ మూడో వన్డే నేడు ● తుది జట్టులో హార్దిక్ పాండ్యా!

ఉదయం 7.30 నుంచి స్టార్ స్పోర్ట్స్ 1, 3లో

మౌంట్ మాంగనూ: భీకరంగా కనిపిస్తున్న బ్యాటింగ్ లైనప్.. వణికిస్తున్న బౌలర్ల అండతో కివీస్ గడ్డపై భారత జట్టు రెండో సిరీస్‌పై కన్నేసింది. సోమవారం ఇరుజట్ల మధ్య బే ఓవల్‌లోనే మూడో వన్డే జరగనుంది. కోహ్లీ సేన ఇప్పటికే ఈ సిరీస్‌లో 2-0తో ఆధిక్యంలో ఉంది. అలాగే ఐదేళ్ల క్రితం 0-4తో ఎదురైన దారుణ ఓటమికి భారత్ బదులు తీర్చుకోవాలనుకుంటోంది. ఇక ఆతిథ్య జట్టు పరిస్థితి ఘోరంగా ఉంది. సొంత వేదికల్లో ఉమ్మడిగా విఫలమవుతోంది. భారత స్పిన్ ద్వయాన్ని ఎలా ఎదుర్కోవాలో వారికి అర్థం కావడం లేదు. సిరీస్‌లో నిలవాలంటే వారికి ఈ మ్యాచ్ విజయం అత్యంత కీలకం. అందుకే బ్యాట్స్‌మెన్‌తో పాటు బౌలర్లు సమష్టిగా రాణించి ఈ కీలక వన్డేలో గెలవాలనే పట్టుదలతో ఉంది.

హార్దిక్‌పై దృష్టి..



మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు రెండు వారాలుగా సస్పెన్షన్‌లో ఉన్న ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యాకు లైన్ క్లియర్ కావడంతో జట్టులోకి వచ్చాడు. ఈ మ్యాచ్‌లో అతడిని విజయ్ శంకర్ స్థానంలో ఆడించే అవకాశాలు కనిపిస్తున్నాయి. రెండో వన్డేలో విజయ్ శంకర్‌తో కోహ్లీ కేవలం రెండు ఓవర్లే వేయించాడు. అయితే ఐదో బౌలర్ స్థానాన్ని పాండ్యా సమర్థవంతంగా భర్తీ చేయగలడు. పది ఓవర్ల కోటా పూర్తి చేయడంతో పాటు అవసరమైతే ఆరో నెంబర్‌లోనూ బ్యాటింగ్‌కు దిగి వేగంగా పరుగులు సాధించే సత్తా ఉంది. ఈ మ్యాచ్‌తోనే సిరీస్‌ను పట్టేయాలనే ఆలోచనలో ఉన్న కెప్టెన్ కచ్చితంగా పాండ్యా వైపే మొగ్గుచూపుతాడనడంలో సందేహం లేదు. అయితే తగినంత మ్యాచ్ ప్రాక్టీస్ లేకపోవడం అతడికి మైనస్సే. ధవన్, రోహిత్‌ఫామ్ కారణంగా జట్టుకు శుభారంభాలు అందుతున్నాయి. విరాట్ కోహ్లీ భారీఇన్నింగ్స్ ఆడాల్సి ఉంది. అంబటి రాయుడు, ధోనీ, జాదవ్ రాణిస్తుండడంతో జట్టుకు ఎదురు లేకుండా పోతోంది. బౌలింగ్‌లో స్పిన్నర్లు కుల్దీప్, చాహల్ కలిసి 12 వికెట్లతో ఆధిపత్యం చూపారు. పేసర్లు భువనేశ్వర్, షమి పరుగులను కట్టడి చేయడంతో పాటు కీలక సమయాల్లో కివీస్ భాగస్వామ్యాలను విడదీస్తున్నారు.

'కోహ్లీ సేన'తో జాగ్రత్త!

కివీస్ పోలీసుల హెచ్చరిక

భారత జట్టు విధ్వంసం నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని న్యూజిలాండ్ పోలీసులు హెచ్చరికలు జారీ చేశారు. తొలి వన్డేలో 8 వికెట్లతో నెగ్గిన టీమిండియా.. రెండో మ్యాచ్‌లో 90 పరుగులతో కివీస్‌ను మట్టికరిపించింది. కోహ్లీ అండ్ కో ప్రదర్శనకు ఫిదా అయిన ఈస్ట్రన్ డిస్ట్రిక్ట్ పోలీసులు.. సోషల్ మీడియా వేదికగా భారత జట్టు ప్రదర్శనను ప్రశంసిస్తూ ఇలా సరదాగా ఫేస్‌బుక్‌లో పోస్టు చేశారు. 'ప్రజలకు పోలీసుల హెచ్చరిక. విధ్వంసకారుల బృందం దేశంలో పర్యటిస్తోంది. గతవారం నేపియర్, మౌంట్ మాంగనూలో అమాయకంగా కనిపించే కివీస్ జట్టుపై కనికరం లేకుండా దాడులు చేయడమే అందుకు సాక్ష్యం. క్రికెట్ బ్యాట్, బాల్ లాంటి వస్తువులను మీతో ఉంచుకున్నట్లయితే మరింత అప్రమత్తంగా ఉండాల'ని పోస్టు పెట్టింది.

విండీస్ 'రికార్డు' విన్

ఇంగ్లండ్ చిత్తు చిత్తు
రోస్టన్ చేజ్‌కు 8 వికెట్లు



బ్రిడ్జిటౌన్: ఫార్మాట్ ఏదైనా ఇంటా.. బయటా చెత్త ఆట తీరుతో తీవ్ర విమర్శలు ఎదుర్కొంటున్న వెస్టిండీస్ జట్టు నుంచి కళ్లు చెదిరే ప్రదర్శన. సమష్టిగా ఆడితే ఎలా ఉంటుందో నిరూపిస్తూ తొలి టెస్టులో పటిష్ఠ ఇంగ్లండ్ జట్టును ఏకంగా 381 పరుగులతో చిత్తుచిత్తుగా ఓడించి రికార్డు విజయాన్ని అందుకుంది. సొంతగడ్డపై పరుగుల పరంగా విండీస్‌కు ఇదే భారీ విజయం కాగా.. అటు ఇంగ్లండ్ వరుసగా ఐదు టెస్టుల విజయానికి బ్రేక్ పడినట్టయింది. 628 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన ఇంగ్లండ్ శనివారం నాలుగోరోజు రెండో ఇన్నింగ్స్‌లో 246 పరుగులకే కుప్పకూలింది. వికెట్ ఫ్లాట్‌గానే ఉన్నప్పటికీ పార్ట్‌టైమ్ ఆఫ్ స్పిన్నర్ రోస్టన్ చేజ్ ఒక్కడే 8వికెట్లు తీసి ఇంగ్లండ్ పతనాన్ని శాసించాడు. అతడి ధాటికి ఇంగ్లండ్ చివరి ఆరు వికెట్లను 31 రన్స్ తేడాతో కోల్పోయింది. దీంతో మరోరోజు ఆట మిగిలి ఉండగానే విండీస్ మూడు టెస్టుల సిరీస్‌లో 1-0తో ఆధిక్యం సాధించింది. మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌గా జేసన్ హోల్డర్ నిలిచాడు. విండీస్ తొలి ఇన్నింగ్స్‌లో 289 పరుగులు చేయగా.. ఇంగ్లండ్ 77 పరుగులకే కుప్పకూలింది. ఆ తర్వాత హోల్డర్ డబుల్ సెంచరీతో రెండో ఇన్నింగ్స్‌ను విండీస్ 415/6 స్కోరు వద్ద డిక్లేర్ చేసింది.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా!

కృష్ణానదిలో ఈత పోటీలు




విజయవాడ (ఆంధ్రజ్యోతి): 'ఈత అంటే ఏమిటో తెలియదు. ఎప్పుడూ ఈత నేర్చుకోవాలన్న ఆసక్తీ పుట్టలేదు. ఐపీఎస్‌కు ఎంపికైన తర్వాత మాత్రం ఈత నేర్చుకోవాల్సి వచ్చింది. ఈ ఉద్యోగంలో ఇది తప్పనిసరి. అప్పటి నుంచి ఈతను వదల్లేదు' అని విజయవాడ పోలీసు కమిషనర్ సీహెచ్ ద్వారకా తిరుమలరావు ఆనాటి జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకున్నారు. ఆక్వాడెవిల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కృష్ణా నదిలో ఈత పోటీలను ఆదివారం నిర్వహించారు. ఈ పోటీలను ద్వారకాతిరుమలరావు, నరసాపురం ఎంపీ గోకరాజు గంగరాజు దుర్గాఘాట్ దగ్గర జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎనిమిది విభాగాల్లో పోటీలు నిర్వహించగా.. 462 మంది పాల్గొన్నారు. చిన్నారులు, యువకులతో పాటు పోటీ వృద్ధులూ పాల్గొనడం విశేషం.



భూగర్భ జలాల్లో సూక్ష్మ ప్లాస్టిక్ కణాలు

వాషింగ్టన్, జనవరి 27: ప్రపంచ వ్యాప్తంగా 25 శాతం మంది జనాభాకు భూగర్భ జలాలే తాగునీటి వనరులు. అలాంటి జలం.. ప్లాస్టిక్ వల్ల కాలకూట విషంగా మారుతోంది. భూగర్భ జలవనరులు సూక్ష్మ ప్లాస్టిక్ కాలుష్య కణాలతో నిండిపోతున్నాయి. ఇప్పటికే భూ ఉపరితలంపై ప్లాస్టిక్‌తో ఎదురవుతున్న ముప్పును చూసి ఆందోళన చెందుతున్నాం. ఇప్పుడు అదే కాలుష్యం భూమి పొరల్లోకి చొచ్చుకుపోతుండటంపై అంతా కలవర పడుతున్నారు. ఈ అంశంపై అమెరికాకు చెందిన ఇల్లినాయిస్ సస్టెయినబుల్ టెక్నాలజీ సెంటర్ శాస్త్రవేత్తలు నిర్వహించిన పరిశోధనల్లో ఒళ్లు గగుర్పాటుకు గురిచేసే అనేక అంశాలు వెలుగుచూశాయి. వాటిని గ్రౌండ్‌వాటర్ అనే జర్నల్‌లో ప్రచురించారు. సెయింట్ లూయిస్ మెట్రోపాలిటన్ ప్రాంతంలో విరిగిన సున్నపురాయి ప్రదేశం నుంచి 11 భూగర్భ జలాల నమూనాలను సేకరించారు. వాయవ్య ఇల్లినాయిస్ గ్రామీణ ప్రాంతాల నుంచి మరో 6 భూగర్భ జల నమూనాలు తీసుకున్నారు. పరీక్షించి చూడగా కొన్ని నమూనాలలో లీటరు నీటిలో 15.2 మైక్రోప్లాస్టిక్ కాలుష్య కణాలను గుర్తించారు. ప్రస్తుతం ప్రపంచం ముందు ఉన్న అతిపెద్ద సవాల్ ఇదేనని పరిశోధకులు హెచ్చరిస్తున్నారు. 1940 నుంచీ 630 కోట్ల టన్నుల ప్లాస్టిక్ ఉత్పత్తి కాగా, అందులోని 79 శాతం భూమి పొరల్లోకి దిగి ప్రమాద ఘంటికలు మోగిస్తున్నట్లు చెబుతున్నారు.

అంతరిక్షంలో మంచు మనిషి.. అల్టిమా థూలే



సౌర కుటుంబానికి అత్యంత దూరంలో.. ప్లూటోకు సమీపంలోని క్యూపియర్ బెల్ట్ ప్రదేశంలో ఉన్న అంతుచిక్కని ఖగోళ వస్తువు అల్టిమా థూలే. 2014లో కనుగొన్న ఈ ఖగోళ వస్తువుకు అత్యంత సమీపం నుంచి జనవరి 1న అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ(నాసా)కు చెందిన న్యూహారిజాన్ వ్యోమనౌక వెళ్లింది. ఆ సమయంలో అల్టిమా థూలెకు కేవలం 6,700 కిలోమీటర్ల దూరం నుంచి తీసిన ఒక ఫొటోను తాజాగా నాసా విడుదల చేసింది. ఇది రెండు గోళాలు కలిసి మంచు మనిషిని పోలిన ఆకారంలో కనిపిస్తుందని ఈ నెల మొదట్లో విడుదల చేసిన ఫొటోల ద్వారా నాసా తెలిపింది. అయితే, ఇందులో ఒక గోళంలో చాలా గుంతలు ఉన్నాయని.. అవి ఒక్కోటి 700మీటర్ల వ్యాసంతో ఉన్నట్లు తాజా చిత్రం ఆధారంగా నాసా పేర్కొంది. ఇక తలలా ఉన్న చిన్న గోళంలో 4మైళ్ల వ్యాసంతో లోతైన గుంత ఉన్నట్లు తెలిపింది.

కంపెనీల చట్టం చట్రంలో ప్రియాంక!

- ఒకటికి మించి డిన్ ఖాతాలు
- చట్టప్రకారం శిక్షార్హురాలు
- సుబ్రమణియన్ స్వామి ఆరోపణలు
- జరిమానా చెల్లిస్తానన్న ప్రియాంక





న్యూఢిల్లీ, జనవరి 27: ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ.. కంపెనీల చట్టం ప్రకారం శిక్షార్హురాలని బీజేపీ నేత సుబ్రమణియన్ స్వామి ఆరోపించారు. ఆదివారం ఆయన విలేకరులకు పంపిన ఓ లేఖలో.. ప్రియాంకకు ఒకటికి మించి డైరెక్టర్ గుర్తింపు నంబర్లు (డిన్) ఉన్నాయని ఆరోపించారు. 'ఆమెకు 01038703, 01840144, 02914391 నంబర్లతో మూడు డిన్‌లు ఉన్నాయి' అని వెల్లడించారు. కంపెనీల చట్టం-1956లోని సెక్షన్లు 266సీ, 621ఏ ప్రకారం ఆమె శిక్షార్హులన్నారు. 'ఈ సెక్షన్ల ప్రకారం ఆరునెలల జైలు శిక్ష, రూ. 50 వేల వరకు జరిమానా విధించాల్సి ఉంటుంది' అని తెలిపారు. దీనిపై 2014లో ఫిర్యాదు చేసినట్లు వివరించారు. 'తెలియక జరిగిన పొరపాటు అంటూ కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ కార్యదర్శికి ఆమె సంజాయిషీ ఇచ్చుకున్నారు. జరిమానా చెల్లించేందుకు సిద్ధమయ్యారు. కానీ, ఇది పెద్ద నేరం. ఏ పౌరుడికీ రెండు డిన్‌లు ఉండకూడదు. డిన్ దరఖాస్తుకు పాన్ అవసరం. ఒకే పాన్ నంబరుపై రెండు డిన్‌లు జారీ అవ్వవు. దీన్ని బట్టి ప్రియాంక వద్ద మూడు పాన్‌కార్డులు ఉన్నట్లు తెలుస్తోంది. ఇది కూడా ఆదాయపన్ను చట్టం ప్రకారం పెద్ద నేరమే' అని వివరించారు. కేంద్ర మాజీ ఆర్థిక మంత్రి చిదంబరం కుమారుడు కార్తీచిదంబరం పేరిట కూడా ఒకటి కంటే ఎక్కువ డిన్‌లు ఉన్నాయని చెప్పారు.

ప్రియాంకకు మానసిక సమతౌల్యం లేదు

ప్రియాంక ఓ వ్యాధితో బాధపడుతోందని సుబ్రమణియన్ స్వామి ఆదివారం ఓ ట్వీట్ చేశారు. 'బైపోలారిటీ డిజార్డర్ అనే వ్యాధితో ప్రియాంక బాధపడుతోంది. దీని వల్ల ఆమెకు మానసిక సమతౌల్యం ఉండదు. ప్రజలపై దాడి చేస్తారు. ఆమె రాజకీయాల్లోకి వస్తే ప్రజలకు ఇబ్బందే' అని పేర్కొన్నారు.

ప్రియాంక.. మరో ఇందిర

- ఆమె కోసం దేశం ఎదురుచూస్తోంది
- బీజేపీ ఎంపీ అశ్వినీకుమార్ ప్రశంస



చండీగఢ్, జనవరి 27: "కాంగ్రెస్ నేత ప్రియాంక గాంధీ వాద్రా ప్రత్యక్ష రాజకీయాల్లోకి రావడం దేశానికి, ఉత్తరప్రదేశ్‌కు ఎంతో అవసరం" ఈ మాటలన్నదెవరో తెలుసా? సాక్షాత్తూ ఓ బీజేపీ ఎంపీ! హరియాణాలోని కర్నాల్ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న అశ్వినీకుమార్ చోప్రా కాంగ్రెస్ నేత ప్రియాంకను ఆకాశానికెత్తేశారు. ప్రముఖ హిందీ దినపత్రిక పంజాబ్ కేసరి ఎడిటర్ అయిన చోప్రా.. 'ప్రియాంక పరిమళం' పేరిట పత్రిక మొదటి పేజీలో సంపాదకీయం రాశారు. ప్రియాంకను ఆమె నాయనమ్మ ఇందిరా గాంధీతో పోల్చారు. ఇందిరకు ప్రతిరూపమైన ప్రియాంక రాక కోసం దేశం, ప్రత్యేకించి ఉత్తరప్రదేశ్ ప్రజలు ఎదురుచూస్తున్నారని రాశారు. మొదటి పేజీ సంపాదకీయంతో పాటు ఇందిర, ప్రియాంక ఫొటోలు పక్కపక్కనే పెట్టి రెండు పేజీల్లో వార్తలు ప్రచురించారు. కాంగ్రెస్ కుల, మతాలకు అతీతమైన పార్టీ అని కీర్తించారు. కాంగ్రెస్ ఎప్పుడూ పేదల సంక్షేమం కోసమే పనిచేస్తుందన్నారు. కుటుంబ రాజకీయాలంటూ విమర్శిస్తున్న ప్రతిపక్షాలపైనా ధ్వజమెత్తారు. అకాలీదళ్, శివసేన వంటి పార్టీలతో బీజేపీ పొత్తు పెట్టుకుందని.. అవి కుటుంబ పార్టీలు కావా? అని ప్రశ్నించారు. అశ్వినీకుమార్ తీరుపై బీజేపీ నాయకత్వం గుర్రుగా ఉంది. ఆయన్ను ఎంపిక చేసింది మోదీ కావడం విశేషం. 2014లో కర్నాల్ నుంచి బీజేపీ తరఫున బరిలో దింపగా విజయం సాధించారు. అయితే నాటి నుంచి ఆయన పార్టీతో అంటీముట్టనట్లుగానే ఉంటున్నారు. రాబోయే ఎన్నికల్లో తన భార్య కిరణ్ చోప్రాను కర్నాల్ నుంచి కాంగ్రెస్ టికెట్‌పై పోటీ చేయించేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. 2014లో ఇక్కడి నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో దిగిన అరవింద్ శర్మ బీజేపీలో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారు.

భయంతోనే కూటమి

అవినీతి వ్యతిరేక చర్యలతో వారిలో అలజడి.. మదురై, కొచ్చి సభల్లో మోదీ

చెన్నై, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): దక్షిణాదిలో ప్రధాని మోదీ ఎన్నికల శంఖారావం చేశారు. ఆదివారం ఆయన తమిళనాడు, కేరళల్లో పర్యటించారు. మదురైలో జరిగిన బహిరంగ సభలో, కొచ్చిలో బీజేపీ యువమోర్చా సదస్సులో ప్రసంగిస్తూ.. 'మహా కూటమి'పై విరుచుకుపడ్డారు. "దేశాన్ని దోచుకున్న, మోసగాళ్లందరినీ చట్టం ముందు నిలబెడదాం. వారు భారత్‌లో ఉన్నా... మరో దేశంలో దాక్కున్నా వదిలిపెట్టం" అంటూ పరోక్షంగా మాల్యా, నీరవ్ మోదీ, మెహుల్ చోక్సీ తదితరుల ప్రస్తావన తీసుకొచ్చారు. "దేశ సంపదకు కాపలాదారుగా ఉన్న నన్ను తప్పించేందు.. భయం, వ్యతిరేకతతోనే వారు గుంపుగా చేరారు" అని విపక్ష కూటమిపై ధ్వజమెత్తారు.

ఎవరికీ నష్టంలేకుండా కోటా

ఈడబ్ల్యూఎస్ 10% కోటాను వ్యతిరేకిస్తున్న వారిపై మండిపడ్డారు. "ప్రస్తుత రిజర్వేషన్లపై ఎలాంటి ప్రభావం పడకుండా కొత్త కోటా సృష్టించాం. తమిళనాడులో కొందరు స్వార్థంతో అనుమానాలు, అపోహలు సృష్టిస్తున్నారు" అని పరోక్షంగా డీఎంకేను విమర్శించారు. కేరళ సంస్కృతి, సంప్రదాయాలంటే వామపక్షాలకు గౌరవంలేదని.. శబరిమల విషయంలో ఇది స్పష్టమైందని తెలిపారు.

6 కోట్ల గ్యాస్ కనెక్షన్లు ఇచ్చాం...

కొచ్చిలో బీపీసీఎల్ చమురుశుద్ధి కర్మాగారంలో సమీకృత విస్తరణ సముదాయాన్ని (ఐఆర్ఈపీ) మోదీ ప్రారంభించారు. పెట్రోలియం కెమికల్ కాంప్లెక్స్‌కు శంకుస్థాపన చేశారు. భారత్ అంతర్జాతీయ 'రిఫైనరీ హబ్'గా మారుతోందన్నారు. ఈ రంగంలో భారత్ ఆసియాలోనే రెండో అతిపెద్ద వ్యవస్థ అని తెలిపారు. కొచ్చి రిఫైనరీ దేశంలోనే అతిపెద్దదిగా ఆవిర్భవించిందని.. ఇక్కడ ఎల్పీజీ, డీజిల్ ఉత్పత్తి రెట్టింపు అవుతుందన్నారు. దేశంలో కొత్తగా 1,500 కిలోమీటర్ల పైప్‌లైన్ నెట్‌వర్క్ నిర్మించాలనుకుంటున్నామన్నారు. ఉజ్వల పథకం కింద ఇప్పటిదాకా 6 కోట్ల వంట గ్యాస్ కనెక్షన్లు ఇచ్చామన్నారు. తాము అధికారంలోకి వచ్చిన నాటికి 55 శాతం ఇళ్లకే వంటగ్యాస్ కనెక్షన్లు ఉండేవని... ఇప్పుడు అది 90 శాతానికి చేరిందని చెప్పారు. 23కోట్ల మంది వినియోగదారులు 'పహల్' (ఎల్పీజీకి నగదు బదిలీ) పథకంలో చేరారని, ఇది గిన్నిస్ రికార్డు అని తెలిపారు. మదురైలో ఎయిమ్స్ ఆస్పత్రికి ప్రధాని శంకుస్థాపన చేశారు. ఆయుష్మాన్ భారత్ ప్రపంచంలోనే అతిపెద్ద వైద్య పథకమని చెప్పారు. అందరికీ ఆరోగ్య భాగ్యం కోసం తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. "వైద్య చికిత్సపై ఢిల్లీ ఎయిమ్స్ ఒక ప్రత్యేక ముద్ర వేసింది. ఇదే ముద్రను దేశంలో కశ్మీర్ నుంచి మదురై వరకు... గువహటి నుంచి గుజరాత్ వరకు విస్తరింప చేస్తున్నాం. మదురై ఎయిమ్స్‌తో తమిళనాడు ప్రజలందరికీ మేలు జరుగుతుంది" అని తెలిపారు. నాలుగున్నరేళ్లలో దేశవ్యాప్తంగా ఎంబీబీఎస్ సీట్లు 30 శాతం పెరిగాయని ప్రధాని చెప్పారు. లక్షన్నర ఆరోగ్య కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు.



కొచ్చిరలో గ్యాస్ కంపెనీ వద్ద నిల్వ చేయడానికి ఉపయోగించే భారీట్యాంకులను ప్రారంభిస్తున్న మోదీ

ఓటు వేయకపోతే చింతే!

- మన్ కీ బాత్‌లో ప్రధాని

న్యూఢిల్లీ, జనవరి 27: ఓటు వేయడం పవిత్ర కర్తవ్యమని, ఆ ప్రజాస్వామ్య హక్కును వినియోగించుకోని వాళ్లు.. ఓటు వేయనందుకు చింతించాల్సి వస్తుందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు. మన్ కీ బాత్‌లో భాగంగా ఆదివారం ఆయన రేడియో సందేశం ఇచ్చారు. "21వ శతాబ్దంలో పుట్టిన యువత తొలిసారిగా ఈ లోక్‌సభ ఎన్నికల్లో ఓటు వేయబోతోంది. జాతి నిర్మాణంలో వారు భాగస్వాములు కాబోతున్నారు. జనవరి 30న అమర వీరుల దినోత్సవం సందర్భంగా సుభాష్ చంద్ర బోస్‌కు ఆయన నివాళి అర్పించారు. ఇటీవల శివైక్యం చెందిన శివకుమార స్వామికి ప్రధాని మోదీ ఘనంగా నివాళులు అర్పించారు. విద్యార్థులు రూపొందించిన కలాం శాట్‌ను జనవరి 24న ప్రయోగించడం గర్వకారణమన్నారు. పరీక్షల కాలం నేపథ్యంలో విద్యార్థులకు ఆల్‌దబెస్ట్ తెలిపారు.



ఎడమవైపు ఫొటోలో పచ్చదనంతో ఆహ్లాదంగా కనిపిస్తున్నది బ్రెజిల్‌లో మినాస్ గెరియాస్ రాష్ట్రంలోని పరావోపెబా నదిపై ఆనకట్ట ఉన్న ప్రాంతం. శుక్రవారం ఆ ఆనకట్ట కొట్టుకుపోయి పరిసర ప్రాంతాలను బురద ముంచెత్తిన దృశ్యాన్ని రెండో ఫొటోలో చూడొచ్చు. ఈ దుర్ఘటనలో మృతుల సంఖ్య 34కు చేరగా వందలమంది గల్లంతయ్యారు.



సమాఖ్య వ్యవస్థకు స్ఫూర్తి ఎన్టీఆర్

- ఆయన చేసిన కృషి ఏ సీఎం చేయలేదు: అశోక్ గజపతి
- 'ఎన్టీఆర్ ఎ బయోగ్రఫీ' పుస్తకం ఆవిష్కరణ



హైదరాబాద్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): దేశ రాజకీయాల్లో సమాఖ్య వ్యవస్థ కోసం ఎన్టీఆర్ చేసిన కృషి బహుశా ఏ ముఖ్యమంత్రీ చేసి ఉండరని కేంద్ర మాజీ మంత్రి, ఎంపీ పి.అశోక్‌గజపతిరాజు అన్నారు. లోక్‌నాయక్ జయప్రకాశ్ నారాయణ్ తర్వాత దేశంలో బీజేపీని, వామపక్షాలను ఏకతాటిపైకి తీసుకువచ్చిన ఘనత ఎన్టీఆర్‌దే అని చెప్పారు. ఆదివారం హైటెక్స్‌లోని సైబర్ కన్వెన్షన్‌లో 'ఎన్టీఆర్ ఎ బయోగ్రఫీ' పుస్తకాన్ని అశోక్ ఆవిష్కరించారు. రిటైర్డు ఐఏఎస్ కె.లక్ష్మీనారాయణ, రిటైర్డు ఐఆర్ఎస్ కె.చంద్రహాస్ రచించిన పుస్తకం తొలి ప్రతిని ఎన్టీఆర్ చిన్న కుమారుడు రామకృష్ణకు అశోక్ అందజేశారు. ఎన్టీఆర్ బయోగ్రఫీ ఇంగ్లిషులో రావడం ఇదే తొలిసారి అని నిర్వాహకులు తెలిపారు. ఎన్టీఆర్ గురించి ప్రపంచానికి తెలియని అనేక విషయాలను తెలియజేసేందుకు కృషి చేసినట్లు రచయిత కె.లక్ష్మీనారాయణ చెప్పారు. ఎన్టీఆర్ ఏ నిర్ణయాన్నైనా ధైర్యంగా తీసుకునేవారని చెప్పారు. పుస్తక రచనకు పలువురు ప్రముఖులు సహకారం అందించారని మరో రచయిత కె.చంద్రహాస్ తెలిపారు. కాగా, పవన్ కళ్యాణ్ ఎవరో తనకు తెలియదని, తనకు సినిమాలు చూసే అలవాటు లేదని అశోక్ గజపతిరాజు వ్యాఖ్యానించారు. దగ్గుబాటి జగన్‌తో భేటీ కావడం ఆయన విజ్ఞతకే వదిలివేస్తున్నాని చెప్పారు. చిరంజీవి, ఆయన తండ్రి మాత్రం తెలుసని మీడియాతో అన్నారు.

జగన్, దగ్గుబాటి భేటీ రాజకీయ దిగజారుడుతనం: నారాయణ

జగన్, దగ్గుబాటి భేటీ కావడం రాజకీయ దిగజారుడుతనానికి నిదర్శనమని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ విమర్శించారు. 'ఆయన (దగ్గుబాటి) ప్రయాణం ఎక్కడ ప్రారంభించారు? ఎక్కడికి పయనిస్తున్నారో ఆలోచించుకోవాలి' అని హితవు పలికారు.

టీచర్లను అలా అడగరాదు: ఢిల్లీ హైకోర్టు

న్యూఢిల్లీ, జనవరి 27 : చదువుతో సంబంధంలేని విధులు నిర్వర్తించాలని టీచర్లను అడగరాదని ఢిల్లీ హైకోర్టు స్పష్టం చేసింది. చదువుతో సంబంధంలేని పనులను టీచర్లతో చేయించినందుకు అధికారులను హైకోర్టు చీవాట్లు పెట్టింది. బాలల ఉచిత, నిర్బంధ విద్యా హక్కు (ఆర్టీఈ) చట్టం, నిబంధనల పరిధిలోకి రాని పనులు చేయాలని టీచర్లు, ప్రిన్సిపాళ్లను మునిసిపల్ కార్పొరేషన్లు అడగరాదని హైకోర్టు పేర్కొంది. అయితే స్కూళ్లలో పిల్లలకు బ్యాంకు ఖాతాలు తెరవడంలో, వాటిని ఆధార్‌కు అనుసంధానించడంలో టీచర్ల, ప్రిన్సిపాళ్ల సహాయం తీసుకోవచ్చని, ఇది కూడా తప్పనిసరి కాదని జస్టిస్ సి.హరి శంకర్‌తో కూడిన ఏకసభ్య ధర్మాసనం తెలిపింది.

కాలుష్య కోరల్లో తాబేళ్లు!



సముద్రంలో దీర్ఘాయుష్షుతో జీవించాల్సిన భారీ తాబేళ్లు.. సముద్ర కాలుష్యంతో అర్థంతరంగా మృత్యువాతపడి తీరానికి కొట్టుకొస్తున్నాయి. కృష్ణాజిల్లా కృత్తివెన్ను పరిధిలోని పెదగొల్లపాలెం బీచ్‌లో ఆదివారం పదుల సంఖ్యలో భారీ తాబేళ్ల కళేబరాలు దర్శనమిచ్చాయి. వీటితో పాటు వివిధ జాతులకు చెందిన భారీ చేపలు, ఇతర జలచరాల కళేబరాలు అప్పుడప్పుడూ దర్శనమిస్తున్నాయని స్థానిక మత్స్యకారులు చెబుతున్నారు. భారీ తాబేళ్లు మృత్యువాతపడి తీరానికి కొట్టుకొస్తుండడంతో వాటిని చూసేందుకు జనం ఎగబడుతున్నారు.

- కృత్తివెన్ను



జయ బ్యాంక్ ఖాతాల్లో నగదు జమ

- మృతిచెంది రెండేళ్లయినా ఆగని లావాదేవీలు
- ఇళ్లు, వ్యాపార సముదాయాల అద్దెలు జమ
- వెల్లడించిన ఐటీ అధికారులు

చెన్నై, జనవరి 27(ఆంధ్రజ్యోతి): తమిళనాడు మాజీ సీఎం జయలలిత మృతి చెంది రెండేళ్లు గడిచినా ఆమె బ్యాంక్ ఖాతాల్లో క్రమం తప్పకుండా ప్రతి నెలా నగదు జమ అవుతోందని ఆదాయపు పన్నులశాఖ అధికారులు తెలిపారు. జయ సొంత భవనాలలో నివసిస్తున్నవారు, దుకాణాలు నడుపుతున్నవారు, వ్యాపారం చేస్తున్నవారు ప్రతినెలా ఆమె బ్యాంక్ ఖాతాలలో అద్దె రూపంలో చెల్లించాల్సిన నగదును జమ చేస్తున్నారని పేర్కొన్నారు. జయలలిత రూ.16.74 కోట్లకు పైగా ఆస్తిపన్నులు చెల్లించని కారణంగా ఆమెకు చెందిన 4 స్థిరాస్తులను అటాచ్ చేసినట్లు ఐటీ వల హైకోర్టులో ఐటీ శాఖ నివేదికను సమర్పించారు. ఆమె ఖాతాలలో నగదును జమచేస్తున్నవారి వివరాలను సేకరించేందుకు ప్రయత్నిస్తున్నారు. జయకు చెందిన చెన్నై మందవెల్లిలో ఉన్న భవనం, అన్నాసాలై పార్సన్‌మనేర్‌లోని దిగువ అంతస్తు, హైదరాబాద్ శ్రీనగర్ కాలనీలోని రెసిడెన్షియల్ ఫ్లాట్, పోయెస్ గార్డెన్‌లోని వేదనిలయంను 2009 నుంచి అటాచ్ చేసినట్లు తెలిపారు. వీటికి సంబంధించి క్రయవిక్రయ లావాదేవీలు జరుపరాదని ఆయా ప్రాంతాల్లోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలకు నోటీసులు కూడా పంపారు. 2016, డిసెంబరు 5న ఆమె మృతి చెందేనాటికే ఆమె చెల్లించాల్సిన ఆస్తి పన్నులు రూ.20 కోట్లు దాటినట్లు తెలుస్తోంది. జయ అధికారిక వారసులెవరనే విషయం తేలకపోవడంతో ఐటీకి జయ తరపు ఆస్తిపన్నులను ఇప్పటికిప్పుడు ఎవరూ చెల్లించలేని పరిస్థితి ఉందన్నారు.

'ఐసీఐసీఐ' సోదాల సమాచారం లీక్?

- చందా కొచ్చర్‌పై కేసు పెట్టిన సీబీఐ అధికారి బదిలీ

న్యూఢిల్లీ, జనవరి 27: ఐసీఐసీఐ బ్యాంకు కేసును విచారిస్తున్న సీబీఐ అధికారికి స్థానభ్రంశం కలిగింది. కేసులో భాగంగా నిర్వహించే సోదాల సమాచారాన్ని లీక్ చేస్తున్నారన్న ఆరోపణలు రావడంతోనే ఆయన్ను బదిలీ చేసినట్లు అధికారులు వెల్లడించారు. ఐసీఐసీఐ బ్యాంకు మాజీ సీఈవో చందా కొచ్చర్, ఆమె భర్త దీపక్ కొచ్చర్, వీడియోకాన్ గ్రూపు ఎండీ వేణుగోపాల్ ధూత్‌లపై కేసు నమోదు చేసిన సీబీఐ ఎస్పీ సుధాన్షు ధార్ మిశ్రాను రాంచీకి బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 22న మిశ్రా వీరిపై ఎఫ్ఐఆర్ దాఖలు చేయగా.. మరుసటి రోజే ఆయన్ను బదిలీ చేసినట్లు అధికారులు వెల్లడించారు. 24న చందాకొచ్చర్, తదితరులపై సీబీఐ కేసు నమోదైంది. ఈ కేసు విచారణ బాధ్యతను తాజాగా మోహిత్ గుప్తాకు అప్పగించామని, ఆయన ఆధ్వర్యంలో పలు చోట్ల తనిఖీలు చేశారని వివరించారు. మిశ్రా ఎలాంటి కారణాలు చూపకుండానే ఈ కేసులో ప్రాథమిక విచారణను అపరిష్కృతంగా ఉంచారని అధికారులు పేర్కొన్నారు. "ఈ కేసులో సుధాన్షు మిశ్రా పాత్ర అనుమానాస్పదంగా తేలింది. అందువల్ల కేసు తీవ్రత దృష్ట్యా సమగ్ర విచారణ జరిపేందుకే ఆయన్ను బదిలీ చేశాం" అని వివరించారు.

సీబీఐ టార్గెట్ బ్యాంకర్లే: చిదంబరం

కేంద్ర దర్యాప్తు సంస్థ(సీబీఐ) కొందరు బ్యాంకర్లను విచక్షణారహితంగా టార్గెట్ చేసుకుంటోందని కాంగ్రెస్ నేత చిదంబరం ఆరోపించారు. ఇదంతా ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ అండతోనే జరుగుతోందని విమర్శించారు. వేల కోట్ల రూపాయల అవకతవకలు జరిగినట్లు ఆరోపణలున్న కేసుల్లో కొందరు ప్రముఖ బ్యాంకర్లను విచక్షణారహితంగా టార్గెట్ చేసుకొని వేధిస్తున్నారని చిదంబరం ట్విటర్‌లో సీబీఐపై మండిపడ్డారు.

మేల్కోకుంటే హిందువుల ఇళ్లన్నీ మసీదులుగా మారతాయి

- కేంద్ర మంత్రి అనంత్ హెగ్డే



న్యూఢిల్లీ, జనవరి 27 : హిందువులందరూ మేల్కోవాల్సిన సమయం వచ్చిందని, లేకపోతే వారి ఇళ్లన్నీ మసీదులుగా మారిపోతాయని కేంద్ర మంత్రి అనంత్ కుమార్ హెగ్డే ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం నాడిక్కడ మీడియాతో ఆయన మాట్లాడారు. తాజ్‌మహల్ శివ మందిరమని, పరమతీర్థ అనే రాజు ఆ మందిరాన్ని నిర్మించాడని తెలిపారు. మొదట్లో దానిని 'తేజో మహాలయ' గా పేర్కొనేవారని, అనంతరం ఆ మందిరం తాజ్‌మహల్‌గా మారిపోయిందన్నారు. హిందువుల్లో ఐక్యత లేకపోవడం వల్లే ఇలా జరిగిందని చెప్పారు. ఇప్పటికీ హిందువులు మొద్దునిద్ర వీడకపోతే భగవాన్ రాముడిని కూడా జహాపన అంటారని, సీతను బీబీగా పిలుస్తారని హెచ్చరించారు. ఎవరైనా పరాయి మగాడు హిందూ మహిళను దురుద్దేశపూర్వకంగా తాకితే వారి చేతులు నరికివేయాలని వ్యాఖ్యానించారు.



పటీదార్ ఉద్యమ నేత హార్దిక్ పటేల్ ఓ ఇంటివాడయ్యాడు. చిన్ననాటి స్నేహితురాలు కింజల్ పారిఖ్‌తో ఆయన వివాహం ఆదివారం గుజరాత్ సురేంద్రనగర్ జిల్లాలో ఓ ఆలయంలో సంప్రదాయపద్ధతిలో జరిగింది. అతి ముఖ్యులు మాత్రమే ఈ వేడుకకు హాజరై వధూవరులను ఆశీర్వదించారు.

మోదీకి ప్రత్యామ్నాయం రాహులే

- ప్రధాని అభ్యర్థిగా 52 శాతం మద్దతు
- దరిదాపుల్లో లేని మమత, మాయావతి
- ఇండియా టుడే-కార్వి సర్వే



న్యూఢిల్లీ, జనవరి 27: ప్రజాదరణలో ప్రధాని నరేంద్ర మోదీకి తనకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ నెమ్మదిగా తగ్గించుకుంటూ వస్తున్నారా? అంటే తాజా సర్వే అవుననే అంటోంది. ప్రతిపక్షాల నుంచి ప్రధాని అభ్యర్థిని ఎంచుకోవలసి వస్తే రాహుల్‌వైపే ప్రజలు మొగ్గుచూపుతున్నారని ఇండియా టుడే-కార్వి ఇన్‌సైట్స్ నిర్వహించిన 'మూడ్ ఆఫ్ ద నేషన్' సర్వే వెల్లడించింది. మమత సహా మిగతా నేతలెవరూ రాహుల్ దరిదాపుల్లో లేరు. జాతీయస్థాయిలో వివిధ వర్గాలకు చెందిన 13,000 మందితో నిర్వహించిన ఈ సర్వేలో.. 52% మంది మోదీ స్థానాన్ని భర్తీ చేసేది రాహులేనని స్పష్టంచేశారు. రాహుల్ గాంధీతో పాటు పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, సమాజ్‌వాది పార్టీ చీఫ్ అఖిలేశ్ యాదవ్, సీనియర్ కాంగ్రెస్ నేత పి.చిదంబరం తదితరుల పేర్లను ఆప్షన్‌గా ఇచ్చారు. రాహుల్ తర్వాత ప్రజలు మమత అభ్యర్థిత్వంపై మొగ్గు చూపారు. అయితే వీరిద్దరి మధ్య వ్యత్యాసం 44% ఉండడం గమనార్హం. 8% మంది మాత్రమే ఆమెకు ఓటు వేశారు. అఖిలేశ్‌కు 5, కేజ్రీవాల్‌కు 4, మాయావతికి 3 శాతం మంది మద్దతు మాత్రమే లభించింది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107
Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.